ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 13-7-2019 శనివారం సిటీ సంపుటి 45 . సంచిక 334 రూ. 6-50 పేజీలు 18+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

... ఏడాది బడ్జెట్‌లో అమల్లోకి తెద్దాం. దీనివల్ల తొలి రెండేళ్లలోనే ఎన్నికల ప్రణాళికలోని హామీలను వంద శాతం నెరవేర్చినట్లవుతుంది.

– మంత్రిమండలి సమావేశంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా అత్యంత దయనీయ ఆర్థిక స్థితిని మా ప్రభుత్వం వారసత్వంగా పొందింది. రాష్ట్రానికున్న పరిమిత ఆదాయాల్లోనే ఖర్చులు భరించాల్సి ఉంది. ఈ ప్రభుత్వానికి ప్రాప్తించిన ద్రవ్య స్థితి వల్ల కఠిన ప్రత్యామ్నాయాలను చూసుకోవాల్సి వచ్చింది. 2022నాటికి రాష్ట్రంలో లేమితనం లేకుండా చూడాలని భావిస్తున్నాం.

– ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

కేటాయింపులు
(రూ.కోట్లలో)

15,746
పింఛన్లు

6,455.80
జగనన్న అమ్మఒడి

8,750
వైఎస్సార్ రైతు భరోసా

4,962.34
జగనన్న విద్యా దీవెన

16,720
గృహనిర్మాణ పథకాలు

1,788
'డ్వాక్రా' సున్నా వడ్డీ రుణాలు

13,139
జలయజ్ఞం

1,740
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

1,880
గ్రామ, పట్టణ వాలంటీర్లు

9 నవ సంక్షేమం

- సర్వజన శ్రేయస్సుకు నవరత్నాలు
- మేనిఫెస్టో అమలుకే ప్రాధాన్యం
- సంక్షేమానికి రూ.75వేల కోట్ల పైమాటే
- శాసనసభకు తొలి బడ్జెట్ సమర్పించిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

ఎన్నికల ముందు నుంచీ మనసా వాచా ఒకటే 'నవరత్న మంత్రం' జపిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి.. ఆంధ్ర జనం కట్టబెట్టిన అఖండ విజయం తర్వాత ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్లో.. ఆ నవ విధ సంక్షేమానికే పెద్ద పీట వేశారు. రైతులు, పేదలు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, వితంతువులు, వికలాంగులు... ఇలా అన్ని వర్గాల వారికీ బాసటగా నిలిచేందుకు, ప్రతి ఒక్కరికీ ఆర్థికంగా అండనిచ్చేందుకు ఉద్దేశించిన పథకాలకే భూరి కేటాయింపులు చేశారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శుక్రవారం శాసనసభకు సమర్పించిన రూ.2.27 లక్షల కోట్ల బడ్జెట్లో రూ.75 వేల కోట్లకు పైగా సంక్షేమ రంగానికే అందించటం విశేషం. రైతన్నల పైన అయితే ఏకంగా రూ.28,866 కోట్ల వరాల వాన కురిపించారు. మొత్తానికి బడ్జెట్ ఆసాంతం నవరత్నాల ధగధగలే ప్రస్ఫుటంగా కనిపించే అంశం!!

వరాల జల్లులు

- రూ.5 లక్షల కంటే తక్కువ వార్షికాదాయం ఉన్న మధ్య తరగతి కుటుంబాలకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపు.
- కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దేందుకు రూ.1500 కోట్లు
- ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సాయం.
- సొంత వాహనం ఉన్న ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.10వేల ఆర్థిక సాయం
- కాపు కార్పొరేషన్‌కు రూ. 2వేల కోట్లు
- 2021 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి.

మరిన్ని బడ్జెట్ వార్తలు, కథనాలు లోపలి పేజీల్లో

రాష్ట్ర బడ్జెట్ (2019–20)
రూ. 2,27,975 కోట్లు

అదిగో నవలోకం

- నవరత్నాలతో అన్ని వర్గాల సర్వతోముఖాభివృద్ధి
- వివక్ష లేకుండా అర్హులందరికీ పథకాలు
- సామాజిక, ఆర్థిక సర్వేలో ప్రభుత్వం వెల్లడి

10లో

కోతల బడ్జెట్

- పేదల సంక్షేమ పథకాలకు కేటాయింపులు తగ్గించారు
- అభివృద్ధి పనులను పట్టించుకోలేదు
- తెదేపా అధినేత చంద్రబాబు విమర్శలు

8లో

చక్కని సాగుకు నిధులు భళా

- వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.28,866.23 కోట్లు
- ఉచిత విద్యుత్తుకు రూ.4,525 కోట్లు
- కొత్త పథకాలకు ప్రాధాన్యం
- వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మంత్రి బొత్స సత్యనారాయణ

6లో

సున్నా వడ్డీపై మళ్లీ రభస

లక్షకు ఐదు వేలిస్తే రుణమంతా చెల్లించినట్లా?

23 స్థానాల నుంచి 13కి పడిపోతారు జాగ్రత్త

ఎలాంటి వాళ్లను తయారు చేశారయ్యా... ఇదేమైనా పశువుల సంతా?

బాబు, అచ్చెన్నాయుడులపై తీవ్రంగా మండిపడ్డ ముఖ్యమంత్రి జగన్

సీఎం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు

రాజీనామా చేస్తారా, ప్రజలకు క్షమాపణ చెబుతారా?: చంద్రబాబు

శాసనసభా... చేపల బజారా?: తమ్మినేని

ఈనాడు – అమరావతి

వ్యవసాయ రుణాలమీద సున్నా వడ్డీ అంశంపై తీవ్ర విమర్శలు, ఆరోపణలతో శుక్రవారం కూడా శాసనసభ దద్దరిల్లింది. ప్రతిపక్షనేత చంద్రబాబుపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రూ. లక్ష అప్పులో రూ.ఐదు వేలు చెల్లించి రుణం మొత్తం (మిగతా 3లో)

నేను మాట్లాడుతుంటే రౌడీలూ, గూండాల్లా వ్యవహరిస్తూ సభలో దౌర్జన్యం చేసేందుకు తెదేపా సభ్యులు యత్నిస్తున్నారు. ప్రతిపక్ష నేత మాట్లాడినప్పుడు మావాళ్లెవరూ అడ్డుతగలలేదే? మాట్లాడే అవకాశం ఇచ్చినా సిగ్గులేకుండా మళ్లీ చేతులెత్తుతారా? బుద్ధి జ్ఞానం ఉండాలి. ఎమ్మెల్యేగా ఎలా ఎన్నికయ్యారయ్యా..! మర్యాద లేదు. గౌరవం లేదు. మీకసలు అసెంబ్లీ జరిపించడం తెలుసా? కళ్లెర్ర చేసిచూస్తే ఎవరూ భయపడరు? మీరు 23 మంది ఉన్నారు.. మావాళ్లు 150 మంది ఉన్నారు. ఒకసారి లేచారంటే ఎవరూ స్థానాల్లో తిరిగి కూర్చోలేరు. ఒకర్నికైనా బుద్ధి ఉందా? గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలి. అందర్నీ కూర్చోమనండి.. అచ్చం (అచ్చెన్నాయుడు) కూర్చో...పర్సనాలిటీ పెరగడం కాదు.... బుర్ర పెరగాలి, బుద్ధి పెరగాలి. - జగన్

వడ్డీలేని రుణాలు చెల్లించామా? లేదా? పథకాన్ని నిలిపివేశామా? కొనసాగించామా? అనే దానిపై పక్కా దస్త్రాలు మీ ముందు పెడుతున్నా. ఇదే విషయాన్ని గురువారం పక్కా ఆధారాలతో వివరిద్దామని బయటకు వెళ్లి వచ్చేలోగా మీరు (సభాపతిని ఉద్దేశించి) సభను వాయిదా వేశారు. వడ్డీలేని రుణాలు చెల్లించలేదని ఆరోపిస్తూ నన్ను రాజీనామా చేయాలని డిమాండు చేసిన ముఖ్యమంత్రిని అడుగుతున్నా....మీరు రాజీనామా చేస్తారా? ప్రజలకు క్షమాపణలు చెబుతారా? - చంద్రబాబు

చెన్నై గొంతు తడిపేందుకు..

- 200 కి.మీ. దూరం నుంచి ప్రత్యేక రైల్లో నీటి తరలింపు

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు రాజధాని చెన్నైలో నీటి ఎద్దడి విశ్వరూపం దాల్చింది. నగర ప్రజల దాహార్తిని తీర్చే 4 ప్రధాన జలాశయాలు పూర్తిగా అడుగంటడం, రుతుపవనాల ప్రభావం పెద్దగా లేకపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. జలమండలిలో ట్యాంకరు నీటిని బుక్ చేసుకుంటే మళ్లీ 30 రోజుల వరకు నీరు పొందలేని స్థితి ఏర్పడింది. చుట్టుపక్కల వ్యవసాయ బావులు, రాళ్ల క్వారీల నుంచి సేకరించిన నీటిని శుద్ధి చేసి నగర ప్రజలకు సరఫరా చేస్తున్నారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో అవసరాలు తీరడం లేదు. ఈ నేపథ్యంలో నగరానికి సుమారు 200 కిలోమీటర్ల దూరంలోని వేలూరు జిల్లా జోలారుపేట నుంచి కావేరి సహకార తాగునీటి పథకం నీటిని చెన్నైకు తరలించడానికి రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీని కోసం రూ.65 కోట్లు కేటాయించింది. శుక్రవారం జోలారుపేట నుంచి 2 ప్రత్యేక రైళ్ల ద్వారా నీటిని తరలించారు. 50 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన 100 వ్యాగన్లు ఉన్న రెండు ర్యాక్‌ల ద్వారా మొత్తం 50 లక్షల లీటర్ల నీటిని తీసుకొచ్చారు. వీటిని శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేయనున్నారు. ఇలా రోజుకు కోటి లీటర్ల నీటిని తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

జోలార్‌పేట్ నుంచి విల్లివాక్కం రైల్వే స్టేషన్‌కు నీటి వ్యాగన్లతో చేరుకున్న ప్రత్యేక రైలు

జైలు ఎలా ఉంటుందో మీకు తెలియాలి

- కోర్టు ధిక్కరణ వ్యాజ్యంలో హైకోర్టు ఘాటు వ్యాఖ్య
- కోర్టుకు హాజరైన హోంశాఖ పూర్వ ముఖ్య కార్యదర్శి అనూరాధ, నెల్లూరు జైళ్ల సూపరింటెండెంట్ రవికిరణ్

ఈనాడు - అమరావతి

కారాగారంలో ఉన్న వ్యక్తిని విడుదల చేయాలన్న కోర్టు ఉత్తర్వులను పాటించనందుకు అధికారులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ ఉత్తర్వులను సకాలంలో ఎందుకు అమలు చేయలేదో తెలుపుతూ ప్రమాణ పత్రాలు దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తిలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. నెల్లూరు కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న గని శ్రీనివాసులు ప్రత్యేక క్షమాభిక్షకు అర్హుడని పేర్కొంటూ, తక్షణం విడుదల చేయాలని ఈ ఏడాది ఏప్రిల్ 9న హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. శ్రీనివాసులును విడుదల చేయకపోవడంతో ఆయన సోదరుడు పవన్‌కుమార్ కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. జూన్ 14న జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున న్యాయవాది మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'ఎన్నికల కోడ్' అమల్లో ఉందన్న కారణం చూపుతూ శ్రీనివాసులును విడుదల చేయలేదన్నారు. అధికారుల తీరుపై మండిపడిన ధర్మాసనం.. కోర్టు ఉత్తర్వులకు ఎన్నికల కోడ్ ఎలా వర్తిస్తుందని ప్రశ్నించింది. కోర్టుధిక్కరణ కింద చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలపాలని అప్పటి హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనూరాధ, జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ వినయ్‌రంజన్, నెల్లూరు కేంద్ర కారాగార సూపరింటెండెంట్ ఎం.రవికిరణ్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో హోంశాఖ పూర్వ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనూరాధ, నెల్లూరు కేంద్ర కారాగార సూపరింటెండెంట్ ఎం.రవికిరణ్ శుక్రవారం హైకోర్టుకు హాజరయ్యారు. విచారణ సందర్భంగా.. 'కారాగార జీవితం ఎలా ఉంటుందో మీకు అనుభవంలోకి రావాలి' అంటూ హాజరైన అధికారులను ఉద్దేశించి కోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా వ్యక్తిని విడుదల చేయబోం అన్న వైఖరికే కట్టుబడి ఉండాలని, మరో కారణం చెప్పడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. అంతకుముందు ఈ విచారణకు హాజరు కాలేనంటూ వినయ్‌రంజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు అనుమతించింది.

జులై 4న విడుదల చేశారు..

పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కోర్టు ధిక్కరణ వ్యాజ్యంలో అధికారులు వ్యక్తిగతంగా హాజరు కావాలని జూన్ 14న హైకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. జులై 4న శ్రీనివాసులును విడుదల చేశారన్నారు. ఉత్తర్వుల అమల్లో ప్రస్తుత హోంశాఖ ముఖ్య కార్యదర్శి కూడా నిర్లక్ష్యం చూపారనీ, బాధితులకు పరిహారం ఇప్పించాలని కోరుతూ అనుబంధ పిటిషన్ దాఖలు చేశానని కోర్టుకు తెలిపారు.

గుండిచా ఆలయం నుంచి శ్రీక్షేత్రం వైపునకు రథాలను లాగుతున్న పోలీసులు, బలగాలు, భక్తులు

పూరీలో ఘనంగా బహుడా యాత్ర

జైజగన్నాథ్ నామస్మరణతో మార్మోగిన క్షేత్రం

గోపాలపూర్(ఒడిశా), న్యూస్‌టుడే: విశ్వప్రసిద్ధ పూరీ శ్రీక్షేత్రంలో శుక్రవారం జగన్నాథ, బలభద్ర, సుభద్రల బహుడా(తిరుగు)యాత్ర వైభవంగా జరిగింది. లక్షలాది భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఉదయం గుండిచా మందిర ప్రాంతం పురుషోత్తమ కీర్తనలు, ప్రార్థనలతో ప్రతిధ్వనించింది. 11.45 గంటలకు గుండిచా మందిరానికి చేరుకున్న పూరీ రాజు గజపతి దివ్యసింగ్‌దేవ్ వరుసక్రమంలో బలభద్ర, జగన్నాథ, సుభద్రల రథాలపైకి వెళ్లి బంగారు చీపురుతో ఊడ్చి చెరాపహరా చేశారు. కస్తూరి కళ్లాపి చల్లి మంగళహారతి పట్టిన ఆయన చామరసేవలు నిర్వహించారు. తర్వాత మధ్యాహ్నం 1.17 గంటలకు తాళధ్వజ్(బలభద్రుని) రథం శ్రీక్షేత్రం వైపు కదిలింది. భక్తులు జైజగన్నాథ్.. అంటూ నినాదాలు చేస్తూ మూడు రథాలు లాగారు. ఈ దృశ్యం మరోసారి పూరీ బొడొదండొ వీధుల్లో నేత్రపర్వం చేసింది. భక్తులు పారవశ్యం పొందారు. శనివారం హరిశయన ఏకాదశి పర్వదినం నేపథ్యంలో శ్రీక్షేత్రం ఎదుట మూడు రథాలపై పురుషోత్తమ, బలభద్ర, సుభద్రల సున్నాబెషొ(స్వర్ణాభరణ అలంకరణ) వేడుక ఏర్పాటు కానుంది.

ఏపీలో 90% కన్నా ఎక్కువ భూ రికార్డుల నవీకరణ

ఈనాడు, దిల్లీ: డిజిటల్ ఇండియా భూ రికార్డుల నవీకరణ పథకం కింద ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో భూ రికార్డుల కంప్యూటరీకరణ 90 శాతం కన్నా ఎక్కువ అయిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. రాజ్యసభ సభ్యుడు కె.వి.పి.రామచంద్రరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.

పిటిషనర్ల దరఖాస్తులను స్వీకరించండి

రిజిస్ట్రార్‌ను ఆదేశించిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: జూనియర్ సివిల్ జడ్జి(జేసీజే) పోస్టుల భర్తీ విషయంలో న్యాయవాదిగా మూడేళ్ల అనుభవం లేకపోయినా 'కోర్టును ఆశ్రయించిన పిటిషనర్ల' సమర్పించే దరఖాస్తులను స్వీకరించాలని హైకోర్టు రిజిస్ట్రార్(నియామకాలు)ను హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ల ఎంపిక అంశం కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. ప్రమాణ పత్రాలు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. జేసీజే పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు న్యాయవాదిగా కనీసం మూడేళ్ల అనుభవం కలిగి ఉండాలన్న నిబంధనను సవాలు చేస్తూ పలువురు యువ న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ఎస్.నంద, బాలాజీ వడేరా వాదనలు వినిపిస్తూ.. మూడేళ్ల అనుభవం అవసరం లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. వివిధ రాష్ట్రాల్లోనూ మూడేళ్ల అనుభవం లేకున్నా జేసీజే పోస్టుల పోటీ పరీక్షల్లో పాల్గొనేందుకు అనుమతిస్తున్నారన్నారు. ఆ వివరాల్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. పిటిషనర్ల దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశించింది.

పొగాకు బోర్డు ఛైర్మన్‌గా రఘునాథబాబు

తొలిసారిగా ఐఏఎస్ కానివారికి పదవి

ఈనాడు, దిల్లీ, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న జాతీయ పొగాకు బోర్డు ఛైర్మన్‌గా భాజపా సీనియర్ నేత యడ్లపాటి రఘునాథబాబుని కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈమేరకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన మూడేళ్ల పాటు ఈ పదవిలో ఉంటారు. 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐఏఎస్ అధికారులను సీఈఓ పదవిలో నియమించి, ఛైర్మన్ పదవిని నాన్ అఫీషియల్‌కు కట్టబెట్టే విధంగా మార్పులు చేసింది. అందులో భాగంగా తొలిసారిగా రాజకీయాల నుంచి వచ్చిన రఘునాథబాబును నియమించింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనను పొగాకు బోర్డు ఛైర్మన్‌గా నియమించినందుకు ప్రధాని మోదీ, భాజపా అధ్యక్షుడు అమిత్‌షాలకు కృతజ్ఞతలు తెలిపారు. పొగాకు రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

ఎ.వి.ధర్మారెడ్డి బాధ్యతల స్వీకరణ

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే తిరుమల ప్రత్యేకాధికారిగా ఎ.వి.ధర్మారెడ్డి శుక్రవారం శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. తిరుమల ఇన్‌ఛార్జి జేఈవో బసంత్‌కుమార్ మందిరంలోని రంగనాయకుల మండపంలో ప్రత్యేకాధికారికి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత స్వామివారిని దర్శించుకున్నాక పండితులు వేదాశీర్వచనం చేశారు. తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ స్వామివారి పట్టువస్త్రంతో ధర్మారెడ్డిని సత్కరించి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం ధర్మారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ. . తిరుమల ప్రత్యేకాధికారిగా మూడోసారి శ్రీవారి సేవచేసే అవకాశం కలగడం పూర్వజన్మ పుణ్యఫలమని, దేవుడి ఆశీస్సులతోనే ఇది సాధ్యమైందని సంతోషం వ్యక్తం చేశారు. భక్తులు వేచి ఉండే సమయాన్ని తగ్గించి సంతృప్తికరంగా దర్శనం చేయించడం, మెరుగైన సౌకర్యాలు కల్పించడం తొలి ప్రాధాన్యంగా చెప్పారు.

తిరుమల ప్రత్యేకాధికారి ఎ.వి.ధర్మారెడ్డి దంపతులకు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

16న ప్రత్యేక దర్శనాలు రద్దు

శ్రీవారి ఆలయంలో ఈ నెల 16న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనుండడం, రాత్రి చంద్రగ్రహణం కారణంగా అన్ని రకాల ప్రత్యేక దర్శనాలను రద్దు చేస్తున్నట్లు తితిదే వెల్లడించింది. వయోవృద్ధులు, దివ్యాంగులకు, ఏడాదిలోపు చంటిబిడ్డలతోపాటు తల్లిదండ్రులకు నిత్యం కల్పించే ప్రత్యేక దర్శనాలను ఆ రోజు రద్దు చేసింది. 17న అంగప్రదక్షిణ సేవ కూడా ఉండదు. 16న కేవలం 5 గంటలపాటు మాత్రమే శ్రీవారి దర్శన అవకాశం ఉంటుంది.

ఈనాడు 1869 - 2019 మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

వ్యామోహమే సమస్య!

అంతా నేను యంత్ర వ్యతిరేకిని అనుకుంటున్నారు. అది నిజం కాదు. నేను వ్యతిరేకించేది యంత్రాలను కాదు, యంత్రాల పట్ల మనుషులు చూపిస్తున్న మోజునూ, అనవసరపు వ్యామోహాన్నే!

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

13-7-2019 శనివారం

శ్రీ వికారి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; ఆషాఢ మాసం; శుక్ల పక్షం
ద్వాదశి: రా.1.34 తదుపరి త్రయోదశి
అనూరాధ నక్షత్రం: సా.6.29 తదుపరి జ్యేష్ఠ
అమృత ఘడియలు: ఉ.8.11 నుంచి 9.46 వరకు
వర్జ్యం: రా.12.08 నుంచి 1.45 వరకు
దుర్ముహూర్తం: ఉ.5.36 నుంచి 7.19 వరకు
రాహుకాలం: ఉ.9.00 నుంచి 10.30 వరకు
సూర్యోదయం: ఉ.5-36; సూర్యాస్తమయం: సా.6.32

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నెల్లూరు	41.0	29.0
ఖమ్మం	40.0	28.0
తిరుపతి	40.0	26.7
గుంటూరు	39.8	29.2
ఒంగోలు	39.5	30.1
విజయవాడ	38.8	26.0
కడప	38.0	27.0
రాజమహేంద్రవరం	37.0	26.0
అనంతపురం	36.5	25.7
కర్నూలు	36.5	25.5
విశాఖపట్నం	35.8	26.2
శ్రీకాకుళం	34.0	26.0
తాడేపల్లిగూడెం	33.0	26.0
హైదరాబాద్	32.8	22.4
నరసాపురం	31.1	27.6

రూ. కోటిన్నర గంజాయి పట్టివేత

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: విశాఖ ఏజెన్సీ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని మధురకు రెండు వ్యాన్లలో తరలిస్తున్న 1386 కేజీల గంజాయిని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1.50 కోట్లు ఉంటుందని అనకాపల్లి ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. విశాఖ జిల్లా నీలంపేట వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా 2 వ్యాన్లలో ఈ సరకు పట్టుబడిందని ఆయన వివరించారు. గంజాయిని ఎవరికీ అనుమానం రాకుండా బంగాళాదుంపల బస్తాలు వేసి రవాణా చేస్తున్నారని తెలిపారు.

మంత్రి కన్నబాబును ఓదార్చుతున్న కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి

మంత్రి కన్నబాబుకు చిరంజీవి పరామర్శ

కాకినాడ గ్రామీణం (సర్పవరం జంక్షన్), న్యూస్‌టుడే: సోదరుడు సురేష్ హఠాన్మరణంతో బాధపడుతున్న వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబును కేంద్ర మాజీ మంత్రి, సినీనటుడు చిరంజీవి శుక్రవారం మధ్యాహ్నం పరామర్శించారు. కాకినాడలోని కన్నబాబు నివాసానికి చేరుకున్న ఆయన ముందుగా తండ్రి సత్యనారాయణ, మరో సోదరుడు, దర్శకుడు కల్యాణ్‌కృష్ణలను పరామర్శించి సానుభూతిని తెలిపారు. చిరంజీవిని చూసిన తరువాత కన్నబాబు, ఇతర కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

SATYA ONLINE IAS ACADEMY
APPSC - Gr-I, II & P.S.
చేతిలో ఫోన్ ఉంటే, సక్సెస్ మీ వెంటే
జులై 15న గ్రామ సచివాలయ ఉద్యోగాలు 1.60 లక్షలు
33% మహిళా కోటా క్రింద 52 వేలపైన ఉద్యోగాలలో మీరెందుకు ఉండకూడదు? VRO to MRO గా ఎదిగే అవకాశం మీరెందుకు వదులుకోవాలి?
సిలబస్, బుక్స్, ము॥ అంశాలు తెలుసుకోవాలంటే
Follow us: youtube/SatyaonlineIAS Academy
www.satyaiasacademy.com
9505753375, 9985459450
9533646703, 8096411709

BFIT GROUP OF INSTITUTIONS SUDDHOWALA DEHRADUN
KINGSTON IMPERIAL · KIPS JHAJRA DEHRADUN · NIMS · LIBRA · Guru Nanak
www.bfitdoon.com

సెంట్రల్ గవర్నమెంట్ యునివర్సిటీ లో అడ్మిషన్ల కోసం ఎంట్రన్స్, జిడిపి మరియు మెరిట్ విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతో అడ్మిషన్లు జరుగనున్నాయి.
ఉచిత కౌన్సిలింగ్ మరియు సెమినార్ కొరకై ఈ నెంబర్ పై సంప్రదించగలరు.

MPC / BIPC Students can apply for Agriculture/Forestry/Horticulture Courses

ADMISSION OFFICE HYDERABAD
Flat No.- 201, 2 nd Floor, Konark Tower Above Konark Diagnostic Center Dilsukhnagar, Call-7456000102, 9719460505,7456000103, 9121549102

Ranked Number 1 Multidisciplinary College in India.
Source- Katalyst Research

SCHOLARSHIP – Apply AIBFEE/GD-PI/MERIT
95% or above aggregate marks - 60% of Tuition Fee Waiver ● 90% – 94.99% aggregate marks - 40% of Tuition Fee Waiver
80% – 89.99% aggregate marks - 30% of Tuition Fee Waiver ● 70% – 79.99% aggregate marks - 20% of Tuition Fee Waiver

Affiliations
Approved by AICTE (All India Council for Technical Education Ministry of HRD, Govt of India) H.N.B. Garhwal Central University (Central Govt. University) UGC Approved University, Ministry of HRD, Govt of India NAAC 'A' Accredited University) Uttarakhand Technical University (State Govt. University) Uttarakhand Board of Technical Education (State Govt. Board), Pharmacy Council of India (PCI), Bar Council of India (BCI), National Council for Teacher Education (NCTE).

COURSES (Fee mentioned are - per year in INR)

SCHOOL OF POLYTECHNIC- SOP
Diploma in Engg. (Qualification -Class X Pass)

Course	Fee Per Year
Civil /Mechanical /Electronics /Electrical /Computer Sc.	₹ 25,000
Lateral Entry in all Diploma Courses (10+2 PCM/ITI)	₹ 25,000

SCHOOL OF LIFE & ALLIED SCIENCES- SLAS

Course	Fee Per Year	Course	Fee Per Year
B.Sc. BioTech./Micro Bio.	₹ 40,000	M.Sc. Micro Bio/Bio Tech	₹ 55,000
B.Sc. Geology	₹ 40,000	M.Sc. Bio Chem./Geology	₹ 49,500
B.Sc. Economics+WCBA (U.S)	₹ 31,000	M.Sc. Statistics+WCBA (U.S)	₹ 39,500
B.Sc. Statistics+WCBA (U.S)	₹ 31,000	M.Sc. Chem./Zoology	₹ 45,000
B.Sc. PCM/CBZ	₹ 28,000	M.Sc. Physics/Botany	₹ 40,000
B.Sc. Home Science	₹ 30,000	M.Sc. EVS/Math.	₹ 35,000

SCHOOL OF AGRICULTURE SCIENCES- SAS

Course	Fee Per Year	Course	Fee Per Year
B.Sc. Agriculture	₹ 59,500	M.Sc. Agri./Agronomy	₹ 59,500
B.Sc. Forestry /Horticulture	₹ 49,500	M.Sc. Ag./Seed Sc.& Tech.	₹ 59,500
		M.Sc. Horticulture /Forestry	₹ 50,000

SCHOOL OF TECHNOLOGY, INFORMATION & COMPUTER SCIENCE- STICS

Course	Fee Per Year
B.Sc. IT+WCBA(U.S)	₹ 31,000
B.C.A.+WCBA(U.S)	₹ 33,000
M.Sc. IT+WCBA(U.S)	₹ 35,000
MCA+WCBA(U.S)	₹ 65,000
MCA+WCBA(U.S) Lateral Entry for (B.Sc IT/BCA/)	₹ 65,000

SCHOOL OF ARTS & JOURNALISM- SAJ

Course	Fee Per Year
B.A. (Hons.) Mass Comm.	₹ 40,000
B.A. Economics /English	₹ 28,000
B.A. Socio./Pol. Sc./ Hindi	₹ 28,000
M.A. (Hons.) Mass Comm.	₹ 49,500
M.A. Math.	₹ 35,000
M.A./M.Sc. Geography	₹ 35,000
M.A. Eco./Eng./Pol. Sc./Edu	₹ 35,000

SCHOOL OF MANAGEMENT STUDIES- SMS

Course	Fee Per Year
B.B.A.+CMA/WCBA(U.S)	₹ 45,000
B.Com.+CMA(U.S)	
B.Com C.A.	₹ 35,000
M.Com	₹ 39,500

BUSINESS SCHOOL
MBA ₹ 97,500
+WCBA/Foreign Tour
APPROVED BY AICTE, MINISTRY OF HRD GOVT. OF INDIA

SCHOOL OF FOOD TECHNOLOGY

Course	Fee Per Year
B.Sc Food Technology	₹ 49,500
M.Sc Food Technology	₹ 59,500

SCHOOL OF HOTEL MANAGEMENT- SHM

Course	Fee Per Year
1 Yr Certificate Diploma in Hotel Management AHLEI (USA)	₹ 30,000
BHM Bachelor Hotel Mgmt.	₹ 59,500

SCHOOL OF LAW- SOL (LIBRA DEHRADUN)

Course	Fee Per Year
B.A. LLB	₹ 50,000/-
LLB	₹ 50,000/-
LLM	₹ 80,000/-

SCHOOL OF PHARMACY- SOP (KIPS JHAJRA DEHRADUN)

Course	Fee Per Year
D.Pharma	₹ 45,000/-
B.Pharma	₹ 55,000/-
B.Pharma- Lateral Entry	₹ 55,000/-

HOSTEL FACILITY | CAMPUS PLACEMENT | CAMPUS EVENTS
Hostel Fee Per Year 50,000 (Inclusive of South Cuisine)

CAMPUS MAIN
BFIT GROUP OF INSTITUTIONS, DEHRADUN
Suddhowala, Chakrata Road, Dehradun, Uttarakhand-248007
Ph: 7300900900, 7300900909, 7300900919, 7300900929
Email : info@bfitdoon.com ▮ admissionbfit@gmail.com
For Details Log on to : www.bfitdoon.com

నవరత్నాల ధగధగలు

- ఎన్నికల మేనిఫెస్టో అమలుకు బాటలు
- రూ.2,27,975 కోట్లతో రాష్ట్ర బడ్జెట్
- శాసనసభకు సమర్పించిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్
- రూ.1,778.52 కోట్ల రెవెన్యూ లోటు

ఈనాడు- అమరావతి: ఎన్నికల హామీల అమలు దిశగా వైకాపా ప్రభుత్వం ముందడుగు వేసింది. నవరత్నాలను ప్రజల చెంతకు చేర్చేందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. రాష్ట్రాన్ని సంక్షేమ బాటలో నడిపించేందుకు నడుం బిగించింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీల అమలు దిశగా బడ్జెట్ రూపుదిద్దుకుంది. సామాజిక పింఛన్లకు భారీగా నిధులు కేటాయించింది. రాష్ట్ర శాసనసభకు శుక్రవారం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సమర్పించిన తొలి బడ్జెట్ సర్వజన సంక్షేమానికి బాటలు వేసింది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి రూ.2,27,975 కోట్ల అంచనా విలువతో బడ్జెట్ ప్రతిపాదించింది. ఇందులో ఒక్క సంక్షేమానికే ప్రభుత్వం రూ.75 వేల కోట్లకుపైగా కేటాయించింది. రూ1,778.52 కోట్ల రెవెన్యూ లోటును చూపింది.

ఆపన్నులకు అండ

సామాజిక పింఛన్లకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించింది. వైఎస్సార్ పింఛను, కానుకల పేరుతో దాదాపు తొమ్మిది గ్రూపుల కోసం మొత్తం రూ.15,746.59 కోట్లను కేటాయించింది. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, డయాలసిస్ రోగులు, కల్లు గీత కార్మికులు, వైఎస్ఆర్ అభయహస్తం కింద డ్వాక్రా మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు సయితం పింఛన్లు ఇవ్వనుంది. రజకులు, నాయీబ్రాహ్మణులు, దర్జీలకు ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం ఇవ్వనుంది. ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేల ఆర్థికసాయం ప్రకటించి అమలు చేయనుంది. సొంత ఆటోలు నడుపుతున్న వారికి రూ.400 కోట్ల వరకు సాయం అందించనుంది.

శాసనసభలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బడ్జెట్ ప్రసంగం చేస్తుండగా ప్రతులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి జగన్. చిత్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు

రైతు సంక్షేమబాట

వ్యవసాయానికి ఏకంగా రూ.21 వేల కోట్లకు పైగా కేటాయించింది. ప్రస్తుతం ఏడు గంటలు ఇస్తున్న ఉచిత విద్యుత్‌ను మరో రెండు గంటల పాటు పెంచి ఇచ్చేందుకు వీలుగా రూ.4525 కోట్లు కేటాయించింది. ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ.12,500 ఇచ్చేలా రూ.8,750 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. దీని వల్ల 64.07 లక్షల రైతు కుటుంబాలకు ప్రయోజనం దక్కనుంది. కేంద్ర నిధులే కాకుండా అదనంగా పెట్టుబడి సాయానికి భరోసానిచ్చింది. ధరల స్థిరీకరణకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా రూ.3000 కోట్లు కేటాయించింది. ఇప్పటికే ఏర్పాటుచేసిన రైతుమిషన్ ధరల వ్యవహారాన్ని పరిశీలించి అదనపు మద్దతు ధర కల్పించేందుకు వీలుగా మార్కెట్ స్థిరీకరణకు ఈ నిధులు వినియోగించనుంది. పంటలకు ఉచిత బీమా కల్పించనుంది. ఇందుకోసం రూ.1163 కోట్లు కేటాయించింది. ఆక్వా రైతుల విద్యుత్ రాయితీకి నిధులిచ్చింది. కొత్తగా వైఎస్సార్ భరోసా కింద బోరుబావుల తవ్వకానికి నిధులు కేటాయించింది.

బడ్జెట్ ప్రతులను పరిశీలిస్తున్న చంద్రబాబు నాయుడు. చిత్రంలో తెదేపా, వైకాపా ఎమ్మెల్యేలు

విద్య, ఉద్యోగాలకు పెద్దపీట

వైకాపా తన మేనిఫెస్టోలో ప్రకటించినట్లు జగనన్న అమ్మఒడి పథకం ఈ బడ్జెట్‌లో రూపుదిద్దుకుంది. ఇంటర్మీడియట్ స్థాయి వరకు చదువుకునే పిల్లలున్న అమ్మలకు ఆర్థికసాయం అందించేందుకు రూ.6455.80 కోట్లు కేటాయించింది. గ్రామ సచివాలయాలు, పురపాలక వార్డు సచివాలయాల ఏర్పాటు ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుడుతున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా ఈ సచివాలయాల ఏర్పాటుకు బడ్జెట్‌లో రూ.880 కోట్లు చూపింది. ఇవి కాక వాలంటీర్ల నియామకానికి రూ.వెయ్యి కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

ఆరోగ్యశ్రీకి రూ.1740 కోట్లు

రాష్ట్రంలోనే కాక సమీప రాష్ట్రాల్లోని హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల్లోనూ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందేందుకు రూ.1740 కోట్లు కేటాయించింది. ఇళ్ల నిర్మాణానికీ ప్రాధాన్యమిచ్చింది. వైఎస్సార్ గృహవసతి కింద రూ.5000 కోట్లు ప్రతిపాదించింది. రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణానికి రూ.9785.75 కోట్లు వెచ్చించనుంది.

వ్యవసాయానికి కేటా'యింపు'లే

శాఖలవారీ కేటాయింపుల్లో.. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. 2018-19 ఆర్థిక సంవత్సరంకన్నా ప్రస్తుత బడ్జెట్‌లో ఏకంగా 81.51 శాతం అదనంగా కేటాయించడం విశేషం. ఇంధన శాఖకు కూడా 63శాతం అదనపు కేటాయింపులున్నాయి. జలయజ్ఞం ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు రూ.13,139.05 కోట్లు కేటాయించింది. ఇందులో ఒక్క పోలవరానికే రూ.5,242 కోట్లు ఇవ్వనుంది. వైద్యం, ఆరోగ్యానికి సయితం 34శాతం అదనపు కేటాయింపులున్నాయి. వెనకబడిన తరగతుల సంక్షేమానికి 17శాతం అదనపు నిధులు ఇవ్వనుంది.

అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బడ్జెట్.. ముఖ్యాంశాలు

- వ్యవసాయ ట్రాక్టర్లకు రోడ్డు పన్ను మినహాయింపు
- భూసారం, విత్తనం, ఎరువులు, పురుగు మందులను పరీక్షించే సదుపాయాలతో వైఎస్ఆర్ అగ్రిల్యాబ్స్ ఏర్పాటు
- సరిహద్దు జిల్లాల్లోని ప్రజలకు రాష్ట్రానికి వెలుపల బెంగళూరు, హైదరాబాద్, చెన్నై తదితర నగరాల్లోని ఆసుపత్రిల్లోనూ ఆరోగ్య శ్రీ కింద వైద్యం
- పాడేరు/అరకు ప్రాంతాల్లో రూ.66 కోట్ల ప్రాథమిక వ్యయంతో గిరిజన వైద్య కళాశాల ఏర్పాటు
- పల్నాడు ప్రాంతానికి సేవలందించేందుకు గురజాలలో, ఉత్తరాంధ్రకు సేవలందించేందుకు విజయనగరంలో చెరో రూ.66 కోట్ల వ్యయంతో వైద్య కళాశాలల ఏర్పాటు
- శ్రీకాకుళం జిల్లా పలాసలో రూ.50 కోట్ల వ్యయంతో కిడ్నీ పరిశోధన కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు
- ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు (ప్రస్తుతం 100 యూనిట్ల వరకే ఉచిత విద్యుత్తు ఇస్తున్నారు)
- ఎస్సీల్లోని మాల, మాదిగ, రెల్లి తదితర కులాల కోసం ప్రత్యేక కార్పొరేషన్లు
- బీసీ కమిషన్ పునర్నిర్మాణం
- రజకులు, నాయీ బ్రాహ్మణులు, దర్జీలకు ఏటా రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం
- బీసీకులాల కోసం 139 ప్రత్యేక కార్పొరేషన్ల ఏర్పాటు. వీటి ద్వారా వచ్చే ఏడాది నుంచి వైఎస్ఆర్ చేయూత పథకం ప్రారంభం
- వైఎస్ఆర్ గిరిజన విశ్వవిద్యాలయం అభివృద్ధికి రూ.50 కోట్లు
- ఇమామ్‌లకు రూ.10 వేలకు, మౌజమ్‌లకు రూ.5 వేలకు గౌరవ వేతనం పెంపు. పాస్టర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం
- 2వేల వరకూ జనాభా కలిగిన ప్రతి పంచాయతీకి రూ.30వేలతోనూ, 5వేల వరకూ జనాభా కలిగిన ప్రతి పంచాయితీకి రూ.60 వేలు, 10 వేల వరకూ జనాభా కలిగిన ప్రతి పంచాయతీకి రూ.90 వేలు, 10 వేలకు మించి జనాభా కలిగిన ప్రతి పంచాయతీకి రూ.1.20 లక్షలతోనూ దూప, దీప, నైవేద్యం కల్పన. ధార్మిక సంస్థలకు వైఎస్ఆర్ గ్రాంటు కింద ఈ పథకం అమలు. దీనికోసం రూ.234 కోట్లు కేటాయింపు
- న్యాయవాదులు ప్రాక్టీసు మొదలుపెట్టిన తొలి మూడేళ్లపాటు నెలకు రూ.5 వేల స్టైఫండ్ చెల్లింపు. రూ.100 కోట్లతో న్యాయవాదుల సంక్షేమ ట్రస్టు ఏర్పాటు
- సొంతంగా వాహనం కలిగిన ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.10వేల ఆర్థిక సాయం
- కడప ఉక్కు కర్మాగారానికి రూ.200 కోట్లు
- అమరావతి-అనంతపురం జాతీయ రహదారికి రూ.100 కోట్లు
- రాష్ట్ర క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు: రూ.43.60 కోట్లు

అసెంబ్లీ సాక్షిగా బెదిరింపులా?

ఈనాడు డిజిటల్, అమరావతి: ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తే శాసనసభ సాక్షిగా బెదిరింపులకు దిగడం సరికాదని తెదేపా ఎమ్మెల్యేలు హితవు పలికారు. బడ్జెట్ సమావేశాల రెండో రోజైన శుక్రవారం టీ విరామ సమయంలో తెదేపా ఎమ్మెల్యేలు అసెంబ్లీ మీడియాపాయింట్ వద్ద విలేకర్లతో మాట్లాడారు.

తెదేపా ఎమ్మెల్యేలతో కలిసి మీడియా కేంద్రంలో మాట్లాడుతున్న ఆ పార్టీ శాసనసభాపక్ష ఉపనేత అచ్చెన్నాయుడు

క్షమాపణ చెప్పండి

'ముఖ్యమంత్రి సభను అవాస్తవాలతో తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆయనకు అవగాహన, అనుభవం రెండూ లేవు. సభలో గురువారం సున్నా వడ్డీ రుణాలపై జరిగిన చర్చలో తెదేపా ప్రభుత్వం 2014 నుంచి 19 వరకు సున్నా వడ్డీ రుణాల కింద చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదన్నారు.. ఆధారాలు తెప్పిస్తా రాజీనామా చేస్తారా అని జగన్ సవాలు విసిరారు. ఇప్పుడు సున్నా వడ్డీకి డబ్బులిచ్చినట్లు ఆధారాలు తెచ్చాం.. తెదేపా ఏమీ ఇవ్వలేదని చెప్పిన మీ నోటితోనే రూ.600 కోట్లు ఇచ్చిందంటూ ఒప్పుకున్నారు. మీరు రాజీనామా చేయండి. లేదా తప్పు చేశానంటూ ఒప్పుకొని క్షమాపణ చెప్పండి. 5 శాతమే రుణమాఫీ చేశామనటం మీ అవివేకం. అవమానించి మాట్లాడటం, సంఖ్యా బలం ఎక్కువుందని చేతులు విరిచేస్తామంటూ బెదిరించడం వల్ల ఉపయోగం లేదు. బళ్లు ఓడలు, ఓడలు బళ్లు అయిన సందర్భాలు చరిత్రలో చాలా ఉన్నాయి. గుర్తుంచుకోండి'

– తెదేపా ఎమ్మెల్యేలు అచ్చెన్నాయుడు, బుచ్చయ్య చౌదరి, రామానాయుడు

ఆర్థిక మంత్రి బుగ్గనకు ముఖ్యమంత్రి అభినందన

ఈనాడు, అమరావతి: తొలిసారి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, మంత్రులు అభినందనలు తెలిపారు. శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి సమావేశమైంది. అసెంబ్లీలో ప్రవేశపెట్టే వార్షిక, వ్యవసాయ బడ్జెట్లను ఆమోదించింది.

అన్నం పెట్టమంటే బిర్యానీ వడ్డించారు

– వైకాపా ఎమ్మెల్యేలు అప్పలరాజు, కాసు మహేష్ రెడ్డి

'పేదవాడు అన్నం పెట్టమంటే ఏకంగా బిర్యానీ వడ్డించేలా బడ్జెట్ ఉంది. నవరత్నాలు హామీల్లో 80 శాతం తొలి సంవత్సరమే నెరవేర్చేందుకు కసరత్తు చేశారు. గురజాలలో వైద్యకళాశాలకు, పలాసలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి నిధులు కేటాయించి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి మొగ్గు చూపారు. పౌరసరఫరాల శాఖ ద్వారా రేషన్ సరుకులు ఇంటికే చేర్చడం దేశంలో ఇదే తొలిసారి. వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన చేరువవుతుంది.'

కౌలు రైతుకు మేలు జరిగేలా చర్యలుండాలి

రాష్ట్ర బడ్జెట్‌లో కౌలు రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పడం హర్షనీయం. కౌలు రైతు చట్టం 2011లో చేస్తామంటున్న సవరణల్లో భూ యజమాని సంతకంతో కూడిన అంగీకార పత్రం ఇస్తామని చెప్పడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కౌలుకిచ్చిన పొలానికి ఒప్పంద పత్రం రాసిచ్చిన చరిత్ర ఇప్పటివరకూ రాష్ట్రంలో లేదు. కౌలు రైతులకు ప్రస్తుతం ఉన్న అరకొర సౌకర్యాలు సైతం కోల్పోయేలా చర్యలు ఉండకూడదు.

– కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి. జమలయ్య

వ్యవసాయ కార్మికులను విస్మరించారు

బడ్జెట్‌లో ప్రతిపాదనల్లో ప్రభుత్వం వ్యవసాయ కార్మికులను విస్మరించింది. ఏటా కరువు కాటకాల వల్ల 20 లక్షల వ్యవసాయ కార్మిక కుటుంబాలు వలస పోతున్నాయి. వీటిని నివారణకు ఏ చర్యలు తీసుకుంటుందో బడ్జెట్‌లో చెప్పలేదు.

– ఏపీ వ్యకాసం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బారావు, వెంకటేశ్వర్లు

Admission Guidance in AP
MBBS
NEET Qualified NRI Quota
9666 590 490

సున్నా వడ్డీపై మళ్లీ రభస

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించామన్నట్లుగా బాబు వైఖరి ఉందని తప్పుపట్టారు. 'వడ్డీ సొమ్ము చెల్లించకుండా రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తారా? మోసాలన్నీ ప్రజలంతా గమనించినందునే మీ (తెదేపా) సీట్లు 23కి పడిపోయాయి. ఇదే ధోరణి కొనసాగిస్తే వచ్చే ఎన్నికల్లో సీట్లు 13కి పడిపోతాయి' అని వ్యాఖ్యానించారు. సభ్యులు ఒకరినొకరు దూషించుకుంటూ పెద్దఎత్తున నినాదాలు చేయడం గందరగోళానికి దారితీసింది. దమ్మిడీ చెల్లించి అంతా ఇచ్చేసినట్లు చెప్పడమేమిటని ముఖ్యమంత్రి నిలదీశారు. '2015-19 మధ్య వడ్డీలేని వ్యవసాయ రుణాల కింద బ్యాంకులకు రూ.11,595 కోట్లు చెల్లించాల్సి ఉంది. రూ.630 కోట్లు చెల్లించి పూర్తిగా జమ చేశామంటే ఎలా నమ్మాలి? పొదుపు సంఘాల రుణాలపై పావలా వడ్డీ కింద రూ.3,036 కోట్ల చెల్లింపులపైనా ఇలాగే మోసం చేశారు' అని సీఎం విమర్శించారు.

ఎప్పుడూ రాజకీయ లబ్ధికే ఆరాటం

'ఎప్పుడూ ఏదో ఒక రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూస్తుంటారు. ఇలాంటి వ్యక్తుల మధ్య శాసనసభ జరగడం బాధాకరం. ఆపై వెకిలి నవ్వు ...ఎందుకు నవ్వుతున్నారో ఆయనకే తెలియదు?' అంటూ చంద్రబాబుని ఉద్దేశించి జగన్ విమర్శించారు. 'ఏమైనా అంటే 40 ఏళ్ల ఇండస్ట్రీ (అనుభవం) అంటారు. కనీస నియమాలు కూడా తెలియవు. అబద్ధాలు, అసత్యాలు ఎవరు చెబుతున్నారో గుండెల మీద చేయి వేసుకొని చెప్పమనండి. ఆయనేమో ఇప్పటికీ తానే ముఖ్యమంత్రిననే భ్రమల్లో ఉన్నట్లున్నారు. దాని నుంచి బయటపడమనండి. వడ్డీలేని రుణాలపై జాతీయ స్థాయిలో ఆహా అన్నట్లుగా చంద్రబాబు గొప్పలు చెప్పుకున్నారు. తానా అంటే తందాన అనే ఎల్లో మీడియా అండ ఆయనకు ఉంది' అని ముఖ్యమంత్రి అన్నారు. 'మీ మాదిరిగా నేను వ్యాఖ్యలు చేయడం మొదలు పెడితే, ఫిరాయింపుల్ని ప్రోత్సహిస్తే అసెంబ్లీలో ఎవరూ కనిపించరు. మేం 151 మంది శాసనసభ్యులం ఉన్నాం. మీ వాళ్లు 23 మంది మాత్రమే ఉన్నారు. ముఖ్యమంత్రిగా నేను మాట్లాడుతుంటే అడ్డు తగులుతారా? ఇదేం పశువుల సంత అనుకున్నారా? ఎలాంటోళ్లను తయారు చేశారయ్యా?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చేపల బజారా: స్పీకర్

సభ్యులు ఘాటైన వ్యాఖ్యలతో కేకలు వేయడంతో సభాపతి తమ్మినేని సీతారాం తీవ్రంగా స్పందించారు. 'ఇది శాసనసభ. . చేపల బజారా (ఫిష్ మార్కెట్టా)?' అని ప్రశ్నించారు. 'ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు మాట్లాడుతున్నారు. వాళ్లిద్దరి వాదనలు ప్రజల్లోకి వెళ్లనీయండి. మంచేదో, చెడేదో వారే నిర్ణయిస్తారు' అని అన్నారు. ప్రతిపక్షం మాట్లాడాక ఇక చర్చకు అవకాశం లేదన్న ఉద్దేశంతోనే గురువారం సభను వాయిదా వేశానని, ఇంకేమీ జరగలేదని స్పష్టంచేశారు. తొలుత తెదేపా ఉప నాయకుడు కె.అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వడ్డీలేని రుణాలపై ముఖ్యమంత్రి గురువారం ప్రజలను తప్పుతోవ పట్టించారని, వాస్తవాలేమిటో వివరించే అవకాశం ఇవ్వాలని సభాపతిని కోరారు. ముగిసిన విషయాలపై మళ్లీ మాట్లాడే అవకాశం లేదని తమ్మినేని స్పష్టం చేయగా, నిన్నటి సమావేశాన్ని అర్థాంతరంగా ముగించారని అచ్చెన్నాయుడు అన్నారు. గత ప్రభుత్వం వడ్డీలేని రుణాలు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారని, ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. దీనిపై అధికార, ప్రతిపక్షాల మధ్య వాదోపవాదనలు, ప్రతి విమర్శలు చోటుచేసుకున్నాయి. సభాపతి తీవ్రంగా స్పందిస్తూ హక్కులు అణచివేసే పరిస్థితి ఇక్కడ ఉండదన్నారు. నిన్నటి అంశాన్ని అత్యవసరంగా భావిస్తే చర్చిద్దామని, వాస్తవాలేమిటో ప్రజలకు తెలుస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. ప్రతిపక్ష నేతకు మాట్లాడే అవకాశం కల్పించాలని సభాపతిని కోరారు. తప్పుడు సమాచారంతో తెదేపా సభ్యులు సభను తప్పుతోవ పట్టిస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. అధికార పార్టీ తరపున అంబటి రాంబాబు, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి; తెదేపా తరపున అచ్చెన్నాయుడు, రామానాయుడు, బుచ్చయ్యచౌదరి, వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు ఒకరిపై మరొకరు పెద్ద ఎత్తున కేకలు వేసుకున్నారు. ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని తెదేపా సభ్యులు, చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ వైకాపా సభ్యులు సభలో నినాదాలు చేశారు.

తప్పుడు ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి తప్పుకోవాలి: చంద్రబాబు

ముఖ్యమంత్రి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విపక్షనేత చంద్రబాబు ధ్వజమెత్తారు. 'వడ్డీలేని రుణాలు ఇచ్చామని నిరూపిస్తే రాజీనామా చేసి వెళ్లిపోతారా? 2013 నుంచి 2019 వరకు పావలా వడ్డీ పథకంపై రూ.25.14 కోట్లు, వడ్డీలేని రుణం పథకంపై రూ.979.45 కోట్లు చెల్లించినట్లు రికార్డులు చెబుతున్నాయి. పథకాలతో 43,70,127 మందికి లబ్ధి చేకూరింది. వాస్తవాలిలా ఉంటే ..రీ షెడ్యూల్ చేయలేదని మాట్లాడతారా? కరవు మండలాల వివరాలు కేంద్రానికి పంపినపుడల్లా ఆర్బీఐ నిబంధనల ప్రకారం వాటంతట అవే రీ-షెడ్యూల్ అవుతాయని తెలియదా? ఈ పెద్ద మనిషి నన్ను రాజీనామా చేసి వెళ్లిపోమంటారా? కాళేశ్వరం గురించి మాట్లాడితే గాడిదలు కాస్తున్నావా? అంటే బాధ కలగదా?' అని చంద్రబాబు అన్నారు. 'ముఖ్యమంత్రితో అయిదు కోట్ల మంది ప్రజలకు క్షమాపణలు చెప్పించే బాధ్యత మీపైనా కూడా ఉంది' అని సభాపతిని ఉద్దేశించి చంద్రబాబు అన్నారు. తమపై ఆరోపణలకు వివరణ ఇచ్చే అవకాశం కల్పించాలన్నారు. మాట్లాడుతుంటే అడ్డుతగలడం ఏం పద్ధతి అని ప్రశ్నించారు.

బడ్జెట్‌పై విభిన్న స్పందనలు

యువత నిరుత్సాహం

ఎన్నికల హామీలను అమలు పరిచేలా కృషి చేయడం మంచి పరిణామమే. మైనారిటీ, సాంఘిక సంక్షేమం, మహిళా- శిశు సంక్షేమం, గృహ నిర్మాణం, నీటిపారుదల, పట్టణాభివృద్ధి రంగాలకు బడ్జెట్‌లో కోత విధించడం ఆయా తరగతుల అభివృద్ధికి ఆటంకంగా మారుతుంది. నిరుద్యోగ భృతి రద్దు చేయడం యువతను నిరుత్సాహానికి గురి చేస్తుంది. – సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు

ప్రాధాన్య రంగాలను పక్కన పెట్టారు: నీటి పారుదల శాఖకు 22.61 శాతం నిధుల కోత విధించడం సరైన చర్య కాదు. నవరత్నాలకు నిధులు కేటాయించి ప్రాధాన్య రంగాలను పక్కన పెట్టడం శోచనీయం. – సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

బడ్జెట్ బాగుంది..

బడ్జెట్‌లో ప్రతిపాదించిన అంశాలు బాగున్నాయి. విద్యుత్తు వాహనాలతో ప్రజారవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. పరిశ్రమల అభివృద్ధికి సైతం ఇది ఆసరా అవుతుంది.

– భారత పరిశ్రమ సమాఖ్య ఏపీ సీఈవో విజయ్ నాయుడు

తాత్కాలికంగా బాగుంటుంది..

'పూర్తి సంక్షేమ ప్రధానంగా సాగిన బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించలేదు. నగదు లాభాలు నేరుగా అందించేందుకే ప్రయత్నించింది. తాత్కాలికంగా బాగున్నట్లు అనిపించినా దీర్ఘకాలిక ప్రయోజనాలు ఏమాత్రం లేని బడ్జెట్ ఇది.'

– పీడీఎఫ్ ఎమ్మెల్సీలు బాల సుబ్రమణ్యం, కేఎస్ లక్ష్మణరావు, వై. శ్రీనివాసరెడ్డి, రాము సూర్యారావు, ఐ. వెంకటరావు

ఈనాడు

మృగోన్మాదంపై వేటు

దేశంలో నునులేత మొగ్గల్లాంటి పిల్లల బతుకుల్ని కర్కశంగా చిదిమేసే మానవ మృగాల పైశాచిక నేరాల విస్తృతి, ఉద్ధృతి దిగ్భ్రాంతపరుస్తున్నాయి. లైంగిక దాడులు, వేధింపుల బారినుంచి బాలబాలికల్ని రక్షించే లక్ష్యంతోనే 2012లో 'పోక్సో' చట్టం రూపుదిద్దుకొంది. ఎనిమిదేళ్ల నిస్సహాయ బాలికపై ఆరుగురు అత్యాచారానికి తెగబడి క్రూరంగా హింసించి హతమార్చిన కథువా కేసు నేపథ్యంలో- ఈ ఏడాది మొదట్లో 'పోక్సో' చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ తెచ్చిన బిల్లు, పదహారో లోక్‌సభ కాలావధి ముగియడంతో మురిగిపోయింది. దాని స్థానే కేంద్రం కొత్తగా సిద్ధపరచిన సవరణ బిల్లు, పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడేవాళ్లకు మరణశిక్ష విధించాలంటోంది. చిన్న పిల్లలతో అశ్లీల చిత్రాలు తీయడం, వాటిని ప్రచారం చేయడం, లైంగిక కార్యకలాపాల రొంపిలో దింపడానికి హార్మోన్ ఇంజక్షన్లతో శారీరక ఎదుగుదలకు పాల్పడటం తదితరాలన్నింటికీ జైలుశిక్ష, జరిమానా తప్పవంటున్న బిల్లులో తొలిసారి కీలక నిర్వచనమొకటి పొందుపరచారు. ఇప్పటిదాకా ఐటీ సెక్షన్ 67, ఐపీసీ సెక్షన్ 293 బాలల అశ్లీల చిత్రాలంటే ఏమిటో ఇదమిత్థంగా పేర్కొనని లోటు పూడ్చడానికంటూ సవరణ బిల్లులో ఆ అంశాన్ని పేర్కొనడం ఏ మేరకు ప్రయోజనకరమో- చట్టం అమలయ్యాక నిగ్గు తేలాల్సి ఉంది. ఇటీవల మదోన్మాదానికి బలైన వరంగల్ పసికందు కేసులో ఫాస్ట్‌ట్రాక్ విచారణ జరిపించాలని జాతీయ బీసీ కమిషన్ సభ్యులు సూచించడం తెలిసిందే. వాస్తవానికి 'పోక్సో' కేసులన్నింటా శీఘ్రతర విచారణ చేపట్టాలని ఏడాది క్రితమే సుప్రీంకోర్టు పిలుపిచ్చింది. పేరుకుపోతున్న అత్యాచార, 'పోక్సో' కేసుల్ని చకచకా ఒక కొలిక్కి తేవడానికి 18 రాష్ట్రాల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు యత్నాలు చురుకందుకుంటున్నాయి. సత్వర విచారణ చేపట్టి దోషులకు కఠిన శిక్షలు విధించి ఏమాత్రం జాప్యానికి తావివ్వకుండా అమలుపరిస్తేనే- ఈ సవరణలకు, ఫాస్ట్‌ట్రాక్ వ్యూహాలకు అర్థం, పరమార్థం!

ఈ గడ్డమీద ప్రతి గంటకు కనీసం నలుగురు పిల్లలు లైంగిక హింసకు గురవుతున్నట్లు అధికారిక గణాంకాలే చాటుతున్నాయి. స్వచ్ఛంద సంస్థ 'క్రై' లెక్కల ప్రకారం, పదేళ్ల కాలంలో పిల్లలపై లైంగిక నేరాలు అయిదు రెట్లు పెరిగాయి. 'పోక్సో' చట్టం కింద ఒక్క 2016 సంవత్సరంలోనే 36వేల కేసులు నమోదయ్యాయని, ఆ ఏడాది చివరికి సుమారు 90వేల కేసులు అపరిష్కృతంగా ఉన్నట్లు కేంద్రం గత నెలలో లోక్‌సభాముఖంగా వెల్లడించింది. ప్రస్తుత సంవత్సరం తొలి ఆరు నెలల్లోనే పిల్లలపై పాశవిక అత్యాచారాలకు సంబంధించి దేశం నలుమూలలా దాఖలైన ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్)ల సంఖ్య 24వేలకు పైబడింది. ఈ తీవ్రతను పరికించి కలవరపాటుకు గురైన సర్వోన్నత న్యాయస్థానం తనంతతాను (సు మోటు)గా ప్రజా ప్రయోజన వ్యాజ్యం నమోదు చేయాల్సిన దుస్థితి- యావత్ జాతీ సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిణామం! లైంగిక నేరారోపణలు విరివిగా వెలుగు చూస్తున్న రాష్ట్రాల జాబితాలో యూపీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర ముందు వరసలో ఉన్నాయి. ఆరేళ్లలోపు బాలికలపై అత్యాచారాల్లో తెలంగాణ రెండు, ఆంధ్రప్రదేశ్ అయిదో స్థానాల్లో నిలిచాయన్న గణాంకాలు మృగాళ్ల విశృంఖలత్వాన్ని కళ్లకు కడుతున్నాయి. ఎనిమిదేళ్ల పాపపై హత్యాచారానికి ఒడిగట్టిన కామాంధుడికి భోపాల్ కోర్టు 32 రోజుల్లోనే మరణశిక్ష ఖరారు చేసిన తాజా ఉదంతం లాంటివి అత్యంత అరుదైన ఉదాహరణలుగా మిగులుతున్నాయి. పిల్లలపై నేరాల్లో ఏటా సుమారు 26శాతం వృద్ధి నమోదవుతుండగా, శిక్షల రేటు పాతికశాతంలోపే ఉంటోంది. చాలా చోట్ల అసలు ఫిర్యాదులే స్వీకరించని, తీసుకున్నా చురుగ్గా స్పందించని అవ్యవస్థ బాధిత కుటుంబాల్ని మరింత కుంగదీస్తోంది. లైంగిక నేరాలకు శిక్షల పరిధిలో ఉరినీ చేర్చడంవల్ల కేసుల నమోదు చతికిలపడుతుందన్న భయాందోళనలపై ప్రభుత్వమే దీటుగా స్పందించాలి!

కారడవిలో ఆకలిగొన్న పులులు లేడికూనల్ని వేటాడినట్లు, జనారణ్యంలో మదోన్మత్తులు అన్నెంపున్నెం ఎరుగని పిల్లల్ని యథేచ్ఛగా కబళిస్తున్న తీరు- చట్టమే ఏకైక పరిష్కారమార్గం కాదని పదేపదే నిరూపిస్తోంది. అరుంధతీరాయ్ వంటివారు 'నేను పుట్టి పెరిగిన భారతావని మౌలిక సంస్కృతి ఇది కాదు' అని ఆక్రోశించే స్థాయిలో లైంగిక నేరాలు పెచ్చరిల్లుతున్నాయి. 'అయిదేళ్ల పసిపాప మీదా క్రూర అత్యాచారమా? ఎక్కడో ఏదో లోపం ఉంది!' అన్న దిల్లీ హైకోర్టు ఆవేదనాభరిత స్పందన- జాతి నైతిక దిక్సూచిని సరిచేసుకుని తీరాల్సిన ఆవశ్యకతను ఉద్బోధించేదే. లైంగిక హింసోన్మాదం అపరిచితులు, సైకోలకే పరిమితమైన జాడ్యం కాదంటున్న విశ్లేషణలు- పసికందుల పట్ల రాక్షసంగా ప్రవర్తిస్తున్నవాళ్లలో 95శాతం పరిచయస్తులు, సన్నిహితులు, కుటుంబ సభ్యులు ఉంటున్నారనడం... సామాజిక విలువల క్షీణతను నిరోధించాల్సిన అవసరాన్ని ఎలుగెత్తేదే. కానిపనికి పాల్పడి చట్టం పొడుగాటి చేతులనుంచి తప్పించుకోవడం అసాధ్యమన్న భీతిని న్యాయపాలిక రగుల్కొల్పడం ఎంత ముఖ్యమో, మృగప్రవృత్తిని రేకెత్తించే అశ్లీల వెబ్‌సైట్లు మత్తుపదార్థాలపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపడం అంతే కీలకం. 130 కోట్లకు పైబడిన దేశ జనాభాలో పద్నాలుగేళ్లలోపు పిల్లలు మూడోవంతు (సుమారు 43కోట్లు)గా లెక్క తేలుతున్నా, కేంద్ర బడ్జెట్‌లో వారికోసం కేటాయింపులు అయిదుశాతంలోపు. అందులోనూ పిల్లల సంరక్షణ నిధులు బొటాబొటీయేనంటున్న గణాంకాలు, దిద్దుబాటు చర్యలు ఎక్కడ మొదలుపెట్టాలో ఎలుగెత్తుతున్నాయి. స్వేచ్ఛ, రక్షణ, విశ్వాసాలతో కూడిన బాల్యదశను పొందే హక్కు దేశంలో పిల్లలందరికీ దఖలుపడే వాతావరణ పరికల్పన ప్రభుత్వాల మౌలిక బాధ్యత. బాలబాలికల్ని జాతి సంపదగా పరిగణించే విధి విధానాల కూర్పు, ఆ మేరకు యంత్రాంగాన్ని సన్నద్ధపరుస్తూ వ్యవస్థాగత మరమ్మతులు, బడి దశలోనే సంస్కార బీజాలు నాటే నైతిక విద్యాబోధన- ఈ బహుముఖ కార్యాచరణతోనే భారత్ శిరసెత్తుకోగలిగేది!

ఆలస్యం న్యాయం విషం

క్రిమినల్ కేసుల్లో వాదనలు జరిగే సమయానికి నిందితులు అప్పటికే తమ నేరం రుజువైతే పడే గరిష్ఠ శిక్షకు మించి కారాగారాల్లో మగ్గిపోతున్నారు. సివిల్ కేసుల్లో రెండు మూడు తరాలు గడచిపోయాక తీర్పులు వస్తున్నాయి. ఇది తీవ్రమైన సమస్య' అంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగొయ్ ఇటీవల ఆవేదన వ్యక్తంజేశారు. జాతీయ న్యాయ సమాచార నిధి వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో 1979లో నమోదైన ఓ హత్యకేసు 1982లో న్యాయస్థానానికి వచ్చింది. రాజమండ్రి అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి ముందు ఈ కేసులో జనవరి 31, 2018నాడు మొదటిసారి వాదనలు జరిగాయి. అంటే, నేరం జరిగిన నాలుగు దశాబ్దాలకు విచారణ ప్రక్రియ మొదలైందన్న మాట! కామారెడ్డి సీనియర్ సివిల్ న్యాయస్థానంలో 1988లో దాఖలైన వ్యాజ్యం- 2017, ఏప్రిల్ 19న తొలిసారి విచారణకు నోచుకుంది. ఇలా దేశవ్యాప్తంగా వివిధ న్యాయస్థానాల్లో 76 వేల వ్యాజ్యాలు కనీసం మూడు దశాబ్దాలకు పైబడి (వీటిలో 140 కేసులు అరవై ఏళ్ల కిందటివి) అపరిష్కృతంగా ఉన్నాయి. 24.27 లక్షల వ్యాజ్యాల విచారణ పది నుంచి ముప్పై ఏళ్లుగా సాగుతూనే ఉంది. మొత్తమ్మీద ఈ జులై 11నాటికి దేశ న్యాయస్థానాల్లో 3.13 కోట్ల కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. దిగువ కోర్టుల్లో పెండింగు కేసులను పరిష్కరించడానికి సంస్కరణలు తీసుకువస్తే సులభతర వాణిజ్యంలో దేశం వడివడిగా అడుగులు వేయగలదని మొన్నటి ఆర్థిక సర్వే సైతం సూచించింది.

నేరానికి మించిన శిక్ష

న్యాయవిచారణలో చోటుచేసుకుంటున్న 'ఆలస్యం' అనేక దుష్పరిణామాలకు హేతువవుతోంది. ముఖ్యంగా విచారణ ఖైదీల (అండర్ ట్రయిల్స్) మానవ హక్కులను బుగ్గిచేస్తోంది. వాస్తవానికి మన దేశ కారాగారాలు 3.78 లక్షల మంది ఖైదీలకే సరిపోతాయి. కానీ, జాతీయ నేర గణాంకాల సంస్థ గణాంకాల మేరకు 2016 నాటికే దేశంలోని దాదాపు 1,400 కారాగారాల్లో 4.33 లక్షల మంది ఖైదీలున్నారు. వీళ్లలో 2.93 లక్షలు విచారణ ఖైదీలే! వీరి జీవితాల మీద అపరిష్కృత కేసులు చూపిస్తున్న దుష్ప్రభావం గురించి పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా ఆందోళన వ్యక్తీకరించారు. నిరుడు జూన్ 25న ఆయన అన్ని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు లేఖలు రాస్తూ, అయిదేళ్లకు పైబడిన అపరిష్కృత కేసుల పరిష్కారానికి నిర్దేశిత గడువు తేదీలతో సహా ఓ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయమని కోరారు. దీనికి ఓ నెల తరవాత కేసుల సత్వర పరిష్కారమే అజెండాగా జస్టిస్ దీపక్ మిశ్రా హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, సీనియర్ న్యాయమూర్తులతో ఓ సమావేశమూ నిర్వహించారు. అపరిష్కృత కేసులను తగ్గించడానికి సృజనాత్మక మార్గాలను అన్వేషించాలని, ఇందుకోసం ప్రతి హైకోర్టు పరిధిలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, విద్యావేత్తలతో మేధాబృందాలను ఏర్పాటుచేయాలని సూచించారు. నిరుడు డిసెంబరులో జస్టిస్ మదన్ బి.లోకూర్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనమూ దేశంలోని మొత్తం ఖైదీల్లో 67 శాతం విచారణ ఖైదీలేనన్న సంగతిని ప్రత్యేకంగా ప్రస్తావించింది. కారాగారాల్లోని అమానవీయ పరిస్థితులపై దాఖలైన వ్యాజ్యం విచారణ సందర్భంగా ఈ విషయాన్ని ధర్మాసనం పరిశీలించింది. ప్రస్తుత విచారణ ఖైదీల సంఖ్య 'చాలా చాలా ఎక్కువ' అని అభిప్రాయపడింది. వీళ్ల కేసులను సత్వరం పరిష్కరించాలని చెప్పింది. 'దక్ష్' సంస్థ అధ్యయనం ప్రకారం దేశవ్యాప్తంగా నిందితుల్లో 21 శాతం తమ నేరాలకు పడే గరిష్ఠ శిక్షలకు మించి కారాగారాల్లో గడుపుతున్నారు. నేరానికి మించిన శిక్ష ఎప్పటికీ న్యాయ సమ్మతం కాదు. ఈ నేపథ్యంలో విచారణ ఖైదీల కేసులు ఎంత తొందరగా కొలిక్కి వస్తే అంత మంచిది!

ఆర్థిక నేరాల కేసులు సుదీర్ఘకాలం తేలకపోవడం వల్ల వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని 2018 ఆర్థిక సర్వే సైతం విస్పష్టంగా చెప్పింది. ప్రాజెక్టులు ఆగిపోవడం, కోర్టు ఖర్చులు పెరగడం, పన్ను వసూళ్ల వివాదాస్పదం కావడం, పెట్టుబడులు తగ్గిపోవడం తదితరాలతో ఆర్థిక వ్యవస్థకు చేటు కలుగుతోందని సర్వే నివేదిక విడమరచింది. న్యాయ వివాదాల కారణంగా ఆగిపోయిన ప్రాజెక్టుల విలువ రూ.52 వేలకోట్లు అన్నది ఓ అంచనా. 'దేశంలో సత్వర న్యాయం అందడం మీద పెట్టుబడిదారుల్లో అపనమ్మకం పెరుగుతున్న సమయంలో

న్యాయస్థానాల్లో కేసుల విచారణ మందకొడిగా సాగుతుండటానికి కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర ప్రసాద్ ఇటీవల పార్లమెంటులో చెప్పిన కొన్ని కారణాలు...

★ కేంద్ర రాష్ట్రాల స్థాయుల్లో చట్టాల సంఖ్య పెరగడం ★ మొదటి అప్పీళ్లు అధికంగా పేరుకుపోవడం ★ కొన్ని హైకోర్టుల్లో సాధారణ సివిల్ జ్యుడిషియరీ పరిధి కొనసాగుతుండటం ★ పాక్షిక న్యాయవేదికల నిర్ణయాలపై హైకోర్టుల్లో అప్పీళ్లు దాఖలవడం ★ రివిజన్ పిటిషన్లు, అభ్యర్థనలు ఎక్కువ కావడం ★ తరచూ విచారణ వాయిదాలు ★ రిట్ న్యాయపరిధిని విచ్చలవిడిగా వాడటం ★ కేసుల విచారణకు సరైన సన్నాహాలు లేకపోవడం ★ జడ్జీలకు పాలనపరమైన విధులు బదలాయించడం ★ న్యాయస్థానాలకు సుదీర్ఘ విరామాలు

అపరిష్కృత వ్యాజ్యాల సంక్షోభం

మేకిన్ ఇండియా పేరిట విదేశీ పెట్టుబడిదారులను ఆహ్వానించి ఏం లాభం?' అని 2016లో ముఖ్యమంత్రులు, ప్రధాన న్యాయమూర్తుల వార్షిక సమావేశంలో ప్రధాని మోదీ సమక్షంలోనే అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి టీఎస్ ఠాకూర్ ప్రశ్నించారు. మరోవైపు, కోట్లకొద్దీ కేసుల్లో కక్షిదారులు కోర్టు వాయిదాలకు హాజరు కావడానికే ఏడాదికి రూ.30 వేలకోట్లు వెచ్చించాల్సి వస్తోందని 'దక్ష్' అధ్యయనంలో తేలింది. ఈ సొమ్ముకు కోర్టు ఖర్చులు, న్యాయవాదుల రుసుములు అదనం. క్రిమినల్ కేసుల్లో 45 శాతం కక్షిదారుల వార్షిక కుటుంబ ఆదాయం లక్ష రూపాయలలోపే. వీళ్ల సంపాదనలో పది శాతం కేవలం కోర్టు వాయిదాలకు వెళ్లి రావడానికే పోతోంది. కేసులు త్వరగా పూర్తికాకపోవడంతో కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉండటంతో దేశం ఏడాదికి రూ.50,387 కోట్ల విలువైన ఉత్పాదకతను కోల్పోతోంది. దేశవ్యాప్తంగా పారిశ్రామిక కాలుష్యం మీద దాఖలైన 21 వేల వ్యాజ్యాలు అపరిష్కృతంగా ఉన్నాయి. వీటి విచారణలో జాప్యం పర్యావరణానికే కాదు, ప్రజారోగ్యానికీ హాని చేస్తోంది!

వ్యాజ్యాల విచారణ తేదీలను నిర్ణయించడానికి సంబంధించి పక్కా వ్యవస్థ లేకపోవడం, డిజిటలీకరణ జరగకపోవడంతో దేశంలో అపరిష్కృత కేసుల సమస్య రానురానూ జటిలమవుతోంది. కేంద్రం, రాష్ట్రాలు తెచ్చే కొత్త చట్టాలకు అనుగుణంగా న్యాయవ్యవస్థలో మానవ వనరులు పెరగకపోవడం, అర్ధన్యాయ వేదికల ఆదేశాల మీద హైకోర్టులకు వచ్చే అప్పీళ్లు, న్యాయస్థానాల తీర్పుల మీద రివిజన్లు, అప్పీళ్లు, ప్రభుత్వ యంత్రాంగం విరివిగా దాఖలు చేసే వ్యాజ్యాలతో ఎప్పటికప్పుడు అపరిష్కృత కేసులు పెరుగుతున్నాయి. ట్రయిల్‌కోర్టుల ముందు సాక్ష్యాలను నమోదు చేయకపోవడం, దిగువ న్యాయస్థానాల తీర్పుల మీద హైకోర్టు, సుప్రీంకోర్టుల స్టేలు, ముఖ్యసాక్షుల గైర్హాజరు తదితరాలతో విచారణ ప్రక్రియ కుంటుపడుతోంది. 'వాయిదా కోరడాన్ని ఓ మినహాయింపుగా కాకుండా ఓ ప్రమాణంగా భావించే సంస్కృతి స్థిరపడింది. చాలా అనివార్యమైన పరిస్థితిలో తప్ప వాయిదాలు అడగకూడదు' అని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కూడా న్యాయవాదులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేసిన ఓ అధ్యయనం ప్రకారం ప్రస్తుతమున్న అపరిష్కృత కేసులు ఓ కొలిక్కి రావడానికి 324 సంవత్సరాలకు పైగా సమయం పడుతుంది! ఇదో అసాధారణ పరిస్థితి. దీన్ని మూడేళ్ల కిందటే గుర్తించిన అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి టీఎస్ ఠాకూర్ 'మన రాజ్యాంగ మూలస్తంభాల్లో ఒకటైన న్యాయవ్యవస్థను రక్షించుకోవాల్సిన సమయమిదే'నని హెచ్చరించారు. న్యాయపాలన మీద రాష్ట్రాలు, కేంద్రం కలిసి చేస్తున్న వ్యయం జీడీపీలో 0.08-0.09 శాతమే ఉంటోంది. న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాల వృద్ధికి గత రెండు బడ్జెట్లలో రూ.629.21, రూ.630 కోట్లతో సరిపెట్టిన కేంద్రం రూ.720 కోట్లు కేటాయించింది. ఇది కూడా అరకొర మొత్తమే.

న్యాయమూర్తులేరి?

నిధుల లేమితో పాటు న్యాయమూర్తుల పోస్టుల భర్తీలో జాప్యం న్యాయవ్యవస్థ పనితీరును దెబ్బతీస్తోంది. 2006-18 మధ్యకాలంలో దేశంలో అపరిష్కృత కేసులు 8.6 శాతం పెరిగాయి. ఇదే సమయంలో న్యాయమూర్తుల పోస్టుల్లో ఖాళీలు 23 శాతం నుంచి 35 శాతానికి చేరాయి. పార్లమెంటులో చర్చకోసం కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ సిద్ధం చేసిన ఓ నివేదిక ప్రకారం 2018 నాటికి దేశంలో ప్రతి పది లక్షల మందికి 19 మంది న్యాయమూర్తులున్నారు. ఆరువేల న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రజలకు సత్వర న్యాయం అందుబాటులోకి రావాలంటే ప్రతి పది లక్షల మందికి 50 మంది న్యాయమూర్తులు ఉండాలని జాతీయ న్యాయ సంఘం 1987లోనే సిఫార్సు చేసింది. ప్రభుత్వాలు దాన్ని ఆచరణలోకి తీసుకురాలేదు. న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి రాష్ట్రాలే చొరవ తీసుకోవాలని కేంద్రం చెబుతుంటే- కాదు, కేంద్రమే చర్యలు చేపట్టాలని రాష్ట్రాలు అంటున్నాయి. ఈ వాదప్రతివాదాల నడుమ ఎక్కడి సమస్య అక్కడే ఉండిపోతోంది. ఇదే విషయం మీద 2013లో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అల్తమస్ కబీర్ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఓ లేఖ రాశారు. అయిదేళ్ల కాలపరిమితిలో ప్రతి పది లక్షల మంది ప్రజలకు యాభై మంది న్యాయమూర్తులైనా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి మన్మోహన్ సమాధానమిస్తూ న్యాయమూర్తుల పోస్టుల సంఖ్యను కచ్చితంగా పెంచాలని చెబుతూనే, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో ఏమీ చేయట్లేదని నెపం వాటి మీదకు తోసేశారు. ఆపై వచ్చిన ఎన్డీయే ప్రభుత్వమూ న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి ప్రత్యేక చొరవ ఏమీ తీసుకోలేదు. 'సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 1988లో 18 నుంచి 26కి పెంచారు. ఇరవై ఏళ్ల తరవాత 2009లో సీజేఐతో కలిపి 31 పోస్టులకు చేశారు. న్యాయస్థానం మరింత సమర్థంగా పనిచేయడం కోసం న్యాయమూర్తుల సంఖ్యను ఇంకా పెంచడానికి అధిక ప్రాధాన్యమివ్వాలి' అంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గగొయ్ ఇటీవల ప్రధాని మోదీకి లేఖ రాశారు.

వ్యవస్థీకృత ఇబ్బందులకు తోడు ప్రభుత్వాల నుంచి ఆశించిన మద్దతు లభించకపోవడంతో ఏటికేడాది న్యాయస్థానాల మీద అపరిష్కృత వ్యాజ్యాల భారం పెరుగుతోంది. ఈ పరిణామాలతో న్యాయవ్యవస్థపై సామాన్యుల్లో నమ్మకం పోతోంది. పేదలు, విచారణఖైదీల న్యాయహక్కులు నిరాకరణకు గురవుతున్నాయి. దేశాభివృద్ధికీ ఆటంకాలు ఎదురవుతున్నాయి. 'దీర్ఘకాల అపరిష్కృత కేసులు భారత న్యాయవ్యవస్థ సమర్థత మీద ప్రశ్నలు రేకెత్తించడమే కాదు, వ్యవస్థకు అపకీర్తి కూడా తెచ్చి పెడతాయి' అన్న సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా వ్యాఖ్యలు పరిస్థితి తీవ్రతకు అద్దంపడతాయి. ఈ నేపథ్యంలో 2018 ఆర్థిక సర్వే ఆశించినట్లుగా ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు, న్యాయస్థానాలు కలిసికట్టుగా కార్యాచరణకు ఉపక్రమించాలి.

– శైలేష్ నిమ్మగడ్డ

నిలువెత్తు 'చెత్త' ప్రగతి

ప్రభుత్వం, ప్రజల నిర్లక్ష్యం వల్ల నేడు నేల, నదులు, భూగర్భ జలాలు, సాగరాలు చెత్తాచెదార కాసారాలుగా మారిపోతున్నాయి. కావాలంటే భారత రాజధాని దిల్లీ నగరంలో మేరు పర్వతంలా పెరిగిపోతున్న ఘాజీపూర్ చెత్త కొండను చూడండి. అంబరాన్ని చుంబించేట్లున్న ఆ కొండ విమానాలకు అడ్డువస్తుందేమోనని సుప్రీంకోర్టు దానిపై ఎర్ర దీపాలు పెట్టాలని గతేడాది ఆదేశించింది. 1984లో ఘాజీపూర్‌లో 40 ఫుట్‌బాల్ మైదానాలంత వెడల్పుగల గోతిని తవ్వి పాత దిల్లీ తోపాటు నగరంలోని తూర్పు, మధ్య ప్రాంతాల నుంచి చెత్తను తీసుకొచ్చి పోయసాగారు. ఆ గొయ్యి 2002లోనే పూడిపోయినా నగరం నుంచి రోజుకు రెండు వేల టన్నుల చెత్తను ట్రక్కుల్లో తీసుకొచ్చి పోస్తూనే ఉన్నారు. అందుకే అది ఏటా 33 అడుగుల చొప్పున ఎత్తు పెరుగుతోంది. 2002లో 67 అడుగుల ఎత్తును అందుకున్న ఘాజీపూర్ చెత్త కొండ ఇప్పుడు 213 అడుగులకు పెరిగింది. ఈ లెక్కన అది 239.5 అడుగుల ఎత్తయిన తాజ్‌మహల్‌ను వచ్చే ఏడాది మించిపోతుంది. ఇప్పటికే కుతుబ్ మినార్ కన్నా ఎత్తున్న ఆ చెత్త కొండను స్థానికులు ఎవరెస్ట్ శిఖరమని పిలుస్తున్నారు. దిల్లీకి ఉత్తరాన భల్స్వా ప్రాంతంలో మరో చెత్త కొండ వెలసింది. ఈ చెత్త కొండలపై ఎలుకలు, కాకులు, గద్దలు, ఈగలు, దోమలు మూగి పరిసర ప్రజలకు అనారోగ్య హేతువులవుతున్నాయి. 2018లో భారీ వర్షాలకు ఘాజీపూర్ చెత్త కొండలో కొంత భాగం విరిగిపడి ఇద్దరు వ్యక్తులు మరణించారు కూడా. దాంతో ఘాజీపూర్‌లో ఇక చెత్త పారేయకూడదని అధికారులు ఆదేశించినా, ప్రత్యామ్నాయ స్థలం లేకపోవడంతో వారం తరవాత పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఈ చెత్త కొండ నుంచి వెలువడే మీథేన్ వాయువుకు మండే స్వభావం ఉన్నందువల్ల తరచూ మంటలు రేగుతుంటాయి. ఈ ఏడాది మార్చి 31న భగ్గుమన్న మంటలను ఆర్పడానికి పది రోజులు పట్టింది. అన్ని రోజులూ పొగ మేఘం చుట్టుపక్కల ప్రాంతాలను కమ్మేసింది.

మురుగు, చెత్త కుప్పల్లో ఉక్కిరిబిక్కిరి అవుతోంది ఒక్క దిల్లీ నగరం మాత్రమే కాదు- దేశమంతా అదే దుస్థితి ఉంది. చెత్త కుప్పల నుంచి స్రవించే లీచేట్ తదితర విషపూరిత రసాయనాలు నేలలోకి ఇంకి భూగర్భ జలాలను కలుషితం చేస్తాయి. దేశంలో వినియోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల్లో 70 శాతం ఘాజీపూర్, భల్స్వా వంటి చెత్త కొండల్లో పోగుపడుతోంది. నదుల్లో చేరి అక్కడి నుంచి సముద్రాల్లో కలిసిపోతోంది. నేడు ప్రపంచంలోని మహాసాగరాలకు అత్యధిక ప్లాస్టిక్ చెత్తను చేరవేస్తున్న నది చైనాలోని యాంగ్ ట్జే కాగా, తరవాతి స్థానాన్ని గంగా నది ఆక్రమిస్తోంది. నిజానికి భారత్‌లో ప్లాస్టిక్ వినియోగం తక్కువే. ఇక్కడ తలసరి వినియోగం ఏడాదికి 11 కిలోలైతే, అభివృద్ధి చెందిన దేశాల్లో ఇంతకు పదిరెట్లు ఎక్కువ. చైనాలో ఏటా అయిదు కోట్ల టన్నులు, అమెరికాలో 3.45 కోట్ల టన్నుల చెత్త ఉత్పన్నమవుతున్నా- వాటిని చాలావరకు శుద్ధిచేసి పునర్వినియోగార్హంగా మారుస్తున్నారు. ఆ పని భారత్‌లో సక్రమంగా జరగడం లేదు.



కొండల్లా పేరుకుంటున్న వ్యర్థాలు

మధ్యతరగతి ఆదాయాలు పెరుగుతున్నకొద్దీ ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్‌ల వినియోగం పెరిగిపోతోంది. దేశంలో ప్లాస్టిక్ ప్యాకేజింగ్ పరిశ్రమ విలువ 3,200 కోట్ల డాలర్లకు (రూ.2,20,000 కోట్ల పైచిలుకు) చేరి, 10 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. అందువల్ల ప్లాస్టిక్కులను ఉన్న పళాన నిషేధించడం అనుకున్నంత సులువు కాదు. తాజాగా ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణలో బాధ్యత తీసుకోని 52 సంస్థలకు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు నోటీసులు జారీచేసింది. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, పతంజలి వంటి సంస్థలూ వీటిలో ఉన్నాయి. ఇటీవలి వరకు విదేశాల నుంచి చెత్త తీసుకొచ్చి ఇక్కడ పారవేసేవారు. ఈ ఏడాది నుంచి విదేశీ చెత్త దిగుమతిని రద్దు చేసిన కేంద్రం, 2022 కల్లా ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్‌లను నిషేధిస్తామని ప్రకటించింది.

కేవలం విధాన ప్రకటనలతోనే పని జరగదు. ప్రజలు, పరిశ్రమల దృక్పథంలో సమూల మార్పు రావాలి. ఇళ్లలోనే తడి, పొడి చెత్తను వేరుచేయాలన్న చైతన్యం పెరగాలి. వాటిని శుద్ధి చేసి సాధ్యమైనంతవరకు పునర్వినియోగార్హంగా మార్చాలి. భారతదేశంలోని 7,936 నగరాలు, పట్టణాలు ఏటా 6.2 కోట్ల టన్నుల చెత్తను పుట్టిస్తున్నాయి. అందులో 4.3 కోట్ల టన్నుల చెత్తను మాత్రమే సేకరించి, 1.19 కోట్ల టన్నులను శుద్ధి చేసి, మిగిలిన 3.1 కోట్ల టన్నుల చెత్తను గుంతల్లో పారేస్తున్నారు. 2030కల్లా మొత్తం వ్యర్థాల పరిమాణం 16.5 కోట్ల టన్నులకు పెరగనుంది. దీన్ని ఉపయోగకరంగా, ప్రమాదరహితంగా మార్చే ప్రయత్నాలు జరగడం లేదు. ప్రస్తుతం ప్లాస్టిక్ వ్యర్థాలను కరిగించి చెప్పులుగా, సంచులుగా మార్చే కర్మాగారాలు కొన్ని ఉన్నా, వాటి నుంచి వెలువడే వాయు కాలుష్య మేఘాలు జనారోగ్యానికి ఎసరు పెడుతున్నాయి. అధునాతన సాంకేతికతలను వినియోగించి ప్లాస్టిక్ వ్యర్థాలను భద్రంగా పునరుపయోగకరంగా మార్చాలి. ప్రతిరోజూ పుట్టుకొస్తున్న చెత్తలో 15 శాతం పునర్వినియోగార్హంగా మార్చడానికి అనువైనదని ఐఐటీ-కాన్పూర్ అధ్యయనం తెలిపింది. దాన్ని ఏరే పనిలో అయిదు లక్షల మందికి జీవనోపాధి కల్పించవచ్చనీ వివరించింది. ఘన వ్యర్థాలను ఇంధనంగా ఉపయోగించి విద్యుదుత్పాదన చేయవచ్చు. మిగిలిన వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా వినియోగించవచ్చు. సాంకేతికత, నిధుల కొరత వల్ల ఈ పని సక్రమంగా జరగడం లేదు. దేశంలో ప్రతి 150 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఆసుపత్రి వ్యర్థాల శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉన్నా, అవి కొన్ని నగరాలు, పట్టణాలకే పరిమితమయ్యాయి. ఈ పరిస్థితి మారాలి. మున్ముందు 100 స్మార్ట్ నగరాలను ఏర్పాటు చేయాలని సంకల్పించిన ప్రభుత్వం పట్టుదలగా వ్యర్థాల నివారణకు కృషిచేయాలి. దేశంలో 20 నగరాల్లో చెత్త పారేయడానికి గోతులు తవ్వి కొండల్లా పేర్చే పద్ధతికి స్వస్తి చెప్పాలని కేంద్రం ఆశిస్తోంది. దిల్లీ గోతుల్లో 80 శాతం చెత్తను పునర్వినియోగార్హంగా మార్చవచ్చని ఒక పరిశోధనలో తేలింది. అంతా ప్రభుత్వానికే వదిలి తమ మానాన తాము చెత్త పారేసే అలవాటును ప్రజలు, పరిశ్రమలు మానుకోవాలి. కుటుంబాలు, పురపాలక సంఘాలు ఇందుకు నడుంకట్టాలి.

– ఆర్య

ఈనాడు లేఖలు

కళాకారులను ఆదుకోండి

ఒకప్పుడు నాటకరంగంలో ఓ వెలుగు వెలిగిన ఎందరో కళాకారులు ఇప్పుడు పేదరికంలో మగ్గుతున్నారు. ఆ రంగం ప్రాభవం మసకబారడంతో వారికి జీవనోపాధి కష్టమవుతోంది. బుల్లితెర, సినీ రంగాల్లో అవకాశాలు దొరక్క వారు ఇప్పటికీ నాటకరంగాన్నే నమ్ముకుని ఉండిపోయారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ కళాకారులు ఉన్నారు. వారిలో చాలామంది వృద్ధులయ్యారు. వారికి ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లు సైతం కొన్ని నెలలుగా ఆగిపోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది. కళాకారుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

- కె.రమణకుమారి, తాడిపత్రి, అనంతపురంజిల్లా

పచ్చదనం కనుమరుగు

ఆధునిక సమాజం అభివృద్ధి పేరిట కాలుష్యాన్ని సృష్టిస్తోంది. వివిధ అవసరాల కోసం విచ్చలవిడిగా వృక్షాలను నరికివేయడం వల్ల అడవుల విస్తీర్ణం నానాటికీ తగ్గిపోయి, పచ్చదనం కనుమరుగయ్యే దుస్థితి దాపురించింది. తెలుగు రాష్ట్రాల్లో స్మగ్లర్లు, కలపదొంగలు అడవులను కొల్లగొడుతున్నారు. మరోవైపు పరిశ్రమలు వెదజల్లే కాలుష్యంతో కర్బన ఉద్గారాల తీవ్రత పెచ్చరిల్లి పర్యావరణ సమతుల్యత దెబ్బతినే పరిస్థితి ఏర్పడటం దురదృష్టకరం. ప్రతి ఒక్కరూ మేల్కోవాల్సిన తరుణమిది. ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలను చేపట్టాలి. పెద్దయెత్తున మొక్కలు నాటడంతోపాటు జల సంరక్షణకు నడుం బిగించాల్సిన అవసరం ఉంది. సహజ వనరుల సంరక్షణపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన సమయమిది. ప్రస్తుతం చేపట్టే కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేలా ఉండాలి.

- గంధం మహేశ్వరరావు, ఉప్పల్, హైదరాబాద్

అంతర్యామి

నారద భక్తి సూత్రాలు

ఏ ప్రబోధసారమైనా, ప్రబంధ సందేశమైనా ఒక్కటే- మానవ జీవన గమనాన్ని సువ్యవస్థీకరించడం. ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థితికి మనిషిని నడపడం. విశృంఖలంగా చరించే మనిషి చాంచల్య రీతులను కట్టడి చేసి రుజుమార్గవర్తనులుగా, సత్త్వగుణ సంపన్నత్వంతో భాసించేలా చేయడం. ఆది కాలం నుంచి, ఆధునిక కాలం వరకు విరాజిల్లుతున్న అఖండ ఆధ్యాత్మిక సంపదలోని అర్థం, అంతరార్థం ఇదే.

జ్ఞాన సిద్ధులు, మహాపురుషులు, యోగులు, సాధుసత్పురుషులు, ధర్మాచరణరీతులను, రుజుమార్గవర్తన విధానాలను వివిధ కోణాల్లో తెలియజేశారు. శాస్త్రాల్లో అక్షరబద్ధం గావించారు. శుద్ధవేదాంతతత్వాన్ని, జీవిత పరమార్థాలను ప్రచారంచేసి సమాజాల్లోని మూఢత్వాన్ని, మూర్ఖత్వాన్ని తొలగించారు. సత్య, ధర్మ, నియతిని ప్రబోధించారు.

లోకకల్యాణమే నారదుడి ధ్యేయం. భక్తి సూత్రాలు రచించి మానవాళి తరించే మార్గాన్ని ప్రబోధించాడు. ఎనభైనాలుగు భక్తి సూత్రాలు 'నారదభక్తి సూత్రాలు'గా ప్రసిద్ధి పొందాయి. భక్తి సాధనకు కొన్ని భూమికలున్నాయని, వాటిని నారద మహర్షి ప్రతిపాదించాడని, సుప్రసిద్ధ వేదాంతి, తత్త్వవేత్త మధుసూదన సరస్వతి వెల్లడించారు.

భక్తిమార్గం ద్వారా భక్తుడు దైవాన్ని, తన వాడిగా మానవరూపంలో ఆరాధిస్తాడు. జ్ఞాన మార్గం ద్వారా నిరాకార రూపంలో తెలుసుకుంటారని గీతలో భగవానుడు అర్జునుడితో చెప్పాడు. ఈ ఇద్దరిలో ఉత్తమ యోగులెవరన్న అర్జునుడి ప్రశ్నకు- ఎవ్వరైతే మనసును నాయందు స్థిరపరుస్తారో, నాయందే శ్రద్ధాసక్తులతో ఉంటారో వారే ఉత్తమ యోగులని శ్రీకృష్ణభగవానుడు తెలియజేశాడు. భక్తికి శ్రద్ధ మూలం. శ్రద్ధ ప్రేమకు పునాది. నారదభక్తి సూత్రాల నేపథ్యం ఇదే.

మనిషి జీవన ఔన్నత్యానికి ఈ భక్తి సూత్రాలు దోహదపడతాయి. భక్తి జ్ఞానవైరాగ్య సంపదలను అనుగ్రహిస్తాయి. ప్రతి ప్రాణిలోను ఈశ్వరుడే ఉన్నాడని గ్రహించిన భక్తుడు అనన్యమైన ప్రేమతత్వంతో ఉంటాడు. ఏ వస్తువునూ కాంక్షించడు. దేనికొరకూ శోకించడు. ఏ వ్యక్తినీ ద్వేషించడు.

భక్తితత్త్వ సాధకులు ఆనంద స్వరూపులు. వారు పవిత్రులు. వారు ఏ తీర్థంలో స్నానమాచరించినా అది ఉత్తమ తీర్థమై అలరారుతుంది. ఆ తీర్థంలో మాలిన్యాలు లేకుండా పోతాయి.

శ్రీమద్భాగవతం, గంగావతరణం ఘట్టంలో భగీరథుడితో గంగ- 'పాపాలు చేసే కలుషాత్ములు నాలో మునిగి స్నానాలాచరించి పునీతులవుతారు. వారి పాపాలు సోకి నేను కలుష గంగనైపోతాను గదా!' అన్నప్పుడు, 'తల్లీ! మహాత్ములు, పుణ్యాత్ములు భక్తిసాధకులు సైతం స్నానాదికాలు ఆచరిస్తారు. దాంతో మాలిన్యాలన్నీ తొలగిపోతాయి' అంటూ భగీరథుడు ప్రత్యుత్తరమిస్తాడు. గంగ కరుణిస్తుంది.

భక్తులు ఆచరించే కర్మలే సత్కర్మలని అరవైతొమ్మిదో సూత్రం ప్రకటిస్తుంది. డెబ్భైతొమ్మిదో సూత్రం నిరంతర భగవన్నామ స్మరణ విశిష్టతను తెలుపుతుంది. 'ప్రాణాలు పోయేవేళ నీ నామస్మరణ చేయగలనోలేదో! కాబట్టి కాలమంతా, నీ స్మరణ నా మనసులో ఉండిపోయేలా అనుగ్రహించు' అన్న భావనే భక్తుడి వాంఛగా ఉండాలని చెప్పాడు నారదుడు.

శ్రద్ధ, విశ్వాసం నిండిన భక్తిసాధనే భగవానుడి ప్రేమసామ్రాజ్యాన్ని పొందుతుందని ఎనభై నాలుగో సూత్రంలో నారదుడు తెలియజెప్పాడు.

ఆధ్యాత్మిక వికాసానికి, మానవ జీవన పురోగతికి నారదభక్తి సూత్రాలు మార్గదర్శనం చేస్తాయి.

– దానం శివప్రసాదరావు

విశ్వాస పరీక్షకు కుమార సన్నద్ధం

- విధానసభ సమావేశాల్లో ప్రకటన
- రాజీనామాలపై 'సుప్రీం' విచారణ
- 16 వరకు యథాతథ స్థితికి ఆదేశం

ఈనాడు డిజిటల్ – బెంగళూరు

విశ్వాస పరీక్షకు సిద్ధమని సభలో ప్రకటిస్తున్న ముఖ్యమంత్రి కుమారస్వామి

శాసనసభలో బలనిరూపణకు కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి సిద్ధమయ్యారు. సభలో ఈ మేరకు ఆయన విస్పష్ట ప్రకటన చేశారు. మరోవైపు రాజకీయ సంక్లిష్టతల దృష్ట్యా మంగళవారం వరకు రాష్ట్రంలో యథాతథ స్థితిని కొనసాగించాలని సుప్రీంకోర్టు శుక్రవారం తేల్చిచెప్పింది. ఈ పరిణామాలు రాజకీయాలను ఊహించని మలుపు తిప్పాయి. శుక్రవారం రాష్ట్ర శాసన సభ ప్రారంభమయ్యాక నిమిషాల వ్యవధిలోనే ముఖ్యమంత్రి రాజకీయ పరిణామాలను ప్రస్తావించారు. 'మిత్రపక్షాల ఎమ్మెల్యేల రాజీనామాలతో రాష్ట్రంలో అనిశ్చితి నెలకొంది. నేను మా బలాన్ని నిరూపించుకోగలనన్న విశ్వాసం ఉంది. అందుకు తగిన గడువు విధించండి' అంటూ స్పీకర్‌కు ఆయన విన్నవించారు. 'నేను బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నా. ప్రస్తుత రాజకీయ దుర్బల పరిస్థితులలో బలం నిరూపించుకోనిదే పదవిలో కొనసాగాలని భావించటం లేదు. నేను దేనికైనా సిద్ధం' అని సభలో ప్రకటించారు. ఆయన ప్రకటన సభలోని అన్ని పక్షాల సభ్యులను నివ్వెరపరిచింది. ఆయన గడువు కోరితే మరుసటి రోజే అవకాశం కల్పిస్తానని స్పీకర్ రమేశ్‌కుమార్ హామీనిచ్చారు. అనంతరం పాలక, ప్రతిపక్ష సభ్యుల ప్రసంగాల తర్వాత సభ సోమవారానికి వాయిదా పడింది.

మంగళవారం వరకు అంతే..

అసమ్మతి ఎమ్మెల్యేల రాజీనామాలపై సుప్రీంకోర్టు శుక్రవారం ఇచ్చిన తీర్పు రాష్ట్ర రాజకీయ అనిశ్చితిని మరో మూడు రోజులు కొనసాగేలా చేసింది. గురువారం ఆరుగంటలకల్లా ఎమ్మెల్యేల రాజీనామాలపై ఓ నిర్ణయం ప్రకటించాలని సుప్రీంకోర్టు ఆదేశించినా స్పీకర్ తేల్చలేదు. తనకు సమయం కావాలని సుప్రీంకోర్టుకు స్పీకర్ విన్నవించారు. ఆయన వినతిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి నేతృత్వంలోని ధర్మాసనం సుదీర్ఘంగా విచారించింది. ఫిర్యాదుదారులైన పది మంది అసమ్మతి ఎమ్మెల్యేల తరఫున ముకుల్ రోహత్గీ, స్పీకర్ తరఫున అభిషేక్ మను సింఘ్వి, ముఖ్యమంత్రి తరఫున రాజీవ్ ధవన్ వాదనలు వినిపించారు. ఒక దశలో వాదనల మధ్య కలగజేసుకున్న చీఫ్‌జస్టిస్ రంజన్ గొగొయి.. 'స్పీకర్ చర్యల్లో కోర్టు జోక్యం చేసుకోరాదా? మాకు సవాలు చేస్తున్నారా?' అంటూ ఆయన తరఫు న్యాయవాది సింఘ్విని నిలదీశారు. అలాంటిదేమీ లేదని, రాజీనామాలపై విచారణకు సమయం మాత్రమే కోరామని న్యాయవాది వివరించారు. కేసు సంక్లిష్టతను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి 'తక్షణమే రాజీనామాల ఆమోదం కానీ, ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కానీ వేయకుండా ప్రస్తుత పరిస్థితినే కొనసాగించాలి. విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నాం' అని ప్రకటించారు.

హాజరుకాని ఎమ్మెల్యేలు

గత శనివారం సమర్పించిన రాజీనామాల్లో ఐదు క్రమబద్ధంగా ఉన్నాయని స్పీకర్ ప్రకటించిన విషయం తెలిసిందే. వీరిలో ఆనంద్‌సింగ్, ప్రతాప్‌గౌడ పాటిల్, నారాయణగౌడ శుక్రవారం స్పీకర్ కార్యాలయంలో హాజరుకావాల్సి ఉంది. స్పీకర్ తన కార్యాలయంలో వేచి చూసినా వారు రాలేదు.

రిసార్టులకు తరలింపు

ముఖ్యమంత్రి స్వయంగా విశ్వాస పరీక్షకు సిద్ధం కావటంతో ఏదైనా 'రివర్స్ ఆపరేషన్'కు అవకాశం ఉంటుందనే భయం ప్రతిపక్ష భాజపాలో నెలకొంది. సుప్రీంకోర్టు మరోమారు రాజీనామాలపై విచారించే నేపథ్యంలో అంతవరకు ఎమ్మెల్యేల మధ్య ఐక్యత అవసరమని భాజపా భావించింది. విధానసౌధ నుంచే ఆ పార్టీ ఎమ్మెల్యేలను నాలుగు బృందాలుగా రిసార్టులకు తరలించింది. ఇప్పటికే భాజపా నుంచి నలుగురు ఎమ్మెల్యేలు జేడీఎస్ నేతలతో సంప్రదిస్తుండటం శుక్రవారం చర్చనీయాంశమైంది. మరో వైపు కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు దేవనహళ్లిలోని వేర్వేరు రిసార్టుల వైపు వెళ్లారు.

గిరీశ్ కర్నాడ్ మృతికి సంతాపం

మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం ప్రారంభమైన వెంటనే ఇటీవల మృతి చెందిన సాహిత్య దిగ్గజం గిరీశ్ కర్నాడ్, మంత్రి సి.ఎస్.శివళ్లితోపాటు మరో పది మంది నేతల సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

ప్రజా ప్రభుత్వాన్ని రక్షిస్తా

కర్ణాటక స్పీకర్ రమేశ్‌కుమార్

ఈనాడు డిజిటల్, బెంగళూరు: 'వందనం చేసే నెపంతో మహాత్మాగాంధీని చంపిన వ్యక్తులున్న సమాజం మనది. అలాంటి సమాజానికి నాపై నిందలు వేయటం ఓ లెక్కా?' అని కర్ణాటక స్పీకర్ రమేశ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను కార్యాలయంలో లేనప్పుడు కొందరు ఎమ్మెల్యేలు రాజీనామాలు సమర్పించారు. వారు ఇష్ట ప్రకారమే చేస్తున్నారా? లేదా? తెలుసుకోవద్దా? ఉద్దేశపూర్వకంగా అంగీకరించటం లేదన్న విమర్శలెందుకు?' అని వాపోయారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. 'గాంధీజీ కన్ను మూసినా ఆయన తత్వం బతికే ఉంది. ఆయన బాటలో నడిచే నాపై ప్రజా ప్రభుత్వాన్ని రక్షించే బాధ్యత ఉంది. ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోను. అన్నింటికీ మించి ప్రజల మనసు బాధపెట్టే నిర్ణయం అసలు తీసుకోను. సుప్రీంకోర్టు ఏ తీర్మానం చేస్తుందో మరిన్ని రోజులు వేచి చూస్తా. ఆ తీర్మానం మాకు అన్వయం అవుతుందా? లేదా? కూడా పరిశీలిస్తా. లేదంటే ఆ కోర్టునే ఆశ్రయిస్తా' నని పేర్కొన్నారు. ఇప్పటికే రాజీనామా చేసిన ముగ్గురిని విచారించడానికి ప్రయత్నించినా వారు రాలేదని, మరోమారు వారికి అవకాశం ఇస్తానని తెలిపారు. విశ్వాస పరీక్షపై ముఖ్యమంత్రి కుమారస్వామి తన మనసులో మాట చెప్పారే తప్ప మరింత స్పష్టత ఇవ్వలేదని అన్నారు. ఆయన ఏ రోజు నిర్ణయిస్తే మరుసటి రోజు విశ్వాస పరీక్షకు అవకాశం కల్పిస్తానని ప్రకటించారు. 'ముఖ్యమంత్రి విశ్వాస పరీక్ష అంశాన్ని విధానసభ సలహా సమితి ముందుపెట్టాం. ఈ సమితికి ప్రతిపక్ష సభ్యులు హాజరుకాలేదు. వీరి అభిప్రాయాన్ని సేకరించటం నా కర్తవ్యం. సోమవారం మరోమారు సమావేశమై విశ్వాస పరీక్షపై తుది నిర్ణయం ప్రకటిస్తా'నని స్పీకర్ చెప్పారు.

అత్తివరదర్‌ను దర్శించుకుంటున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

అత్తివరదర్ సేవలో రాష్ట్రపతి

నేడు తిరుమలకు.. రేపు శ్రీహరికోటకు రాక

తిరుమల, కాంచీపురం, సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: తమిళనాడులోని కాంచీపురం వరదరాజ పెరుమాళ్ ఆలయంలో అత్తివరదర్‌ను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. 40 సంవత్సరాలకు ఒక్కసారి 48 రోజులపాటు జరిగే అత్తివరదర్ ఉత్సవాలు ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమయ్యాయి.

షార్‌లోని రెండో ప్రయోగ వేదికపై జీఎస్ఎల్‌వీ-మార్క్‌3 వాహక నౌక

నేడు వెంకన్న సేవలో..

శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం రాష్ట్రపతి కుటుంబ సమేతంగా శనివారం తిరుమలకు రానున్నారు. చెన్నై నుంచి సాయంత్రం తిరుపతికి చేరుకుంటారు. తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని... శ్రీకపిలేశ్వర స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం తిరుమల శ్రీపద్మావతి విశ్రాంతి సముదాయానికి చేరుకుని బస చేస్తారు. 14న ఉదయం వేంకటేశ్వరస్వామివారి సేవలో పాల్గొంటారు. ఆదివారం మధ్యాహ్నం శ్రీహరికోటకు హెలికాప్టర్‌లో వెళతారు. తిరుమల ప్రత్యేకాధికారి ఎ.వి.ధర్మారెడ్డి రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు.

షార్ రెండో గేటు లోపలే పర్యటన

రాష్ట్రపతి కోవింద్ రెండు రోజుల పర్యటన నిమిత్తం సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌కు ఆదివారం సాయంత్రం రానున్నారు. ఆయన పర్యటన అంతా షార్‌లోని రెండో గేటు లోపలే ఉండేలా అధికారులు రూటుమ్యాప్ తయారుచేశారు. తిరుమల నుంచి ఆదివారం సాయంత్రం 4.55 గంటలకు షార్‌కు చేరుకుంటారు. నూతనంగా నిర్మించిన రెండో వాహన అనుసంధాన భవనాన్ని, రెండో ప్రయోగ వేదికను సందర్శిస్తారు. ప్రయోగవేదికపై ఉన్న జీఎస్ఎల్‌వీ-మార్క్‌3 వాహక నౌకను వీక్షిస్తారు. 15వ తేదీ వేకువ జామున 2.30 గంటలకు మిషన్ కంట్రోల్ సెంటర్‌కు వెళ్తారు. అక్కడ జీఎస్ఎల్‌వీ-మార్క్‌3 ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షిస్తారు. ఉదయం 9 గంటలకు దిల్లీ బయలుదేరి వెళ్తారు.

నేడు రాకెట్ సన్నద్ధత సమావేశం

జీఎస్ఎల్‌వీ-మార్క్‌3 వాహక నౌక ప్రయోగ సన్నాహాలు చురుగ్గా జరుగుతున్నాయి. శుక్రవారం వేకువ జామున 2.51 గంటలకు రిహార్సల్ కార్యక్రమం ముగిసింది. శనివారం బ్రహ్మప్రకాష్ హాలులో రాకెట్ సన్నద్ధత సమావేశం(ఎంఆర్ఆర్) జరగనుంది. ఇందులో ప్రయోగ తేదీని అధికారికంగా ప్రకటిస్తారు. శనివారం ప్రికౌంట్‌డౌన్, ఆదివారం ఉదయం 6.51 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. ఇస్రో అధిపతి డాక్టర్ శివన్ శనివారం షార్‌కు రానున్నారు.

భారీగా పురపాలక కమిషనర్ల బదిలీలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో భారీగా పురపాలక, నగరపాలక సంస్థల కమిషనర్లను బదిలీ చేశారు. 101 పట్టణ స్థానిక సంస్థల్లో వీరికి స్థానచలనం కలిగింది. అలాగే వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో శుక్రవారం భారీగా బదిలీలు జరిగాయి. కృష్ణా జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి ఐ.రమేష్‌ను జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షకులుగా నియమించారు.

జేఏ చౌదరి రాజీనామా ఆమోదం: రాష్ట్ర ప్రభుత్వ సమాచార సాంకేతిక సలహాదారుగా ఉన్న జేఏ చౌదరి చేసిన రాజీనామాను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మే 24, 2019 నుంచి అమల్లోకి వస్తుందని సంబంధిత ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తాడేపల్లిలో వైకాపా కేంద్ర కార్యాలయం

ఈనాడు, అమరావతి: వైకాపా కేంద్ర కార్యాలయాన్ని గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఏర్పాటు చేయనున్నారు. నాలుగు అంతస్తులున్న ప్రైవేట్ భవనంలో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పనులు దాదాపు పూర్తయ్యాయని, ఈ నెలాఖరులోగా కార్యాలయాన్ని ప్రారంభించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో ఉన్న పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఇప్పటికే పలు విభాగాలను అమరావతికి మార్చారు. మరోవైపు రాష్ట్ర కార్యాలయాన్ని విజయవాడ ఎంజీ రోడ్డులో నిర్వహిస్తున్నారు. వీటన్నింటినీ తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయానికి తరలించనున్నారు.

తాడేపల్లిలో సిద్ధమవుతున్న వైకాపా కేంద్ర కార్యాలయం

రవిప్రకాశ్‌కు ముందస్తు బెయిలు

ఈనాడు, హైదరాబాద్: టీవీ 9 మాజీ సీఈవో రవిప్రకాశ్‌కు షరతులతో కూడిన ముందస్తు బెయిలును హైకోర్టు మంజూరు చేసింది. ఏబీసీఎల్ కార్పొరేషన్ యాజమాన్యం మార్పిడి, వాటాల బదిలీ తదితర అంశాలపై జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్‌లో కేసులు అపరిష్కృతంగా ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా బంజారాహిల్స్, సైబర్ క్రైం పోలీసులు నమోదు చేసిన మూడు వేర్వేరు కేసుల్లో ముందస్తు బెయిలు ఇవ్వాలంటూ టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై వాదనలు విని తీర్పును రిజర్వు చేసిన జస్టిస్ గండికోట శ్రీదేవి శుక్రవారం ఉత్తర్వులు వెలువరించారు.

ఎరువుల దుకాణాలు, గిడ్డంగులపై దాడులు

ఈనాడు, అమరావతి: తూనికలు, కొలతలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎరువుల దుకాణాలు, గిడ్డంగుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని దుకాణాల్లో 50 కిలోల ఎరువుల బస్తాలో 4.1 కిలోల వరకు తూకంలో తేడా ఉన్నట్లు గుర్తించారు. విశాఖపట్నం, నెల్లూరు, కర్నూలు అనంతపురం, గుంటూరు, కడప, విజయనగరం, కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల్లో తనిఖీలు సాగాయి.

కృష్ణా డెల్టాకు నీరు విడుదల

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌లో తొలిసారిగా 1000 క్యూసెక్కుల నీటిని కృష్ణా డెల్టాకు విడుదల చేశామని జలవనరులశాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఉదయం విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా కుడి కాలువ ద్వారా డెల్టాకు మంత్రులు పేర్ని నాని, కొడాలి నాని, వెలంపల్లి శ్రీనివాస్‌లతో కలిసి ఆయన నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ 150 టీఎంసీల నీరు కృష్ణా డెల్టాకు అవసరమన్నారు. అందులో 80 టీఎంసీలు పట్టిసీమ నుంచి, మిగిలింది సాగర్‌తో పాటు ఇతర మార్గాల ద్వారా అందించనున్నామని తెలిపారు. చిట్టచివరి ఆయకట్టుకు సైతం సాగునీరు చేర్చటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాబోయే 10 రోజుల్లో పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తామని మంత్రి చెప్పారు.

తెలుగు రాష్ట్రాల దిశగా గలగలా కృష్ణమ్మ!

బాగల్‌కోట, న్యూస్‌టుడే: కృష్ణమ్మ తెలుగు రాష్ట్రాల వైపు పరుగులు తీస్తోంది. ఆల్మట్టి నీరు నారాయణపుర జలాశయానికి చేరుతుండడంతో అక్కడి నుంచి శుక్రవారం దిగువకు ప్రవాహాన్ని కొనసాగించే ప్రక్రియ మొదలైంది. దిగువన ఉన్న రాయచూరు థర్మల్ విద్యుత్తు కేంద్రానికి అవసరమైన నీటిని నారాయణపుర జలాశయం నుంచి విడుదల చేస్తున్నారు. ఇలా 5800 క్యూసెక్కుల నీరు విడుదల అవుతున్నందున పరీవాహక ప్రాంత ప్రజలు నదిలోకి దిగవద్దంటూ అధికారులు హెచ్చరించారు. ఈ క్రమంలో థర్మల్ స్టేషన్ అవసరాలు తీరుస్తూ నీరు జూరాల దిశగా సాగనుంది. ఎగువన ఆల్మట్టి జలాశయానికి ఇప్పటికీ 1,06,582 క్యూసెక్కుల వరద చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30గంటలకు ఈ జలాశయంలో సుమారు 71టీఎంసీల నీరున్నట్లు వెల్లడించారు. మహారాష్ట్ర నుంచి భారీగా వరద వస్తున్నందున జలాశయం నిండే అవకాశం అధికంగా ఉందన్నారు.

ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణాడెల్టాకు నీటిని విడుదల చేసి పూజలు చేస్తున్న జలవనరులశాఖ మంత్రి అనిల్‌కుమార్. చిత్రంలో మంత్రి కొడాలి నాని తదితరులు

గిరిజన, కేంద్రీయ వర్సిటీలకు ఆమోదం

- ఏపీకి చాలా చేశాం.. మేమే వస్తాం: కేంద్రమంత్రి పోఖ్రియాల్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 13వ షెడ్యూల్‌లో ఇచ్చిన హామీమేరకు రాష్ట్రంలోని కేంద్రీయ, గిరిజన విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు ఉద్దేశించిన కేంద్రీయ విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లును లోక్‌సభ శుక్రవారం ఆమోదించింది. ఈ బిల్లు ద్వారా అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, విజయనగరం జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుచేస్తున్నట్లు కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి రమేష్ పోఖ్రియాల్ నిశాంక్ తెలిపారు. ఈ రెండింటి ఏర్పాటుకు తాము ముందే నిధులిచ్చామని చెప్పారు. రెండు సంస్థలకు రూ.1,700 కోట్లు ఖర్చుపెట్టబోతున్నామని, ప్రస్తుతానికి తాత్కాలిక మొత్తం కేటాయించామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు తమ ప్రభుత్వం చేసినట్లు ఎవరూ చేయలేదని, అందుకే వచ్చేసారి ఆ రాష్ట్రంలో తమ ప్రభుత్వం తప్ప ఎవ్వరూ కనిపించే అవకాశం లేదన్నారు. అంతకుముందు బిల్లుపై జరిగిన చర్చలో శ్రీకాకుళం తెదేపా ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ రెండు యూనివర్సిటీలకూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే భూమి ఇచ్చారన్నారు. ఈ రెండు విశ్వవిద్యాలయాలు ఎప్పటిలోగా పూర్తిచేస్తారో చెప్పాలన్నారు. నర్సరావుపేట వైకాపా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం మూడేళ్లక్రితం రూ.420 కోట్లు కేటాయిస్తే అక్కడి ఉపకులపతి రూ.952 కోట్లతో సమగ్ర నివేదిక పంపారని, అందువల్ల కేటాయింపులు పెంచాలని కోరారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం గత ఏడాది కాలంగా ఒకే కోర్సుతో నడుస్తోందన్నారు.

రుషికొండ బీచ్‌కి అంతర్జాతీయ హంగులు

అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ దేశవ్యాప్తంగా 12 బీచ్‌లను ఎంపికచేసింది. వాటిలో విశాఖపట్నంలోని రుషికొండకు స్థానం కల్పించింది. బీచ్‌ను సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు, ఆ ప్రాంతంలో మౌలికవసతుల కల్పన, పరిశుభ్రత, భద్రత చర్యలు చేపడతారు. ఇందుకోసం తీరప్రాంత నియంత్రణ ప్రాంతంలోనూ (కోస్టల్ రెగ్యులేషన్ జోన్-సీఆర్‌జెడ్) గరిష్ఠ అలల ఎత్తుకు పది మీటర్ల దూరంలో నిర్మాణాలకు అనుమతిస్తారు. ఇందులో కంటెయినర్ ఆధారిత మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకొనే గదులు, షవర్ ప్యానెళ్లు ఏర్పాటుచేయొచ్చు. చిన్నతరహా మురుగునీటి శుద్ధి ప్లాంటు, ఘనవ్యర్థాల నిర్వహణ ప్లాంటు, సౌర పీవీ ప్యానెళ్లు, రక్షిత మంచినీటి కియోస్కులు ఏర్పాటుచేయొచ్చు. స్నానాలు చేసే చోటుకు నడకదారి ఏర్పాటు, అందంగా ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, వెదురుతో బల్లలు, గొడుగు, బహిరంగస్థలాల్లో పిల్లలు ఆడుకొనే వస్తువులు, కంటెయినర్ ఆధారిత సీసీటీవీ కంట్రోల్‌రూం, ఫస్ట్ ఎయిడ్ స్టేషన్, బీచ్ సమాచారం తెలిపే హోర్డింగ్‌లు, బీచ్ మ్యాప్‌ల ఏర్పాటుకు అవకాశం ఇస్తున్నట్లు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ తెలిపింది.

కొలిక్కి రాని చర్చలు

- ఇంజినీరింగ్ బోధన రుసుములపై వీడని స్తబ్దత

ఈనాడు, అమరావతి: ఇంజినీరింగ్ బోధన రుసుముల నిర్ణయంపై స్తబ్దత కొనసాగుతోంది. ఒక పక్క కౌన్సెలింగ్‌లో జాప్యం జరుగుతుండగా..మరోపక్క కళాశాలల యాజమాన్యాలు, ప్రభుత్వం మధ్య జరుగుతున్న చర్చలు కొలిక్కి రావడం లేదు. కళాశాలల యాజమాన్యాలతో శుక్రవారం విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ నిర్వహించిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. అన్ని ఇంజినీరింగ్ కళాశాలలకు రూ.35వేలు చొప్పున చెల్లిస్తామని..రుసుముల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేసిన తర్వాత ఆ కమిటీ సిఫార్సుల ప్రకారం చెల్లింపులు ఉంటాయని మంత్రి ప్రతిపాదించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పరిధిలోకి వచ్చే విద్యార్థులకు రూ.35వేలు చొప్పున పూర్తిగా చెల్లించి, మిగతా వారి నుంచి పాత ఏఎఫ్ఆర్సీ సిఫార్సుల ప్రకారం రుసుములు వసూలు చేసుకునేందుకు కళాశాలలకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ ప్రతిపాదనలపై కళాశాలల యాజమాన్యాలు ఎలాంటి నిర్ణయాన్ని వెల్లడించలేదు. సోమవారం సమావేశం నిర్వహించుకుని, తమ అభిప్రాయం చెబుతామని పేర్కొన్నాయి. అనంతరం మంత్రి సురేష్ మీడియాతో మాట్లాడుతూ..ఒకటి రెండు రోజుల్లో రుసుములపై స్పష్టత వస్తుందన్నారు. ఈడబ్ల్యూఎస్, కాపు రిజర్వేషన్లను ఈ కౌన్సెలింగ్‌లోనే అమలు చేస్తామని, ఇందుకోసం సీట్లను పెంచుతామని చెప్పారు.

వీగిన ఓబీసీ సవరణ బిల్లు

- సగం మంది లేకుండా ఓటింగ్ కుదరదు: కేంద్ర మంత్రి రవిశంకర్
- ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ విజయసాయిరెడ్డి వాకౌట్

ఈనాడు, దిల్లీ: చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి రాజ్యసభలో ప్రవేశపెట్టిన ప్రైవేటు మెంబరు బిల్లు వీగిపోయింది. రాజ్యాంగ సవరణ బిల్లు కావడంతో ఓటింగ్ జరపాలంటే సభ్యులు సగం మంది హాజరు తప్పనిసరి అని, 123 మంది హాజరుకావాల్సి ఉన్న సభలో 40 మంది సభ్యులు కూడా లేనందున ఈ బిల్లుపై ఓటింగ్ జరపడానికి వీల్లేదని సభాపక్షనేత, కేంద్ర సామాజిక న్యాయ సాధికారతశాఖ మంత్రి థావర్‌చంద్ గహ్లోత్, న్యాయశాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్‌లు స్పష్టం చేశారు. దీంతో కేంద్ర వైఖరిని నిరసిస్తూ బిల్లు ప్రవేశపెట్టిన విజయసాయిరెడ్డి వాకౌట్ చేశారు. అనంతరం సభాపతి స్థానంలో ఉన్న సత్యనారాయణ జతియా మూజువాణి ఓటు ద్వారా సభ అభిప్రాయాన్ని తీసుకొని బిల్లు వీగినట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జనాభాలో 50 శాతంపైగా ఉన్న ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలంటూ 'రాజ్యాంగ సవరణ బిల్లు, 2018'ని విజయసాయిరెడ్డి గతంలో రాజ్యసభలో ప్రవేశపెట్టారు. వెనకబడిన వర్గాల సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందని, బిల్లు రాజ్యాంగ సవరణ బిల్లు కాబట్టే మొత్తం సభ్యుల్లో సగం మంది హాజరు తప్పనిసరి అని నిబంధన చెప్పామని న్యాయ శాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్ తెలిపారు. ప్రైవేటు మెంబరు బిల్లుతో రాజ్యాంగాన్ని సవరించాలని చూస్తున్నారని దీనిపై ఓటింగ్ కుదరదని స్పష్టం చేశారు.

ఏపీకి అన్యాయం జరగనివ్వం: పీయూష్

ఆంధ్రప్రదేశ్‌కు ఏ కోశానా అన్యాయం జరగనివ్వమని కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయెల్ భరోసా ఇచ్చారు. శుక్రవారం లోక్‌సభలో రైల్వేబడ్జెట్ పద్దులపై చర్చకు కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు లాభదాయకం కాని రైల్వే జోన్ ఎందుకిచ్చారని తెదేపా సభ్యుడు గల్లా జయదేవ్ ప్రశ్నించారు. దీనిపై కేంద్రమంత్రి పీయూష్ గోయెల్ స్పందిస్తూ..'ప్రయాణికుల సంక్షేమంలో వివక్ష ప్రభుత్వానికి ఉండదు. దేశవ్యాప్తంగా పరిగణించి జోన్‌ల ఏర్పాటు ఉంటుంది. లాభం ఒడిశాకు, ఖర్చులు ఆంధ్రప్రదేశ్‌కు అని భావించొద్దు. కొన్ని జోన్‌లు లాభదాయకంగా ఉంటే కొన్ని నష్టాలు వస్తుంటాయి. ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌ల్లో ఖనిజ సంపద వల్ల ఆదాయం ఎక్కువ వస్తోందని అక్కడే అన్నీ చేయం కదా. ఏపీ ప్రజలకు చింత వద్దు. వారికి అన్యాయం జరగదని భరోసా ఇస్తున్నా' అని పీయూష్‌గోయెల్ పేర్కొన్నారు.

పీఎంకేఎస్‌లో 14.57 కోట్ల కుటుంబాలు: తోమర్

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకేఎస్)కింద 14.57 కోట్ల రైతు కుటుంబాలకు ఈ ఏడాది రూ.87,217 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ..ఈ పథకంలో ఏపీలో 85.24 లక్షల, తెలంగాణలో 59.48 లక్షల కుటుంబాలు ఉన్నాయన్నారు. నెల్లూరు జిల్లాలో పొగాకు నుంచి ఇతర పంటలకు రైతులు మళ్లేలా మార్పిడి పథకం కింద 2018-19లో ఏపీ ప్రభుత్వం రూ.20.13 లక్షలు కేటాయించిందని చెప్పారు.

- పరిశ్రమలకు సంబంధించి ఏపీలో 27 ప్రాజెక్టులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ.160.54 కోట్లు, తెలంగాణలో 13 పరిశ్రమలకు రూ.100.66 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర సహాయ మంత్రి రామేశ్వర్ తెలిపారు. రాజ్యసభ సభ్యుడు వై.ఎస్.చౌదరి అడిగిన ప్రశ్నకు ఈ మేరకు బదులిచ్చారు.
- విజయవాడ-కాజీపేట మధ్య విద్యుదీకరణతో కూడిన మూడో రైలుమార్గం నిర్మాణానికి 2019 మార్చినాటికి రూ.234.39 కోట్లు వెచ్చించినట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ పనికి 2019-20లో రూ.110 కోట్లు సమకూర్చినట్లు చెప్పారు. రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ ప్రశ్నకు ఆయన ఆ సమాధానమిచ్చారు.

మళ్లీ మండుతున్న ఎండలు

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతున్నాయి. శుక్రవారం కోస్తా జిల్లాల్లో సాధారణం కన్నా ఒకటి నుంచి 5 డిగ్రీల వరకు పెరిగాయి. రాయలసీమ జిల్లాల్లో సాధారణంతో పోల్చితే 3 నుంచి 4 డిగ్రీల వరకు పెరుగుదల నమోదైంది. నెల్లూరులో 41 డిగ్రీలు, తిరుపతిలో 40, జంగమహేశ్వరపురంలో 39.6, ఒంగోలు, కావలిలో 39.5, అమరావతిలో 39.2 డిగ్రీలుగా రికార్డయ్యింది. ప్రస్తుతం రాష్ట్రం మీదుగా పశ్చిమ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. రానున్న 4 రోజుల్లో రాయలసీమ జిల్లాల్లో ఒకట్రెండుచోట్ల, కోస్తా జిల్లాల్లో కొన్నిచోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని చెబుతున్నారు.

'బొంతు' @ 185 కిలోలు

సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల వలకు చిక్కిన భారీ 'బొంతు' చేపను శుక్రవారం విశాఖపట్నం ఫిషింగ్‌హార్బర్‌లో విక్రయించారు. సుమారు 185 కిలోల బరువున్న ఈ చేపను స్థానిక వ్యాపారులు రూ.30 వేలకు కొనుగోలు చేశారు. దీన్ని కేరళకు ఎగుమతి చేయనున్నట్టు వారు తెలిపారు. ఈ భారీ మీనాన్ని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు.

ఎంపీటీసీని హత్యచేసిన మావోయిస్టులు

ఈనాడు, ఖమ్మం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మావోయిస్టులు అలజడి సృష్టించారు. ఇన్‌ఫార్మర్ నెపంతో తెరాసకు చెందిన ఎంపీటీసీ సభ్యుడిని హత్య చేశారు. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది. ఈనెల 8న రాత్రి చర్ల మండలం బెస్తకొత్తూరులోని తన ఇంట్లో ఉన్న పెద్దమిడిసిలేరు ఎంపీటీసీ సభ్యుడు నల్లూరు శ్రీనివాసరావును మావోయిస్టులు అపహరించారు. మానవతా దృక్పథంతో తన భర్తను విడిచిపెట్టాలని శ్రీనివాసరావు భార్య దుర్గ. . అప్పటి నుంచి మావోలను వేడుకొంటున్నారు. శుక్రవారం సాయంత్రం చర్ల మండలం ఎర్రంపాడు సమీపంలోని అటవీ ప్రాంతంలో శ్రీనివాసరావు మృతదేహాన్ని గుర్తించారు. శ్రీనివాసరావు ఇన్‌ఫార్మర్ అయినందునే ఖతం చేశామని చర్ల-శబరి ఏరియా కమిటీ కార్యదర్శి శారద పేరుతో విడుదల చేసిన కరపత్రంలో పేర్కొన్నారు. ఇంటెలిజెన్స్ పోలీసులతో కలిసి శ్రీనివాసరావు.. మావోయిస్టు పార్టీని నిర్మూలించడానికి, ఆదివాసీ గ్రామాల్లో ఇన్‌ఫార్మర్లను తయారు చేస్తున్నాడని ఆ కరపత్రంలో ఆరోపించారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
DEPARTMENT OF TECHNICAL EDUCATION
A.P - POLYCET-2019 ADMISSIONS
FINAL PHASE & SPOT ADMISSION NOTIFICATION
FOR WEB BASED COUNSELLING
The Qualified candidates of A.P-POLYCET-2019 who are desirous of seeking admission into Diploma Courses are informed that Certificate Verification & exercising options will be from 16-07-2019 to 18-07-2019. Spot admissions for the leftover vacancies will be conducted on 29-07-2019 at respective institutions. For complete information refer the website: https://appolycet.nic.in
Dated: 12-07-2019 Sd/- CONVENER, APPOLYCET

నవరత్న సమేత

రాష్ట్ర బడ్జెట్ 2019-20

"యథా బీజం వినాక్షేత్రం
ముప్తం భవతి నిష్ఫలం
ఎంత సారవంతమైన నేల అయినా, ఎంత బాగా దున్నినా,
ఎంత చేయితిరిగిన రైతు అయినా... విత్తనం వేయకపోతే పంట పండదు.
అందుకే రైతు సంక్షేమమే మా ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యం.

సాగుకు వడ్డీ లేని సాయం

ఈనాడు, అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20)లో పంట రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతులకు వచ్చే ఆర్థిక సంవత్సరం (2020 ఏప్రిల్ 1) నుంచి వడ్డీ రాయితీ చెల్లిస్తామని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాబోయే బడ్జెట్లోనే సున్నా వడ్డీ రుణాలకు కేటాయింపులు చేయాల్సి ఉంటుందని వివరించారు. అందుకే ప్రస్తుత బడ్జెట్లో రూ.100 కోట్లు మాత్రమే కేటాయించామని ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయానికి సున్నా వడ్డీ రుణాలకు ఈ సొమ్ము ఎలా సరిపోతుందని ప్రతిపక్షం ప్రశ్నించగా మంత్రి స్పష్టత ఇచ్చారు.

రైతు కోసం రాజన్న స్ఫూర్తితో..

ఈనాడు, అమరావతి: తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వమని, ఇప్పటికే ఈ విషయం అందరికీ అర్థమయ్యేలా తమ పరిపాలన కొనసాగుతోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. రైతు సంక్షేమమనే మాట వింటే రైతు బాంధవుడిగా పేరొందిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డే గుర్తొస్తారన్నారు. ఆయన స్ఫూర్తితో అన్నదాతల సంక్షేమానికి అంకితమవుతున్నామని వెల్లడించారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ బడ్జెట్‌ను శుక్రవారం ఆయన శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా బొత్స ప్రసంగిస్తూ.. వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఒక్కో రైతు కుటుంబానికి ఏడాదికి రూ.12,500 చొప్పున నగదు సాయం చేస్తామన్నారు. అక్టోబరు 15 నుంచి దీన్ని ప్రారంభిస్తామన్నారు. పట్టాదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కౌలు రైతులకు 11 నెలల కాలానికి పంట హక్కులు కల్పిస్తూ కౌలు పత్రాన్ని తీసుకురావాలని భావిస్తున్నామన్నారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద..పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. ప్రమాదవశాత్తూ మరణించే రైతులకు రూ.7 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు వైఎస్సార్ రైతు బీమా తీసుకొస్తున్నామన్నారు. రూ.3 వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశామని తెలిపారు. చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు ఇచ్చే జీవనభృతిని నెలకు రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచామని వెల్లడించారు. యాంత్రిక, మర పడవలకు ఇచ్చే డీజిల్ రాయితీని లీటరుకు రూ.6.03 నుంచి రూ.12.96కు పెంచేందుకు ప్రతిపాదించామన్నారు. శాసనమండలిలో మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖల మంత్రి మోపిదేవి వెంకటరమణ వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టారు.

నిధులు మిషన్ ఆధ్వర్యంలోనే

రాష్ట్రంలో రైతు సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించి అమలు చేయడమే లక్ష్యంగా వ్యవసాయ మిషన్ ఏర్పాటు చేశారు. ప్రతి నెలా మిషన్ విధిగా సమావేశమవుతుంది. ప్రకృతి విపత్తుల నిధి రూ.2 వేల కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.3వేల కోట్లు నిధుల్ని ఎలా వినియోగించాలో కూడా ఇదే నిర్ణయించనుంది.

డెయిరీలకు రూ. 100 కోట్లు

సహకార రంగంలోని పాల సమాఖ్యలు, పాల సేకరణ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు కేటాయించింది. సహకార డెయిరీలకు పాలు పోసే రైతులకు లీటరుకు రూ.4 చొప్పున బోనస్ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

అన్నదాతపై పెద్ద మనసు

- వ్యవసాయ అనుబంధ రంగాలకు **రూ.28,866.23 కోట్లు**
- వైఎస్సార్ రైతు భరోసాకు **రూ.8,750 కోట్లు**
- ఉచిత విద్యుత్తుకు **రూ.4,525 కోట్లు**
- కొత్త పథకాలకు ప్రాధాన్యం

ఈనాడు - అమరావతి

అన్నదాతపై సర్కారు పెద్ద మనసు చూపింది. వ్యవసాయ అనుబంధ రంగాలకు పెద్ద పీట వేస్తూ.. బడ్జెట్లో వాటికి రూ.28,866.23 కోట్లు కేటాయించింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌కు 81.51 శాతం, పశుసంవర్ధక, మత్స్య రంగాలకు 9.71 శాతం చొప్పున కేటాయింపులు పెంచింది. రైతుకు పెట్టుబడి సాయం అందించే వైఎస్సార్ రైతు భరోసా, సాగుకు పగటిపూట 9 గంటల విద్యుత్తు సరఫరా పథకాలకే రూ.13,275 కోట్లు ఖర్చు చేయనుంది. రైతు సంక్షేమమే లక్ష్యంగా పలు కొత్త పథకాలను కూడా ప్రారంభించబోతున్నట్లు ప్రభుత్వం శాసనసభలో ప్రకటించింది. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం (జడ్‌బీఎన్‌ఎఫ్) విధానాన్ని భారీస్థాయిలో ప్రోత్సహించాలని నిర్ణయించింది. పశుసంవర్ధకంలో జీవాలు, పశువుల బీమాకు రూ.50 కోట్లు, మత్స్య రంగ అభివృద్ధిలో భాగంగా జెట్టీలు, ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల ఏర్పాటుకు రూ.100 కోట్లు ఇవ్వనుంది.

"ప్రపంచంలో మోసపోవటం తప్ప.. మోసం చేయటం చేతకానీ ఒకే ఒక్క వ్యక్తి రైతు.. అలాంటి రైతు ఏ దశలోనూ మోసపోకుండా చూడాలని మా ప్రభుత్వం భావిస్తోంది.

● నూతన రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఈ సంధికాలంలో వ్యవసాయం తప్ప.. ఇతర రంగాలైన సేవా, పరిశ్రమల రంగాల్లో అభివృద్ధికి అవకాశాలు తక్కువే. ఈ పరిస్థితుల్లో వ్యవసాయ అభివృద్ధిపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తూ.. రైతు శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు సాగాలనేది సీఎం జగన్ అభిమతం

- శాసనసభలో వ్యవసాయ బడ్జెట్‌పై ప్రసంగం సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ

రైతుకు పూర్తి భరోసా

నవరత్నాల్లో భాగంగా ప్రకటించిన 'వైఎస్సార్ రైతు భరోసా' పథకాన్ని ఈ ఏడాది రబీ నుంచి అమలు చేయబోతోంది. దీనికింద రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో రైతుకు ఏడాదికి రూ.12,500 మొత్తాన్ని సొంతంగా ఇవ్వనుంది. కేంద్రం ఏడాదికి మూడు విడతల్లో ఇచ్చే రూ.6 వేలు కూడా కలిపితే ఒక్కో రైతుకు రూ.18,500 అందుతుంది. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్తును రూ.1.50 చొప్పున ఇచ్చేందుకు రూ.475 కోట్లు ప్రతిపాదించారు. ఈ ఏడాది 50 వేల సౌర విద్యుత్తు పంపుసెట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

ఉపాధి హామీ కింద సాగుకు రూ.3,626 కోట్లు

కరవు నివారణ కార్యక్రమాల్లో భాగంగా మినీ గోకులం, పట్టుపరిశ్రమ, చేప పిల్లల్ని పెంచే చెరువులు, ఎండబెట్టే యార్డులు, పండ్ల తోటల పనులకు ఉపాధి హామీ నిధుల్ని వినియోగించుకునే దిశగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.3,626 కోట్లను వ్యవసాయ, అనుబంధ రంగాలకు ఖర్చు చేయనుంది. 81 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, 5 వేల కిలోమీటర్ల పరిధిలో రహదారులకు ఇరువైపులా మొక్కల పెంపకం, 25 వేల చెరువుల పునరుద్ధరణ, 35 వేల చెరువుల్లో పూడికతీత, 35 వేల ఎకరాల్లో భూమి అభివృద్ధి, 25,500 ఊటకుంటల ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు రూపొందించింది.

గ్రామ సచివాలయాల్లో ఇద్దరు సహాయకులు

కొత్తగా ఏర్పాటు చేయబోయే గ్రామ సచివాలయాల్లో రైతు సేవల కోసం వ్యవసాయ, అనుబంధ రంగాల నుంచి ఇద్దరు సహాయకుల్ని నియమించబోతున్నారు. వ్యవసాయ, ఉద్యాన రంగాల నుంచి గ్రామ వ్యవసాయ సహాయకుడు (విలేజి అగ్రికల్చర్ అసిస్టెంట్).. మత్స్య, పశుసంవర్ధక రంగాల నుంచి పశుసంవర్థక సహాయకుడు (ఏహెచ్ అసిస్టెంట్)ను నియమిస్తారు.

కౌలు రైతులకు కొత్త చట్టం

కౌలు రైతులకు ప్రభుత్వ రాయితీలు, సాయం అందించే దిశగా కౌలు రైతు చట్టంలో సమూల మార్పులు తీసుకురాబోతున్నారు. భూయాజమాన్య హక్కులకు ఇబ్బంది లేకుండా.. భూయజమాని, కౌలు రైతు మధ్య 11 నెలల కాలానికి మాత్రమే ఒప్పందం అమల్లో ఉండేలా సవరణలు తీసుకురానున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

భారీ స్థాయిలో ప్రకృతి సాగు

రసాయన ఎరువులు, క్రిమి సంహారకాల వినియోగం అధికమై ఆహార పంటల్లో అవశేషాలు పెరుగుతున్నాయి. ఈ దుష్ఫలితాలను నివారించి తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తులను పండించడానికి ప్రభుత్వం 'పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం' పథకాన్ని అమలు చేయనుంది. పరంపరాగత కృషి వికాస యోజన పథకం కింద రూ.91.31 కోట్లు ప్రతిపాదించింది.

మరికొన్ని పథకాలకు కేటాయింపులు ఇలా..

పథకం	కేటాయింపు (రూ.కోట్లలో)
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	1,163
సూక్ష్మసేద్యం	1,105.66
నూనెగింజల అభివృద్ధి	141.26
మౌలిక వసతుల కల్పన	341
రాయితీ విత్తనాలు	200
ఉచిత సూక్ష్మపోషకాలు	30.05
భూసార పరీక్షలు	30.43
రైతు శిక్షణ	89.63
సుస్థిర సాగు విధానం	233
ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం	355
ఆయిల్‌పామ్ తోటల సాగుకు ప్రోత్సాహం	65.15
ఆయిల్‌పామ్ రైతులకు ధరలో వ్యత్యాసం	80
పశుదాణా పథకాలు	100

రైతు సంఘాలకే యంత్రాలు

రాష్ట్రంలో హెక్టారు భూమిలో వ్యవసాయానికి 2.5 కిలోవాట్లు యంత్రశక్తి అవసరం కాగా.. ప్రస్తుతం 1.72 కిలోవాట్లు మాత్రమే అందుబాటులో ఉంది. యాంత్రీకరణను పెంచే క్రమంలో రైతు సంఘాలను గుర్తించి కస్టమ్ హైరింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయించాలని నిర్ణయించింది. అక్కడ రైతులకు అవసరమయ్యే అన్ని వ్యవసాయ యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచుతారు. ప్రస్తుత బడ్జెట్లో ఈ పథకానికి రూ.460.05 కోట్లు ప్రతిపాదించారు.

కల్తీకి తావుండదు

ఎరువులు, పురుగుమందులు, విత్తనాల్లో కల్తీని నివారించడానికి ప్రతి నియోజకవర్గంలోనూ సమగ్ర పరీక్షా కేంద్రం (ఇంటిగ్రేటెడ్ టెస్టింగ్ ల్యాబ్) ఏర్పాటు చేయనున్నారు. పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించిన తర్వాతే రైతులకు ఉత్పత్తులు అందిస్తారు. బడ్జెట్లో దీనికి రూ.109.28 కోట్లు కేటాయించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించేందుకు ప్రభుత్వం వీటిని సరఫరా చేసే సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటుంది. ఎక్కడైనా పొరపాటు జరిగి రైతు నష్టపోతే సంస్థలే బాధ్యత వహించేలా ముందే వాటి నుంచి ధరావతులు తీసుకుంటుంది.

మరో 10 లక్షల టన్నుల గోదాములు

రాష్ట్రంలో పంట ఉత్పత్తుల నిల్వ కోసం 10 లక్షల టన్నుల సామర్థ్యంతో గోదాములు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి గోదాముల మౌలిక వసతుల నిధి కింద రూ.200 కోట్లు కేటాయించింది. కొత్త గోదాముల నిర్మాణానికి రూ.37 కోట్లు ఇవ్వబోతోంది. కొత్తగా 100 రైతు బజార్లను ఏర్పాటు చేయాలని ప్రణాళిక సిద్ధం చేసింది.

50 శాతం రాయితీపై పసుపు విత్తనం

ఉద్యానశాఖ ద్వారా పసుపు- గ్రామ విత్తన కార్యక్రమం ద్వారా కర్కుమిన్ అధికంగా ఉండే వంగడాలను రైతుకు రాయితీపై అందించే దిశగా ప్రణాళిక రూపొందించారు. కేరళలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పైసెస్ రీసెర్చి (ఐఐఎస్ఆర్) ఆధ్వర్యంలో విడుదల చేసిన అధిక దిగుబడినిచ్చే మహిమ, వరద రకాల అల్లాన్ని కూడా రైతులకు అందిస్తారు. కొత్తగా 100 రైతు ఉత్పత్తి సంఘాలు ఏర్పాటు చేయబోతున్నారు.

అన్నదాతకు అండ..దండ

రైతులను ఆదుకోడానికి వైకాపా పలు రకాల పథకాలను తన ఎన్నికల ప్రణాళికలో, నవరత్నాలలో ప్రకటించింది. ఆ పథకాలు.. వాటివల్ల కలిగే ప్రయోజనాలు ఇలా ఉన్నాయి.

రైతు భరోసా
ప్రయోజనం: ఒక్కో రైతు కుటుంబానికి ఏడాదికి రూ.12,500 చొప్పున పెట్టుబడి సాయంగా అందిస్తారు. గుర్తింపు పొందిన కౌలు రైతులకు కూడా రూ.12,500 అందజేస్తుంది.
లబ్ధి: 64.07 లక్షల రైతు కుటుంబాలు
కౌలు రైతులు: 15.37 లక్షల కుటుంబాలు
కేటాయింపు: రూ. 8,750 కోట్లు

వడ్డీలేని రుణాలు
ప్రయోజనం: రైతులు బ్యాంకు నుంచి రూ.లక్ష లోపు పంటరుణం తీసుకుని గడువులోగా చెల్లిస్తే అందుకయ్యే వడ్డీని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది.

కేటాయింపు: రూ.100 కోట్లు

వైఎస్సార్ రైతు బీమా
ప్రయోజనం: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకుంటే వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం రూ. 7 లక్షల పరిహారం అందిస్తుంది. ఈ మొత్తాన్ని అప్పులవారు తీసుకునే వీలు లేకుండా చట్టం తెచ్చే దిశగా చర్యలు తీసుకుంటోంది. 2014-19 మధ్య ఆత్మహత్య చేసుకుని.. పరిహారం అందనివారిలో అర్హులను గుర్తించి వారికి కూడా పరిహారం ఇవ్వనుంది.
కేటాయింపు: రూ. 100 కోట్లు

ఉచిత పంటల బీమా
ప్రయోజనం: సాగయ్యే అన్ని పంటలకు ఉచితంగా బీమా కల్పిస్తారు. రైతు చెల్లించాల్సిన వాటాను కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది.
బీమా చేసే విస్తీర్ణం: 55 లక్షల హెక్టార్లు
ఎంతమందికి లబ్ధి: 85 లక్షల మంది (ఖరీఫ్, రబీల్లో)
కేటాయింపు: రూ. 1,163 కోట్లు

ధరల స్థిరీకరణ నిధి
ప్రయోజనం: పంటలకు మద్దతు ధరలు లభించని సమయంలో ప్రభుత్వమే రంగంలోకి దిగి కొనుగోలు చేస్తుంది.
ఖర్చు: రూ. 3 వేల కోట్లు

9 గంటల ఉచిత విద్యుత్తు
ప్రయోజనం: రైతులకు పగటిపూటే 9 గంటల విద్యుత్తు సరఫరా
లబ్ధి: 18.15 లక్షల పంపుసెట్లు వినియోగించే రైతులకు
రాష్ట్రంలో 6,663 వ్యవసాయ విద్యుత్తు ఫీడర్లున్నాయి. ఇందులో 3,854 ఫీడర్ల (60శాతం)లోనే ప్రస్తుతం 9 గంటల సరఫరాకు అనువైన సౌకర్యాలు ఉన్నాయి. మిగిలిన వాటికి సదుపాయాల కల్పనకు రూ. 1700 కోట్ల కేటాయింపు.
కేటాయింపు: రూ. 4,525 కోట్లు

మత్స్యకారులకు ఊరట
పథకం: ప్రమాదంలో మరణించే మత్స్యకారుల కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల పరిహారం
ప్రయోజనం: వేటకు వెళ్లి ప్రమాదాల పాలయ్యే మత్స్యకార కుటుంబాలకు దీనిని ఇస్తారు.
పథకం: సముద్రంలో ఏటా 61 రోజులు వేట నిషేధించిన సమయంలో భృతిగా ఇస్తున్న రూ.4 వేలను రూ.10 వేలకు పెంచారు.
లబ్ధి: 96,662 మంది మత్స్యకారులకు
కేటాయింపు: రూ. 100 కోట్లు

దేనికెంత? (రూ. కోట్లలో)

రంగం	కేటాయింపు
వ్యవసాయం	18,327.94
మత్స్య, పాడి, పశుసంవర్ధక	1,912.29
అటవీ, పర్యావరణం	446.77
ఉన్నత విద్య	3,021.63
బీసీ సంక్షేమం	7,271.45
విద్యుత్	6,861.03



పక్షినాం బలమాకాశం
మత్స్యానాం ఉదకం బలం
పక్షులకు ఆకాశమే బలం, చేపలకు నీళ్లే బలం.. మరి పిల్లలకు? అమ్మ ఒడే బలం.
అలాగే చదువు అనేది.. మాతేవ రక్షతి.. పితవే హితే నియుంక్తే.
అంటే చదువే తల్లిలా రక్షిస్తుంది, తండ్రిలా మంచి చేస్తుంది.
పిల్లలను చదివించుకోవాలని తపనపడే తల్లుల ప్రేరణే మా ప్రభుత్వానికి బలం!

బీసీ సంక్షేమానికి అధనం

- గతం కన్నా ఎక్కువ
- ఉప ప్రణాళికకు 15 వేల కోట్లు
- సంక్షేమానికి 7,271 కోట్లు

ఈనాడు డిజిటల్ - అమరావతి

వెనుకబడిన వర్గాలు తమకు వెన్నెముక అన్న వైకాపా ప్రభుత్వం బడ్జెట్‌లో అందుకు తగ్గట్లుగానే నిధులు కేటాయించింది. కులవృత్తులను జీవనోపాధిగా ఎంచుకున్న సామాజికవర్గాల ఆదాయ మార్గాలు పెరిగేలా కొత్తగా ఆర్థిక మద్దతు పథకాలను ప్రకటించింది. బీసీ ఉప ప్రణాళికకు రూ.15,061 కోట్లు కేటాయించింది. గతేడాది కేటాయింపు (రూ.12,200 కోట్లు) కంటే ఇది 23.46 శాతం అధికం. వివిధ పథకాల అమలు కోసం బీసీ సంక్షేమ శాఖకు రూ.7271.45 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే ఇది 17.03 శాతం ఎక్కువ.

139 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు

బీసీల్లోని 139 కులాల ఆర్థికాభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బడ్జెట్‌లో హామీ ఇచ్చింది. బీసీల్లోని 29 కులాలకు ప్రస్తుతం ప్రత్యేక కార్పొరేషన్లు ఉన్నా ప్రభుత్వ ఆర్థికాభివృద్ధి పథకాలు ఆయా వర్గాలకు పూర్తి స్థాయిలో అందడం లేదు. రుణాల జారీలో జాప్యం జరుగుతోంది. కులానికో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే ఆయా వర్గాల అభివృద్ధికి ఆర్థిక సాయం నేరుగా అందించవచ్చన్న ఉద్దేశంతో ప్రభుత్వం మరో 110 కార్పొరేషన్లను కొత్తగా ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. మహిళలకు రూ.75 వేలు ఇచ్చే 'వైఎస్సార్ చేయూత' పథకాన్ని కూడా కొత్త కార్పొరేషన్ల ద్వారానే అందించనుంది.

దర్జీలకు ఏటా రూ.10 వేలు

కులవృత్తిని జీవనోపాధిగా ఎంచుకున్న నాయీబ్రాహ్మణులు, రజకులు, దర్జీలకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలవనుంది. ఆయా వర్గాలకు ఏటా రూ.10 వేలు ఇచ్చే పథకానికి శ్రీకారం చుట్టింది. వృత్తిపరంగా ఉపయోగించే యంత్రాలు, ఉపకరణాల ఆధునికీకరణ, కొత్తవాటి కొనుగోలుకు సాయంగా ఈ పథకాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా దాదాపు 3 లక్షల మంది నాయీబ్రాహ్మణులు, రజకులు, దర్జీలు లబ్ధి పొందుతారని పేర్కొంది. ఈ పథకానికి రూ.300 కోట్లు కేటాయించింది. చేనేత పనిమీద ఆధారపడ్డ కుటుంబాల జీవనోపాధి కోసం ఎలాంటి షరతులు లేకుండా ఏటా రూ.24 వేల ఆర్థిక సాయం అందించే పథకాన్ని బడ్జెట్‌లో ప్రతిపాదించింది. మగ్గాల ఆధునికీకరణ, ప్రస్తుత విపణిలో పోటీపడేందుకు ఈ సాయం అందిస్తున్నట్లు ప్రకటించింది.

ఇచ్చిన హామీ మేరకు

కాపు సంక్షేమానికి అండగా ఉంటామన్న ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది. అధికారంలోకొస్తే కాపు సంక్షేమం కోసం ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు కేటాయిస్తామన్న హామీ మేరకు ప్రభుత్వం రూ.2వేల కోట్లు కేటాయించింది.

బడుగుల బాగు కోసం

ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. విద్యార్థులకు బోధన రుసుములు, ఉపకారవేతనాలు, డప్పు కళాకారులకు పింఛన్లు, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, ఆహారబుట్ట, ఉచిత విద్యుత్, భూమి కొనుగోలు, పెళ్లికానుక తదితర పథకాల కోసం నిధులు కేటాయించింది.

పేదింట ఉచిత 'వెలుగు'

ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితవిద్యుత్ పరిమితిని 200 యూనిట్లకు పెంచింది. దీనివల్ల అదనంగా 3.42 లక్షల కుటుంబాలకు లబ్ధి కలుగుతుంది.

లబ్ధిదారులు	ప్రస్తుతం	200 యూనిట్లకు పెంచితే
ఎస్సీ కుటుంబాలు	12.83 లక్షలు	15.62 లక్షలు
ఎస్టీ కుటుంబాలు	4.18 లక్షలు	4.78 లక్షలు
వ్యయం (ఏడాదికి రూ.కోట్లలో)	284.87	–
బడ్జెట్‌లో కేటాయింపులు		రూ.430.35 కోట్లు

ఎస్సీలకు మూడు కార్పొరేషన్లు

షెడ్యూల్డ్ కులాల్లోని మాల, మాదిగ, రెల్లి కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటుచేసింది.

ఆహారబుట్టకు 100 కోట్లు

గిరిజనులకు పోషహాకార పథకానికి ప్రభుత్వం కేటాయింపులు పెంచింది. ఆహారబుట్ట పథకం పరిధిలోకి వచ్చే కుటుంబాల సంఖ్య 4.24 లక్షలకు పెరిగినందున కేటాయింపులు పెంచింది.

బడ్జెట్‌లో కేటాయింపులు– రూ. 100 కోట్లు

నేతన్నకు ఆసరా

చేనేత కుటుంబాలకు ఏటా రూ.24 వేలు అందించే పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది.

చేనేతపై ఆధారపడ్డ కుటుంబాలు – 98 వేలు

బీమా ధీమా

18 - 60 ఏళ్లలోపు పౌరులు సహజంగా మరణిస్తే వారి కుటుంబాలకు రూ.లక్ష ఇచ్చే 'వైఎస్ఆర్ బీమా' పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు ఇవ్వనుంది.

పథకానికి కేటాయింపు– రూ. 404.02 కోట్లు

బీసీలకు వెన్నుదన్ను

వెనుకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధి, జీవనోపాధి పెంపు లక్ష్యంగా ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేసింది. బీసీ ఉపప్రణాళికకు రూ.15,061 కోట్లు కేటాయించింది.

నాయీబ్రాహ్మణులు, రజకులకు సాయం

కులవృత్తి చేసుకునే నాయీబ్రాహ్మణులు, రజకులకు ప్రభుత్వం ఏటా రూ.10 వేలు ఇవ్వనుంది.

రాష్ట్రంలోని రజకులు 23,000
నాయీబ్రాహ్మణులు 1,92,000

కేటాయింపు రూ. 200 కోట్లు

కాపు సంక్షేమానికి రూ. 2000 కోట్లు

కాపు కార్పొరేషన్‌కు రూ. 2వేల కోట్లు కేటాయించారు. గతేడాది కేటాయింపుల కంటే ఇది రెట్టింపు.

కొత్తగా మాదిగ, మాల, రెల్లి కార్పొరేషన్లు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది. ఆయా వర్గాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో రోడ్లు, ఇతరత్రా మౌలిక సదుపాయాలు పెంచేలా ఉపప్రణాళికలకు ఎక్కువ నిధులు కేటాయించింది. ఎస్సీ ఉప ప్రణాళికకు గతేడాది కంటే 33.60 శాతం అధిక నిధులు ప్రతిపాదించింది. ఎస్సీల్లోని మాదిగ, మాల, రెల్లి కులాల కోసం ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఉపకారవేతనాలు, బోధనా రుసుములు, ఉచిత విద్యుత్తు పథకం, సంక్షేమ గురుకులాలు, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, రోడ్లు, తాగునీటి సదుపాయాలు, బ్రాడ్‌బ్యాండ్ సదుపాయాల విస్తరణకు ఎక్కువ నిధులిచ్చింది.

ఎస్సీ ఉపప్రణాళికకు రూ.15 వేల కోట్లు

- 2018-19 సంవత్సరంలో కేటాయించిన రూ.11,228 కోట్లకు ఇది 33.60 శాతం అధికం.
- సాంఘిక సంక్షేమ శాఖకు రూ.5,919 కోట్లు కేటాయింపు
- ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక పథకాలకు రూ.350.27 కోట్లు
- సంక్షేమ వసతి గృహాల నిర్వహణకు రూ.475.78 కోట్లు
- భూమి కొనుగోలు పథకానికి రూ.35 కోట్లు

గిరిజన ఉపప్రణాళికకు రూ.19.44 శాతం అధికం

గిరిజన ఉప ప్రణాళికకు ప్రభుత్వం రూ.4988.52 కోట్లు కేటాయించింది. గతేడాది రూ.4176 కోట్ల కన్నా ఇది 19.44 శాతం అధికం. గిరిజన సంక్షేమ శాఖకు రూ.2,153 కోట్లు ప్రతిపాదించింది.

గిరిజనాభివృద్ధి కోసం ప్రధాన కేటాయింపులు	(రూ. కోట్లలో)
వైఎస్ఆర్ గిరిజన విశ్వవిద్యాలయ అభివృద్ధికి	50
ఏజెన్సీ ప్రాంతాల్లో కాఫీ తోటల అభివృద్ధికి	30.46
ఆర్థిక మద్దతు పథకాలకు	161.77
బ్రాడ్‌బ్యాండ్ సదుపాయాల విస్తరణకు	30
గిరిజన విద్యాసంస్థల్లో మౌలిక వసతులకు	137.24

గ్రామ, వార్డు సచివాలయాలకు కేటాయింపులు	
గ్రామ వాలంటీర్లు	రూ. 720 కోట్లు
గ్రామ సచివాలయాలు	రూ. 700 కోట్లు
మున్సిపల్ వార్డు వాలంటీర్లు	రూ. 280 కోట్లు
మున్సిపల్ వార్డు సచివాలయాలు	రూ. 180 కోట్లు
అగ్రిగోల్డ్ బాధితులకు ఆర్థిక భరోసా	రూ. 1,150 కోట్లు

11 లక్షల కొత్త పింఛన్లు

ఈనాడు డిజిటల్, అమరావతి: సామాజిక భద్రత పింఛన్ల అర్హత వయసును 60 ఏళ్లకు తగ్గించడంతో పాటు తలసేమియా, పక్షవాతం, కుష్ఠు వ్యాధిగ్రస్తులకు తోడుగా నిలిచేలా ప్రభుత్వం సాయం అందించనుంది. ప్రస్తుతం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, ఎయిడ్స్ బాధితులకు రూ.2,250, హిజ్రాలు, డప్పు కళాకారులు, దివ్యాంగులకు రూ.3 వేలు, డయాలసిస్ రోగులకు రూ.10 వేలు చొప్పున ప్రతి నెలా సాయం అందిస్తోంది. అర్హత వయసున్న వారికి పింఛను మంజూరు చేయడం, అర్హత వయసు 60 ఏళ్లకు తగ్గించడంతో కొత్తగా పెరిగే లబ్ధిదారులతోపాటు తలసేమియా, పక్షవాతం, కుష్ఠు వ్యాధిగ్రస్తులకు కూడా పింఛన్లు మంజూరు చేస్తే కొత్తగా 11.20 లక్షల మంది అదనంగా పెన్షన్లకు అర్హత సాధిస్తారని సర్కారు గుర్తించింది. వైఎస్సార్ అభయహస్తం పింఛనుదారులకు కొత్తగా నెలకు రూ.2,750 చొప్పున ప్రతి నెలా పింఛను అందించనుంది. ఈ మేరకు బడ్జెట్‌లో 15,746.58 కోట్లు కేటాయించింది.

కొత్త వారికి పింఛన్లు...

ఎన్నికల హామీ
సామాజిక భద్రత పింఛన్ల అర్హత వయసు 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గిస్తాం

అవసరం

ప్రజాసాధికార సర్వే ప్రకారం 60-65 ఏళ్ల మధ్య 5.49 లక్షల మంది ఉన్నారు. వీరితోపాటు తలసేమియా, పక్షవాతం, కుష్ఠువ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు పింఛను అందించాలి. అక్టోబర్ 2 నుంచి కొత్తవారికి పింఛన్లు పంపిణీ చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

బడ్జెట్ కేటాయింపు రూ.15,746.58 కోట్లు

భరోసా: 5 లక్షల సాయం

ఈనాడు డిజిటల్, అమరావతి: ఇంటి పెద్ద హఠాన్మరణంతో బతుకుపై భరోసా కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవనుంది. ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.5 లక్షల పరిహారం చెల్లించేలా వైఎస్ఆర్ బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్కుల సహజ మరణానికి రూ.లక్ష చెల్లించనుంది.

- కేటాయింపు– రూ.404.02 కోట్లు

సహాయం: ఏటా 10 వేలు

రవాణా సేవల రంగంలో బహుళ జాతి సంస్థల ప్రవేశంతో ఆదాయ మార్గాలను కోల్పోతున్న ఆటోలు, ట్యాక్సీ డ్రైవర్లకు ప్రభుత్వం భరోసా ఇచ్చింది. సొంత వాహనం ఉన్న అర్హులైన డ్రైవర్లకు ఏటా రూ.10వేల వంతున ఆర్థిక సాయం అందించే పథకానికి శ్రీకారం చుట్టింది. వాహనాల బీమా, మరమ్మతులు ఇతరత్రా అవసరాలకు సాయం చేయనుంది. పథకం అమల్లోకొస్తే రాష్ట్రంలోని లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

- కేటాయింపు– రూ.400 కోట్లు

ధార్మికం: 234 కోట్లు

ధూప, దీప, నైవేద్యాలు, నిర్వహణకు నోచని ఆలయాలకు ప్రతినెలా ప్రభుత్వం నిధులివ్వనుంది. గ్రామాల్లో జనాభాను బట్టి వీటిని అందించనుంది. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.234 కోట్లు కేటాయించింది. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.100కోట్లు కేటాయించింది.

న్యాయం: లాయర్లకు భృతి

న్యాయవాదులకు ప్రతి నెలా రూ.5వేల వంతున భృతి ఇచ్చే పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ప్రాక్టీసు మొదలుపెట్టిన తొలి మూడేళ్ల కాలంలో దీన్ని చెల్లిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి రూ.10కోట్లు కేటాయించింది. న్యాయవాదుల సంక్షేమం, ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.100 కోట్లతో సంక్షేమ ట్రస్టు ఏర్పాటు చేసింది.

బడ్జెట్ స్వరూపం

(రూ.కోట్లలో)

ఆర్థిక సంవత్సరం	ప్రతిపాదిత బడ్జెట్	రెవెన్యూ ఆదాయం	రెవెన్యూ ఖర్చు
2014-15	1,11,824.00	90,671.41	1,14,986.24
2015-16	1,13,048.98	88,647.80	95,949.66
2016-17	1,35,688.90	98,984.48	1,16,178.21
2017-18	1,56,999.39	1,05,062.09	1,21,213.77
2018-19	1,91,063.60	1,14,684.14	1,26,339.05
2019-20	2,27,975.00	1,78,697.41	1,80,475.94

ఆర్టీసీకి చేయూత

- రూ.1,572 కోట్ల కేటాయింపు

ఈనాడు, అమరావతి: ఏపీఎస్ఆర్టీసీని ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. ఆర్థిక సాయం, కొత్త బస్సుల కొనుగోలు, రాయితీల రీయింబర్స్‌మెంట్ తదితర పద్దుల కింద రూ.1,572 కోట్లు కేటాయించింది. ఆర్టీసీ బస్సు ఒక కిలోమీటరు నడిపేందుకు రూ.44.58 వ్యయం అవుతుండగా రూ.38.05 మాత్రమే ఆదాయం వస్తోంది. వివిధ రకాల కారణాలతో గత నాలుగేళ్లలో సంస్థకు ఏటా దాదాపు రూ.వెయ్యి కోట్ల మేర నష్టాలు వచ్చాయి. ఆదుకునేందుకు ప్రత్యేక ఆర్థిక సాయం చేయాలని గత కొన్నేళ్లుగా యాజమాన్యం, కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. స్పందించిన ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో నిధులు కేటాయించింది.

ఆర్థిక సాయం
రూ.1000 కోట్లు
రాయితీల రీయింబర్స్‌మెంటుకు
రూ.500 కోట్లు
కొత్త బస్సుల కొనుగోలుకు
రూ.50 కోట్లు
ఇతర అవసరాలకు
రూ.22 కోట్లు

డ్వాక్రా మహిళలకు 1,788 కోట్లు

ఈనాడు డిజిటల్, అమరావతి: మహిళల ఆర్థిక ప్రగతి ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమని గుర్తించిన ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా గ్రూపు)లకు ఆర్థిక భరోసా కల్పించాలని నిర్ణయించింది. పేదింటి అతివలపై భారం లేకుండా సున్నా వడ్డీకే రుణాలిచ్చేలా 'వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని' అమల్లోకి తీసుకువచ్చింది. డ్వాక్రా మహిళలకు ఆదాయ కల్పన కోసం ఇచ్చిన రుణాలపై వడ్డీ రాయితీ చెల్లింపునకు నిధులు ఇస్తామని బడ్జెట్‌లో ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాల్లోని 6,32,254 సంఘాలకు రూ.1,140 కోట్లు, పట్టణ ప్రాంతాల్లోని 1,66,727 సంఘాలకు రూ.648 కోట్లు ఇందుకోసం కేటాయించింది.

సున్నా వడ్డీకే రుణాల విప్లవం!

రుణ మంజూరు లక్ష్యం: రూ.16,819 కోట్లు

వడ్డీ రాయితీకి బడ్జెట్‌లో కేటాయింపు
గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,140 కోట్లు
పట్టణ పరిధిలో రూ.648 కోట్లు

డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీకే రుణాలు ఇస్తామని, వడ్డీ రాయితీ చెల్లింపులో జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

ఇదీ పథకం

- డ్వాక్రా మహిళలకు జీవనోపాధి కల్పనలో భాగంగా ప్రభుత్వం బ్యాంకు రుణాలు మంజూరు చేస్తోంది.
- నెల వారీ వాయిదాల రూపంలో వడ్డీతో కలిపి అసలును మహిళలు ఆయా బ్యాంకులకు చెల్లిస్తున్నారు.
- మహిళలు చెల్లించే వడ్డీని ప్రభుత్వం రాయితీ రూపంలో విడతల వారీగా సంఘం బ్యాంకు ఖాతాల్లో తిరిగి జమ చేస్తోంది.

పాత బకాయిలు రూ. 3,037 కోట్లు

2016 ఆగస్టు నుంచి 2019 మార్చి వరకు

రూ. 2,303 కోట్లు	గ్రామీణ పరిధిలోని డ్వాక్రా మహిళలకు
రూ. 734 కోట్లు	పట్టణ పరిధిలోని డ్వాక్రా సభ్యులకు

వడ్డీ బకాయిలు చెల్లించాల్సి ఉంది.

దేనికెంత? (రూ. కోట్లలో)

పాఠశాల విద్య	ఆహారం, పౌరసరఫరాలు	ఆర్థిక	సాధారణ పరిపాలన	వైద్యం, కుటుంబ సంక్షేమం	హోం
29,772.79	4,429.43	46,858.81	1,010.78	11,399.23	7,461.92

నవరత్న సమేత
రాష్ట్ర బడ్జెట్ 2019-20

"పక్షికి గూడు ఉంటుంది.. మృగాలకు గుహలుంటాయి
చిన్న చీమ కూడా పుట్ట ఏర్పాటుచేసుకుంటుంది..
ఓ నీడంటూ లేని దురదృష్టకర పరిస్థితి మనిషిదే

పేదలు జానెడు జాగా కోసం జీవితమంతా కష్టపడుతున్నారు. అందుకే అయిదేళ్లలో 25 లక్షల గృహాలు నిర్మించాలని, 2020 మార్చి 25న ఉగాదినాటికి ఇల్లులేని వారికి 25 లక్షల ఇంటిపట్టాలు పంపిణీ చేయాలని తలపెడుతున్నాం.

కోతల పద్దు

- సంక్షేమ పథకాలకు కేటాయింపులు తగ్గించారు
- ప్రభుత్వం మాటలకు.. చేతలకు పొంతన లేదు : చంద్రబాబు



ఈనాడు-అమరావతి: 'ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించేలా లేదు. పేదల సంక్షేమానికి దోహదం చేసేలా లేదు. వైకాపా నేతల మాటలకు, చేతలకు పొంతన లేదనటానికి ఈ బడ్జెట్టే నిదర్శనం. బడ్జెట్ ప్రసంగం పుస్తకాన్ని కూడా పార్టీ పుస్తకంగా, వైకాపా కరదీపికగా మార్చారు' అని తెదేపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో సున్నా వడ్డీ రుణాలకు రూ.4 వేల కోట్లు అవసరం ఉంటే.. రూ.100 కోట్లు మాత్రమే కేటాయించటంపై రైతులకు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. ఈ బడ్జెట్‌లో రైతులకు అన్యాయం చేసి వచ్చే బడ్జెట్‌లో సరిచేస్తామని చెప్పటం సరికాదని విమర్శించారు. బడ్జెట్‌పై స్పందన ఆయన మాటల్లోనే..

- నీటి పారుదల ప్రాజెక్టులకు కేటాయింపుల్లో 22 శాతం కోత పెట్టారు. పొరుగు రాష్ట్ర భూభాగంలో నీరు పారించటంపైనే శ్రద్ధ పెట్టారు. బీసీల సంక్షేమం కోసం కేటాయించే నిధులూ తగ్గించారు. 139 ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వాటికి కేటాయింపులపై స్పష్టత లేదు. ముస్లిం మైనారిటీలకు తెదేపా హయాంలో రూ.1,102 కోట్లు కేటాయించాం. వాటికంటే ఇప్పుడు 13.56 శాతం నిధులను తగ్గించారు.
- అమ్మఒడి పథకానికీ ఆంక్షలు పెట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల తేడా లేకుండా ప్రతి తల్లికీ ఇస్తామని చెప్పి.. ప్రస్తుత బడ్జెట్‌లో మాత్రం 43 లక్షల మందికి మాత్రమే అని చూపారు.
- పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు మూసేసి, మద్యం విక్రయాలను ప్రోత్సహించటం వైకాపా ప్రభుత్వానికే చెల్లింది.
- సహజ మరణానికి చంద్రన్న బీమా కింద ఇచ్చే రూ.2 లక్షల మొత్తాన్ని సగానికి తగ్గించారు.
- రాజధానికి రూ.500 కోట్లు, కడప ఉక్కు కర్మాగారానికి రూ.250 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ నిధులు ప్లాంటు ఏర్పాటుకు తీసుకున్న భూమి చదును చేయటానికి కూడా సరిపోవు. రాజధానిలో ఇప్పటికే భూముల ధరలు భారీగా పతనమయ్యాయి. లక్షలాది కూలీలు, కార్మికులు ఉపాధి కోల్పోయారు. పట్టణ ప్రాంతాల అభివృద్ధి, రాజధాని అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు నిధుల్లో కోత పెట్టి రాష్ట్ర ప్రగతికి గండికొట్టారు.
- ఆర్టీసీ విలీనం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై చిత్తశుద్ధి లేదు.
- రాష్ట్ర రుణ బకాయిలపై ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రోజుకో రకంగా మాట్లాడుతూ, పొంతనలేని లెక్కలతో తప్పుదోవ పట్టిస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు.

మెట్రో కేంద్ర సాయంపైనే ఆశ

విజయవాడ, విశాఖపట్నం మెట్రోరైలు ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఆశలు పెట్టుకుంది. ఈ జాబితాలో తాజాగా అమరావతి మెట్రోరైలు ప్రాజెక్టునూ ప్రతిపాదించారు. వీటి ప్రాథమిక అవసరాల కోసం రూ.10 కోట్లకు పైగా బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో విశాఖలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విజయవాడలో మెట్రో రైలు ప్రాజెక్టులను చేపట్టాలి. విశాఖలో ప్రాజెక్టుకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు సవివర పథక నివేదిక (డీపీఆర్) సిద్ధం చేస్తున్నారు. రెండింటికీ కేంద్రప్రభుత్వ సాయం కోసం త్వరలో ప్రతిపాదనలు పంపనున్నారు. వీటికి కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ నుంచి ఆమోదం వస్తేతప్ప మెట్రో ప్రాజెక్టులు పట్టాలెక్కే అవకాశం లేదు.

అమృత్ 373.61 కోట్లు

పురపాలక, నగరపాలక సంస్థల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలో అమలుచేస్తున్న కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయి. అమృత్‌కు రూ.373.61 కోట్లు, ఆకర్షణీయ నగరాలకు రూ.50 కోట్లు, పేదరిక నిర్మూలన, మహిళా సంక్షేమానికి మరో రూ.23.40 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించింది. విజయవాడలో మౌలిక సదుపాయాల కల్పనకు నగరపాలక సంస్థకు ప్రత్యేకంగా రూ.50 కోట్లు సమకూర్చారు.

సాగునీటి యజ్ఞం

ఈనాడు - అమరావతి

ఈ ఎన్నికల్లో వైకాపా హామీ ఇచ్చిన ప్రకారం ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో జలయజ్ఞం ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చింది. రూ.13,139.04 కోట్లు కేటాయించింది. 2021 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేస్తామని ఆర్థికమంత్రి భరోసా ఇచ్చారు. ఇందుకు అవసరమైనన్ని నిధులు కేటాయిస్తామంటూ రూ.5129 కోట్లు ఇచ్చారు. కృష్ణా, గోదావరి ఆయకట్టుల స్థిరీకరణ, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలను హరితాంధ్రగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని విత్తమంత్రి విశదీకరించారు. మానవతా దృక్పథంతో ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలకు పునఃపరిష్కారం, పునరావాసాన్ని పూర్తిచేస్తామని చెప్పారు. ఏడాది కాలంలోనే వెలిగొండ ప్రాజెక్టును కొంతమేర పూర్తి చేస్తామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. రెండో సొరంగం పనులు కూడా పూర్తి చేసి రెండేళ్లలో రెండోదశను కూడా పూర్తిచేస్తామని ప్రకటించారు.

జలవనరులశాఖలో కేటాయింపులు (రూ. కోట్లలో)

ఆర్థిక సంవత్సరం	ఖర్చు
2015-16 (వాస్తవ లెక్కలు)	9,540.66
2016-17 (వాస్తవ లెక్కలు)	10,592.45
2017-18(వాస్తవ లెక్కలు)	8,877.16
2018-19(సవరించిన అంచనాలు)	13,991.00
2019-20 (అంచనాలు)	13,139.04

ఈ బడ్జెట్‌లో కొన్ని ప్రాజెక్టులకు కేటాయింపులు (రూ. కోట్లలో)

చింతలపూడి ఎత్తిపోతల	720
తోటపల్లి ప్రాజెక్టు	156
గుండ్లకమ్మ ప్రాజెక్టు	28
తాడిపూడి ఎత్తిపోతల	55
గాలేరు నగరి	391
హంద్రీనీవా	1134
వెలిగొండ ప్రాజెక్టు	592
ముసురుమిల్లి	32
పులివెందుల కాలువ	112
చిన్ననీటి వనరులు	589
ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు	479

పోలవరానికి రూ.5254 కోట్లు

పోలవరం ప్రాజెక్టుకు అత్యధికంగా రూ.5254 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టును 2021 నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పోలవరం పూర్తి కావాలంటే ఇంకా రూ.34,751.06 కోట్లు కావాలి. కేంద్రం నుంచి వీలైనన్ని నిధులు రాబట్టేందుకు రాష్ట్ర అధికారులు ప్రయత్నం చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొలుత ఈ ప్రాజెక్టుపై నిధులు ఖర్చుచేసి, తర్వాత కేంద్రం నుంచి ఆ నిధులు పొందే ప్రక్రియ ఇంతకాలం సాగుతోంది. కానీ కేంద్రం ఆ నిధులు సకాలంలో ఇవ్వకపోవడంతో ఆ మేరకు రాష్ట్ర ప్రాజెక్టులపై భారం పడుతోంది.

ఎన్నికల ప్రణాళికలో ఇవీ వైకాపా హామీలు..

- పోలవరం, వెలిగొండ ప్రాజెక్టులతో సహా అన్ని ప్రాజెక్టుల పూర్తి
- సాగునీటి కల నిజం చేస్తాం...చెరువులను పునరుద్ధరిస్తాం..
- వైఎస్ హయాంలో చేపట్టిన 14 ప్రాజెక్టులు పూర్తి కావాలి. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తే దాదాపు 31.64 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని అంచనా. వీటిలో చాలా ప్రాజెక్టులు మూడొంతుల మేర పూర్తయ్యాయి. వాటిలో కొన్నింటికి నిధులు కూడా పెద్ద అవసరం ఉండదు. ఖర్చు తక్కువ...సాగులోకి వచ్చే ఆయకట్టు ఎక్కువ కావడంతో అటుగా దృష్టి సారిస్తున్నట్లు పేర్కొంటున్నారు.

ఎన్ని నిధులు కావాలి?

- 2004 నుంచి కొనసాగుతున్న ప్రాజెక్టుల తాజా విలువ : రూ.1,57,770 కోట్లు
- 2019 మార్చి 31 నాటికి ఖర్చు రూ.62,251 కోట్లు
- మిగిలిన పనుల విలువ రూ.95,519 కోట్లు
- పాలనామోదం పొంది ప్రారంభించని పనుల విలువ రూ.10,704 కోట్లు
- టెండర్లు పిలిచి ఖరారు చేసి పనులు ప్రారంభించని వాటి విలువ: రూ.7302.56
- పనులు మొదలు పెట్టి 25% లోపు ఖర్చుచేసిన ప్రాజెక్టుల విలువ: రూ.22,880.44 కోట్లు
- తాజా ప్రభుత్వ నిర్ణయం ప్రకారం పనులు ఆపగా కొనసాగుతున్న పాత పనుల విలువ: రూ.21,681.30 కోట్లు

రంగాలవారీ కేటాయింపులు
(రెవెన్యూ, మూలధనం) (శాతాల్లో)



సామాజిక సేవలు

సాధారణ విద్య:	14.31
క్రీడలు, యువజన సర్వీసులు:	0.14
సాంకేతిక విద్య:	0.25
కళలు, సంస్కృతి:	0.03
వైద్యం:	5
తాగునీరు, పారిశుద్ధ్యం:	0.98
గృహనిర్మాణం:	1.59
పట్టణాభివృద్ధి:	2.89
సమాచార పౌరసంబంధాలు:	0.08
సంక్షేమం:	6.2
ఉద్యోగ, ఉపాధి కల్పన:	0.43
సామాజిక భద్రత, సంక్షేమం:	1.19

ఆర్థిక సేవలు

వ్యవసాయం, అనుబంధ సేవలు:	9.07
గ్రామీణాభివృద్ధి:	12.87
నీటిపారుదల, వరద నియంత్రణ:	5.76
ఇంధనం:	3.01
పరిశ్రమలు, ఖనిజాలు:	1.75
రవాణా:	8.38
శాస్త్ర, సాంకేతిక, పర్యావరణం:	0
పర్యావరణ సేవలు:	2.64

ఖర్చు ఎంతైనా ఆరోగ్యశ్రీ

ఈనాడు, అమరావతి: వార్షిక ఆదాయం రూ.5లక్షల కంటే తక్కువగా ఉన్న అన్ని కుటుంబాలకు వైద్య ఖర్చులు రూ.వెయ్యి మించితే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వర్తించనుంది. ఎన్ని లక్షలు ఖర్చయినా ఉచిత వైద్యం అందించనున్నారు. సరిహద్దు జిల్లాల ప్రజల ప్రయోజనం కోసం బెంగళూరు, హైదరాబాద్, చెన్నైవంటి నగరాల్లోని పెద్ద ఆస్పత్రులను ప్రభుత్వ జాబితాలో చేర్చనున్నారు. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.1,740కోట్లు కేటాయించారు. ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిద్దేందుకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చింది. ఆస్పత్రుల్లో మౌలికవసతుల కల్పనకు రూ.1500కోట్లు కేటాయించింది. మూత్రపిండ వ్యాధుల నివారణకు శ్రీకాకుళం జిల్లా పలాసలో ప్రత్యేక పరిశోధన కేంద్రం, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు బడ్జెట్‌లో రూ.50కోట్లు కేటాయించారు. అరకు/పాడేరు ప్రాంతాల్లో డాక్టర్ వైఎస్ఆర్ పేరుతో గిరిజన వైద్య కళాశాల, గుంటూరు జిల్లా పల్నాడులోని గురజాల, విజయనగరంలో వైద్య కళాశాలల ఏర్పాటుకు రూ.66కోట్ల వంతున కేటాయించారు. కొత్తగా '108 అంబులెన్సులు' 432, '104 అంబులెన్సులు' 676 కొనుగోలు చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. మొత్తంగా బడ్జెట్‌లో రూ.11,399.23 కోట్లు ఇచ్చారు. గతేడాదితో పోల్చితే నిధుల కేటాయింపు 34.69% పెరిగింది. మొత్తం బడ్జెట్‌లో వైద్య రంగం కేటాయింపు 5%గా ఉంది.

ఉద్యోగుల ఆరోగ్య పథకానికి	రూ.200కోట్లు
ఏపీ మెడ్‌టెక్ జోన్‌కు	రూ.30 కోట్లు.
కేంద్రీయ ఔషధాలు, మందులు కొనుగోలుకు	రూ.126 కోట్లు.
జాతీయ ఆరోగ్య మిషన్‌కు రాష్ట్రం వాటాగా	రూ.509 కోట్లు
ఆయుష్ కళాశాలల పటిష్ఠతకు	రూ.52 కోట్లు

వైద్యం.. కాదిక భారం!

వైద్యఖర్చులలో **65%** వరకు ప్రజలు సొంతంగా భరించాల్సి రావడంతో కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయి. కుటుంబంలో ఒకరు తీవ్ర అనారోగ్యం బారినపడితే ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తోంది. ఇతర నగరాల్లో వైద్యసేవలు పొందాలంటే ఆరోగ్యశ్రీకి పరిమితులుండేవి. ఆరోగ్యశ్రీలో చికిత్సచేసే వ్యాధులు తక్కువ కావడంతో మిగిలినవాటికి సొంతడబ్బు కట్టాల్సి వస్తోంది. రూ.5 లక్షలు దాటినా రోగులు సొంతంగా డబ్బు చెల్లించాల్సి వచ్చేది.

ప్రభుత్వ పరిష్కారం ఇలా..

- రాష్ట్ర ప్రభుత్వం 'నవరత్నాల్లో' భాగంగా రూ. **1000** ఖర్చు దాటితే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తుంది.
- ఎన్ని లక్షలు ఖర్చయినా ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం, సేవల విస్తరణ
- కిడ్నీ వ్యాధులు, తలసేమియా, ఇతర దీర్ఘకాలిక వ్యాధులున్నవారికి నెలకు రూ. **10,000** పింఛన్
- కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వాసుపత్రుల అభివృద్ధి.

ఇందుకు రూ. **1500** కోట్ల కేటాయింపు

ప్రతిపాదనలు

- బడ్జెట్‌లో రూ.**11,399.23** కోట్లు కేటాయించారు. ఇది 2018-19 కేటాయింపు కంటే **34.69%** అదనం.
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ విస్తృతికి రూ.**1740** కోట్లు అవసరం.
- ఆరోగ్యశ్రీ పరిధిలోకి కొత్తగా **963** వ్యాధులు.



70వేల మందికి ఒక అంబులెన్స్

బడ్జెట్‌లో రూ.**143.38** కోట్ల కేటాయింపు

- ప్రస్తుతం **1.11** లక్షల మందికి ఒక అంబులెన్స్ ఉంది.
- అదనంగా **432** అంబులెన్సులు కొనుగోలు.

మరిన్ని 104 అంబులెన్సులు

ఈ సంచార వైద్యశాలల కోసం రూ.**179.76** కోట్ల కేటాయింపు

- ప్రస్తుతమున్న సంచార వైద్యశాలలు : **292**
- కొత్తగా **676** అంబులెన్సులు కొనుగోలు.

'స్థానిక' సచివాలయాలకు శాశ్వత సిబ్బంది



గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల పాలనలో అధికార వికేంద్రీకరణలో భాగంగా రాష్ట్రంలో మొదటిసారి గ్రామ సచివాలయాలను అక్టోబరు 2 నుంచి ప్రారంభిస్తున్నారు. గ్రామాల్లో ప్రతి 2000 జనాభాకు ఒకటి చొప్పున, పట్టణాల్లో 5వేల జనాభాకు ఒకటి చొప్పున దాదాపు 20వేల సచివాలయాలు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లో ప్రతిసచివాలయానికి పదిమంది , పట్టణాల్లో 5గురుచొప్పున శాశ్వత ఉద్యోగులను కొత్తగా నియమించనున్నారు. 12 ప్రభుత్వ శాఖలకు భాగస్వామ్యం కల్పిస్తున్నారు.

సచివాలయాలు ఎందుకంటే..

- ప్రజలకు క్షేత్రస్థాయిలో సేవలందించే అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగుల్ని ఒకచోట అందుబాటులో ఉంచడం
- ప్రజా సమస్యల్ని పరిష్కరించి, నిర్దేశిత గడువులోగా పౌర సేవల అందజేతకు పెద్దఎత్తున ఉద్యోగాలు
- జిల్లా ఎంపిక కమిటీ (డీఎస్సీ) ఆధ్వర్యంలో ప్రక్రియ
- విజయవంతంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు
- గ్రామ సచివాలయాల్లో కొత్తగా లక్ష ఉద్యోగుల నియామకం
  బడ్జెట్ కేటాయింపు రూ. 700 కోట్లు
- పట్టణ సచివాలయాల్లో కొత్తగా 15వేల శాశ్వత ఉద్యోగుల నియామకం
  బడ్జెట్ కేటాయింపు రూ. 180 కోట్లు

ఏపీఐడీసీకి వైభవం

పారిశ్రామిక రంగానికి బడ్జెట్‌లో రూ.3,986 కోట్లు కేటాయించి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు రూ.573.60 కోట్ల ప్రోత్సాహకాలను ప్రకటించారు. ఎంఎస్ఎంఈల మౌలిక సదుపాయాల కల్పన, ప్రోత్సాహాల కోసం రూ. 400 కోట్లు కేటాయించారు.

- కడప ఉక్కు కర్మాగారానికి రూ. 250 కోట్లు
- ఏపీఐఐసీకి రూ. 360 కోట్లు
- పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ. 250 కోట్లు
- ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న లక్షకు పైగా ఎంఎస్ఎంఈలకు రూ. 200 కోట్ల చేయూత
- ఈ రంగంలో కొత్తగా ఏర్పడే పరిశ్రమలకు ప్రోత్సాహకాలు.. దీనిపై రూ. 200 కోట్ల ప్రత్యేక ప్రణాళిక

మౌలిక వసతులు, అభివృద్ధికి నిధులు ఇలా (రూ. కోట్లలో)

ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ	700	అమరావతి-అనంతపురం జాతీయ రహదారి	100
రాజధానిలో మౌలిక వసతుల కల్పన	500	మంగళగిరి మోడల్ టౌన్ అభివృద్ధి	50
రాజధాని నగర అభివృద్ధి ప్రాజెక్ట్	50	ముఖ్యమంత్రి అభివృద్ధి నిధి	500
రాజధాని ప్రాంత సామాజిక భద్రత నిధి	65	ఉపాధిహామీ అనుసంధాన పథకాలు	500
కడప యాన్యుటీ ప్రాజెక్టులు	120	పీఎంజీఎస్‌వై	376.35
పులివెందుల ప్రాంత అభివృద్ధి ఏజెన్సీ	100	పంచాయతీరాజ్ రహదారులు	350

దేనికెంత (రూ. కోట్లలో)

గృహనిర్మాణం	జలవనరులు	మహిళ, శిశు	పరిశ్రమలు	ఐటీ, ఎలక్ట్రానిక్స్	కార్మిక, ఉపాధి కల్పన
3,617.37	13,139.04	2,689.36	3,986.05	453.56	978.58



క్షీరార్థినాం కిం కరిణ్యా?

పాలు కావల్సిన వాడికి పాలే ఇవ్వాలి. ఏనుగునిస్తే ఏం ఉపయోగం? నిరుద్యోగులకు కంటితుడుపు భృతుల కన్నా పని కల్పించడం అవసరం.

ప్రియః ప్రజానాం దాతైవ, న పునః ద్రవిణేశ్వరః

ఎన్ని నీళ్లున్నా ఏం లాభం? ఎవరూ సముద్రాన్ని ఇష్టపడరు. కాసిన్ని చినుకులు చిలకరించినా సరే, మేఘాన్నే కోరుకుంటారు.

రెవెన్యూ: లోటు సవాలే

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఆర్థికవ్యవస్థను రెవెన్యూ లోటు కుంగదీస్తోంది. రాష్ట్రంలో సొంతపన్నుల ఆదాయం, పన్నేతర ఆదాయం, కేంద్రపన్నుల్లో వాటాలు, కేంద్రం నుంచి అందే గ్రాంట్ ఇన్ ఎయిడ్ అన్నింటినీ కలిపి రెవెన్యూ ఆదాయంగా లెక్కిస్తారు. రెవెన్యూ ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువగా ఉంటే రెవెన్యూ లోటుగా పరిగణిస్తారు. ఈసారి రూ.1778.52 కోట్ల రెవెన్యూ లోటుతో బడ్జెట్ సమర్పించారు. 2014-15 నుంచి రెవెన్యూ లోటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సవాలు విసురుతూనే ఉంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలోనే రూ.5235.23 కోట్ల మిగులుతో బడ్జెట్ ప్రతిపాదించారు. ఆ తర్వాత బడ్జెట్ సంవత్సరం ముగిసేనాటికి మిగులు కనిపించలేదు. దాంతో అదికూడా లోటు సంవత్సరంగానే మారింది. మనకు ఆదాయం వచ్చే మార్గాల్లో ప్రధానంగా కేంద్రం నుంచి ఆశించినంత మేర సాయం అందకపోవడమే సమస్యగా ఉంది. పన్నుల ఆదాయం, పన్నేతర ఆదాయం కూడా అటూ ఇటుగా అంచనాలకు తగ్గట్టుగానే ఉంటోంది. కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటా కూడా పెద్దగా తేడాలేదు. కేంద్రం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ మాత్రం ఆశించిన మేర రావడం లేదు.

గత ఆరేళ్ల రెవెన్యూ లోటు (రూ.కోట్లలో)

ఆర్థిక సంవత్సరం	రెవెన్యూ లోటు
2014-15	24,314.82
2015-16	7,301.87
2016-17	17,193.72
2017-18	16,151.68
2018-19 (సవరించిన అంచనాలు)	11,654.90
2019-20 (అంచనాలు)	1,778.52

వ్యయం: 85 శాతమే

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.1,62,134 కోట్లు ఖర్చుచేసినట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. వీటిని 2018-19 ప్రీ అకౌంట్స్‌గా చెబుతారు. అడ్వకేట్ జనరల్ పరిశీలన తర్వాత మరో నాలుగు నెలలకు వాస్తవ లెక్కలు తేలుస్తారు. బడ్జెట్ ప్రతిపాదనలతో పోలిస్తే 84.8% మేర ఖర్చుచేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత గడిచిన 5 ఏళ్లలో చివరి ఆర్థిక సంవత్సరంలోనే బడ్జెట్ అంచనాలతో పోలిస్తే ఖర్చు తక్కువ. ఇందుకు అనేక కారణాలున్నాయి. కేంద్రం నుంచి ఆశించిన నిధులు రాకపోవడమే కీలకం.

కేంద్రం నుంచి ఆశించిన నిధులేవీ?

2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.1,55,598.27 కోట్లు రెవెన్యూ ఆదాయంగా అధికారులు అంచనాలు వేశారు. కానీ రూ.1,14,684 కోట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇందులో కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో ఆశించిన సాయం దక్కలేదు. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తం మీద కేంద్రం నుంచి రూ.50,695 కోట్లు వస్తుందని ఆశించినా వచ్చింది రూ.19,457 కోట్లే. అదే సమయంలో రాష్ట్ర పన్నుల ఆదాయమూ తగ్గింది. రూ.65,535 కోట్లు ఆశిస్తే వచ్చింది రూ.58,125 కోట్లే. 2018-19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదన సమయంలో రెవెన్యూ మిగులు ఉంటుందని లెక్కించినా, అ అంచనాలు తప్పాయి. ప్రస్తుతం సవరించిన అంచనాల ప్రకారం.. రూ.11,654.90 కోట్లుగా రెవెన్యూ లోటు తేలింది.

అప్పులు: పాపం వారిదే..

ఈనాడు, అమరావతి: రాష్ట్రంపై గత ప్రభుత్వం అప్పుల భారాన్ని మోపిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శాసనమండలిలో ధ్వజమెత్తారు. మండలి ఛైర్మన్ ఎండీ అహ్మద్ షరీఫ్ అధ్యక్షతన శుక్రవారం సభ ప్రారంభమైన తర్వాత ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. '2014 జూన్‌లో రాష్ట్ర విభజన సమయంలో రూ.1,30,654.34 కోట్ల అప్పులను కేటాయించారు. ఇందులో విభజించని ప్రజా పద్దు రూ.33,477.52 కోట్లు ఉంది. అప్పటినుంచి ఈ ఏడాది మే వరకు రాష్ట్ర ప్రభుత్వ నికర అప్పు రూ.1,00,658.37 కోట్లకు చేరింది' అని మంత్రి వివరించారు. ప్రతిపక్ష నేత, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు దీనిని తోసిపుచ్చారు. ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ తాగునీటి సమస్యకు గత ప్రభుత్వమే కారణమన్నారు. ప్రతి దానికీ గత ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని యనమల చెప్పారు. వైకాపా నేతలు పాపం చేశారు కాబట్టే జైలుకి వెళ్లారని చెప్పారు. 'వివరాలన్నీ చెబితే తలకాయలు ఎక్కడ పెట్టుకోవాలో తెదేపా నేతలకు తెలియదు. మీరు పాపాలు చేశారు. మీరు జైలుకెళ్లే రోజులు దగ్గరలో ఉన్నాయి' అని బోస్ తిప్పికొట్టారు.

అనుమతులున్న ఇసుక రీచ్‌లు 57: పెద్దిరెడ్డి

రాష్ట్రంలో 153 ఇసుక రీచ్‌లకు గానూ అన్ని అనుమతులతో ఉన్నవి 57 అని, పట్టా భూముల్లో 80 చోట్ల ఉన్నాయని పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు.

విద్యారంభం కరిష్యామి!

గతేడాదితో పోల్చితే విద్యకు 34.87% నిధుల పెంపు

మొత్తం బడ్జెట్‌లో 14.31%

పేదలకు పిల్లల చదువులు భారంగా తయారవుతున్నాయి. వారి ఆదాయంలో 40% పైగా దీనికే వెచ్చించాల్సి వస్తోంది. దీంతో ఎంతోమంది అప్పుల పాలవుతున్నారు, ఆస్తులు అమ్ముకుంటున్నారు. అందుకే వీరికి అండగా నిలబడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక 'నవరత్నాల్లో' భాగంగా 'జగనన్న అమ్మఒడి' పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనికి తోడు 'జగనన్న విద్యా దీవెన' కింద బోధన రుసుముల పూర్తి చెల్లింపు; ప్రైవేటు వసతి గృహాల్లో ఉన్న వారికి ఏటా రూ.20 వేలు ఇవ్వాలని తలపెట్టారు. సకల సదుపాయాలతో సర్కారీ బడులకు కొత్త కళ తేవాలని నడుం కట్టారు.

రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసింది. కేటాయింపులు పెంచడంతోపాటు కొత్త పథకాలకు శ్రీకారం చుట్టింది. గతేడాదితో పోల్చితే ఈ బడ్జెట్‌లో 34.87% నిధులను పెంచింది. మొత్తం బడ్జెట్‌లో 14.31% నిధులను విద్యకు కేటాయించింది. సాంకేతిక విద్య మినహా మొత్తంగా విద్యకు రూ.32,618.46 కోట్లు ఇచ్చింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు విద్యార్థులను పంపే తల్లులకు 'జగనన్న అమ్మఒడి' కింద రూ.15 వేలు ఇవ్వనున్నారు. ఇందుకు బడ్జెట్‌లో రూ.6,455 కోట్లను కేటాయించారు. 'జగనన్న విద్యా దీవెన పథకం' కింద విద్యార్థులకు పూర్తిగా బోధన రుసుముల చెల్లింపు, భోజనం, ప్రయాణం, వసతి, పుస్తకాలకు ఏడాదికి ఒక్కో విద్యార్థికి రూ.20వేలు ఇవ్వనున్నారు. ఇందుకు రూ.4,962.3 కోట్లు కేటాయించారు. పాఠశాలల నిర్వహణకు ఇచ్చే నిధులను ఇక నుంచి వైఎస్ఆర్ పాఠశాలల నిర్వహణ నిధిగా పిలవనున్నారు. ఇందుకు రూ.160 కోట్లు చూపారు. పాఠశాలల్లో రెండేళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ ఏడాది రూ.1500 కోట్లు ఇచ్చారు. మధ్యాహ్న భోజనం సరఫరా బాధ్యతలను అక్షయపాత్రకు అప్పగించనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా కేంద్రీయ వంటశాలల నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయించారు.

ఉన్నత విద్యకు 6.59% నిధుల పెంపు

ఉన్నత విద్యకు గతేడాది కంటే 6.59% నిధులను అదనంగా నిధులను కేటాయించారు. గతేడాది రూ.2,834.90 కోట్లు కేటాయించగా.. ప్రస్తుతం రూ.3,021.63 కోట్లు కేటాయించారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి రూ.4.29 కోట్లు, డాక్టర్. బీఆర్.అంబేడ్కర్ సార్వత్రిక వర్సిటీకి రూ.4.53 కోట్లు కేటాయించారు. రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక వర్సిటీకి రూ.41.16 కోట్లు, జేఎన్‌టీయూ అనంతపురానికి రూ.60 కోట్లు, జేఎన్‌టీయూ కాకినాడకు రూ.38.35 కోట్లు కేటాయించారు. సాంకేతిక వర్సిటీలు మినహా యూజీసీ-2016 వేతన బకాయిలు, సీపీబ్రౌన్ మెమోరియల్ గ్రంథాలయం కడపతో కలిపి మొత్తం విశ్వవిద్యాలయాలకు రూ.1,418.96 కోట్లు కేటాయించారు.

సాంకేతిక విద్యకు తగ్గింపు..

సాంకేతిక విద్యాశాఖకు ఈసారి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గాయి. గతేడాది రూ.818.02 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.580.29 కోట్లే ఇచ్చారు.

ఉన్నత విద్యామండలికి రూ.2వేలు..

ఉన్నత విద్యామండలికి ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.0.02 లక్షలు కేటాయించారు. గతేడాదికి అసలు బడ్జెట్ కేటాయింపులే లేక పోగా ఈసారి రూ.2 వేలుగా చూపారు. 2017-18లో రూ.2.13 లక్షలు కేటాయించారు.

- ఈనాడు, అమరావతి

జగనన్న అమ్మఒడి..

పిల్లలను ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు బడులు, జూనియర్ కాలేజీల్లో చదివించే పేద తల్లికి ఏడాదికి రూ. **15,000** ప్రోత్సాహకం అందించనున్నారు.

➡ **ఉపయోగం:** చదువుల భారం తగ్గి పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతాయి. చదువు మధ్యలో మానెయ్యటం తగ్గుతుంది. బాలకార్మిక సమస్యా తగ్గుతుంది.

➡ **అమలు:** జనవరి 26 నుంచి

ఎంతమందికి? పిల్లలను బడులకు, కాలేజీలకు పంపిస్తున్న పేద తల్లులను ఎంపిక చేసేందుకు తెల్లరేషన్ కార్డు ఉండాలి.

10 వరకు చదువుతున్న విద్యార్థులు: **70** లక్షలు

ఇంటర్మీడియట్ విద్యార్థులు: **9.65** లక్షలు

తెల్లరేషన్‌కార్డు ఉన్న తల్లులు

బడి స్థాయిలో: సుమారు **36,88,952**

జూనియర్ కళాశాల స్థాయిలో: **6,11,048**

బడ్జెట్లో ఎంత కేటాయించారు: రూ. 6,455 కోట్లు

ఒక తల్లికి చదువుకునే పిల్లలు ఎంత మంది ఉన్నా రూ. **15** వేలే ఇస్తారు

జగనన్న విద్యా దీవెన: వసతికి ఊతం

ఇదీ పథకం..

విద్యార్థులు ప్రైవేటు వసతిగృహాల్లో ఉంటే ఏటా రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకూ ఖర్చవుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వసతి, ప్రయాణం, పుస్తకాలు, భోజనాలకు ప్రతి విద్యార్థికీ ఏటా రూ.20 వేలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకంలో ప్రైవేటు వసతి గృహాల్లోని వారికి దాదాపు సగం భారం తగ్గుతుంది.

దీన్ని ఇంటర్ విద్యార్థులకు వర్తింపజేస్తారు, ఈ మొత్తం తల్లులకే ఇస్తారు.

విద్యార్థుల సంఖ్య	ప్రస్తుత విధానంలో ఉపకారవేతనం	రూ.20 వేలు ఇస్తే ఖర్చు
15,35,911	రూ.1,226.05 కోట్లు	రూ. 1,810.56 కోట్లు

బడ్జెట్లో ఎంత కేటాయించారు? : రూ. **1,810.56** కోట్లు

బడులకు కొత్త కళ

ఏమిటి లక్ష్యం: రెండేళ్లల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలతో సర్కారీ బడులను కార్పొరేట్ బడులకు దీటుగా తయారు చెయ్యాలన్నది సంకల్పం.

ఎంత అవసరం?

ప్రభుత్వ పాఠశాలలు: **44,510**

మౌలిక సదుపాయాల కల్పనకు కావాల్సింది: **8,012** కోట్లు

బడ్జెట్లో ఎంత కేటాయించారు: రూ. **1,500** కోట్లు

బోధన రుసుముల పూర్తి చెల్లింపు

ఉన్నత విద్య చదువుతున్న పేద విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. దీన్ని పెంచేందుకు ప్రభుత్వం బోధన రుసుములను పూర్తిగా చెల్లించి, ఉన్నత చదువులను ప్రోత్సహించాలని తలపెట్టింది.

అమలు ఎలా? ప్రస్తుతం సాధారణ డిగ్రీ, వృత్తి విద్యా కోర్సులు విద్యార్థులకు కొన్ని పరిమితులతో 'బోధన రుసుముల చెల్లింపు' జరుగుతోంది. ఉదాహరణకు ఎస్సీ, ఎస్టీలు మినహా మిగతా వారు ఇంజినీరింగ్ వంటి కోర్సుల్లో పది వేలకు పైగా ర్యాంకులతో కన్వీనర్ కోటా కింద సీటు తెచ్చుకుంటే ఏడాదికి రూ.35 వేలు చెల్లిస్తున్నారు. మిగతా మొత్తాన్ని విద్యార్థులే భరిస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం రుసుము మొత్తాన్ని తానే చెల్లించి, ఉచితంగా ఉన్నత విద్య అందించేలా ఈ కొత్త పథకం తెచ్చింది.

బడ్జెట్లో ఎంత కేటాయించారు?: రూ. 3,151.74 కోట్లు

విద్యార్థులు	15,35,911
చెల్లింపులు	రూ. 2,070.61 కోట్లు

నిజమా.. కల్పితమా!

గత ప్రభుత్వ రెండంకెల వృద్ధి రేటు లెక్కలపై ఆర్థిక మంత్రి బుగ్గన వ్యాఖ్య

ఈనాడు, అమరావతి: 'ఆర్థిక వ్యవస్థలో రెండంకెల వృద్ధి సాధించామని గత ప్రభుత్వం ప్రకటించుకుంది. ఈ అంకెలు నిజమైనవా? కల్పితమా? అనేది నిర్ధరించుకుంటున్నాం. రెండంకెల వృద్ధి రేటే ఉంటే అన్నదాత ఆకలితో ఎందుకున్నాడు? అక్కాచెల్లెళ్లలో విషాదం, యువతలో అసంతృప్తి ఎందుకుంది? మార్పు కోసం ఇంత భారీగా, నిర్ణయాత్మక ఓటు ఎలా వేశారనేది ఆలోచించాలి. రెండంకెల వృద్ధిరేటు నిజమే అయితే మాత్రం.. వృద్ధిని వక్రీకరించి ధనవంతులను మరింత ధనవంతులుగా, పేదలను మరింత పేదలుగా చేసి వృద్ధి వనరులను కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం చేశారని అర్థం' అని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా అత్యంత దయనీయ ఆర్థిక స్థితిని తమ ప్రభుత్వం వారసత్వంగా పొందిందని వివరించారు. రాష్ట్ర విభజనినాటికి ఉన్న అప్పు అయిదేళ్లలో విపరీతంగా పెరిగిందని వ్యాఖ్యానించారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికిగాను రాష్ట్ర శాసనసభలో శుక్రవారం ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. శాసనసభలో ఆర్థిక మంత్రి మాట్లాడుతూ.. 2022నాటికి రాష్ట్రంలో లేమితనం లేకుండా చూడాలని భావిస్తున్నామన్నారు. రాష్ట్రానికున్న పరిమిత ఆదాయాల్లోనే ఖర్చులు భరించాల్సి ఉందని, ఈ ప్రభుత్వానికి ప్రాప్తించిన ద్రవ్య స్థితి వల్ల కఠిన ప్రత్యామ్నాయాలను చూసుకోవాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. తొలుత నిర్ణయించుకున్న ప్రకారం ఉదయం 11 గంటలకే బడ్జెట్ ప్రవేశపెట్టాల్సి ఉన్నప్పటికీ రాహుకాలం ఉండటంతో మధ్యాహ్నం 12.22 గంటలకు ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రసంగంలో ఆయన సంస్కృత శ్లోకాలు, గాంధీజీ, అంబేడ్కర్, ఠాగూర్ సూక్తులు, చాణక్య నీతి సూత్రాలను మేళవించారు.

"విభజన తర్వాత తెలంగాణ రాష్ట్ర తలసరి రాబడి రూపాయి ఉండగా, ఏపీ తలసరి రాబడి సుమారు 60 పైసలకు పడిపోయింది. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని ప్రధాని, కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. సింగపూర్ అంతర్జాతీయ విమానాలకు లోటు భర్తీ నిధి (వయబిలిటీ గ్యాప్ ఫండింగ్) సమకూర్చాలా? లేదా వేలాది తల్లులు, పిల్లలకు మెరుగైన పోషకాహారాన్ని అందించాలా? అంటే మొదటి దానికి మా ప్రాధాన్యం ఉండదు. మా మనస్సాక్షి, ఎంపికలు స్పష్టంగా ఉన్నాయి. గోదావరి జలాలను శ్రీశైలానికి తీసుకొచ్చి రాయలసీమకు నీటినందిస్తాం. కృష్ణా ఆయకట్టును స్థిరీకరిస్తాం. ప్రతి గ్రామం, కుటుంబానికి తాగునీటిని సమకూరుస్తాం. పోలవరం, వంశధార, గాలేరు నగరి, హంద్రీనీవా, వెలిగొండ, ఇతర ముఖ్యమైన ప్రాజెక్టులు.. ప్రత్యేకించి ఉత్తరాంధ్రలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ బోధనను ప్రవేశపెడతాం. తెలుగును తప్పనిసరి చేసి భాష ప్రాముఖ్యాన్ని కొనసాగిస్తాం. మెట్రిక్ అనంతర కోర్సులు చదివే విద్యార్థుల కోసం జగనన్న విద్యాదీవెన పథకాన్ని అమలు చేస్తాం. అన్ని కులాలవారికి పూర్తి ఫీజు రీఎంబర్స్‌మెంట్ సమకూరుస్తాం. ప్రఖ్యాత శాస్త్రవేత్త ఎడిసన్‌ను ఆయన తల్లి తీర్చిదిద్దింది. ఈ స్ఫూర్తితోనే అమ్మ ఒడి పథకాన్ని రూపొందించాం. పథకం ఆలోచనంతా జగన్‌దే. అందుకే ఈ పథకానికి 'జగనన్న అమ్మ ఒడి పథకం'గా పేరు పెట్టాం. మేము ఎన్నోసార్లు బతిమిలాడాక ఆయన పేరు పెట్టేందుకు అంగీకరించారు. అమ్మ ఒడి పథకాన్ని ఇంటర్ విద్యార్థులకూ వర్తింపజేస్తాం. నెలకు రూ.40 వేల ఆదాయం కలిగిన మధ్యతరగతి కుటుంబాలకూ ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తాం. ప్రతి మండలానికి 108 అంబులెన్స్ ఉండేలా చూస్తాం. రెండేళ్లలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను ఉత్తమ కార్పొరేట్ ఆసుపత్రులుగా మారుస్తాం" అని ఆర్థిక మంత్రి బుగ్గన వివరించారు.

రంగాల వారీగా బడ్జెట్ కేటాయింపులు

పథకం	2018–19	2019–20	పెరుగుదల శాతం
	(కేటాయింపులు రూ.కోట్లల్లో)		
ఆర్థిక సేవలు	**67,917.56**	**86,185.63**	**26.90**
వ్యవసాయం, అనుబంధ సేవలు	12,355.32	20,677.08	67.35
గ్రామీణాభివృద్ధి	20,815.98	29,329.98	40.90
నీటి పారుదల, వరద నియంత్రణ	16,978.23	13,139.05	-22.61
విద్యుత్	4,193.30	6,861.03	63.62
పారిశ్రామిక ఖనిజాలు	4,021.47	3,986.05	-0.88
రవాణా	4,653.74	6,157.25	32.31
సాధారణ పర్యావరణ సేవలు	4,890.62	6,025.27	23.20
సామాజిక సేవలు	**67,032.91**	**75,465.02**	**12.58**
సాధారణ విద్య	24,185.75	32,618.46	34.87
క్రీడలు, యువజన సేవలు	1,635.44	329.68	-79.84
సాంకేతిక విద్య	818.02	580.29	-29.06
కళలు, సంస్కృతికం	94.98	77.67	-18.22
వైద్యం	8,463.51	11,399.23	34.69
నీటి సరఫరా, పారిశుద్ధ్యం	2,623.23	2,234.77	-14.81
గృహ నిర్మాణం	3,679.53	3,617.37	-1.69
పట్టణాభివృద్ధి	7,740.80	6,587.09	-14.90
సమాచార, పౌర సంబంధాలు	224.81	191.02	-15.03
సంక్షేమం	13,722.98	14,142.99	3.06
కార్మిక, ఉపాధి కల్పన	814.83	978.58	20.10
సామాజిక భద్రత, సంక్షేమం	3,029.03	2,707.86	-10.60
సాధారణ సేవలు	**56,113.14**	**66,324.35**	**18.20**
మొత్తం	**1,91,063.61**	**2,27974.99**	**19.32**

దేనికెంత? (రూ. కోట్లలో)

న్యాయశాఖ	శాసన సభ	పురపాలిక, పట్టణాభివృద్ధి	మైనార్టీ సంక్షేమం	యువజన, క్రీడలు	ప్రణాళిక
937.37	121.17	6,587.09	952.47	604.55	1,439.55



నవరత్న సమేత

రాష్ట్ర బడ్జెట్ 2019-20

ఈ ప్రభుత్వం చాణుక్యుని 'చతుర్విధ వికాసాల' మాదిరిగా ఉంటుంది. అవి..

" అనుకున్న లక్ష్యాన్ని సాధించడం
సాధించినదాన్ని సుస్థిరపర్చుకోవడం
సుస్థిపరిచిన దాన్ని విస్తరించడం
విస్తరించినదాన్ని నలుగురికీ ఉపయోగపడేలా తీర్చిదిద్దడం.

వైఎస్సార్ కల్యాణ కానుక

వైఎస్సార్ కల్యాణ కానుకకు బడ్జెట్‌లో **రూ.716.26** కోట్లు కేటాయించారు. మైనారిటీ యువతుల వివాహాలకు సాయం అందించే 'దుల్హన్ పథకం'.. 'వైఎస్సార్ షాదీకా తోఫా'గా మార్పు చేశారు.

ప్రస్తుత పరిస్థితి

ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతుల వివాహానికి రూ.**50** వేలు, బీసీలకు రూ.**35** వేల సాయం

ఎన్నికల హామీ

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతుల వివాహానికి రూ.లక్ష, బీసీలకు రూ.**50** వేలు సాయం

కులాంతర వివాహాలకు ప్రోత్సాహం: దంపతులకు రూ. లక్ష.

అవసరం ఇలా

గతేడాది ఆయా వర్గాలలో 83వేల వివాహాలు జరిగాయి. వీరికి రూ.320 కోట్ల మేర సాయం ఇచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 1,27,858 వివాహాలు జరిగే అవకాశం ఉందని, ఇందుకు రూ.716.26 కోట్లు అవసరమని అంచనా.

స్థానిక నవోదయం

గ్రామీణ, స్థానిక సంస్థల్లో సరికొత్త పాలనకు ప్రభుత్వం తెర తీసింది. ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే వాలంటీర్ల వ్యవస్థ, అక్టోబరు 2 నుంచి అమల్లోకి వచ్చే గ్రామ, వార్డు సచివాలయాల కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. రెండు వేల జనాభాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్న గ్రామ సచివాలయాల్లో లక్ష, అయిదు వేల జనాభాకు ఒకటి చొప్పున ప్రారంభిస్తున్న వార్డు సచివాలయాల్లో 42 వేల మందికి రాష్ట్రంలో కొత్తగా శాశ్వత ఉద్యోగ అవకాశాలు కల్పించబోతోంది. దీనికి ఈ నెల 15న ఉద్యోగ ప్రకటన జారీ చేయనున్నారు. సేవల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఉద్యోగులే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించే విధానానికి శ్రీకారం చుడుతున్నారు.

ఎన్నికలకు రూ.149.57 కోట్లు: పురపాలక, పంచాయతీ ఎన్నికలకు బడ్జెట్‌లో ప్రభుత్వం రూ. 149.57 కోట్లు కేటాయించింది. ఇందులో పురపాలక సంఘాలకు రూ. 60 కోట్లు, పంచాయతీలకు రూ. 89.57 కోట్లు సమకూర్చారు.

మైనారిటీలకు మెజారిటీ నిధులు

మైనారిటీలకు ప్రభుత్వం మెజార్టీ స్థాయిలో నిధులు కేటాయించింది. వారి ఆర్థిక పురోభివృద్ధికి చేయూత ఇచ్చేలా నిధులు మంజూరు చేసింది. తొలిసారిగా వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా వాటి పరిరక్షణ కోసం రూ. 20 కోట్లు.. వక్ఫ్ ఆస్తుల రీ సర్వేకు రూ. 20 కోట్లు కేటాయించింది. వైఎస్సార్ షాదీకా తోఫా పేరుతో మైనారిటీ యువతుల వివాహాలకు ఆర్థిక సాయాన్ని రూ.లక్షకు పెంచుతూ.. అందుకుగానూ రూ. 100 కోట్లు కేటాయించింది. ఇమామ్/మౌజమ్‌లకు గౌరవ వేతనం రూ. 15 వేలు పెంపునకు అనుగుణంగా రూ. 100 కోట్లు ఇచ్చింది. మొత్తంగా మైనారిటీల ఆర్థిక పురోగతికి రూ. 952. 47 కోట్లు కేటాయించింది.

ఇంటికే కోటా బియ్యం

ప్రజాపంపిణీ వ్యవస్థలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. లబ్ధిదారులకు పూర్తి ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో అడుగులు వేస్తోంది. సెప్టెంబరు 1 నుంచి వాలంటీర్ల ద్వారా తెల్ల కార్డుదారుల ఇంటికే రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తారు. 5, 10, 20 కిలోల సంచుల్లో బియ్యాన్ని అందిస్తారు. ఇందుకోసం ప్రతి నెలా 2.07 కోట్ల సంచులు అవసరమవుతాయని గుర్తించారు. దీనికోసం బడ్జెట్‌లో రూ. 4,429.43 కోట్లు కేటాయించారు.

ఎమ్మెల్యేలకు ఐప్యాడ్‌లు

బడ్జెట్ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రభుత్వం ఐప్యాడ్‌లను అందజేసింది. ప్రతీ సభ్యుడికీ ఒక ఐప్యాడ్, బడ్జెట్ సంక్షిప్త ప్రతి, బడ్జెట్ పూర్తి వివరాలను లోడ్ చేసిన పెన్‌డ్రైవ్, సామాజిక ఆర్థిక సర్వే పుస్తకం కలిపి ఒక ప్రత్యేక బ్యాగ్‌లో అధికారులు అందజేశారు.

గూడు కట్టి.. నీడనిచ్చి..!

ఈనాడు డిజిటల్, అమరావతి: పేదలకు గూడు కట్టించి నీడ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కష్టజీవులకు ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు అడుగులు వేసింది. వచ్చే ఏడాది మార్చి 25న ఉగాది రోజున మహిళల పేరుమీద 25 లక్షల ఇళ్లపట్టాలను ఇస్తామంటూ ప్రకటించింది. ఈ స్థలాల్లో నిర్మించిన ఇళ్లను పేదలు వారి అవసరాల కోసం తనఖా పెట్టుకునే వెసులుబాటు కల్పించింది. స్థల సేకరణకు బడ్జెట్‌లో రూ. 8,615 కోట్లు కేటాయించింది. వైఎస్సార్ గృహవసతి పథకం కింద గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి రూ.5వేల కోట్లు, వైఎస్సార్ పట్టణ గృహనిర్మాణ పథకానికి రూ. వెయ్యి కోట్లు మంజూరుచేసింది. ఇవేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టే గృహనిర్మాణ పథకాలకు రూ. 2,105 కోట్లు కేటాయించింది. ఇలా మొత్తం గృహ నిర్మాణాలకు రూ. 16,720 కోట్లు కేటాయించినట్లయింది. ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నట్లుగా 300 చదరపు అడుగుల వరకు ఉండే గృహాలకు సంబంధించి పట్టణ గృహనిర్మాణ లబ్ధిదారుల రుణభారాన్ని మాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయంతో 1.50 లక్షల మంది లబ్ధిదారులకు సంబంధించిన రూ. 3,975 కోట్లు బకాయిలు రద్దుకానున్నాయి. గత ప్రభుత్వం పట్టణాల్లో 300 చదరపు అడుగులు, 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగులతో ఇళ్ల నిర్మాణం చేపడుతోంది. వీటిలో 1.50 లక్షల మందికి 300 చదరపు అడుగుల ఇళ్ల నిర్మాణాలు మంజూరయ్యాయి. ఒక్కో ఇంటిపై రూ. 2.65 లక్షలు బకాయిలు ఉన్నాయి.

సొంత ఇంటి కల తీరాలి!

'నవరత్నాల'లో ఒకటైన పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉగాదికి **25** లక్షల మందికి సెంటున్నర చొప్పున నివాస స్థలం పట్టాలు అందజేయడానికి సిద్ధమవుతోంది. స్థలం ఎక్కడుందో పక్కాగా తెలిసేలా కొలతలు వేసి, మహిళల పేరుతో రిజిస్ట్రేషన్ చేయాలని సీఎం స్పష్టం చేశారు. పట్టణాలు, నగరాల్లో స్థలానికి బదులు.. అపార్టుమెంట్లు (జి+3) కట్టించి ఫ్లాట్‌ను ఇస్తారు.

ఉగాది రోజు **25** లక్షల మందికి స్థలాల పంపిణీ



వాలంటీర్ల ద్వారా లబ్ధిదారుల గుర్తింపు

రెవెన్యూ శాఖ నివేదిక ప్రకారం.. మార్చి చివరి నాటికి ఇంటికోసం **11.87** లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో **8.38** లక్షల మంది అర్హులని గుర్తించారు. ఇల్లు లేని పేదలు ఇంకా లక్షల్లో ఉంటారని ప్రభుత్వం అంచనా. గ్రామ వాలంటీర్లతో దీనిపై క్షుణ్ణంగా సర్వే చేయించి అర్హులను గుర్తించాలని నిర్ణయించింది.

బడ్జెట్ కేటాయింపులు

రూ. 5 వేల కోట్లు	వైఎస్ఆర్ గృహ వసతి
రూ.1370 కోట్లు	ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పట్టణ)
రూ.1280 కోట్లు	వెనుకబడిన వర్గాలకు గృహాలు (వైఎస్సార్ గృహాల పథకం)
రూ. 1000 కోట్లు	వైఎస్సార్ అర్బన్ హౌసింగ్

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) - 565.25 కోట్లు
ఆర్థిక సంస్థలకు రుణాల చెల్లింపులకు సహకారం - 250 కోట్లు

మొత్తం బడ్జెట్ కేటాయింపులు : రూ. 16,720 కోట్లు

అమరావతికి రూ.615 కోట్లు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 615 కోట్లు కేటాయించింది. గత ప్రభుత్వం అమరావతి భూసమీకరణ విభాగం కింద.. రైతులకు వార్షిక కౌలు చెల్లించేందుకు గత బడ్జెట్‌లో రూ. 166. 53 కోట్లు కేటాయించగా.. ఈ బడ్జెట్‌లో ఆ ప్రస్తావన లేదు. రాజధానిలో అత్యవసర మౌలిక వసతుల అభివృద్ధికి రూ. 500 కోట్లు ప్రత్యేకంగా కేటాయించింది. ప్రపంచ బ్యాంకు నుంచి వస్తుందనుకుంటున్న రుణానికి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌గా... గత ప్రభుత్వం అమరావతి రాజధాని అభివృద్ధి ప్రాజెక్టు కేటగిరీలో గత బడ్జెట్‌లో రూ. 457 కోట్లు కేటాయించింది. ప్రపంచబ్యాంకు రుణం వచ్చే పరిస్థితులు లేని నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం ఈ కేటగిరీలో రూ. 50 కోట్లు కేటాయించింది. భూమిలేని పేదలకు పింఛన్ల చెల్లింపునకు రూ. 65 కోట్లు కేటాయించింది. అమరావతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకి గత ప్రభుత్వంలానే, ఈ ప్రభుత్వం కూటా కేటాయింపులు జరపలేదు.

బాపూజీ చూపిన వెలుగులో..



మన దేశం 2022లో 75వ స్వాతంత్ర్య వేడుకలను జరుపుకొంటోంది. అప్పటికి రాష్ట్రం ఏ స్థాయిలో అభివృద్ధి సాధించాలనేది తమ ప్రభుత్వం ముందున్న బృహత్తర లక్ష్యమని ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పారు. తన మొట్టమొదటి బడ్జెట్‌లో ఆయన గాంధీ మహాత్ముడి బోధనలను పలుమార్లు ప్రస్తావించారు. "ఈ దేశ నిర్మాణంలో తనకు కూడా ఒక పాత్ర ఉందని ఈ దేశంలోని ప్రతి పేదవ్యక్తి అర్థం చేసుకోవాలి. ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలు లేకుండా సమాజంలో ప్రతి వ్యక్తి నివసించగలిగేలా ఉండాలి" అని మహాత్మాగాంధీ అన్నారంటూ, తాను సమర్పిస్తున్న బడ్జెట్ గాంధీజీ లక్ష్యాన్ని సాధించే దిశలో మొదటి అడుగని చెప్పారు. "నేను సత్యానికి తప్ప దేనికీ లొంగి ఉండను. సత్యం కాక నేను సేవించవలసిన మరే దేవుడూ లేడు" అన్న బాపూ మాటలతో పాటు ఏడు తప్పులు చేయకుండా ప్రజలను నిలువరించాలని చెప్పిన విషయాన్నీ ప్రస్తావించారు.

గ్రామ సచివాలయాల ఏర్పాటును ప్రస్తావించే సమయంలో మరోసారి బాపూజీని ఆయన గుర్తుచేసుకున్నారు. గ్రామ సచివాలయంలో లక్ష కొత్త ఉద్యోగాలు, వార్డు సచివాలయంలో 15వేల కొత్త ఉద్యోగాలు వస్తాయని.. ఈ కార్యక్రమాన్ని 2019లోనే బాపూజీ 150వ జయంతి అయిన అక్టోబరు 2వ తేదీన ప్రారంభిస్తామని చెప్పారు. మన దేశంపై గాంధీజీ ప్రభావం కొనసాగేందుకు ఇది ఆయనకు ఒక నివాళి అన్నారు.

అంబేడ్కర్, ఠాగూర్ కూడా..

ఇక రాజ్యాంగనిర్మాత అంబేడ్కర్ చెప్పిన మాటను మరో సందర్భంలో ప్రస్తావించారు. "మహిళల పురోభివృద్ధిని కొలబద్దగా చేసుకుని మాత్రమే నేను ఏ సమాజ పురోగతినైనా అంచనా వేస్తాను" అని అంబేడ్కర్ అన్నారని, అందుకే సింగపూర్ విమానాలకు వీజీఎఫ్ సమకూర్చాలా లేదా వేలాదిమంది తల్లులు, పిల్లలకు మెరుగైన పోషకాహారం అందించాలా అనే విషయంలో మొదటిదాన్ని వదిలేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. తమ మనస్సాక్షి, ఎంపికలు స్పష్టంగా ఉన్నాయన్నారు. "ఏదైనా పొందేందుకు మనం సామర్థ్యాన్ని కల్పిస్తే మనకు చెందిన ప్రతీదీ మన వద్దకు వస్తుంది" అన్న విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ బోధనలను ప్రస్తావించారు.

అదిగో 'నవ'లోకం

నవరత్నాలతో అన్ని వర్గాల సర్వతోముఖాభివృద్ధి

వివక్ష లేకుండా అర్హులందరికీ పథకాలు.. సామాజిక, ఆర్థిక సర్వేలో ప్రభుత్వం వెల్లడి

ఈనాడు, అమరావతి: అవినీతి రహిత, సుస్థిర పాలన అందించడం ద్వారా సమాజంలో అట్టడుగున ఉన్న, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 'నవరత్నాలు' పేరుతో అమలు చేస్తున్న సమీకృత పథకం ద్వారా దీన్ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేసింది. కుల, మత, వర్గ, రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులందరికీ పథకాలను అందించి వివక్షకు తావులేకుండా చేస్తామని స్పష్టం చేసింది. 2018-19 సంవత్సరానికి రాష్ట్ర సామాజిక, ఆర్థిక సర్వేను ప్రభుత్వం శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టింది.

జీఎస్‌డీపీ వృద్ధి 11.02 శాతం

★ 2011-12 స్థిర ధరల ప్రకారం 2018-19లో (అడ్వాన్స్‌డ్ ఎస్టిమేట్స్) రాష్ట్ర స్థూలోత్పత్తి (జీఎస్‌డీపీ) రూ. 6,80,332 కోట్లు. 2017-18లో అది రూ. 6,12,793 కోట్లుగా ఉంది. 11.02 శాతం వృద్ధి నమోదైంది. అదే సమయంలో జాతీయ స్థాయిలో జీడీపీ వృద్ధి 7 శాతమే.

★ 2018-19 సవరించిన అంచనాల ప్రకారం సొంత పన్నుల ద్వారా రాష్ట్రానికి వచ్చే ఆదాయం 2017-18తో పోలిస్తే రూ. 49,813 కోట్ల నుంచి రూ. 58,125 కోట్లకు పెరిగింది. 2018-19లో రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 4,391 కోట్ల పన్నేతర ఆదాయం, కేంద్రం నుంచి రూ. 52,963 కోట్లు సమకూరింది.

★ రాష్ట్ర మొత్తం వ్యయాలు (వేజెస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ మినహాయించి) 2017-18లో రూ. 1,37,486 కోట్లు ఉండగా, 2018-19లో రూ. 1,48,697 కోట్లకు చేరింది.

తగ్గిన ఆహార ధాన్యాల ఉత్పత్తి

2017-18లో 42.06 లక్షల హెక్టార్లలో ఆహార పంటల్ని సాగు చేయగా, 2018-19లో 40.26 లక్షల హెక్టార్లకు తగ్గింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి 167.22 లక్షల టన్నుల నుంచి 151.12 లక్షల టన్నులకు తగ్గిందని అంచనా. 2010-11లో 76.21 లక్షలుగా ఉన్న భూ కమతాల సంఖ్య 2015-16కి 85.24 లక్షలకు పెరిగింది. సగటున ఒక భూ కమతం పరిమాణం 1.06 హెక్టార్ల నుంచి 0.94 హెక్టార్లకు పడిపోయింది. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం వడ్డీలేని పంట రుణాలు, పావలా వడ్డీ పథకాన్ని ప్రకటించింది. 'వడ్డీలేని రుణాలు' పథకంలో భాగంగా 2018-19లో 6,56,303 మంది రైతులకు రూ. 122. 84 కోట్ల వడ్డీ రాయితీని విడుదల చేసింది.

మత్స్యపరిశ్రమలో అగ్రస్థానం

రొయ్యలు, చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటిస్థానంలో ఉంది. దేశంలో మొత్తం రొయ్యల ఉత్పత్తిలో 65 శాతం మన రాష్ట్రంలోనే జరుగుతోంది. భారతదేశంలో 24 శాతం, ప్రపంచంలో 1.61 శాతం చేపల ఉత్పత్తి ఏపీ నుంచే జరుగుతోంది. ఈ రంగం 14.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది.

★ 2017-18తో పోలిస్తే 2018-19లో ప్రభుత్వానికి గనుల ద్వారా వచ్చే ఆదాయం 14.71 శాతం పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే సెప్టెంబరు నుంచి కొత్త ఇసుక విధానాన్ని అమల్లోకి తెస్తోంది.

★ రాష్ట్రం నుంచి 2017-18లో రూ. 84,640.56 కోట్ల విలువైన ఎగుమతులు జరిగాయి. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 98,983. 95 కోట్లకు పెరిగాయి.

★ రాష్ట్రం ప్రస్తుతం 308.703 టీఎంసీల జలాలను సాగుకు వినియోగించుకుంటోంది. నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే మరో 468.688 టీఎంసీలు అందుబాటులోకి వస్తాయి.

★ 2018-19లో 86,430 కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. 'నవరత్నాలు' కింద త్వరలో రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ పథకాన్ని అమల్లోకి తెస్తోంది.

★ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద 942 రకాల వైద్యసేవలే ఉచితంగా అందజేస్తుండగా, ఈ సంఖ్యను 1059కి పెంచారు.

2018-19లో పరిశ్రమల ప్రగతి

పరిశ్రమలు	కొత్తగా ఏర్పాటైనవి	పెట్టుబడి	ఉపాధి పొందినవారు
భారీ, మెగా	44	రూ. 16,925. 08 కోట్లు	14,130
సూక్ష్మ, చిన్న, మధ్యతరహా	10,068	రూ. 3,443. 57కోట్లు	93,240

పెరిగిన తలసరి ఆదాయం

గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా పెరిగింది. ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే జాతీయ స్థాయిలో తలసరి ఆదాయం సగటు కంటే, రాష్ట్రంలో తలసరి ఆదాయం చాలా మెరుగ్గా ఉంది.

సంవత్సరం	జాతీయ (రూ.)	రాష్ట్ర (రూ.)
2014-15	86,647	93,903
2015-16	94,797	1,08,002
2016-17	1,04,659	1,24,401
2017-18	1,14,958	1,43,935
2018-19	1,26,699	1,64,025

వసూళ్లు (రూ.కోట్లలో)



ఖర్చులు (రూ.కోట్లలో)



రెవెన్యూ వసూళ్లు (రూ.కోట్లలో)



రెవెన్యూ వ్యయం (రూ.కోట్లలో)



దేనికెంత.. (రూ. కోట్లలో)

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	31,564.75
రెవెన్యూ	9,496.93
రియల్ టైమ్ గవర్నెన్స్	145.75
నైపుణ్యాభివృద్ధి, ఇన్నోవేషన్	363.42
సాంఘిక సంక్షేమం	5,919.07
రవాణా, రహదారులు, భవనాలు	6,202.98

మిడిల్‌ఆర్డర్‌లో కావాలొక మంచి బ్యాట్స్‌మన్

లండన్: టీమ్ ఇండియాకు ఒక మంచి మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ అవసరం ఉందని అంటున్నాడు కోచ్ రవిశాస్త్రి. ప్రపంచకప్‌లో మిడిల్ ఆర్డర్ పేలవ ప్రదర్శన నేపథ్యంలో అతడు ఈ వ్యాఖ్యలు చేశాడు. సెమీఫైనల్లో ఓడినా టోర్నీలో ప్రదర్శనకు కోహ్లీసేన గర్వపడాలని అన్నాడు. ఓ ఇంటర్వ్యూలో ప్రపంచకప్‌కు సంబంధించి చాలా విషయాల గురించి మాట్లాడాడు. ఏమన్నాడంటే..

నాలుగులో సరైనోడు అవసరం

మిడిల్ ఆర్డర్ మంచి బ్యాట్స్‌మన్ ఉండుంటే బాగుండేదని ఇప్పుడనిపిస్తోంది. ఇప్పుడిక భవిష్యత్తు కోసం అలాంటి ఆటగాణ్ని అన్వేషించాలి. ఆ స్థానం మాకు ఎల్లప్పుడూ సమస్యలు సృష్టిస్తూనే ఉంది. కానీ పరిష్కారాన్ని కనుక్కోలేకపోయాం. ప్రపంచకప్‌లో ముందు కేఎల్ రాహుల్‌ను ఆ స్థానానికి అనుకున్నాం. కానీ ధావన్ గాయపడ్డాడు. విజయ్ శంకర్ ఉన్నాడనుకుంటే అతడూ గాయపడ్డాడు. మా చేతుల్లో ఏమీ లేకపోయింది. మయాంక్ జట్టుతో చేరే సరికి పెద్దగా సమయం లేకపోయింది. సెమీఫైనల్‌కు ముందు ఇంకో మ్యాచ్ ఉంటే మయాంక్‌ను కచ్చితంగా నాలుగో స్థానంలో ఆడించే వాళ్లం.

ఓటమికి అదే ఓ కారణమే..

వర్షం కారణంగా సెమీఫైనల్ రెండో రోజులోకి వెళ్లడం కూడా మమ్మల్ని దెబ్బతీసింది. మంగళవారం ఉన్న ఊపును మేం కోల్పోయాం. అది మంచి పరిస్థితి కాదు. ఆటలో కొన్నిసార్లు ఇలా జరుగుతుంది.

జడేజా అదరహో..

సెమీఫైనల్లో జడేజా అసాధారణంగా బ్యాటింగ్ చేశాడు. అతడు సహజ ప్రతిభావంతుడు. తాను ఎంత మంచి ఆటగాడో, జట్టుకు ఎంత సమతూకాన్ని తేగలడో జడేజా గ్రహించినందుకు సంతోషంగా ఉంది. వచ్చే రెండేళ్లలో అతడు మరో స్థాయికి వెళ్తాడు.

ఆ రనౌట్ కాకుంటే..

ధోని చాలా గొప్పగా ఆడాడు. చాలా ప్రశాంతంగా కనిపించాడు. దురదృష్టవశాత్తు రనౌట్ కాకుండా ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. జట్టును ఎలా గెలిపించాలనే విషయంపై అతడు ఓ లెక్కతో ఉన్నాడు. జట్టును గెలిపించాలని తపించాడు.

ధోని ఏడులోనే ఎందుకంటే..

అది జట్టు నిర్ణయం. అందరూ మద్దతు తెలిపారు. ధోని త్వరగా వచ్చి ఔటైతే చాలా ఇబ్బంది. ఎవరూ ఆ పరిస్థితిని కోరుకోరు. అదే జరిగితే ఛేదనలో భారత్ కథ చాలా ముందే ముగిసేది. అతడి అనుభవం తర్వాత అవసరం అనుకున్నాం. అతడో గొప్ప ఫినిషర్. ధోనీని ఆ విధంగా పూర్తిగా ఉపయోగించుకోకుంటే అంతకన్నా నేరం ఉండేది కాదు. అతణ్ని ఏడో స్థానంలో పంపే విషయంలో జట్టులో అందరిదీ ఒకే అభిప్రాయం. నాలుగో స్థానంలో వచ్చిన రిషబ్ పంత్ చక్కగా బ్యాటింగ్ చేశాడు. అతడు ముందు ముందు ఇంకా నేర్చుకుంటాడు. పంత్, పాండ్య ఔటయ్యాక కూడా భారత్ గొప్పగా పోరాడింది.

ఫెదరర్ మళ్లీ వచ్చాడు

చెల్లుకు చెల్లు.. ఎర్రమట్టి (ఫ్రెంచ్ ఓపెన్)లో తనను ఓడించిన రఫెల్ నాదల్‌పై రోజర్ ఫెదరర్ పచ్చగడ్డి (వింబుల్డన్)పై ప్రతీకారం తీర్చుకున్నాడు. ఫామ్‌ను కొనసాగిస్తూ ఈ దిగ్గజ ఆటగాడు వింబుల్డన్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. మరో సెమీస్‌లో సెర్బియా స్టార్ జకోవిచ్.. బటిస్టా అగట్‌పై గెలిచి తుది సమరానికి అర్హత సాధించాడు. ఆదివారం జరిగే టైటిల్ పోరులో రోజర్.. జకోతో తలపడనున్నాడు.

రఫాపై గెలిచి ఫైనల్లో ప్రవేశం • జకోవిచ్‌తో టైటిల్ పోరు

లండన్: ప్రియమైన వింబుల్డన్‌లో స్విస్ స్టార్ రోజర్ ఫెదరర్ మరోసారి టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. గ్రాస్‌కోర్టులో చిరకాల ప్రత్యర్థి రఫెల్ నాదల్‌పై మరోసారి తన ఆధిపత్యాన్ని నిరూపించుకున్నాడు. శుక్రవారం పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ఫెదరర్ 7-6 (7-3), 1-6, 6-3, 6-4తో నాదల్‌పై విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌లో తొలి రెండు సెట్లు మాత్రమే నాదల్.. రోజర్‌కు పోటీ ఇవ్వగలిగాడు. తొలి సెట్ ఎనిమిదో గేమ్‌లో ఫెదరర్ సర్వీసును బ్రేక్ చేసే అవకాశాన్ని సంపాదించాడు రఫా. అయితే అద్భుతంగా పోరాడిన రోజర్ 21 షాట్ల ర్యాలీతో బ్రేక్ పాయింట్‌ను కాచుకుని 4-4తో స్కోరు సమం చేశాడు. ఇద్దరు హోరాహోరీ ఆడడంతో సెట్ టైబ్రేకర్‌కు మళ్లింది. టైబ్రేకర్‌లో తన శైలి ఒంటిచేతి బ్యాక్ హ్యాండ్ షాట్లతో మెరిపించిన రోజర్.. సెట్‌ను గెలుచుకున్నాడు. అయితే రెండో సెట్లో నాదల్ విజృంభించాడు. రెండుసార్లు రోజర్ సర్వీసును బ్రేక్ చేసిన రఫా.. 6-1తో సెట్ గెలిచాడు. కానీ మూడో సెట్లో ఫెదరర్ పుంజుకున్నాడు. మూడో సెట్ నాలుగో గేమ్‌లో నాదల్ సర్వీస్ బ్రేక్ చేసిన ఫెదరర్ 3-1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అదే జోరు కొనసాగిస్తూ అతను 6-3తో సెట్ గెలుచుకున్నాడు. నాలుగో సెట్లోనూ ఫెదరర్‌దే హవా. సర్వీసు నిలబెట్టుకోవడానికి రఫా చాలా తంటాలు పడ్డాడు. తన బ్యాక్‌హ్యాండ్ రిటర్న్‌లతో రఫాను అలిసిపోయేలా చేసిన రోజర్.. మూడో గేమ్‌లో బ్రేక్ సాధించి ఆపై 6-4తో సెట్‌తో పాటు మ్యాచ్ గెలుచుకున్నాడు. మరోవైపు ప్రపంచ నం.1 జకోవిచ్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఈ టాప్‌సీడ్ 6-2, 4-6, 6-3, 6-2తో బటిస్టా అగట్ (స్పెయిన్)ను ఓడించాడు.



సెరెనా × హాలెప్

వింబుల్డన్ మహిళల ఫైనల్ నేడు



ప్రత్యేకం: ఫైనల్లో హాలెప్‌ను ఓడిస్తే సెరెనా విలియమ్స్.. మార్గరెట్ కోర్ట్ (24) పేరిట ఉన్న ఆల్‌టైమ్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల రికార్డును సమం చేస్తుంది.

సా.6.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

రాహుల్‌కు రజతం

కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్

అపియా (సమోవా): కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు జోరు కొనసాగుతోంది. తెలుగు వెయిట్‌లిఫ్టర్ రాగాల వెంకట రాహుల్ పురుషుల 89 కేజీల విభాగంలో రజతం సాధించాడు. మొత్తం 325 కిలోల (145+180) బరువులెత్తిన అతను రెండో స్థానంలో నిలిచాడు. తెలంగాణ క్రీడా పాఠశాల పూర్వ విద్యార్థి శివరామకృష్ణ యాదవ్ (81 కేజీలు) యూత్ విభాగంలో పసిడి, జూనియర్ విభాగంలో రజతం సాధించి సత్తాచాటాడు. మరో లిఫ్టర్ అజయ్ సింగ్ 81 కేజీల విభాగంలో కామన్వెల్త్ రికార్డు నెలకొల్పి స్వర్ణం ఎగరేసుకుపోయాడు. క్లీన్ అండ్ జర్క్‌లో 190 కిలోల బరువెత్తి సరికొత్త రికార్డు నెలకొల్పాడు. మొత్తం 338 కిలోలతో (148+190) వ్యక్తిగతంగా కూడా ఉత్తమ ప్రదర్శన చేసిన అతను అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. మహిళల 87 కేజీల విభాగంలో అనురాధ పసిడి గెలుచుకుంది.

ఫైనల్‌కు ధర్మసేన, ఎరాస్మస్

లండన్: ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే ప్రపంచకప్ ఫైనల్‌కు కుమార ధర్మసేన (శ్రీలంక), మారియస్ ఎరాస్మస్ (దక్షిణాఫ్రికా) మైదాన అంపైర్లుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. రంజన్ మదుగలె (శ్రీలంక) మ్యాచ్ రిఫరీగా వ్యవహరించనున్నారు. రెండో సెమీస్‌లో బాధ్యతలు నిర్వర్తించిన బృందాన్నే ఫైనల్‌కు కూడా కొనసాగించారు. ఐతే ఆ మ్యాచ్‌లో తను ఔట్ కాకముందే ఔటని ప్రకటించిన అంపైర్ ధర్మసేన నిర్ణయంపై ఇంగ్లాండ్ ఆటగాడు రాయ్ అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అతను అంపైర్‌తో వాగ్వాదానికి కూడా దిగాడు. దాంతో ఐసీసీ అతని మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానాగా విధించింది.

రషీదే అఫ్గాన్ కెప్టెన్



కాబుల్: స్టార్ స్పిన్నర్ రషీద్‌ఖాన్ అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్టుకు అన్ని ఫార్మాట్లలో కెప్టెన్ అయ్యాడు. ఇప్పటికే టీ20లకు సారథిగా ఉన్న 20 ఏళ్ల రషీద్.. ఇకపై వన్డే, టెస్టుల్లోనూ జట్టును నడిపించనున్నాడు. గుల్బదిన్ నైబ్ కెప్టెన్‌గా విఫలం కావడంతో రషీద్‌ను వన్డే, టెస్టులకు కూడా కెప్టెన్‌గా నియమిస్తున్నట్లు అఫ్గాన్ బోర్డు ప్రకటించింది.

స్నైడర్‌తో విజేందర్ పోరు

న్యూయార్క్: భారత ప్రొఫెషనల్ స్టార్ బాక్సర్ విజేందర్ సింగ్ చాలాకాలం తర్వాత తిరిగి రింగ్‌లో అడుగుపెట్టనున్నాడు. ఎనిమిది రౌండ్ల సూపర్ మిడిల్‌వెయిట్ పోరులో భాగంగా అతను శనివారం అమెరికా బాక్సర్ మైక్ స్నైడర్‌తో తలపడనున్నాడు. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 4.30కు సోనీ 10లో ప్రసారం కానుంది. విజేందర్ బరిలో దిగిన పది బౌట్లలోనూ విజేతగా నిలిచాడు.

అతణ్ని ఆపితే..!

"ప్రపంచకప్ గెలవాలంటే అతణ్ని ఆపాలి"

ఫైనల్ చేరిన రెండు జట్లదీ ఇదే మాట!

ఇటు ఇంగ్లిష్ జట్టయినా.. అటు న్యూజిలాండ్ అయినా.. ఫైనల్ చేరాయంటే ఆ జట్లలో ఒక్కో ఆటగాడి పాత్ర అత్యంత కీలకం. ఆ ఇద్దరు లేకుంటే ఈ జట్లు లీగ్ దశకే పరిమితం అయ్యేవి. సెమీస్‌లోనూ సత్తా చాటి.. ఫైనల్‌కు భారీ అంచనాలతో వస్తున్నారీ యోధులు. ఫైనల్లో ఈ ఆటగాళ్ల ప్రదర్శనే ఫలితాన్ని నిర్దేశిస్తుందని విశ్లేషకుల అంచనా.

ఆ ఇద్దరు.. జేసన్ రాయ్, కేన్ విలియమ్సన్!

ప్రపంచకప్ ప్రదర్శన

రాయ్	
మ్యాచ్‌లు:	7
పరుగులు:	426
సగటు:	71.00
శతకాలు:	1
అర్ధశతకాలు:	4
అత్యధిక స్కోరు:	153

7 మ్యాచ్‌లు 4 విజయాలు.. 3 ఓటములు.. పాయింట్లు 8. చివరి రెండు మ్యాచ్‌ల్లోనూ పరాజయాలే. ఆఖరి రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిస్తేనే ముందంజ వేసే అవకాశం. గాయపడ్డ జేసన్ రాయ్ పునరాగమనం చేయడానికి ముందు ఈ ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ పరిస్థితి ఇది. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఆ జట్టు ఒక దశలో సెమీస్ చేరడం చాలా కష్టంగానే కనిపించింది. ఆరంభ విజయాల్లో కీలక పాత్ర పోషించిన రాయ్.. గాయం కారణంగా రెండు మ్యాచ్‌లకు దూరం కాగానే ఇంగ్లాండ్ గాడి తప్పింది. వరుసగా రెండు ఓటములు ఎదుర్కొంది. ముఖ్యంగా శ్రీలంక చేతిలో ఓటమి ఆ జట్టుకు పెద్ద షాక్. ఆతిథ్య జట్టుపై అంచనాలన్నీ తలకిందులై ఆ జట్టు నాకౌట్ చేరడం కష్టంగా కనిపించిన సమయంలో రాయ్ గాయం నుంచి కోలుకుని మళ్లీ జట్టులోకి వచ్చాడు. వచ్చీ రాగానే భారత్‌పై మెరుపు ఇన్నింగ్స్ (66)తో జట్టుకు చక్కటి ఆరంభాన్నిచ్చాడు. దీంతో ఇంగ్లాండ్ భారీ స్కోరు సాధించింది. కీలక విజయంతో సెమీస్ ఆశల్ని నిలబెట్టుకుంది. తర్వాత న్యూజిలాండ్‌తో మరో కీలక సమరం. అందులోనూ రాయ్ అర్ధసెంచరీ (60)తో రాణించాడు. జట్టుకు మరో ఘనవిజయాన్నందించాడు. ఇక సెమీఫైనల్లో రాయ్ (85) ఎలా చెలరేగాడో తెలిసిందే. ఆసీస్ బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడి ఆ జట్టును పోటీలోనే లేకుండా చేశాడు. ఇంగ్లిష్ జట్టులో బెయిర్‌స్టో, రూట్ కూడా మంచి ఇన్నింగ్స్ ఆడారు. కానీ రాయ్ ప్రభావం వేరు. సెహ్వాగ్ తరహాలో విధ్వంసకంగా ఆడి ప్రత్యర్థిని ఆత్మరక్షణలోకి నెట్టడం రాయ్ శైలి. ఉన్నంతసేపు బాదడమే పనిగా పెట్టుకునే రాయ్‌ను ఫైనల్ ఆరంభంలోనే ఔట్ చేయకుంటే న్యూజిలాండ్ కప్పుపై ఆశలు వదులుకోవాల్సిందే అన్నది విశ్లేషకుల మాట.

ప్రపంచకప్ ప్రదర్శన

విలియమ్సన్	
మ్యాచ్‌లు:	9
పరుగులు:	548
సగటు:	91.33
శతకాలు:	2
అర్ధశతకాలు:	2
అత్యధిక స్కోరు:	148

ఓపెనర్లది ఘోర వైఫల్యం. మిడిలార్డర్ ప్రదర్శన అంతంతమాత్రం. అయినా ఈ ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ ఫైనల్ వరకు రావడం ఆశ్చర్యకరం. బౌలర్లు నిలకడగా రాణించడం ఇందుకు ఓ కారణమైతే.. బ్యాటింగ్ భారాన్నంతా మోస్తూ కేన్ విలియమ్సన్ ఆడిన మేటి ఇన్నింగ్స్‌లు మరో కారణం. గప్టిల్, మన్రో ఒక్కటంటే ఒక్క మ్యాచ్‌లో కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. ఇద్దరూ పోటీ పడి విఫలమయ్యారు. ఈ స్థితిలో విలియమ్సన్ దాదాపుగా ఓపెనర్ పాత్ర పోషించాడు. ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచాడు. మిడిలార్డర్‌లో టేలర్, నీషమ్ లాంటి వాళ్లు అతడికి కొంత సహకారమందించారు. ఆ మాత్రం తోడ్పాటుతోనే జట్టుకు విజయాలందించాడు విలియమ్సన్. వెస్టిండీస్‌పై అతడి *148* పరుగుల ఇన్నింగ్స్, దక్షిణాఫ్రికాపై సెంచరీ *(106)* గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. మొన్న సెమీఫైనల్లో భారత్ మీదా గొప్ప ఇన్నింగ్సే ఆడాడు. *92* బంతుల్లో *67* పరుగుల ఇన్నింగ్స్‌ను ముందు తక్కువ అంచనా వేశారు కానీ.. బ్యాటింగ్‌లో భారత్ తడబాటు చూశాక కానీ అతడి ఇన్నింగ్స్ విలువ అర్థం కాలేదు. ఈ ప్రపంచకప్ టాప్ బ్యాట్స్‌మెన్‌లో అత్యధిక సగటు కేన్‌దే కావడం విశేషం. అతను *9* మ్యాచ్‌ల్లో *91.33* సగటుతో *548* పరుగులు సాధించాడు. విలియమ్సన్ లేకుంటే ఈసారి ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌ది ఘోరమైన ప్రదర్శనగా ఉండేది. అతడి పుణ్యమా అని ఏకంగా ఫైనల్ కూడా చేరింది. ఫైనల్లో కేన్‌ను ఔట్ చేస్తే ఇంగ్లాండ్ పని సగం అయిపోయినట్లే. అయితే పట్టుదలకు మారుపేరైన కివీస్ కెప్టెన్ అంత తేలిగ్గా వదులుతాడా అన్నది సందేహమే.

– ఈనాడు క్రీడావిభాగం

జడేజా బ్యాటింగ్ అమోఘం

వీవీఎస్ లక్ష్మణ్

ప్రపంచకప్‌లో రెండు సెమీఫైనల్స్ ఒకే రకంగా సాగాయి. న్యూజిలాండ్, ఇంగ్లాండ్ విజయాల్లో కొత్త స్పెల్స్ నిర్ణయాత్మక పాత్ర పోషించాయి. కేవలం ఐదు పరుగులకే రోహిత్, కేఎల్ రాహుల్, కోహ్లీలను ఔట్ చేయడం ద్వారా హెన్రీ, బౌల్ట్ కోట్ల మంది భారతీయులు హృదయాలను ముక్కలు చేశారు. మరో సెమీస్‌లో ఫామ్‌లో ఉన్న ఫించ్, వార్నర్‌లను ఔట్ చేయడం ద్వారా వోక్స్, ఆర్చర్ ఆస్ట్రేలియాను దెబ్బతీశారు. సెమీస్‌లో ఓడినా ప్రపంచకప్‌లో భారత్ గొప్పగా ఆడింది. 240 పరుగుల లక్ష్య ఛేదనలో టాప్ ఆర్డర్ విఫలమయ్యాక.. ఇన్నింగ్స్‌ను నిలబెట్టడానికి మిడిల్ ఆర్డర్‌కు ఓ అవకాశం దక్కింది. కిజడేజా, ధోని అసాధ్యాన్ని సుసాధ్యం చేసేలా కనిపించారు. జడేజా బ్యాటింగ్ అమోఘం. అతడు ఎంత విలువైన ఆటగాడో చెప్పడానికి ఈ ఇన్నింగ్స్ ఉదాహరణ.

అంతా జేసన్ వల్లే..

క్రిస్ శ్రీకాంత్

ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్‌కు చేరుకుంటుందన్న అభిమానుల అంచనాలు తలకిందులయ్యాయి. ఇంగ్లాండ్, న్యూజిలాండ్ కీలక సమయంలో సత్తా చాటి తుది పోరుకు అర్హత సాధించాయన్న నిజాన్ని మనం అంగీకరించాలి. ఫైనల్లో ఇంగ్లాండే ఫేవరెట్ అనడంలో సందేహం లేదు. జాసన్ రాయ్ తిరిగి జట్టులోకి వచ్చిన తర్వాత ఇంగ్లాండ్ భిన్నంగా కనిపిస్తోంది. వాళ్ల బ్యాటింగ్ లోతు పెరిగింది. ఇంగ్లాండ్‌ను సవాల్ చేయాలంటే విలియమ్సన్, టేలర్‌తో పాటు గప్టిల్ చెలరేగాల్సి ఉంది. ప్రపంచకప్ ఆరంభంలో బ్యాట్స్‌మెన్‌దే హవా అనుకున్నారు. కానీ బౌలర్లు తమ ముద్ర వేశారు.



అదే అతిపెద్ద పొరపాటు

సౌరభ్ గంగూలీ

ప్లేఆఫ్స్‌లో సమీకరణాలు.. ఒత్తిడి భిన్నంగా ఉంటాయి. గ్రూపు దశలోని మ్యాచ్‌లతో పోలికే ఉండదు. 2015 నుంచి మాంచెస్టర్‌లో టీమ్‌ఇండియా ఓడిపోలేదు. కీలకమైన పోరులో మాత్రం స్థాయికి తగ్గట్లు ఆడలేకపోయింది. ప్రపంచకప్ ఆసాంతం టీమ్‌ఇండియా అభిమానులది ఒకటే సందేహం. ధావన్ గాయపడిన నేపథ్యంలో రోహిత్, కోహ్లి త్వరగా ఔటైతే పరిస్థితేంటన్నదే. చివరికి అదే జరిగింది. 5 పరుగులకే 3 వికెట్లు కోల్పోవడంతో టీమ్‌ఇండియా కోలుకోలేకపోయింది. భారత్ సెమీస్‌లో ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకుంది. 3 వికెట్లు పడినా ధోనీని ఆలస్యంగా దించడం అతిపెద్ద పొరపాటు. రిషబ్ పంత్‌తో కలిసి పరిస్థితులు చక్కదిద్ది.. ఇన్నింగ్స్‌ను నిర్మించడానికి ధోనీనే సరైన వ్యక్తి.

ఎవరు గెలిచినా చరిత్రే

జాక్ కలిస్

దురదృష్టవశాత్తు టీమ్‌ఇండియాకే అనుకోని ఫలితం ఎదురైంది. ఇప్పటికీ తమ ప్రదర్శన పట్ల టీమ్‌ఇండియా గర్వపడొచ్చు. ఒక్కో ఆటగాడితో పోల్చి చూస్తే న్యూజిలాండ్ కంటే టీమ్‌ఇండియానే మెరుగు. అయితే ప్రపంచకప్ ఫైనల్ చేరడం అనుకోకుండా జరిగేది కాదు. సెమీస్‌లో కివీస్ అద్భుతంగా ఆడింది. 30 పరుగులు తక్కువైనా గొప్పగా పోరాడి స్కోరును నిలబెట్టుకుంది. ఫైనల్లో చోటుకు కివీస్‌కు పూర్తి అర్హత ఉంది. ఐదు పరుగులకే 3 వికెట్లు పడ్డప్పుడు టీమ్‌ఇండియాకు ద్వారాలు మూసుకుపోయాయి. రెండో సెమీస్‌లో 14/3తో ఆస్ట్రేలియాకూ అలాంటి పరిస్థితే ఎదురైంది. గత 3 మ్యాచ్‌ల్లో ఇంగ్లాండ్ ప్రదర్శన స్ఫూర్తిమంతంగా ఉంది. ఫైనల్‌కు అర్హత సాధించిన రెండు జట్లు ప్రపంచకప్ నెగ్గలేదు. కాబట్టి ఎవరు గెలిచినా కొత్త చరిత్రే.



1 నుంచి తక్షణ నగదు బదిలీకి ఛార్జీలుండవ్

నెఫ్ట్, ఆర్‌టీజీఎస్‌లపైనా రుసుముల తొలగింపు

దిల్లీ: ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా జరిపే తక్షణ నగదు బదిలీ సేవలపై (ఐఎంపీఎస్) ఛార్జీలను ఎత్తివేయనున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వెల్లడించింది. ఆగస్టు 1 నుంచి ఛార్జీల తొలగింపును అమల్లోకి తీసుకొని రానుంది. జులై 1 నుంచి నెఫ్ట్, ఆర్‌టీజీఎస్‌లపైనా రుసుములు తొలగించింది. ఇటీవలి ద్రవ్య పరపతి విధాన సమీక్ష సందర్భంగా బ్యాంకులకు నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ లావాదేవీలపై ఛార్జీలు తొలగించేందుకు ఆర్‌బీఐ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆర్‌బీఐ కల్పించిన ఈ ప్రయోజనాన్ని తమ ఖాతాదార్లకు బదిలీ చేసే ఉద్దేశంతో ఎస్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ద రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్‌కు ఆర్‌టీజీఎస్ సంక్షిప్త రూపం. దీని ద్వారా ఎక్కువ మొత్తం నిధులను తక్షణమే బదిలీ చేసే వీలుంటుంది. ద నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్‌ను సంక్షిప్తంగా నెఫ్ట్ అని అంటుంటారు. దీనిని రూ.2 లక్షల వరకు నగదు బదిలీకి ఉపయోగించొచ్చు. 'డిజిటల్ లావాదేవీలకు ఊతమిచ్చే ఉద్దేశంలో 2019 జులై 1 నుంచి యోనో, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ వినియోగదార్లకు ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ ఛార్జీలను తొలగించాం. అలాగే 2019, ఆగస్టు 1 నుంచి ఐఎంపీఎస్ ఛార్జీలను కూడా ఎత్తివేశామ'ని ఎస్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. జులై 1కి ముందు నెఫ్ట్ లావాదేవీలపై రూ.1-5 మధ్య, ఆర్‌టీజీఎస్ లావాదేవీలకు రూ.5-50 మధ్య ఎస్‌బీఐ ఛార్జీలు వసూలుచేసేది. 2019 మార్చి చివరి నాటికి ఎస్‌బీఐ వినియోగదార్లలో ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ను వాడే వారి సంఖ్య ఆరు కోట్లకు పైగానే ఉండగా.. మొబైల్ బ్యాంకింగ్ సేవల వినియోగదార్లు 1.41 కోట్ల మంది. దేశీయంగా మొత్తం మొబైల్ బ్యాంకింగ్ లావాదేవీల్లో ఎస్‌బీఐ వాటా 18 శాతం వరకు ఉంటుంది. యోనోలో రిజిస్టర్ అయిన వినియోగదార్లే దాదాపు కోటి వరకు ఉంటారు.

ఈ ఏడాది బ్రిటన్‌ను, 2025లో జపాన్‌ను

- భారత్ వెనక్కి నెట్టే అవకాశం
- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరణ!
- ఐహెచ్ఎస్ మార్కిట్ నివేదిక

దిల్లీ: ప్రస్తుత సంవత్సరంలో బ్రిటన్‌ను వెనక్కినెట్టి ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని ఐహెచ్ఎస్ మార్కిట్ నివేదిక వెల్లడించింది. 2025 కల్లా జీడీపీ 5.9 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా వేసింది. తద్వారా ఆ ఏడాదిలో జపాన్‌ను కూడా అధిగమించి మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని పేర్కొంది. భారత వినియోగ విపణి పరిమాణం కూడా ప్రస్తుతమున్న 1.9 ట్రిలియన్ డాలర్ల నుంచి 2025 నాటికి 3.6 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని నివేదిక పేర్కొంది. 'ప్రపంచ దిగ్గజ ఆర్థిక వ్యవస్థల జాబితాలో భారత్ ర్యాంకును మెరుగుపడే కొద్దీ ప్రపంచ జీడీపీ వృద్ధిలో భారత భాగస్వామ్యమూ పెరుగుతుంది. భారత వినియోగ విపణి పరిమాణం వేగంగా వృద్ధి చెందుతుండటంతో ఆసియా పసిఫిక్ ప్రాంత వృద్ధిలో ముఖ్య భూమిక భారత్‌దే అవుతుంది. ఆసియా ప్రాంతంలో వాణిజ్యం, పెట్టుబడులు పురోగతికి ఈ పరిణామం దోహదం చేస్తుంద'ని ఐహెచ్ఎస్ వెల్లడించింది. అయితే దీనిని సాధించాలంటే వచ్చే ఐదేళ్లలో సుస్థిర వృద్ధిని కొనసాగాల్సి ఉంటుందని పేర్కొంది. అందుకే ఇటీవల నిర్దేశించుకున్న ఆర్థిక వ్యవస్థ వృద్ధి మార్గసూచీలో పెట్టుబడులు, పొదుపు, ఎగుమతుల వృద్ధి అవసరాన్ని భారత్ గుర్తించిందని వెల్లడించింది. ఆవిష్కరణలకు, ఉత్పాదకతలో గణనీయ వృద్ధికి, కొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చేందుకు, ఉద్యోగాల సృష్టికి పెట్టుబడులు కీలక పాత్ర పోషిస్తాయని నివేదిక పేర్కొంది. అంకుర సంస్థల అభివృద్ధిని వేగం చేయడం కూడా నైపుణ్య ఉద్యోగాల వృద్ధిలో కీలక వ్యూహం అవుతుందని వెల్లడించింది.

నొప్పించినా.. మెప్పించి..

Infosys

త్రైమాసిక ఫలితాలు

- మార్జిన్లు దిగువ స్థాయిలోనే కానీ..
- ఆదాయ వృద్ధి అంచనాల పెంపు
- నికర లాభంలో 5% పైగా వృద్ధి
- ఆదాయం మాత్రం అంచనాల ప్రకారమే
- జూన్ త్రైమాసికంలో రూ.21,803 కోట్లకు

దిల్లీ/ బెంగళూరు

ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాల్లో కొంత నొప్పించినా.. మొత్తం మీద మెప్పించింది. బ్రోకరేజీ సంస్థలు అంచనా వేసినట్లుగానే మార్జిన్ల విషయంలో క్షీణతను నమోదు చేసింది. ఆదాయం విషయంలోనూ వాటి అంచనాలకు అనుగుణంగానే గణాంకాలను ప్రకటించింది. అయితే నికర లాభంలో మాత్రం అంచనాలను మించి రాణించింది. మరోవైపు ఆదాయ అంచనాలను పెంచడంతో పాటు.. వచ్చే అయిదేళ్లలో డివిడెండ్లు, బైబ్యాక్ రూపంలో వాటాదార్లకు అధిక నగదును ఇవ్వాలని నిర్ణయించడం మెప్పించే నిర్ణయం.

ఐటీ ఫలితాలు

నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం 5.2 శాతం వృద్ధితో రూ.3,802 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.3,612 కోట్లుగా నమోదైంది. కాగా, విశ్లేషకులు సంస్థ నికర లాభం కేవలం 2% వృద్ధితో రూ.3,680 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. ఆ అంచనాలను మించి గణాంకాలు వెల్లడయ్యాయి. అమెరికా డాలర్లలో నికర లాభం అంతక్రితం ఏడాది ఏప్రిల్-జూన్‌తో పోలిస్తే 534 మిలియన్ డాలర్ల నుంచి 546 మి. డాలర్లకు పెరిగింది.

ఆదాయాలు జూన్ 2019 త్రైమాసికంలో కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం అంతక్రితం ఏడాది జూన్ త్రైమాసికంతో పోలిస్తే 13.9 శాతం వృద్ధితో రూ.21,803 కోట్లుగా నమోదు చేసింది. కంపెనీ ఆదాయాలు 14% వృద్ధితో రూ.21883 కోట్లకు చేరుతాయన్న బ్రోకరేజీ సంస్థల సగటు అంచనాకు ఇవి చేరువలోనే ఉండడం గమనార్హం. డాలర్లలో ఆదాయం 2.83 బిలియన్ల నుంచి 3.13 బిలియన్లకు పెరిగింది.

ఆదాయ అంచనాలు.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆదాయ వృద్ధి అంచనాలను 8.5-10 శాతానికి పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఏప్రిల్ త్రైమాసికంలో ఈ అంచనాలను 7.5-9.5 శాతంగా పేర్కొన్న సంగతి తెలిసిందే.

తగ్గిన మార్జిన్లు సమీక్షిస్తున్న త్రైమాసికంలో ఆపరేటింగ్ మార్జిన్లు 20.5 శాతంగా నమోదయ్యాయి. మార్చి త్రైమాసికంలో నమోదైన 23.7 శాతం; అంతక్రితం ఏడాది జూన్ త్రైమాసికంలో నమోదైన 21.4 శాతం కంటే ఇది తక్కువ. కాగా, పూర్తి ఆర్థిక సంవత్సరానికి కంపెనీ అంచనా అయిన 21-23 శాతానికి చేరగలమని కంపెనీ ధీమా వ్యక్తం చేసింది. కాగా అమెరికాకు చెందిన ట్రైఫాక్టా ఇంక్‌లో అదనంగా 6 మి. డాలర్ల(రూ.41 కోట్లకు పైగా) మేర పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. 2016లో ఈ కంపెనీలో 4 మి. డాలర్ల పెట్టుబడులను పెట్టింది.

ఈ ఏడాది 18000 ప్రాంగణ నియామకాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 18,000 మందిని ప్రాంగణ(క్యాంపస్) నియామకాల ద్వారా చేర్చుకోనున్నట్లు ఇన్ఫోసిస్ తెలిపింది. ఈ త్రైమాసికంలో ఇప్పటికే 8,000 మందిని నియమించుకున్నాం. అందులో 2,500 మంది ఫ్రెషర్లు. మొత్తం ఏడాదికి క్యాంపస్ నియామకాల ద్వారా 18,000 మందిని తీసుకుంటామ'ని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీఓఓ) యూబీ ప్రవీణ్ రావు పేర్కొన్నారు. కాగా సమీక్షిస్తున్న త్రైమాసికంలో నికరంగా 906 మంది ఉద్యోగులను జత చేసుకోవడంతో జూన్ 2019 నాటికి కంపెనీలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,29,029కి చేరింది.

ఇక మదుపర్లకు ఎక్కువ నగదు: కంపెనీ ప్రస్తుత విధానం ప్రకారం.. తన వద్ద నగదులో 70 శాతం వరకు డివిడెండు, బైబ్యాక్‌లకు ఉపయోగించాలి. అయితే 2019-20 సంవత్సరం నుంచి అయిదేళ్ల పాటు పాక్షిక వార్షిక డివిడెండ్లు, బైబ్యాక్‌లు, ప్రత్యేక డివిడెండ్ల కోసం 85 శాతం వరకు(అయిదేళ్ల సమ్మిళితం లెక్కన) నగదును ఖర్చు చేయనుంది. అంటే మదుపర్లకు కంపెనీ నుంచి వచ్చే నగదు పరిమాణం పెరగనుందన్నమాట. ఆ మేరకు బోర్డు నిర్ణయించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం కంపెనీ వద్ద 3.5 బి. డాలర్ల నగదు ఉంది.

2019-20 ఏడాదిని బలంగా మొదలుపెట్టాం. స్థిర కరెన్సీ వృద్ధి 12.4 శాతానికి చేరడం, డిజిటల్ ఆదాయాల వృద్ధి 41.9 శాతంగా నమోదవడం ఇందుకు సహకరించింది. మా క్లయింట్లు, పెట్టుబడులపై స్థిరంగా మా దృష్టిని కొనసాగించడం వల్ల ఇది సాధ్యమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంపై ఉన్న ధీమాతో మా ఆదాయ అంచనాలను 7.5-9.5% నుంచి 8.5-10 శాతానికి పెంచుతున్నాం.

- ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ సలీల్ పరీఖ్

విదేశాల నుంచి నేరుగా చిన్న పట్టణాలకు..

- 'దోహాప్'తో ట్రూజెట్ ఒప్పందం
- ఆరు నెలల్లో మరో 300 మంది నియామకాలు
- ఎంఈఐఎల్ డైరెక్టర్ కె.వి.ప్రదీప్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా ట్రూజెట్ బ్రాండ్‌పై విమానయాన సేవలందిస్తున్న టర్బోమేఘా..., ఇతర దేశాల నుంచి నేరుగా మనదేశంలోని చిన్న పట్టణాలకు ఒకే టికెట్‌పై ప్రయాణించే వీలు కల్పించనుంది. దీని కోసం ఐరోపాలో దిగ్గజ విమానయాన సంస్థల వేదిక అయిన 'దోహాప్'తో ప్రత్యేక భాగస్వామ్యం కుదుర్చుకుంటోంది. అంతేగాక దేశీయ పెద్ద విమానయాన సంస్థలతో ఒప్పందం చేసుకోనుంది. తత్ఫలితంగా విదేశాల నుంచి మనదేశంలో ట్రూజెట్ విమానాలు నడుస్తున్న చిన్న పట్టణాలకూ ప్రయాణికులు ఒకే టికెట్‌పై రావచ్చు. ఈ సేవలు ఈ నెలాఖరు నుంచి ప్రారంభిస్తారు. దీంతోపాటు దేశీయంగా విమానాల సర్వీసుల సంఖ్యను గణనీయంగా పెంచటానికి సన్నాహాలు చేస్తున్నారు. 2015 జులై 12న విమానయాన సేవలు ఆరంభించిన ఈ సంస్థ నాలుగేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా టర్బోమేఘా మాతృసంస్థ ఎంఈఐఎల్ గ్రూప్ డైరెక్టర్ కేవీ ప్రదీప్, ట్రూజెట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి మూర్తి, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సుధీర్ రాఘవన్, ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్ఓ) కె.జి. విశ్వనాథ్ శుక్రవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. తమతో ఆరంభమైన ఇతర సంస్థలు మూతబడగా, 'ట్రూజెట్' మాత్రం మాతృసంస్థ సహకారం, ప్రయాణికుల ఆదరణతో లాభాల్లోకి వచ్చిందని వారు వెల్లడించారు. సంస్థ కార్యకలాపాలను మరింతగా విస్తరించనున్నట్లు, రెండు- మూడేళ్లలో పబ్లిక్ ఇష్యూకు వచ్చే ఆలోచన ఉన్నట్లు వివరించారు. ట్రూజెట్ రెండు ఏటీఆర్ విమానాలతో కార్యకలాపాలు ఆరంభించింది. ఇప్పుడు 5 విమానాలతో 20 గమ్యస్థానాలకు, నెలకు 1200 సర్వీసులు నిర్వహిస్తోంది. ఈ ఏడాది డిసెంబరు కల్లా మరో 5 విమానాలు సమకూర్చుకొని కార్యకలాపాలు రెట్టింపు చేయాలనేది ప్రణాళిక. వచ్చే ఏడాది చివరి నాటికి కొత్తగా 5 నుంచి 8 విమానాలు రానున్నట్లు, అప్పటికి మొత్తం విమానాల సంఖ్య 15-18కి చేరుతుందని గ్రూప్ డైరెక్టర్ కేవీ ప్రదీప్ తెలిపారు. గత నాలుగేళ్లలో 19 లక్షల మంది ప్రయాణికులను చేరవేసినట్లు, నెలకు సగటున 80,000 మంది తమ విమానాల ద్వారా ప్రయాణాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, అహ్మదాబాద్‌తో పాటు గువాహటిని కూడా తమ కార్యకలాపాలకు కేంద్రస్థానం (హబ్)గా చేసుకుంటామన్నారు. ఉడాన్ కింద 12 మార్గాలు తమకు లభించినట్లు, ఇందులో 10 మార్గాల్లో తమ విమానాలు 73 శాతం సామర్థ్యంతో నడుస్తున్నాయని అన్నారు. జెట్ ఎయిర్‌వేస్ నుంచి 100 మంది ఉద్యోగులను తీసుకున్నట్లు, దీంతో తమ సిబ్బంది సంఖ్య 700కు చేరినట్లు తెలిపారు. వచ్చే ఆరు నెలల్లో మరో 300 మంది నియామకాలు స్థానికంగా చేపట్టనున్నట్లు వివరించారు.

ఏటీఆర్ విమానాలను రోజుకు 10.5-11 గంటల సేపు సమర్థంగా వినియోగిస్తూ, ప్రపంచంలోనే తొలిస్థానంలో నిలుస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. సరకు రవాణాపై ప్రస్తుతం 3 శాతం ఆదాయం లభిస్తోందని, సమీప భవిష్యత్తులో 8 శాతానికి, తదుపరి 15-20 శాతానికి పెంచుకునే ప్రణాళిక ఉన్నట్లు పేర్కొంది. 2017-18లో రూ.165 కోట్ల ఆదాయంపై రూ.84 నష్టం రాగా, 2018-19లో సుమారు రూ.250 కోట్ల ఆదాయంపై నష్టాలు కాస్త తగ్గినట్లు, సగటు ఆదాయంలో ఇతర సంస్థల కంటే మెరుగ్గా ఉన్నట్లు తెలిపింది.

శుక్రవారం హైదరాబాద్‌లో ట్రూజెట్ భవిష్యత్తు ప్రణాళికలు వెల్లడిస్తున్న సంస్థ సీఈఓ మూర్తి, సీసీఓ సుధీర్ రాఘవన్, సీఎఫ్ఓ కె.జి. విశ్వనాథ్ ఎంఈఐఎల్ గ్రూప్ డైరెక్టర్ కేవీ ప్రదీప్

ఇండిగోలో నలుగురు ఉన్నతాధికారులకు డీజీసీఏ షోకాజ్ నోటీసులు

భద్రతాపరమైన వైఫల్యాల వల్లే

దిల్లీ: భద్రతాపరమైన అంశాల్లో వైఫల్యాల కారణంగా ఇండిగోకు చెందిన నలుగురు ఉన్నతాధికారులకు పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) షోకాజ్ నోటీసులను జారీ చేసినట్లు తెలుస్తోంది. గుర్‌గ్రామ్‌లోని ఇండిగో కార్యాలయంలో జులై 8, 9 తేదీల్లో జరిపిన ప్రత్యేక ఆడిట్‌లో ఈ వైఫల్యాలను డీజీసీఏ గుర్తించిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 'శిక్షణాధిపతి కెప్టెన్ సంజీవ్ భల్లా, ప్రధాన భద్రతా అధికారి కెప్టెన్ హేమంత్ కుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (కార్యకలాపాలు) కెప్టెన్ ఆశిమ్ మిత్రా, కెప్టెన్ రాకేశ్ శ్రీవాస్తవ (క్వాలిటీ అష్యూరెన్స్)లకు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయ'ని ఈ పరిణామాన్ని దగ్గర నుంచి గమనిస్తున్న వర్గాలు పీటీఐ వార్త సంస్థకు వెల్లడించాయి. ఈ నోటీసులపై స్పందించేందుకు నలుగురు అధికారులకు డీజీసీఏ 15 రోజులు గడువు ఇచ్చింది. ఇటీవల దేశవ్యాప్తంగా విమానాలు అనుకోకుండా ల్యాండ్ అయిన ఘటనల నేపథ్యంలో విమానయాన సంస్థలు, వర్షాల ప్రభావిత ప్రాంతాల్లోని విమానాశ్రయాల్లో డీజీసీఏ ప్రత్యేక ఆడిట్‌ను నిర్వహిస్తోంది. విమాన భద్రత, కార్యకలాపాల విభాగం పలుమార్లు సూచించినప్పటికీ 'అదనపు శిక్షణ' విషయంలో నలుగురు ఉన్నతాధికారులు సరైన రీతిలో వ్యవహరించలేదని డీజీసీఏ ఆడిట్‌లో వెల్లడైందని వర్గాలు పేర్కొన్నాయి.

పాలనా వైఫల్యాల ఆరోపణలపై ప్రభుత్వం పరిశీలన

ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌లో పాలనాపరమైన వైఫల్యాల ఆరోపణలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించనుందని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. రిలేటెడ్ పార్టీ లావాదేవీలతో పాటు వాటాదార్ల, ఇతరుల ఒప్పందాలను పరిశీలించనుందని పేర్కొన్నారు. కార్పొరేట్ పరిపాలనా వైఫల్యాల సమస్య పరిష్కారం విషయంలో జోక్యం చేసుకోవాలని సెబీకి కంపెనీ ప్రమోటర్ రాకేశ్ గంగ్వాల్ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కంపెనీకి సంబంధించి మెమోరాండమ్, ఒప్పందాలు లాంటివి కంపెనీల చట్టంలో నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? లేవా? అని పరిశీలించేందుకు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుందని అధికారి తెలిపారు.

8 శాతం వృద్ధితోనే సాధ్యం

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ రంగరాజన్

ఈనాడు, హైదరాబాద్: వచ్చే అయిదేళ్లలో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలంటే ఏటా 8 శాతం వృద్ధి రేటు నమోదు చేయాల్సి ఉంటుందని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ సి.రంగరాజన్ పేర్కొన్నారు. అందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ఉండాలని సూచించారు. ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ తొమ్మిదవ స్నాతకోత్సవం ఇక్కడ జరిగింది. ఇక్ఫాయ్ ఛాన్సలర్ అయిన డాక్టర్ రంగరాజన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్వర ఆర్థికాభివృద్ధి సాధనకు అధిక పెట్టుబడులు ఎంతో ముఖ్యమని, అందుకు అనువైన వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం ప్రభుత్వ పెట్టుబడులతోనే అధిక ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదని, ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నందున పెట్టుబడుల కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించలేని పరిస్థితి ఉన్నట్లు వివరించారు. అందువల్ల అధికంగా పెట్టుబడులు పెట్టేందుకు ప్రైవేటు రంగంలోని చిన్న, పెద్దా సంస్థలు ముందుకు రావాలని కోరారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధనలో విద్యా రంగం పాత్ర కూడా పెద్దదని, యువకులందరికీ విద్యాబుద్ధులు చెప్పించి వారిని వివిధ విభాగాల్లో నిపుణులుగా తీర్చిదిద్దాల్సి ఉందని డాక్టర్ రంగరాజన్ అభిప్రాయపడ్డారు. నాణ్యతమైన ఉన్నత విద్య లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'నూతన విద్యా విధానం- 2019' ని ప్రతిపాదించిందని, కానీ ఐఐటీ, ఐఐఎం వంటి ప్రత్యేక విద్యా సంస్థల ప్రాధాన్యాన్ని తగ్గించే యత్నాలు చేయకూడదని అన్నారు. ఉన్నత విద్యలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు అందుకోవాలంటే 'పరీక్షల ప్రక్రియ'ను ప్రక్షాళన చేయాలని సూచించారు.

'సంక్షోభాల సమయంలో వెలిగేదెట్లా...?' అనే అంశంపై మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ఇండియా మాజీ ఛైర్మన్ రవి వెంకటేశన్ మాట్లాడారు. రిస్కు తీసుకునే వారిదే భవిష్యత్తు అని, అన్ని రకాల నైపుణ్యాల సాధనపై విద్యార్థులు దృష్టి పెట్టాలని సూచించారు. సానుకూల దృక్పథాన్ని, ప్రగతిదాయకమైన ఆలోచనా విధానాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని అన్నారు. చక్కగా మాట్లాడటం, సమాచార సేకరణ, పరిశోధన, ఆవిష్కరణ, సునిశితమైన పరిశీలన, సమస్యలను పరిష్కరించగల శక్తి... వంటి 21వ శతాబ్దపు లక్షణాలను అలవరచుకోవాలని కోరారు. నాణ్యమైన విద్యను అందించేందుకు 'ఇక్ఫాయ్' చేస్తున్న యత్నాలను వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ జె.మహేందర్‌రెడ్డి వివరించారు. అవ్రా ల్యాబ్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఏవీ రామారావుకు ఈ కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ స్నాతకోత్సవంలో 1687 మంది విద్యార్థులకు పట్టాలు ఇచ్చారు. అయిదుగురు విద్యార్థులు పీహెచ్‌డీ పట్టాలు పుచ్చుకున్నారు.

రంగరాజన్ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న అవ్రా ల్యాబ్స్ వ్యవస్థాపకుడు ఏవీ రామారావు

5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

పటిష్ఠ ప్రణాళిక, కార్యాచరణ అవసరం

ముఖ్య ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్

శుక్రవారం ఐఎస్‌బీలో జరిగిన కార్యక్రమంలో సీఈఏ కృష్ణమూర్తి సుబ్రమణియన్, ఐఎస్‌బీ ఫైనాన్స్ ప్రొఫెసర్ భగవాన్ చౌదరి

ఈనాడు, హైదరాబాద్: మన దేశం ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారేందుకు 55 సంవత్సరాలు పట్టిందని, అదే 2014-19 సంవత్సరాల మధ్య 1.7 ట్రి.డా. నుంచి 2.7 ట్రి.డా.కు చేరిందని ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) కృష్ణమూర్తి సుబ్రమణియన్ పేర్కొన్నారు. అందువల్ల పటిష్ఠ ప్రణాళిక, కార్యాచరణ వల్ల రాబోయే 5 సంవత్సరాలలో 5 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.350 లక్షల కోట్ల) ఆర్థిక వ్యవస్థగా మన దేశం మారడం సాధ్యమేనని తెలిపారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో ది గ్లోబల్ ఐఎస్‌బీ ఫోరమ్ ఆధ్వర్యంలో 'అయిదేళ్లలో 5 ట్రి.డా. ఆర్థిక వ్యవస్థ: మనం సాధించగలమా' అంశంపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఐఎస్‌బీ ఫైనాన్స్ ప్రొఫెసర్ అయిన కృష్ణమూర్తి ప్రస్తుతం సెలవుపై ఉండి, ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారుగా వ్యవహరిస్తున్నారు. ఐఎస్‌బీలోని మరో ఫైనాన్స్ ప్రొఫెసర్ భగవాన్ చౌదరి ఈ కార్యక్రమానికి ప్రయోక్తగా వ్యవహరించారు. వివిధ అంశాలపై కృష్ణమూర్తి ఏమన్నారంటే.. రాష్ట్రాలు కార్మిక సంస్కరణలు అమలు చేస్తేనే ఉద్యోగాల అధిక కల్పన సాధ్యమవుతుంది. ఈ విషయంలో రాజస్థాన్ తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిచ్చినందున, ఇతర రాష్ట్రాలు కూడా ముందడుగు వేయాలి.

ప్రోత్సాహకాలపై..

ప్రోత్సాహకాలను ప్రారంభస్థితిలోని కంపెనీలకు నిర్దిష్ట కాలపరిమితితో ఇవ్వాలి కానీ చిన్న కంపెనీలంటూ ఎల్లకాలమూ ఇచ్చుకుంటూ పోతే, ఉపయోగం ఉండదు. ప్రోత్సాహకాల మీదే ఆధారపడి మనుగడ సాగించేలా అవి మారతాయి. ప్రత్యేక ఆర్థిక మండళ్ల (ఎస్ఈజడ్‌లు) నెలకొల్పినప్పుడు ప్రోత్సాహకాలివ్వడంతో, సంప్రదాయ వ్యాపారాలు, పరిశ్రమలు కూడా వాటిల్లోకి చేరాయి. అందువల్ల వినూత్నత అభివృద్ధికి పరిశోధనలు చేయాలి కానీ, పన్ను ఎగవేతకు ప్రయత్నించవద్దనేది నా మనవి. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్నది కేంద్రప్రభుత్వ లక్ష్యం. ఇది సాకారం కావాలంటే రైతులు తమ దిగుబడులు నష్టపోకుండా, దళారుల బారిన పడకుండా ఉండాలి. అందుకు మార్కెట్లను చేరువ చేయాలి.

మరీ నిరాశ చెందొద్దు: వాహన విక్రయ గణాంకాలు తక్కువగా నమోదవ్వడం వాస్తవమే. ఇదే సమయంలో ఉక్కు వంటి రంగాలు రాణిస్తుండటం గమనార్హం. తయారీరంగ గణాంకాలు కూడా ఆకర్షణీయంగానే ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థ వృద్ధికి అన్ని రంగాలు ముఖ్యమే అయినందున, ఒక రంగం మందగమనంతోనే పూర్తిగా నిరాశా దృక్పథంతో వ్యవహరించవద్దు. వృద్ధి రేటు బాగుందనేందుకు, గణాంకాలను పెంచి చూపడం లేదు.

సార్వభౌమ బాండ్లపై..: మౌలిక సదుపాయల అభివృద్ధికి రూ.100 లక్షల కోట్లు వెచ్చించాలన్నది ప్రభుత్వ ప్రణాళిక. ఇందుకు అవసరమైన నిధులను దేశీయంగా సమీకరించాలంటే, 7-8% వడ్డీ చెల్లించాలి. ఇందువల్ల పౌరుల పొదుపురేటు పెరుగుతుంది కానీ వినిమయం తగ్గిపోతుంది. అందువల్ల తక్కువ వడ్డీరేట్లు ఉన్న విదేశాల్లో, అక్కడి కరెన్సీ రూపంలోనే నిధులు సమీకరించేందుకు సార్వభౌమ బాండ్లు జారీ చేయాలని ప్రతిపాదించాం.

సెన్సెక్స్ ▼ 87 **38736**

నిఫ్టీ ▼ 35 **11548**

డోజోన్స్ 27261 ▲173

నాస్‌డాక్ 8232 ▲ 36

అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 68.69 ▼ 25 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

ముడి చమురు 66.74 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

ఈనాడు బిజినెస్

ఘనం (+) నిఫ్టీ	12న	మార్పు%
HERO MOTOCORP	2569.80	2.47
VEDANTA	167.65	2.44
SUN PHARMA	407.70	2.40
TATA STEEL	472.90	2.36
ASIAN PAINTS	1361.95	2.21
YES BANK	94.20	1.89
TATA MOTORS	159.30	1.59

గ్రహణం (-) నిఫ్టీ	12న	మార్పు%
WIPRO	258.95	-3.29
ONGC	149.70	-2.22
BAJAJ FINANCE	3377.50	-2.13
INDUSIND BANK	1509.50	-2.06
L & T	1466.85	-1.90
COAL INDIA	231.25	-1.55
AXIS BANK	755.80	-1.38

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	62.33	72.27	బహ్రెయిన్ దీనార్	168.70	193.01
పౌండ్ స్టెర్లింగ్	78.14	90.63	కువైట్ దీనార్	186.24	231.53
యూరో	70.21	81.41	ఒమన్ రియాల్	165.07	189.10
జపనీస్ యెన్/100	57.48	66.67	సౌదీ రియాల్	16.58	19.64
ఆస్ట్రేలియా డాలరు	43.56	50.40	యూఏఈ దిర్హమ్	16.97	19.83
సింగపూర్ డాలరు	45.89	54.37	మలేషియా రింగిట్	14.85	18.26
థాయ్ బాత్/100	202.23	241.79	చైనీస్ యువాన్	7.05	11.44



ద్రవ్యోల్బణం పైకే

- జూన్‌లో 3.18 శాతానికి
- ఆహార పదార్థాలు ప్రియం

దిల్లీ: రిటైల్ ద్రవ్యోల్బణం వరుసగా ఆరో నెలా పెరిగింది. పప్పుధాన్యాలు, ప్రొటీన్లు అధికంగా ఉండే చేపలు, మాంసం లాంటి ఆహార పదార్థాలు ప్రియం కావడం ఇందుకు కారణమైంది. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని వినియోగ ధరల ఆధారిత సూచీతో (సీపీఐ) లెక్కిస్తారు. జూన్‌లో సీపీఐ 3.18 శాతానికి చేరింది. 2018 జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 4.92 శాతంగా నమోదైంది. ఈ ఏడాది జనవరిలో 1.97 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం.. అప్పటి నుంచి పెరుగుతూనే వస్తుండటం గమనార్హం. జూన్ నెలకు కేంద్ర గణక కార్యాలయం విడుదల చేసిన రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాల వివరాలు ఇలా..

✦ జూన్‌లో ఆహార పదార్థాల ధరలు 2.17 శాతం మేర ప్రియమయ్యాయి. మేలో వీటి ద్రవ్యోల్బణ రేటు 1.83 శాతమే.

✦ మాంసం, చేపల ధరల్లో 9.01 శాతం పెరుగుదల ఉంది. మేలో ఇవి 8.1 శాతం మేర ప్రియమయ్యాయి.

✦ పప్పుల ద్రవ్యోల్బణం రేటు 2.13% నుంచి 5.68 శాతానికి, తృణ ధాన్యాల ద్రవ్యోల్బణ రేటు 1.21 శాతం నుంచి 1.31 శాతానికి పెరిగింది.

✦ పండ్లలో ప్రతిద్రవ్యోల్బణ స్థితి కొనసాగింది. మేలో వీటి ప్రతిద్రవ్యోల్బణ రేటు -4.18 శాతంగా నమోదైంది. కూరగాయల ద్రవ్యోల్బణం 4.66 శాతానికి దిగివచ్చింది.

✦ ఇంధనం, విద్యుత్ విభాగాల ద్రవ్యోల్బణ రేటు కూడా 2.32 శాతానికి తగ్గింది.



పారిశ్రామికోత్పత్తి డీలా

- మేలో 3.1 శాతానికి తగ్గిన వృద్ధి
- నెమ్మదించిన తయారీ, గనుల రంగాలు

దిల్లీ: గనులు, తయారీ రంగాల్లో ఉత్పత్తి నెమ్మదించడంతో మేలో పారిశ్రామికోత్పత్తి వృద్ధి డీలాపడింది. పారిశ్రామికోత్పత్తి వృద్ధిని పారిశ్రామికోత్పత్తి సూచీతో (ఐఐపీ) లెక్కిస్తారు. మేలో ఇది 3.1 శాతానికి దిగివచ్చింది. 2018 మేలో పారిశ్రామికోత్పత్తి వృద్ధి రేటు 3.8 శాతంగా ఉండగా.. ఈ ఏడాది ఏప్రిల్‌లో 4.3 శాతంగా నమోదైంది. శుక్రవారం కేంద్ర గణక కార్యాలయం విడుదల చేసిన గణాంకాల వివరాలు ఇలా..

✦ మేలో గనులు రంగ ఉత్పత్తిలో కేవలం 3.2 శాతం మాత్రమే వృద్ధి ఉంది. ఏడాది క్రితం ఇదే నెలలో నమోదైన 5.8 శాతంతో పోలిస్తే వృద్ధి బాగా తగ్గింది.

✦ తయారీ రంగ వృద్ధి కూడా గణనీయంగా తగ్గి 2.5 శాతానికి పరిమితమైంది. గతేడాది మేలో ఈ రంగ ఉత్పత్తి 3.6% వృద్ధి రేటును నమోదుచేసింది.

✦ ఏడాది క్రితంతో పోలిస్తే తయారీ రంగంలోని 23 పరిశ్రమ విభాగాల్లో 12 మాత్రమే సానుకూల వృద్ధిని నమోదుచేశాయి.

✦ పెట్టుబడులకు ప్రామాణికంగా పరిగణించే భారీ యంత్రపరికరాల ఉత్పత్తిలో స్వల్పంగా 0.8 శాతం వృద్ధి ఉంది. కిందటేడాది మేలో ఈ రంగ ఉత్పత్తి గణనీయ స్థాయిలో 6.4 శాతం పెరగడం గమనార్హం.



ఆర్థిక శాఖ పరిశీలనలో షేర్ల బైబ్యాక్‌పై పన్ను

దిల్లీ: నమోదిత(లిస్టెడ్) కంపెనీలు చేపడుతున్న షేర్ల తిరిగి కొనుగోలు(బైబ్యాక్)పై 20 శాతం పన్ను విధించాలన్న బడ్జెట్ ప్రతిపాదన అంశాన్ని పరిశీలిస్తామని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రతిపాదిత పన్ను లక్ష్యం షేర్ల బైబ్యాక్‌లను తగ్గించి.. పెట్టుబడులకు ప్రోత్సాహం ఇవ్వడమేనని ఆర్థిక కార్యదర్శి సుభాశ్ చంద్ర గార్గ్ శుక్రవారమిక్కడ జరిగిన సీఐఐ కార్యక్రమంలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ షేర్ల బైబ్యాక్‌లపై మినహాయింపును పరిశీలిస్తుందా అని అడగ్గా.. 'ఆ విషయంపై నేను చెప్పే పరిస్థితిలో లేను. అయితే రెవెన్యూ విభాగంతో చర్చలు జరుగుతున్నాయ'ని ఆయన అన్నారు. కాగా, ప్రస్తుతం నమోదు కాని(అన్‌లిస్టెడ్) కంపెనీల తరహాలోనే నమోదిత కంపెనీలపైనా షేర్ల బైబ్యాక్‌పై అదనంగా 20 శాతం పన్నును విధించాలని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన విషయం విదితమే. డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ పన్ను(డీడీటీ)ను తప్పించుకోకుండా చూడడం ఈ చర్య ముఖ్యోద్దేశం. 'కంపెనీలు పెట్టుబడులు పెడితే బైబ్యాక్‌ల అవసరం ఉండదు. ఆ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులకే ఎక్కువ అవకాశం ఉంది. మా ప్రాధాన్యం ప్రకారం పెట్టుబడులను ప్రోత్సహించడానికే మొగ్గుచూపుతామ'ని గార్గ్ పేర్కొన్నారు.

విదేశీ మదుపర్ల అండతో..

ఒక షేరు భారీగా పెరుగుతోందంటే అందులోకి విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐలు) ప్రవేశించారని అర్థం. అవును మీరు చదువుతున్నది నిజమే. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ మరోసారి దీన్ని రుజువు చేసింది. ఇంతకీ ఈ షేరు గురించి ఇప్పుడు ఎందుకు చెబుతున్నాం అనుకుంటున్నారా? శుక్రవారం ఈ షేరు 52 వారాల గరిష్ఠానికి చేరడంతో పాటు, నిఫ్టీ నెక్స్ట్ 50 షేర్లలో అత్యధిక లాభం పొందిన షేరుగా నిలిచింది. అంతే కాదు.. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి నేటి (శుక్రవారం) వరకు సుమారు 34 శాతం పెరిగింది.

✦ 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ లైఫ్ అధిక వృద్ధి నమోదు చేస్తుందన్న అంచనాలతో ఎఫ్‌పీఐలు భారీగా కొనుగోళ్లు చేస్తూ వస్తున్నారు. 2019 మార్చి నాటికి ఈ కంపెనీలో వారి వాటా 18.42 శాతం ఉండగా, జూన్ త్రైమాసికానికి 25.56 శాతానికి పెంచుకున్నారు.

✦ బీఎస్ఈలో షేరు గత ముగింపు రూ.754.30తో పోలిస్తే 3.49 శాతం లాభంతో 780.60 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఒక దశలో రూ.789 స్థాయిని కూడా తాకింది. సుమారు 93,000 షేర్లు చేతులు మారాయి. ఎన్ఎస్ఈలో సైతం గత ముగింపు రూ.754.10తో పోలిస్తే 3.53 శాతం లాభంతో రూ.780.70 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో రూ.789.30 స్థాయిని నమోదు చేసింది. 18,17,841 షేర్లు చేతులు మారాయి.

ఇండస్‌ఇండ్ బ్యాంక్ లాభం రూ.1,433 కోట్లు

ముంబయి: ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి రూ.1,433 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో బ్యాంకు నమోదు చేసిన నికర లాభం రూ.1,035.72 కోట్లతో పోలిస్తే ఇది 38.3 శాతం అధికం. భారత్ ఫైనాన్షియల్‌ను విలీనం చేసుకోవడంతోనే లాభం భారీగా పెరిగినట్లు బ్యాంకు ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ.6,369.75 కోట్ల నుంచి రూ.8,624.62 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 34 శాతం పెరిగి రూ.2,844 కోట్లకు చేరింది. రుణ వృద్ధి 28 శాతం నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎమ్) 4.05 శాతానికి పెరిగింది.

కర్ణాటక బ్యాంక్ లాభం ఆకర్షణీయం

దిల్లీ: ఏప్రిల్- జూన్ త్రైమాసికానికి కర్ణాటక బ్యాంక్ రూ.175.42 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఇది బ్యాంకుకు జీవన కాల గరిష్ఠ లాభం. ఏడాదిక్రితం ఇదే సమయంలో నమోదైన రూ.163.24 కోట్లతో పోలిస్తే ఈసారి లాభం 7 శాతం పెరిగింది. మొత్తం ఆదాయం కూడా రూ.1,616.44 కోట్ల నుంచి పెరిగి రూ.1,829.16 కోట్లకు చేరింది. సమీక్ష త్రైమాసికంలో స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 4.72 శాతం నుంచి తగ్గి 4.55 శాతానికి పరిమితమయ్యాయి. అయితే నికర నిరర్థక ఆస్తులు మాత్రం 2.92 శాతం నుంచి 3.33 శాతానికి పెరిగాయి.

గంటకు 129 కి.మీ వేగం

- టీవీఎస్ నుంచి తొలి ఇథనాల్ బైకు
- ధర రూ.1,20,000

దిల్లీ: టీవీఎస్ మోటార్ కంపెనీ నుంచి తొలి ఇథనాల్ ఆధారిత మోటార్ సైకిల్ విపణిలోకి వచ్చింది. టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 200 ఫి ఈ100 పేరుతో రూపొందించిన ఈ బైకు ధరను రూ.1,20,000గా నిర్ణయించింది. దీన్ని కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ, నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్, టీవీఎస్ మోటార్ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్ విడుదల చేశారు. 'కొత్త ఇథనాల్ బైకును నితిన్ గడ్కరీ సమక్షంలో ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉంది. ప్రస్తుతం ద్విచక్ర వాహన పరిశ్రమ ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలపై దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగానే అన్ని సంస్థలు విద్యుత్, హైబ్రిడ్ వాహనాలను తీసుకొస్తున్నాయి. మేము కూడా ఇథనాల్ ఆధారిత ఉత్పత్తుల్ని ఖాతాదారులకు అందించేందుకు సిద్ధమయ్యామ'ని వేణు శ్రీనివాసన్ వెల్లడించారు. గంటకు 129 కి.మీ. గరిష్ఠ వేగం దీని ప్రత్యేకత. ఈ ప్రత్యేక ఎడిషన్ ఇథనాల్ బైకులు మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటకలో లభ్యమవుతాయి.

దిల్లీలో టీవీఎస్ ఇథనాల్ బైకును ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్, టీవీఎస్ మోటార్ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్ తదితరులు

మళ్లీ వాణిజ్య ఉద్రిక్తతలు

సమీక్ష

సూచీలు మళ్లీ నష్టాల బాట పట్టాయి. అంతర్జాతీయ ప్రతికూలతలు, కంపెనీల ఆర్థిక ఫలితాలపై అనిశ్చితుల నేపథ్యంలో మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. దీనికితోడు వినియోగదారు ఆధారిత సూచీ (సీపీఐ) ద్రవ్యోల్బణ గణాంకాలపైనా వారు దృష్టి సారించారు. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి రావడంతో సెన్సెక్స్ 87 పాయింట్లు, నిఫ్టీ 30 పాయింట్ల మేర నష్టపోయాయి. వారం ప్రాతిపదికన చూస్తే సెన్సెక్స్ 777 పాయింట్లు (1.96 శాతం), నిఫ్టీ 259 పాయింట్లు (2.18 శాతం) చొప్పున కోల్పోయాయి. అంతర్జాతీయ సూచీలకొస్తే ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు కూడా అదే బాటలో నడిచాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 25 పైసలు నష్టపోయి 68.69 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ ఉదయం 38,941.10 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. కొద్దిసేపటికి నష్టాల్లోకి జారుకున్న సూచీ మధ్యాహ్నం వరకు ఒడుదొడుకుల మధ్య కొనసాగింది. తర్వాత వచ్చిన కొనుగోళ్ల మద్దతుతో 39,021.84 పాయింట్ల గరిష్ఠాన్ని నమోదు చేసింది. అయితే చివర్లో ఒక్కసారిగా వచ్చిన అమ్మకాల ఒత్తిడితో ఒక దశలో 38,684.85 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 86.88 పాయింట్ల నష్టంతో 38,736.23 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 30.40 పాయింట్లు కోల్పోయి 11,552.50 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 11,639.55-11,538.60 పాయింట్ల మధ్య కదలాడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 14 లాభాల బాట పట్టాయి. వరుసగా రెండో రోజూ హీరో మోటోకార్ప్ అత్యధికంగా 2.46 శాతం లాభపడింది. వేదాంతా 2.44%, సన్ ఫార్మా 2.41%, టాటా స్టీల్ 2.34%, ఏషియన్ పెయింట్స్ 2.08%, యెస్ బ్యాంక్ 1.89%, టాటా మోటార్స్ 1.53%, ఇన్ఫోసిస్ 0.87% మేర లాభపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్ అత్యధికంగా 2.08 శాతం నష్టపోయింది. ఓఎన్‌జీసీ 2.06%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.98%, ఎల్అండ్‌టీ 1.85%, యాక్సిస్ బ్యాంక్ 1.46%, భారతీ ఎయిర్‌టెల్ 1.33%, పవర్‌గ్రిడ్ 1.27%, హెచ్‌యూఎల్ 0.95%, మారుతీ సుజుకీ 0.89%, ఎన్‌టీపీసీ 0.62% చొప్పున నష్టపోయాయి. రంగాల వారీ సూచీలకొస్తే భారీ యంత్ర పరికరాలు, టెలికాం, చమురు-గ్యాస్, ఇంధనం, బ్యాంకింగ్, ఆర్థిక రంగ షేర్లు 1.22 శాతం వరకు కోల్పోయాయి.

డాక్టర్ రెడ్డీస్ బొల్లారం యూనిట్‌పై యూఎస్ఎఫ్‌డీఏ అభ్యంతరాలు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ శివార్లలోని బొల్లారంలో కల డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు చెందిన ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియంట్స్) యూనిట్‌ను తనిఖీ చేసిన అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) బృందం కొన్ని లోటుపాట్లను గుర్తించింది. తత్ఫలితంగా యూఎస్ఎఫ్‌డీఏ నుంచి డాక్టర్ రెడ్డీస్‌కు 5 అభ్యంతరాలతో కూడిన '483 పత్రం' జారీ అయింది. ''బొల్లారంలోని ప్లాంట్-2లో యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీ శుక్రవారం పూర్తయింది. మాకు 5 అభ్యంతరాలతో కూడిన 483 పత్రాన్ని జారీ చేశారు'' అని డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. నిర్ణీత గడువు లోగా ఈ లోటుపాట్లను సరిదిద్దేందుకు ప్రయత్నిస్తామని పేర్కొంది.

12న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

కోడిగుడ్లు

హైదరాబాద్	415	వరంగల్	418
చిల్లరగా(ఒక గుడ్డు)	4.75	విశాఖపట్నం	444
బెంగళూరు	435	చెన్నై	455
13వ తేదీకి...		చిత్తూరు	448
విజయవాడ/గోదావరి	408	నమక్కల్	445

విపణిలోకి సుజుకీ కొత్త జిక్సర్

- ధర రూ.1,00,212

దిల్లీ: సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా (ఎస్ఎంఐపీఎల్) తమ జిక్సర్ మోడల్‌లో కొత్త వెర్షన్‌ను విపణిలోకి విడుదల చేసింది. దీని ధర రూ.1,00,212 (ఎక్స్-షోరూమ్, దిల్లీ). 155 సీసీ, 4 స్ట్రోక్, సింగిల్ సిలిండర్ ఇంజిన్ సామర్థ్యంతో దీన్ని రూపొందించింది. యాంటీ-లాక్ బ్రేకింగ్ (ఏబీఎస్) దీని సొంతమని కంపెనీ పేర్కొంది. 'కొత్త సుజుకీ జిక్సర్‌ను ప్రతి రైడ్‌లో ఉల్లాసం, శక్తిని కోరుకొనే డైనమిక్ రైడర్లను దృష్టిలో ఉంచుకొని రూపొందించాం. సుజుకీ కుటుంబాన్ని విస్తరించడంలో భాగంగా భారతీయ విపణి కోసం ప్రత్యేకంగా ఉత్పత్తుల్ని రూపొందిస్తున్నామ'ని ఎస్ఎంఐపీఎల్ ప్రతినిధి కొయిచిరో హిరావ్ వెల్లడించారు.

డచ్ కోర్టు ప్రతినిధి వాదనలు వింటాం

- జెట్ దివాలా కేసులో ఎన్‌సీఎల్ఏటీ అంగీకారం

దిల్లీ: జెట్ ఎయిర్‌వేస్ దివాలా కేసులో డచ్ కోర్టు ప్రతినిధి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు వినడానికి ద నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రైబ్యునల్(ఎన్‌సీఎల్ఏటీ) అంగీకరించింది. దిగువ కోర్టుల ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. ఇద్దరు యూరోపియన్ రుణదాతలకు చెల్లింపులు చేయడంలో విఫలం కావడంతో నెదర్లాండ్స్‌లోనూ ఈ కంపెనీ దివాలా ప్రక్రియను ఎదుర్కొంటోంది. దీంతో డచ్ కోర్టు ఈ విషయంపై ఒక ప్రతినిధిని నియమించింది. రెండు వేర్వేరు దేశాల్లో ఒకే కంపెనీపై దాఖలైన రెండు దివాలా పిటిషన్లపై తీసుకోవాల్సిన చట్టబద్ధ చర్యలపై జస్టిస్ ఎస్.జె ముఖోపాధ్యాయ్ ఆధ్వర్యంలోని ముగ్గురు సభ్యుల ఎన్‌సీఎల్‌టీ ధర్మాసనం స్పష్టత ఇవ్వనుంది. దివాలా ప్రక్రియలో భాగంగా జెట్ ఎయిర్‌వేస్ ఆస్తులను విక్రయించకుండా ఉండడానికి డచ్ ప్రతినిధి అంగీకరించారు. రెండు వారాల్లోగా స్పందన తెలపాలంటూ జెట్ ఎయిర్‌వేస్ రుణదాతల కన్సార్షియానికి ఎన్‌సీఎల్ఏటీ నోటీసు జారీ చేసింది. తదుపరి విచారణ తేదీని ఆగస్టు 21గా నిర్ణయించింది. ఏప్రిల్‌లో ఇద్దరు యూరోపియన్ రుణదాతలు తమకు రూ.280 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

సొంత ఇష్టాయిష్టాలకే ప్రాధాన్యం

- ఫర్నిచర్ కొనుగోళ్లలో మారుతున్న ధోరణి
- ఈ ఏడాదిలో 15- 20% వృద్ధి లక్ష్యం
- గోద్రెజ్ ఇంటీరియో సీనియర్ ఉపాధ్యక్షుడు సుబోధ్ మెహతా

గోద్రెజ్ ఇంటీరియో సీనియర్ ఉపాధ్యక్షుడు సుబోధ్ మెహతా

ఈనాడు - హైదరాబాద్

సొంత ఇల్లు ఎంతోమంది కల. ఆ కలను నెరవేర్చుకున్న వారు తమ ఇంటిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకోవాలనుకుంటారు. అందులో భాగంగా ఇంటీరియర్ డిజైన్, ఫర్నిచర్, ఆధునిక వంటగది... తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారిస్తారు. మార్కెట్లో అందుబాటులో ఉన్న ఫర్నిచర్ తెచ్చుకోవటం కాకుండా తమ కోసమే తయారు చేసుకున్న... ఇంటికి అనువైన ఫర్నిచర్, వార్డ్‌రోబ్ సమకూర్చుకోవాలని ఆశపడతారు. ఇలా వినియోగదార్ల అభిరుచులు గతంతో పోల్చితే ఎంతో మారుతున్నట్లు, నచ్చిన విధంగా ఫర్నిచర్ తయారు చేయించుకునేందుకు (కస్టమైజ్డ్) ఎక్కువ మంది ప్రాధాన్యం ఇస్తున్నారని గోద్రెజ్ ఇంటీరియో సీనియర్ ఉపాధ్యక్షుడు సుబోధ్ మెహతా తెలిపారు. సొంత ఇంటికి ఫర్నిచర్ కొనేవాళ్లలో 80 శాతం మంది కస్టమైజ్డ్ ఫర్నిచర్ వైపు మొగ్గుచూపుతున్నారని అన్నారు. అంతేగాక ఫర్నిచర్ ఎంపికలో పురుషుల కంటే మహిళల మాటే చెల్లుతోందని పలు సర్వేల్లో స్పష్టమైనట్లు వివరించారు. దీనికి తగ్గట్లుగా తాము సరికొత్త డిజైన్లు, ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్నట్లు ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తమకు సొంత డిజైన్ స్టూడియోతో పాటు దేశవ్యాప్తంగా 7 ప్రాంతాల్లో కర్మాగారాలు ఉన్నాయని తెలిపారు. మన దేశంలో ఫర్నిచర్, వార్డ్‌రోబ్, స్టోరేజ్ స్పేస్ సామగ్రి మార్కెట్ విలువ దాదాపు రూ.75,000 కోట్లు. ఇందులో 80 శాతం అసంఘటిత రంగంలో ఉండగా, సంఘటిత రంగం వాటా 20 శాతం మాత్రమే. అయినప్పటికీ మారుతున్న వినియోగదార్ల అభిరుచుల ఫలితంగా సంఘటిత రంగంలో మెరుగైన వృద్ధి నమోదు అవుతున్నట్లు సుబోధ్ మెహతా తెలిపారు. దీనికి అనుగుణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 15- 20 శాతం వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

ఆన్‌లైన్ అమ్మకాల పెంపుపై దృష్టి

ప్రస్తుత ఇ-కామర్స్ యుగంలో ఆన్‌లైన్ అమ్మకాలపై దృష్టి సారించటం ఏ సంస్థకైనా తప్పనిసరి. ఇదేకోవలో గోద్రెజ్ ఇంటీరియో కూడా సన్నాహాలు ప్రారంభించింది. ఆన్‌లైన్ విభాగంలో విస్తరించే లక్ష్యంతో ప్రస్తుత వెబ్‌సైట్‌ను పూర్తిగా మార్పులు, చేర్పులతో తీర్చిదిద్దుతున్నట్లు మెహతా వెల్లడించారు. ఈ కొత్త సైట్ ఈ ఏడాది డిసెంబరు నాటికి సిద్ధమవుతుందని పేర్కొన్నారు.

ఏపీ, తెలంగాణ ఎంతో ముఖ్యం...

గోద్రెజ్ ఇంటీరియోకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు ఎంతో ముఖ్యమైన మార్కెట్లుగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. దేశం మొత్తం మీద తాము నమోదు చేసే వ్యాపారంలో ఈ రెండు రాష్ట్రాల వాటా 14 శాతం ఉన్నట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో 20 శాతం, ఏపీలో 19 శాతం అధిక విక్రయాలు నమోదు చేసినట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే స్థాయి వృద్ధిని ఆశిస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం నగరాల్లో అమ్మకాలు అధికంగా ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం తమకు 7 సొంత స్టోర్లు, ముగ్గురు డీలర్లు ఉన్నట్లు, కొత్తగా 4 సొంత స్టోర్లను ఏర్పాటు చేయటంతో పాటు అయిదుగురు డీలర్లను నియమించనున్నామని వెల్లడించారు. అదేవిధంగా ఏపీలో ఇప్పుడు 4 సొంత స్టోర్లు, ఏడుగురు డీలర్లు ఉండగా, రెండు కొత్త స్టోర్లు, అయిదుగురు డీలర్లను నియమించాలని అనుకుంటున్నట్లు తెలిపారు.

బ్యాంకుపై ఆరోపణల కేసులో
రాహుల్ గాంధీకి బెయిల్

అహ్మదాబాద్: కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీకి 'అహ్మదాబాద్ జిల్లా సహకార బ్యాంకు' కేసులో శుక్రవారం బెయిల్ లభించింది. 2016లో పెద్దనోట్ల రద్దును ప్రకటించిన 5 రోజుల వ్యవధిలోనే ఈ బ్యాంకు రూ.750 కోట్ల విలువైన రద్దయిన నోట్లను కొత్త వాటితో మార్పిడి చేసిందన్న రాహుల్ ఆరోపణలపై బ్యాంకు పరువునష్టం దావా వేసింది. ప్రస్తుత కేంద్రమంత్రి అమిత్ షా అప్పట్లో ఈ బ్యాంకు డైరెక్టర్లలో ఒకరుగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి తానేమీ తప్పు చేయలేదని రాహుల్‌గాంధీ వాదించారు. బెయిల్ మంజూరు చేసిన కోర్టు.. కేసు తదుపరి విచారణను సెప్టెంబరు ఏడోతేదీకి వాయిదా వేసింది.

రైల్వే అధికారులపై సీబీఐ కేసు

దిల్లీ: రైల్వేలను రూ.100 కోట్ల మేర మోసం చేశారనే ఆరోపణలపై ఆ సంస్థ అధికారులపై సీబీఐ కేసు నమోదు చేసింది. పత్రికల్లో టెండర్ ప్రకటనల జారీకి సంబంధించిన వ్యవహారంలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంలో ఈశాన్య ఫ్రాంటియర్ రైల్వే ప్రజాసంబంధాల విభాగం సీనియర్ అధికారి దిలీప్‌చంద్ర బోస్, కార్యాలయ సూపరింటెండెంట్లు హరధన్‌డే, బాబుల్ చంద్ర మేధి, ముఖ్య ప్రచార ఇన్‌స్పెక్టర్ ఎంఎంవై ఆలం, అకౌంట్స్ సహాయకుడు హితేష్ డేకా, సీనియర్ క్యాషియర్ ప్రబీర్‌దాస్‌లపై సీబీఐ కేసు నమోదు చేసింది.

వీసా రుసుం పెంచనున్న నేపాల్!

కాఠ్‌మాండూ: నేపాల్ సందర్శించే విదేశీ పర్యాటకుల వీసా రుసుం ఈ నెల 17 నుంచి పెరిగే అవకాశం ఉంది. విదేశీ పర్యాటకుల వీసా ఛార్జీలను పెంచాలన్న నిర్ణయాన్ని మే నెలలోనే ప్రభుత్వం తీసుకుంది. రుసుము పెంపు నామమాత్రంగానే ఉంటుందని ఇమిగ్రేషన్ విభాగం అధికారులు శుక్రవారం తెలిపారు.

కుంభకోణాలపైనే మీ దృష్టంతా..

- మీ పాలనలో ఆర్థిక వ్యవస్థ ఎందుకు రెట్టింపు కాలేదు?
- కాంగ్రెస్‌పై ఆర్థికమంత్రి విమర్శలు

ఈనాడు - దిల్లీ:

దేశ ఆర్థిక వ్యవస్థ అయిదేళ్లకోసారి రెట్టింపవుతుందని, అందుకోసం ప్రభుత్వాలే ఉండాల్సిన అవసరంలేదని ఆర్థికశాఖ మాజీ మంత్రి పి.చిదంబరం చేసిన వ్యాఖ్యలను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ గట్టిగా తిప్పికొట్టారు. 'మీరు చెప్పినదే నిజమైతే స్వాతంత్ర్యానంతరం 60ఏళ్ల పాలించిన కాంగ్రెస్ హయాంలో ఆర్థిక వ్యవస్థ ఎందుకు రెట్టింపుకాలేదు? మీది 'హిందూ వృద్ధి రేటు' (ఆర్థిక సంస్కరణలకు ముందు అంతంతమాత్రంగా ఉన్న వృద్ధి రేటు) అన్న ఆరోపణలు మన మీద ఎందుకు వచ్చాయి? యూపీఏ ప్రభుత్వ హయాంలో ఆర్థిక వ్యవస్థ వృద్ధి పై ఎందుకు దృష్టి పెట్టలేదు? ఎందుకు కుంభకోణాలు వరసగా జరిగాయి?' అని ప్రశ్నించారు. శుక్రవారం రాజ్యసభలో బడ్జెట్‌పై చర్చకు మంత్రి సమాధానమిస్తూ చిదంబరం చేసిన ఆరోపణలకు ఒక్కొక్కటిగా బదులిచ్చారు. 5 ట్రిలియన్ డాలర్లు అనేది కేవలం గణాంకమని, వడ్డీవ్యాపారి కూడా ఆ పనిచేయగలరని చిదంబరం వ్యాఖ్యానించడంపై మండిపడ్డారు. ఆర్థిక వ్యవస్థ తనంతటతానుగా రెట్టింపవుతుందనే యూపీఏ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థపై దృష్టి పెట్టకుండా కుంభకోణాలపై దృష్టిసారించినట్లుందని ఎద్దేవా చేశారు. ద్రవ్యోల్బణం, రూపాయివిలువ తరుగుదల, మారకపు విలువ లాంటి ఎన్నింటిపైనో దృష్టిపెడితే తప్ప ఆర్థిక వ్యవస్థ రెట్టింపవడం సాధ్యం కాదన్నారు. చిదంబరం హయాంలో ప్రవేశపెట్టిన స్వచ్ఛంద ఆదాయ వెల్లడి పథకాన్ని కాగ్ తీవ్రంగా తప్పుబట్టిందన్నారు. ఆర్థికమంత్రిగా చిదంబరం ఉన్నప్పుడు ఆర్థికలోటును 4.8%కి పరిమితం చేసి చూపడానికి ఎన్నో బిల్లులు చెల్లించలేదని ఆ భారాన్ని తర్వాత వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం మోయాల్సి వచ్చిందన్నారు. గత 22 ఏళ్లలో 11 సంస్కరణలు మాత్రమే వచ్చాయన్న చిదంబరం వ్యాఖ్యలకు సమాధానమిస్తూ గత అయిదేళ్లలో తాము 16 సంస్కరణలు తీసుకొచ్చామన్నారు.

రాజ్యసభలో మాట్లాడుతున్న నిర్మలాసీతారామన్

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 4,800 ఎంబీబీఎస్ సీట్లు

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఈ ఏడాది దాదాపు 4,800 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి హర్షవర్ధన్ శుక్రవారం లోక్‌సభకు వెల్లడించారు. ప్రస్తుతం నీట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల కోసం దాదాపు 75,000 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

★ దేశంలో ప్రజారోగ్యానికి గాను కృత్రిమ మేధ (ఏఐ)ను సురక్షిత మార్గాల్లో వినియోగించే దిశగా కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. క్యాన్సర్ బయోబ్యాంక్ (రోగులకు సంబంధించిన 20 వేలకు పైగా రేడియాలజీ, పాథాలజీ ఇమేజెస్ డేటాబేస్) రూపకల్పన వంటి వాటిలో ఏఐని వినియోగించనున్నట్లు చెప్పారు.

★ రైల్వేను ప్రైవేటీకరించనున్నట్లు ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం లోక్‌సభలో తోసిపుచ్చారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా కొత్త సాంకేతికత, మార్గాలు, ప్రాజెక్టుల్లో పెట్టుబడులను మాత్రం ఆహ్వానించనున్నట్లు వెల్లడించారు. కొన్ని యూనిట్లను కార్పొరేటీకరించనున్నట్లు తెలిపారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యాలను ప్రోత్సహించేందుకు నిర్ణయించినట్లు వివరించారు. మంత్రి సభను తప్పుతోవ పట్టిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ లోక్‌సభా పక్ష నేత అధీర్ రంజన్ చౌదరితో కలిసి ఆ పార్టీ సభ్యులు పలుమార్లు నిరసన వ్యక్తం చేశారు.

అర్ధరాత్రి వరకు చర్చ..: లోక్‌సభ గురువారం అర్ధరాత్రి (11.58 గంటల) వరకు చర్చ కొనసాగించడం ద్వారా రికార్డు సృష్టించింది. రైల్వేశాఖకు సంబంధించిన కేటాయింపుల డిమాండ్లపై చర్చ జరిగింది. దాదాపు 18 ఏళ్లలో లోక్‌సభ ఇంత సుదీర్ఘంగా సమావేశం కావడం ఇదే తొలిసారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ట్విటర్‌లో తెలిపారు.

ఉపరాష్ట్రపతి ఎదుట కళా ప్రదర్శన

దిల్లీలో ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్ రెడ్డి ఎదుట శుక్రవారం సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న ఈ చిన్నారులు నన్హీ దునియా సంస్థకు చెందినవారు. వారంతా పోలండ్‌లో ఇటీవల 'బ్రేవ్ కిడ్స్ ఫెస్టివల్-2019'లో పాల్గొన్నారు.

ఆరోగ్యం, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి

భాజపా మహిళా ఎంపీలకు ప్రధాని సూచన

దిల్లీ: ఆరోగ్యం, పారిశుద్ధ్యం, శిశువుల్లో పోషకాహారం లోపాన్ని అరికట్టడం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలని భాజపా మహిళా ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. శుక్రవారం ప్రధాని నివాసంలో మహిళా ఎంపీలతో అల్పాహార సమావేశం నిర్వహించారు. 30 మందికిపైగా ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై తమ అభిప్రాయాలను వారు ప్రధానితో పంచుకున్నారు. ప్రతి మహిళా ఎంపీ ఒక వ్యవస్థ అని ప్రధాని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. మహిళలకు అద్భుతమైన నైపుణ్యాలు ఉంటాయని, ప్రజలతో అనుసంధానమయ్యేందుకు అవి ఎంతగానో తోడ్పడతాయని ఆయన అన్నారు. భాజపాకు చెందిన విభిన్న వర్గాల పార్లమెంటు సభ్యులతో ప్రధాని వరసగా సమావేశాలు జరుపుతున్నారు.

27కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

ఐక్యరాజ్యసమితి: భారత్‌లో పేదరిక నిర్మూలన కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. 2006-16 మధ్య పదేళ్లలో కాలంలో 27.1 కోట్ల మందిని పేదరికం నుంచి దేశం గట్టెక్కించిందని వెల్లడించింది. పేదరికానికి సరికొత్త అర్థాన్ని చెబుతూ బహుముఖీయమైన పేదరిక సూచీ(ఎంపీఐ)ల ఆధారంగా జరిపిన విస్తృత అధ్యయనం వివరాలను ఐక్యరాజ్యసమితి గురువారం వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా 101 దేశాల్లో ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం(యూఎన్‌డీపీ), ఆక్స్‌ఫర్డ్ పేదరిక, మానవాభివృద్ధి కార్యక్రమం (ఓపీహెచ్ఐ) విభాగాలు సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించాయి. పేదరిక నిర్మూలనలో దక్షిణాసియా దేశాలు మంచి పనితీరును కనబరిచాయని, వీటిలో భారత్ అగ్ర భాగాన ఉందని నివేదిక పేర్కొంది.

ఎయిర్ కెనడా విమానాన్ని కుదిపేసిన గాలి!

ఎయిర్ కెనడా విమానంలో సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది. (అంతర చిత్రంలో) ఓ ప్రయాణికురాలు విమానం పైభాగానికి గట్టిగా ఢీకొట్టుకోవడంతో ప్యానల్ ఊడిపోయి బయటకు వచ్చిన ఆక్సిజన్ మాస్క్

హొనొలులు: పసిఫిక్ మహాసముద్రం మీదుగా ఆకాశంలో సాగిపోతున్న విమానంలో... అకస్మాత్తుగా భారీ కుదుపు. ఈ లోహవిహంగం ఒక్కసారిగా ఊగిపోయింది. ఇక మన పని అయిపోయినట్టే అని అందరూ భయపడ్డారు. అదృష్టవశాత్తూ గాయాలతో బయటపడ్డారు. ఎయిర్ కెనడాకు చెందిన బోయింగ్ 777-200 విమానం... 269 మంది ప్రయాణికులు, 15 మంది సిబ్బందితో గురువారం బ్రిటిష్ కొలంబియాలోని వాంకోవర్ నుంచి సిడ్నీకి బయల్దేరింది. సముద్ర మట్టానికి 10,973 మీటర్ల ఎత్తులో వెళ్తుండగా గాలుల అసాధారణ చలనంతో విమానం ఊగిపోయింది. 'టర్బులెన్స్'గా పిలిచే ఈ పరిస్థితితో విమానం తలకిందులైంది. సీటు బెల్టు పెట్టుకోనివారు, నిలబడిన వారు ఒక్కసారిగా జారి పడ్డారు. కొంతమంది సీట్లలోంచి ఎగిరిపడి లగేజ్ కంపార్టుమెంట్ వరకూ జారిపోయారు. విమానం తలకిందులవడంతో కొంత మంది విమానం పైభాగానికి వేగంగా వెళ్లి అతుక్కున్నారు. చిన్నాపెద్దా కలిపి మొత్తం 37 మందికి గాయాలయ్యాయి. పైలట్లు చాకచక్యంగా విమానాన్ని హవాయ్‌లోని హొనొలులు ఎయిర్‌పోర్టులో క్షేమంగా దించేశారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అప్పటికే అక్కడ నిరీక్షిస్తున్న అత్యవసర వైద్య, సహాయక సిబ్బంది... గాయపడ్డ వారందర్నీ హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

'సివిల్స్' ప్రిలిమినరీ ఫలితాలు విడుదల

దిల్లీ: సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షా ఫలితాలను కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) శుక్రవారం విడుదల చేసింది. ఈ ఏడాది జూన్ 2వ తేదీన ఈ పరీక్ష నిర్వహించారు. ఫలితాలను యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో చూడవచ్చు. మెయిన్ పరీక్షకు హాజరయ్యేవారు ఆగస్టు 1 నుంచి 16వ తేదీ సాయంత్రంలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థులు తమ చిరునామా, మెయిల్‌ఐడీ లేదా ఇతర సమాచారంలో మార్పు ఉంటే వెంటనే యూపీఎస్సీకి తెలియజేయాలని శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో కోరారు.

క్రీడాకారులపై పైచేయి సాధించిన కృత్రిమ మేధ

న్యూయార్క్: నిపుణులైన క్రీడాకారులపై కృత్రిమ మేధ పైచేయి సాధించింది. పోకర్ క్రీడలో ఆరుగురు ఆడే ఆటలో కృత్రిమ మేధ ముందంజ వేసింది. అమెరికాలోని కార్నెగీ మెలన్ విశ్వవిద్యాలయం, ఫేస్‌బుక్ రూపొందించిన 'ప్లూరిబస్' అనే కృత్రిమ మేధ ప్రోగ్రాం. . పోకర్ ఆటగాళ్లను ఓడించింది. ప్రపంచ పోకర్ టైటిళ్ల సాధనలో రికార్డులు సృష్టించిన డారెన్ ఎలియాస్, ఆరు ప్రపంచ సిరీస్‌లు గెలిచిన క్రిస్ ఫెర్గూసన్‌లు సైతం ఓడిపోయారు. మరో ప్రయోగంలోనూ ప్లూరిబస్ విజయం సాధించింది. బహుళ క్రీడాకారులు ఆడే పోకర్‌లో ప్లూరిబస్ అద్భుత సామర్థ్యాన్ని ప్రదర్శించిందని, కృత్రిమ మేధలో ఇది గుర్తించదగిన మైలురాయిగా నిలిచిపోతుందని ఈ ప్రోగ్రాంను రూపొందించిన ప్రొఫెసర్ ట్యుయోమస్ సాంధోల్మ్ పేర్కొన్నారు.

'హద్దు' మీరిన చైనా జవాన్లు

భారత భూభాగంలోకి చొచ్చుకొచ్చి... మళ్లీ వెనక్కి!

దిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)ను దాటి భారత భూభాగంలోకి చైనా జవాన్లు చొచ్చుకొచ్చారు. లద్దాఖ్ డివిజన్ పరిధి డెమ్‌చోక్ సెక్టార్‌లో టిబెట్‌కు చెందిన కొందరు వలస వచ్చి నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. దలైలామా పుట్టినరోజు సందర్భంగా ఇటీవల వారు తమ జెండాలను ఎగురవేశారు. వీటిని చూసి చైనా జవాన్లు వాహనాల్లో ఎల్ఏసీని దాటి అక్కడికి వచ్చారు. జెండాలు ఎగురవేయడం వంటి కార్యక్రమాలు వద్దని టిబెటన్లను హెచ్చరించి వెళ్లిపోయినట్లు భారత వర్గాలు చెప్పాయి.

అరుణాచల్‌ప్రదేశ్ మాజీ సీఎం నబం టుకీపై సీబీఐ కేసునమోదు చేసింది. 2003లో కాంట్రాక్టుల కేటాయింపుల్లో ఆయన అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

Admission Guidence for
MBBS
U.P. SECOND ROUND COUNSELING
REGISTRATION STARTS ON 15.07.19 TO 18.07.19
LOW SCORE / LOW PACKAGE
9515926206/8466963781

'లక్ష్మణ్‌ఝూలా' మూసివేత

దేహ్రాదూన్: ప్రఖ్యాతిగాంచిన రిషికేశ్‌లోని 'లక్ష్మణ్‌ఝూలా' (లక్ష్మణుడి వంతెన)ను శుక్రవారం మూసివేశారు. ఎప్పుడో బ్రిటిష్ వారి హయాంలో 1923లో గంగానదిపై నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం కనీసం మరమ్మతులకు కూడా వీలుకానంతగా దెబ్బతినడంతో ఈ చర్య చేపట్టినట్లు ప్రజాపనుల విభాగం నిపుణుల సంఘం వెల్లడించింది. వివిధ ప్రాంతాలనుంచి వచ్చే సందర్శకులు, పాదచారుల రాకపోకలకు ఈ వంతెన ఇప్పుడిక ఏ మాత్రం వీలుకానంత దుర్బల పరిస్థితికి చేరుకున్నట్లు ఉత్తరాఖండ్ అదనపు ప్రధానకార్యదర్శి ఓంప్రకాశ్ తెలిపారు.

2.1 లక్షల ఏళ్ల క్రితమే ఐరోపాలో హోమోసెపియన్లు!

దక్షిణ గ్రీస్‌లోని అపిడిమా గుహలో 1970ల్లో దొరికిన ఓ కపాలం భాగమిది. 2.1 లక్షల ఏళ్ల క్రితం నాటిదిగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఆఫ్రికా వెలుపల హోమోసెపియన్లు ఆ కాలం నుంచే ఉన్నారని చెప్పేందుకు ఇదే సాక్ష్యమని సూచిస్తున్నారు. 1.5 లక్షల ఏళ్ల క్రితం నాటి మానవ శిలాజమొకటి ఐరోపాలో గతంలో బయటపడింది. దీంతో అప్పటి నుంచే ఆఫ్రికా వెలుపల హోమోసెపియన్లు ఉంటున్నారని ఇన్నాళ్లూ శాస్త్రవేత్తలు అంచనా వేశారు. గ్రీస్‌లో దొరికిన కపాల భాగం అంతకంటే ముందుదని తేలింది.

చేపా.. చేపా ఎందుకు మారిపోయావు?

మెల్‌బోర్న్: సృష్టి ఎంత విచిత్రమైంది! క్లోన్‌ఫిష్ సహా 500కు పైగా రకాల చేపలు... కావాలనుకుంటే లింగ మార్పు చేసేసుకుంటాయి! కేవలం పది రోజుల్లోనే ఆడ చేపలు పూర్తిస్థాయి మగచేపలుగా మారిపోతాయి. ఉన్నట్టుండి ఇదెలా సాధ్యమవుతోంది? దీనికి అసలు కారణమేంటన్నది ఇప్పటివరకూ అంతుచిక్కని రహస్యం. కానీ... న్యూజిలాండ్‌లోని ఒటాగో శాస్త్రవేత్తలు ఎట్టకేలకు దీన్ని ఛేదించారు! అత్యాధునిక జన్యు విశ్లేషణ విధానాలను ఉపయోగించి అసలు విషయం కనుగొన్నారు. పరిశోధనకర్త ఎరికా టాడ్ ఈ వివరాలను వెల్లడించారు. 'క్లోన్‌ఫిష్ సహా నీలిరంగు తల ఉండే ఆడ చేపలు... నడి వయసుకు వచ్చేసరికి మగవిగా మారిపోతుంటాయి. ఇందుకు చుట్టూ ఉన్న పరిస్థితులే కారణం. తమతో కలిసి సహజీవనం చేసిన బలమైన మగచేప చనిపోయినప్పుడు... ఆడ చేపలు ఆ స్థానాన్ని భర్తీ చేస్తాయి. మగ చేపగా జీవించాలని అనుకున్నదే ఆలస్యం! క్షణాల్లో శరీరంలో మార్పులు ప్రారంభమైపోతాయి. మొదట పురుష మత్స్యం లాంటి ప్రవర్తనను కనబరుస్తాయి. తర్వాత పూర్తిస్థాయిలో జన్యు మార్పులు చోటుచేసుకుంటాయి. గర్భాశయ నిర్వహణ కోసం ఆడ చేపల్లో ఉత్పత్తయ్యే ఈస్ట్రోజన్ హార్మోన్ 'అరోమాటసీ' నిలిచిపోతుంది. అదే సమయంలో వృషణాలు ఏర్పడి, కేవలం 10 నుంచి 21 రోజుల్లోనే మగ చేపలా మారిపోతాయి. ఆ తర్వాత పది రోజులకే ప్రత్యుత్పత్తికి సిద్ధమైపోతాయి'' అని ఎరికా వెల్లడించారు. ఇదంతా వాటి జీవన ప్రక్రియలో భాగమని, పరిస్థితులకు అనుగుణంగా జీవన శైలిని మార్చుకుంటాయని పేర్కొన్నారు. ఆసక్తికరమైన ఈ పరిశోధన వివరాలను సైన్స్ అడ్వాన్సెస్ పత్రిక ప్రచురించింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

మహిమ ముగిసినట్లేనా..!

అనూహ్యంగా సెమీస్‌లోనే తెరపడింది. ఆర్తనాదాలు అయిపోయాయి. విశ్లేషణలు పూర్తయ్యాయి. తర్వాతేంటి? మామూలుగా అయితే భారత్ ఆడే తర్వాతి సిరీస్ మీద అందరి దృష్టి నిలిచి ఉండాలి! కానీ ఇప్పుడు భారత క్రికెట్ అభిమానులందరి చర్చలూ ధోని చుట్టూనే తిరుగుతున్నాయి! ఇంతకీ అంతర్జాతీయ క్రికెట్లో ధోని ప్రస్థానం ముగిసిందా లేదా? అతను చివరి మ్యాచ్ ఆడేశాడా? ఆడబోతున్నాడా? అసలతను రిటైర్మెంట్ ప్రకటిస్తున్నాడా లేదా? ప్రకటించేట్లయితే ఎప్పుడు? ఈ ప్రశ్నలు అభిమానుల మెదళ్లను తొలిచేస్తున్నాయి! ధోని ఆట నచ్చక అతను రిటైర్ కావాలని డిమాండ్ చేసేవాళ్లు కొందరైతే.. అతడికేం తక్కువ, రిటైర్మెంట్ వద్దే వద్దంటున్న వాళ్లు ఇంకొందరు.. ఆట ఎలా ఉన్నా ధోని రిటైర్మెంట్ అనివార్యం అంటున్నారు మరికొందరు! ఇంతకీ ధోని మనసులో ఏముంది.. అతనేం చేయబోతున్నాడు..?

ముగియొచ్చన్నది అందరూ అంచనా వేసిన విషయం.

ప్ర భారత క్రికెట్‌కు ఎనలేని సేవలందించిన ధోని కోసం టీమ్‌ఇండియా కప్పు గెలిచి అతడికి ఘనమైన వీడ్కోలు పలుకుతుందని అభిమానులు ఆశించారు. అదే జరిగితే కప్పు గెలవగానే ధోని తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని కూడా ప్రకటించేవాడేమో! కానీ ఊహించనిది జరిగింది. భారత జట్టు ఫైనల్ కూడా చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆ మ్యాచ్ ముగిసిన కొన్ని నిమిషాల నుంచే ధోని రిటైర్మెంట్ గురించి పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. మ్యాచ్ రోజు రాత్రే మహి తన నిర్ణయాన్ని ప్రకటించబోతున్నట్లు కూడా ప్రచారం జరిగింది. కానీ ధోని ఏమీ స్పందించలేదు. మహి రిటైర్మెంట్ గురించి కోహ్లీని అడిగితే.. అతను తమకేమీ చెప్పలేదన్నాడు. ధోని మద్దతుదారులేమో అతడిప్పుడే రిటైర్ కావద్దంటూ సామాజిక మాధ్యమాల్లో ఉద్యమాలు చేస్తున్నారు.

ప్రపంచకప్‌లో విఫలమయ్యాడా?

ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా వరుసగా గెలుస్తున్నా సరే.. ధోని బ్యాటింగ్ విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా ధోని బ్యాటింగ్ వేగం గురించి ఎడతెగని చర్చ నడిచింది. కానీ అతను ఏ పరిస్థితుల్లో బ్యాటింగ్ చేశాడన్నది పట్టించుకోకుండా కొందరు విమర్శకులు అతడిపై పడిపోయారు. మొత్తం 8 మ్యాచ్‌ల్లోనూ బ్యాటింగ్ చేసిన ధోని.. 45.50 సగటుతో 273 పరుగులు చేశాడు. భారత మిడిలార్డర్లో ఎక్కువ పరుగులు అతడివే. పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో చివర్లో బ్యాటింగ్‌కు వచ్చిన అతను ఒక పరుగుకే వెనుదిరిగాడు. మిగతా మ్యాచ్‌లన్నింట్లో చెప్పుకోదగ్గ స్కోర్లే చేశాడు. అయితే అఫ్గానిస్థాన్, ఇంగ్లాండ్ మ్యాచ్‌ల్లో అవసరమైనపుడు బ్యాట్ ఝుళిపించలేకపోవడంతో విమర్శలు ఎదుర్కొన్నాడు. మిగతా వాటిలో కొన్ని ఇన్నింగ్స్‌లను కూడా వేలెత్తి చూపిన వాళ్లు లేకపోలేదు. వెస్టిండీస్‌పై 61 బంతుల్లో 56 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిస్తే ఇదేం ఇన్నింగ్స్ అన్నారు. కానీ వెస్టిండీస్ 143 పరుగులకే కుప్పకూలితే కానీ ఆ పిచ్‌పై బ్యాటింగ్ ఎంత కష్టమో అర్థం కాలేదు. న్యూజిలాండ్‌తో సెమీస్‌లో ధోని ఆటను కూడా తప్పుబట్టిన వాళ్లున్నారు. ముందు నుంచి ధోని హిట్టింగ్ చేస్తే చివర్లో పరిస్థితి అంత కష్టమయ్యేది కాదన్న లాజిక్ కూడా తీశారు. కానీ అప్పటికే ఆరు వికెట్లు పడ్డాయి. ధోని, జడేజాల తర్వాత బ్యాట్స్‌మన్ లేడు. వీళ్లిద్దరిలో ఒకరు ఔటవడం ఆలస్యం.. భారత్ కుప్పకూలేదే! చివర్లో అదే జరిగింది. ఒకవేళ ధోని షాట్‌కు ప్రయత్నించి ఔటై ఉంటే.. బాధ్యతారాహిత్యంగా ఆడి ఔటయ్యాడనేవారేమో! అసలు అవతల ధోని ఉండబట్టే జడేజా ధీమాగా షాట్లు ఆడగలిగాడన్నది వాస్తవం. జడేజాకు మార్గనిర్దేశం చేస్తూ సాగాడు మహి. జడ్డూ అంత మంచి ఇన్నింగ్స్ ఆడటంలో అతడి పాత్ర కీలకం. ధోని ముందు వచ్చి అవతలి ఎండ్‌లో ఉండుంటే.. పంత్ గుడ్డిగా షాట్ ఆడేవాడు కాదన్న గంగూలీ మాట ఇక్కడ ప్రస్తావనార్హం. ధోని జట్టుకు చేకూర్చే విలువ ఏంటో సూచించే వ్యాఖ్య ఇది. కాబట్టి సెమీస్‌లో భారత్‌ను గెలిపించనంత మాత్రాన మహి ఇన్నింగ్స్‌ను తక్కువగా చూడలేం. ఒకప్పుడు అసాధారణ బ్యాటింగ్ విన్యాసాలతో తనకు తానే ఉన్నత ప్రమాణాలు నిర్దేశించుకున్నాడు మహి. దీంతో అతడి నుంచి ప్రతిసారీ అద్భుతాలు ఆశించడం అందరికీ అలవాటైపోయింది. ఆ స్థాయికి ఏమాత్రం తగ్గినా అతడిని విమర్శించేస్తున్నారు. ఎంతటి ఆటగాడికైనా 37-38 ఏళ్ల వయసులో చురుకుదనం తగ్గడం, బ్యాటింగ్‌పై ప్రభావం చూపడం సహజం! మహి కూడా అందుకు మినహాయింపు కాదు! అయితే గతంలో జట్టు కోసం పడ్డ కష్టాన్ని, సాధించిన ఘనతల్ని మరిచిపోయి ప్రస్తుత ఆటపై శూలశోధన జరిపి ధోనీని నిందించడం సబబేనా?

ఇన్నాళ్లూ ఉన్నది అతడి కోసం కాదు..

ఇంతకీ ధోని ఇప్పుడే రిటైరవుతాడా లేదా అన్నది ఇప్పుడు చర్చనీయాంశం. నిజానికి ధోని మనస్తత్వం ప్రకారం చూస్తే అతనింకా అంతర్జాతీయ క్రికెట్ ఆడుతుండటమే ఆశ్చర్యం. టెస్టుల్లో ఇంకా ఎంతో ఆట మిగిలున్నా.. విరాట్ నాయకత్వ స్థానాన్ని అందుకోవడానికి అర్హత సాధించాడని, జట్టుకు తన అవసరం లేదని అర్థమవగానే.. ఆస్ట్రేలియా సిరీస్ (2014) మధ్యలోనే సుదీర్ఘ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడం ధోనీకే చెల్లింది. ఆ లెక్కన చూస్తే ఇంకో అయిదేళ్ల తర్వాత కూడా మహి వన్డేల్లో కొనసాగుతుండటం అనూహ్యమే. అయితే ప్రపంచకప్‌లో తన అనుభవం ఎన్నో రకాలుగా జట్టుకు అవసరం పడుతుందనే అతను ఆటలో కొనసాగాడు. బ్యాట్స్‌మన్‌గా, వికెట్ కీపర్‌గా, వ్యూహకర్తగా ధోని చేకూర్చే విలువను గుర్తించే జట్టు కూడా అతనుండాలని కోరుకుంది. ఇప్పటికీ జట్టులో కొనసాగడానికి ఏ రకంగా చూసినా మహి అర్హుడే! కానీ భవిష్యత్ దిశగా ఆలోచిస్తే మహి ఇక తప్పుకుని తన స్థానాన్ని భర్తీ చేసే ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాల్సిందే!

ఉంటానంటే ఉండనిస్తారా?

ఒకవేళ మహి ఇంకా కొనసాగాలని కోరుకుంటే జట్టు యాజమాన్యం ఎలా స్పందిసుందో చెప్పలేం. సచిన్ అంతటి వాడే 2011 ప్రపంచకప్ విజయానంతరం వన్డే జట్టులో ఇంకా కొనసాగుతుంటే రిటైర్మెంట్ కోసం సెలక్టర్ల నుంచి ఒత్తిడి ఎదుర్కొన్నాడని, అందుకే ఉన్నట్లుండి వన్డేల నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని అప్పట్లో వార్తలొచ్చాయి. మరి ధోని ఇంకా ఆడతానంటే బీసీసీఐ ఆడనిస్తుందా అన్నది సందేహం! ఒక ప్రపంచకప్ ముగియగానే తర్వాతి ప్రపంచకప్‌కు సన్నాహాలు మొదలైపోతాయి. యువ ఆటగాళ్లను తీర్చిదిద్దుకునే ప్రక్రియ మొదలవుతుంది. కాబట్టి ధోనీలో ఇంకా ఆట ఉన్నా, అతను కొనసాగే పరిస్థితులైతే భారత జట్టులో ఇప్పుడు లేవు! కాకపోతే తమ ఆరాధ్య ఆటగాళ్లు మైదానంలో మ్యాచ్ ఆడుతూ ఘనంగా వీడ్కోలు తీసుకోవాలని ఆశిస్తారు అభిమానులు. ధోని లాంటి దిగ్గజానికి ఆ గౌరవం దక్కాలన్నది వారి అభిప్రాయం. మరి ధోనీలో ఆ కోరిక ఉందో లేదో? మహి గురించి తెలిసిన వాళ్లయితే.. అతను చడీచప్పుడు లేకుండా ఏదో ఒక రోజు రిటైర్మెంట్ బాంబు పేలుస్తాడని అంచనా వేస్తున్నారు. ప్రపంచకప్‌లో చివరి మ్యాచ్ అవ్వగానే ప్రకటన చేస్తే వైఫల్యానికి బాధ్యత వహిస్తూ ఆట నుంచి తప్పుకున్నట్లయ్యేది! అందుకే మహి ఆగాడేమో! అయితే ధోని కెరీర్ ముగింపు ఎలా ఉన్నా.. అతడి గొప్పదనం రవ్వంతైనా తగ్గదు. ఆటగాడిగా, వికెట్ కీపర్‌గా, కెప్టెన్‌గా, వ్యూహకర్తగా మహి ఘనతలకు సరితూగే క్రికెటర్లు ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే చాలా అరుదుగా కనిపిస్తారు. కెరీర్ చరమాంకంలో కాస్త ఒడుదొడుకులు ఎదుర్కొన్నంత మాత్రాన ధోనీని తక్కువ చేయలేం. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ అతనొక ఛాంపియనే!

వేళ్లు లేకపోయినా..!

మంత్రి రమేశ్ సుబ్రహ్మణ్యం నాయుడు.. పుట్టుకతోనే దివ్యాంగుడు! క్రికెట్‌పై ఇష్టంతో ఆట నేర్చుకున్నాడు. నేర్చుకోవడమే కాదు.. అటు బ్యాటుతో, ఇటు బంతితో అదరగొడుతున్నాడు. అతడు బ్యాటింగ్ చేస్తే పరుగుల ప్రవాహమే. బౌలింగ్ చేస్తే వికెట్లే వికెట్లు. దేశవ్యాప్తంగా ఎన్నో క్రికెట్ టోర్నీలు ఆడాడు. ఎన్నో మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌లు అందుకున్నాడు. అందరితో శభాష్ అనిపించుకున్నాడు. ఈ ఘనతలన్నీ దివ్యాంగుల టోర్నీల్లో సాధించినవి అనుకుంటే పొరపాటే! సాధారణ క్రికెట్లోనే.. శారీరకంగా ఏ లోపం లేని ఆటగాళ్లతో పోటీపడుతూ రమేశ్ ఎన్నో శిఖరాలు అధిరోహించడం విశేషం.

రమేశ్ చేతి వేళ్ల నిర్మాణం సరిగా లేదు. రెండు చేతులకు బొటనవేళ్లు పెద్దగా ఉంటాయి. మిగతా వేళ్లు చాలా చిన్నవి. కుడి కాలి పాదానికి బొటన వేలు మాత్రమే ఉంది. విశాఖపట్నానికి చెందిన రమేశ్ అవయవ లోపంతో జన్మించినా ఆటలో అతడు మరెవరికీ తీసిపోడు. బంతిని గింగిరాలు తిప్పడంలో దిట్ట. లెగ్ స్పిన్‌తో హేమాహేమీ బ్యాట్స్‌మెన్‌ను బోల్తాకొట్టించగలడు. బ్యాటుతోనూ అదే స్థాయిలో మాయ చేయగలడు. బొటన వేలు.. చిటికెన వేలు సహాయంతో బంతిపై పట్టుసాధించుకుని బౌలింగ్ వేస్తాడు. బ్యాటింగ్‌లోనూ ఆ రెండు వేళ్లే అతడికి పనికొస్తాయి. గతంలో 'ఈనాడు' ఛాంపియన్ క్రికెట్ (ఈసీసీ) కప్‌లో అందరితో కలిసి ఆడి సత్తాచాటాడు రమేశ్. ఆటలోనే కాదు చదువులోనూ అతడు నేర్పరి. ఇంటర్‌లో 95 శాతం మార్కులు సాధించాడు. ఐఐటీ ప్రవేశ పరీక్షలో అఖిల భారత స్థాయిలో 41వ ర్యాంకు సాధించి ఐఐటీ మద్రాసులో సీటు సంపాదించాడు. తమిళనాడులో చదువుకుంటూ అక్కడి లీగ్ క్రికెట్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. కుడి కాలి వేళ్లు లేకపోయినా రమేశ్ బాగా పరుగెత్తగలడు. 5 కిమీ పరుగును 24 నిమిషాల్లో పూర్తి చేస్తాడు. యోయో ఫిట్‌నెస్ 14వ స్థాయి పరీక్ష కూడా పాసయ్యాడు.

తమిళనాడు సాధారణ లీగ్‌లో ఆడుతున్న రమేశ్‌ను దివ్యాంగుల క్రికెట్‌కు సిఫారసు చేసింది ఆ రాష్ట్ర సంఘం. తమిళనాడు క్రికెట్ సంఘం సూచనతో దివ్యాంగుల క్రికెట్లో తన అదృష్టం పరీక్షించుకున్నాడు. సాధారణ క్రికెట్లోనే సత్తాచాటుతున్న రమేశ్.. దివ్యాంగుల ఆటలోనూ మెరిశాడు. ఏకంగా తమిళనాడు రాష్ట్ర దివ్యాంగుల జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అట్నుంచి సౌత్‌జోన్ టోర్నీలో సత్తాచాటాడు. అఖిల భారత స్థాయిలో జరిగిన సెలెక్షన్స్‌లో 78 పరుగులు చేసి.. ఐదు వికెట్లు తీశాడు. సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించిన రమేశ్‌కు భారత టీ20 ప్రపంచకప్ జట్టులో చోటు దక్కింది. ఆగస్టులో ఇంగ్లాండ్‌లో జరగనున్న దివ్యాంగుల తొలి టీ20 ప్రపంచకప్‌లో రమేశ్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనుండటం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం.

ఫుట్‌బాల్ మాత్రమే కాదు..

ఇటీవల ఫ్రాన్స్‌లో మహిళల ప్రపంచకప్ నడుస్తున్నంతసేపు కెమెరాలన్నీ ఒక అమ్మాయి కోసమే వెతికాయి...అభిమానులు కూడా ఆమె కనపడగానే పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేసేవాళ్లు.. ఆమె గోల్ కొడితేనే కాదు కాలు పెడితేనే స్టేడియం దద్దరిల్లేది.. ఇంతమందిని తనవైపు తిప్పుకున్న ఆ అమ్మాయి పేరు మెగాన్ రాపినో. అమెరికా ఫుట్‌బాల్ తార. ఇటీవల యుఎస్‌ఏ ప్రపంచకప్ గెలవడంలో కీలకపాత్ర పోషించిన రాపినో.. తన ఆటతోనే కాదు మాట, చర్యలతో కూడా అందరి దృష్టిని ఆకర్షించింది.

మోకాళ్ల మీద నిలబడి

జాతీయ గీతం వస్తుంటే ఏ దేశ పౌరుడైనా నిలబడాలనేది నిబంధన. అందులో ఒక అంతర్జాతీయ మ్యాచ్‌లో, దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు ఇంకెంతో ఉత్సాహంగా ఈ గీతాన్ని ఆలపిస్తారు. కానీ రాపినో మాత్రం దుస్సాహసమే చేసింది. ప్రపంచకప్‌లో అమెరికా జాతీయ గీతం ఆలపిస్తున్నప్పుడు నిలబడకుండా మోకాళ్ల మీద కూర్చొంది. ఆమె అలా చేయడం ఇదే తొలిసారి కాదు.. 2016లో థాయ్‌లాండ్‌తో అంతర్జాతీయ మ్యాచ్‌తోనే ఇది షురూ అయింది. దీనికి కారణం అమెరికాలో క్రీడల్లో పురుషులతో పాటు మహిళలకు సమానంగా జీతాలు ఇవ్వకపోవడం. దేశంలో ఆఫ్రికన్ అమెరికన్లపై వివక్ష చూపించడం. ఈ కారణాలతోనే ఆమె ప్రతి మ్యాచ్‌లోనూ ఇలా మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేసింది. మొదట అమెరికా రగ్బీ ఆటగాడు కొలిన్ కోపర్నిక్ ఇలా నిరసన తెలుపగా.. ఆ తర్వాత అతని జట్టులో చాలామంది ఆటగాళ్లు ఇలా చేశారు. ఆ తర్వాత రాపినో.. కోపర్నిక్‌కు మద్దతుగా మహిళల్లోనూ చైతన్యం తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ఆమె ఒకసారి ఇలా చేస్తే పర్వాలేదు కానీ ప్రతి అంతర్జాతీయ మ్యాచ్‌లో తన నిరసనను ఇలాగే తెలపడంతో రాపినో పేరు సామాజిక మాధ్యమాల్లో మార్మోగింది. కఠిన ఆంక్షలు ఉండే అమెరికాలో ఆమె చర్యలు పెద్ద తప్పు. చివరికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం ఆమె చర్యను ఖండించాడు. సంప్రదాయ వాదులు ఆమెపై దుమ్మెత్తిపోశారు. వెంటనే జట్టు నుంచి తీసేయాలని కోరారు. అయినా రాపినో మాత్రం బెదరలేదు. తన పోరాటం అధ్యక్షుడి వరకు వెళ్లినందుకు సంతోషాన్ని వ్యక్తం చేసింది.

ఆటలోనూ మేటే

కాలిఫోర్నియాలో పుట్టిన రాపినోకు కేవలం మాటలు, చర్యల ద్వారా మాత్రమే పేరు రాలేదు. తన ఆట ద్వారా ఒక్కో మెట్టూ ఎదుగుతూ అమెరికా ఫుట్‌బాల్ జట్టులో కీలక క్రీడాకారిణిగా మారింది. 2011 ప్రపంచకప్‌లో అరంగేట్రం చేసిన రాపినో.. ఆ టోర్నీలో నాలుగు గోల్స్ సాధించి జట్టు ఫైనల్ చేరడంలో తన వంతు పాత్ర పోషించింది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో అమెరికా స్వర్ణం నెగ్గడంలోనూ రాపినోనే కీలకం. 2015 ప్రపంచకప్, 2019 ప్రపంచకప్‌లలో అమెరికా విజేతగా నిలిచిందంటే ఈ స్టార్ పాత్ర ఎంతో ఉంది. ముఖ్యంగా ఈ ఏడాది టోర్నీలో ఆరు గోల్స్ చేసి గోల్డెన్ బూట్ అవార్డుతో పాటు ఉత్తమ క్రీడాకారిణిగా గోల్డెన్ బాల్ ట్రోఫీని రాపినో సొంతం చేసుకుంది. ఆటలో పేరు సంపాదించడం వేరు.. ఇలా ఆటలో కొనసాగుతూనే సమస్యలపై పోరాడుతూ సామాజిక చైతన్యం తీసుకు రావడం వేరు.. రాపినో రెండో కోవకు చెందుతుంది. అందుకే ఆమెకు ఆటకే కాదు వ్యక్తిత్వానికి చాలా మంది అభిమానులయ్యారు.

కీర్తి సురేష్

అనగనగా ఓ ఇల్లు.
అందులో అమ్మా.. నాన్న.. ఇద్దరు పిల్లలు.

- ఇలా కథ మొదలెడితే ఎంత బాగుంటుంది?

ప్రతి ఒక్కరిలోనూ ఓ 'ఫ్యామిలీ (వు)మెన్' ఉంటారు. ఇలాంటి కథలు చెబుతున్నప్పుడు ఇట్టే లీనమైపోతారు. తమలో ఉన్న అమ్మో, నాన్నో, బాబాయో, అత్తమ్మో.. బయటకు వస్తారు. తమకు తెలిసిన పెదనాన్నో, మావయ్యో తెరపై తారస పడతారు. భావోద్వేగాల్ని సరిగా మేళవించగలిగితే ఇక అలాంటి చిత్రాలకు తిరుగుండదు. అందుకే కుటుంబ కథలు తెలుగు తెరపై వెల్లువలా వస్తుంటాయి. ఈ సీజన్‌లో ఆ తాకిడి కాస్త ఎక్కువగానే ఉండబోతోంది. మాస్, కమర్షియల్ చిత్రాలకు కాస్త బ్రేక్ ఇవ్వాలనుకున్న హీరోలు, హీరోయిన్లు ఈ తరహా చిత్రాలపై మొగ్గు చూపిస్తున్నారు.

వెంకటేష్

నాగార్జున

ఫ్యామిలీ టచ్ ఇస్తున్నారు!

విజయవంతమైన చిత్రాలకంటూ ఓ ఫార్ములా ఉండదు. ప్రేక్షకులు ఎప్పుడు ఏ కథకు పట్టం కడతారో, ఎప్పుడు ఏ చిత్రాన్ని తిరస్కరిస్తారో ఎవ్వరూ ఊహించలేరు. ఒక్కో సీజన్‌లో ఒక్కో తరహా కథలు ప్రేక్షకుల ముందుకొచ్చినా, దర్శక నిర్మాతలు ట్రెండ్‌కు పెద్ద పీట వేసినా - కొన్నింటికే హిట్టు కళ అబ్బుతుంది. అయితే కుటుంబ కథా చిత్రాలకు మాత్రం ఓ వెసులుబాటు ఉంటుంది. ఏ ట్రెండ్ నడుస్తున్నా, ఎలాంటి ఫార్ములాలు గారడీ చేస్తున్నా - 'ఫ్యామిలీ' టచ్ ఉన్న కథలకు మినిమం గ్యారెంటీ ఉంటుంది. పైగా అది ఎవర్ గ్రీన్ ఫార్ములా. అందుకే కథానాయకులు కుటుంబ కథలవైపు మొగ్గు చూపిస్తుంటారు. బంధాలూ, అనుబంధాలు పెనవేసుకున్న కథలు చేస్తే - అభిమాన గణాన్ని పెంచుకోవచ్చని, వసూళ్లకు ఢోకా ఉండదని నమ్మకం. అందుకే టాలీవుడ్‌కెప్పుడూ ఇలాంటి కథలకు కొదవ ఉండదు. అయితే ఈమధ్య కాన్సెప్ట్ కథలు, హారర్ సినిమాలు, యాక్షన్ డ్రామాలూ, థ్రిల్లర్లు ఎక్కువ అయ్యాయి. సందేశానికి వాణిజ్య సూత్రాల్ని మేళవించి చెప్పడం నేర్చుకున్నారు. వాటి మధ్య కుటుంబ కథలు ఎవ్వరికీ పట్టడం లేదు. ఈసారి మాత్రం ఆ కొరత కొంత వరకూ తీరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అగ్ర కథానాయకులతో పాటు యువ హీరోలూ కుటుంబ కథలపై దృష్టి సారించారు. దాంతో వెండి తెరకు కొత్త శోభ రాబోతున్నట్టు అనిపిస్తోంది.

సమంత

అగ్ర హీరోలు నాగార్జున, వెంకటేష్ ఎప్పుడూ కుటుంబ కథలకు అగ్రతాంబూలం ఇస్తుంటారు. వీళ్ల అభిమానుల్లోనూ కుటుంబ ప్రేక్షకులే ఎక్కువ. 'ఎఫ్ 2'తో వాళ్లందరినీ అలరించిన వెంకీ... ఇప్పుడు 'వెంకీ మామ' అయిపోయారు. నాగచైతన్యతో కలసి నటిస్తున్న చిత్రమిది. ఇద్దరూ నిజ జీవితంలో మామా అల్లుళ్లే. తెరపైనా అవే పాత్రలు పోషిస్తున్నారు. టైటిల్ చూస్తుంటే ఇదో కుటుంబ కథా చిత్రమని ఇట్టే అర్థమైపోతోంది. మరి వెంకీ మామ, చైతూ అల్లుడు కలసి ఎంత సందడి చేస్తారో తెరపైనే చూడాలి. నాగార్జున 'మన్మథుడు 2'లోనూ కుటుంబ ప్రేక్షకులకు నచ్చే అంశాలుంటాయి. ఫ్రేము నిండా నటీనటులే కనిపించే చిత్రాల్లో ఇదొకటి. అయితే దాంతో పాటు నాగ్ నుంచి ఆశించే రొమాన్స్ కూడా ఎక్కువ పాళ్లలోనే ఉండబోతోంది. అయితే ఆ తరవాత నాగ్ చేయబోయే 'బంగార్రాజు' మాత్రం నూటికి నూరుశాతం కుటుంబ కథా చిత్రమే. ఇందులోనూ చైతూ కనిపించబోతున్నాడు. సాయిధరమ్ తేజ్ కూడా ఇప్పుడు కుటుంబ కథల బాట పట్టాడు. దర్శకుడు మారుతితో కలసి చేస్తున్న 'ప్రతిరోజూ పండగే' ఈ జోనర్ కథే. "డబ్బు సంపాదన మీద ధ్యాస ఎక్కువై... యాంత్రికంగా బతికేస్తున్నాం. ప్రేమ, పెద్దలమీద గౌరవం కూడా కలుషితమైపోయింది. మనిషి కంటే యంత్రాలకే ఎక్కువ విలువ ఇస్తున్నాం. వాటి మధ్య ఏం కోల్పోతున్నామో చెప్పే సినిమా ఇది. తండ్రి, కొడుకు, మనవడి మధ్య అనుబంధాన్ని తెరపై ఆవిష్కరించబోతున్నాం" అన్నారు మారుతి. మాస్ కథలు చేస్తున్న కల్యాణ్ రామ్ ఇప్పుడు వాటికి కాస్త బ్రేక్ ఇచ్చారు. ఆయన కూడా కుటుంబ ప్రేక్షకుల్ని మెప్పించాలన్న ఉద్దేశంతో ఉన్నారు. కల్యాణ్‌రామ్ - సతీష్ వేగేశ్నల కలయికలో ఓ చిత్రం ఇటీవలే పట్టాలెక్కింది. 'శతమానంభవతి'తో కుటుంబ ప్రేక్షకుల పల్స్ పట్టుకున్న సతీష్ ఈసారి కల్యాణ్‌రామ్ కోసం అలాంటికథే రాసుకున్నారట.

కీర్తి సురేష్ కథానాయికగా ఈస్ట్‌కోస్ట్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. నరేంద్రనాథ్ దర్శకుడు. ఇది కూడా ఫ్యామిలీ డ్రామానే. "ఓ అమ్మాయి జీవితంలోని వివిధ దశల్ని ఆవిష్కరించే చిత్రమిది. కుటుంబ బంధాలకు పెద్దపీట వేశాం. కథానాయిక ప్రాధాన్యం ఉన్న చిత్రాలంటే మనకు హారర్, థ్రిల్లర్ చిత్రాలే గుర్తొస్తాయి. అయితే వాటికి భిన్నమైన ప్రయత్నం చేస్తున్నాం" అని దర్శక నిర్మాతలు తెలిపారు.

సమంత ప్రధాన పాత్రలో నందిని రెడ్డి తెరకెక్కించిన 'ఓ బేబీ' ఇటీవలే విడుదలై మంచి విజయం అందుకొంది. ఈ చిత్రం కూడా అనుబంధాల పొదరిల్లే. 70 ఏళ్ల బామ్మ అనుకోకుండా పాతికేళ్ల పడుచుగా మారిన కథ. ఆసక్తికరంగా మలిచారు. "మన దేశం ఆధునికతవైపు ఎంత పరుగులు పెడుతున్నా మూలాల్ని మర్చిపోలేదు. మర్చిపోకూడదు కూడా. పెద్దవాళ్లని వృద్ధాశ్రమాలలో విడిచిపెట్టే అలవాటు విదేశాల్లో ఉంది. అది అక్కడ తప్పు కాదు. ఇక్కడ మాత్రం ఆ ఆలోచన వస్తేనే తప్పు చేసినట్టు. తండ్రీకూతుళ్ల మధ్య అనుబంధాలు, వాళ్ల మధ్య గౌరవాలూ అలానే ఉన్నాయి. వాటి విలువెంతో ఈ సినిమాలో చూపించాం" అన్నారు నందిని రెడ్డి.

కల్యాణ్‌రామ్

సాయిధరమ్‌తేజ్

ఈనాడు సినిమా

నిధి అగర్వాల్, రామ్, నభానటేష్, ఛార్మి, పూరి జగన్నాథ్

రామ్‌ని వాడుకున్నోళ్లకి వాడుకొన్నంత - పూరి జగన్నాథ్

"తొలిసారి రామ్‌తో కలిసి పనిచేశా. తనలో ఉత్సాహం తరగనంత ఉంది. తనని వాడుకున్నోళ్లకి వాడుకున్నంత. నేను నా చేతనైనంత వాడా. ప్రేక్షకుల మదిలో 'ఇస్మార్ట్ శంకర్'గా నిలిచిపోతాడు" అన్నారు పూరి జగన్నాథ్. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. రామ్ కథానాయకుడిగా నటించారు. నిధి అగర్వాల్, నభా నటేష్ కథానాయికలు. పూరి జగన్నాథ్, ఛార్మి నిర్మాతలు. చిత్రం ఈనెల 18న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సినిమా విడుదలకి ముందస్తు వేడుకని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పూరి జగన్నాథ్ మాట్లాడుతూ "రామ్ గొప్ప నటుడు. తను మాట్లాడిన తెలంగాణ యాస సినిమాకే హైలెట్. మణిశర్మ ఈ సినిమాకి మూలస్తంభంలా నిలిచార"న్నారు. రామ్ మాట్లాడుతూ "ఈ సినిమా కోసం పనిచేసిన ఆరు నెలల కాలం నా జీవితంలోనే అత్యుత్తమం. నిధి అగర్వాల్ తన పాత్రలో ఒదిగిపోయింది. నభా నటేష్ గడుసైన పాత్రలో కనిపించింది" అన్నారు. "రామ్ లేకుండా ఇస్మార్ట్ శంకర్ లేదు. మరొకరు చేయలేరనేలా నిధి, నభా వారి పాత్రల్లో ఒదిగిపోయారు. మేం తొలి కాపీ చూశాం. సినిమా అప్పుడే విజయవంతమైనందన్న అనుభూతికి గురయ్యాం" అన్నారు ఛార్మి. "పూరి జగన్నాథ్ దర్శకత్వంలో సినిమా చేయాలని ఎదురు చూశా. ఆ అవకాశం ఇంత తక్కువ సమయంలో రావడం ఆనందగా ఉంది. రామ్, నభాలతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది" అని చెప్పింది నిధి అగర్వాల్. నభా నటేష్ మాట్లాడుతూ "అందమైన పాత్ర రాసి... అందులో నటించే అవకాశం నాకు ఇచ్చారు పూరి జగన్నాథ్" అన్నారు. కార్యక్రమంలో నృత్య దర్శకురాలు అనీతోపాటు చిత్రబృందం పాల్గొంది.

విజయంతో కొత్త శక్తి వచ్చినట్టైంది - సందీప్‌కిషన్

అన్యాసింగ్, సందీప్‌కిషన్, దయాపన్నెం

"చాలా రోజుల తర్వాత పంపిణీదారుల నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయి. సినిమా ఫలితం ఎలా ఉంటుందో అనే ఆందోళనతో వారం నుంచి నిద్ర లేదు. సినిమా బాగుందనే మాట విన్నాక ఎంతో ప్రశాంతంగా అనిపించింది" అన్నారు సందీప్ కిషన్. ఆయన కథానాయకుడిగా నటిస్తూ, దయా పన్నెం, వి.జి.సుబ్రహ్మణ్యన్‌తో కలిసి నిర్మించిన చిత్రం 'నిను వీడని నీడని నేనే'. కార్తీక్‌రాజు దర్శకుడు. శుక్రవారం చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. చిత్రానికి లభించిన స్పందన పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ విలేకర్ల సమావేశం నిర్వహించింది చిత్రబృందం. ఈ సందర్భంగా సందీప్‌కిషన్ మాట్లాడుతూ "ఫోన్ చేసిన ప్రతి ఒక్కరూ చాలా మంచి సినిమా తీశారని మెచ్చుకుంటున్నారు. చివర్లో భావోద్వేగాలు బాగున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. శనివారం భావోద్వేగాలతో కూడిన పాటని విడుదల చేస్తాం. ఈ విజయంతో చాలా రోజుల తర్వాత కొత్త శక్తి వచ్చినట్టైంది" అన్నారు. "నా తొలి తెలుగు సినిమాకే ఇంత మంచి ఫలితం రావడం ఆనందంగా ఉందని చెప్పింది చిత్ర కథానాయిక అన్యాసింగ్. దయా పన్నెం మాట్లాడుతూ "తొలి ఆట నుంచే సినిమా బాగుందనే మాట వినిపించింది" అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల్లో ఒకరైన సుప్రియ, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు శివ చెర్రి, సీతారామ్ పాల్గొన్నారు.

ఎవరి కోసం?

రెజీనా, అడివి శేష్

అడివి శేష్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'ఎవరు'. రెజీనా నాయిక. పెరల్ వి. పొట్లూరి, పరమ్ వి. పొట్లూరి, కెవిన్ అన్నె నిర్మాతలు. వెంకట్ రామ్‌జీ దర్శకుడు. నవీన్ చంద్ర కీలక పాత్రధారి. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఆగస్టు 23న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. "అడివి శేష్ పోలీస్ అధికారిగా నటిస్తున్న చిత్రమిది. ఈ కథలో పోలీసు ఎవరి కోసం ఏం చేశాడన్నది ఆసక్తికరం. శ్రీచరణ్ పాకాల సంగీతం ఆకట్టుకుంటుంది" అన్నాయి చిత్రవర్గాలు.

వెళ్లిపోదాం అనుకుంటున్నప్పుడు 'ఆమె' వచ్చింది

"అబద్ధాలతో కూడిన కథలు, ఫార్ములా సినిమాలు చేసి బోర్ కొట్టింది. ఇక ఈ పరిశ్రమ నుంచి వెళ్లిపోదామా అనుకున్నా. ఆ సమయంలోనే 'ఆమె' కథ వచ్చింది" అన్నారు అమలా పాల్. ఆమె ప్రధాన పాత్రధారిగా నటించిన తమిళ చిత్రం 'ఆడై' తెలుగులో 'ఆమె'గా విడుదలవుతోంది. రత్నకుమార్ దర్శకుడు. రాంబాబు కల్లూరి, విజయ్ మోరవనేని నిర్మాతలు. చరితచిత్ర ప్రొడక్షన్స్‌పై తమ్మారెడ్డి భరద్వాజ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ప్రచార చిత్రాన్ని కథానాయకుడు శ్రీకాంత్ హైదరాబాద్‌లో విడుదల చేశారు. అతిథిగా హాజరైన దర్శకురాలు నందినిరెడ్డి మాట్లాడుతూ "ఈ సినిమాలోని ప్రతి సన్నివేశం మనల్ని వెంటాడుతుంది. సమంత, నయనతార, అనుష్క, అమలాపాల్ తదితరులు భవిష్యత్ తరాలకి స్ఫూర్తినిచ్చేలా సినిమాలు చేస్తున్నార"న్నారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ "40 ఏళ్లలో ఎన్నో సినిమాలు చేశా. కానీ 'ఆమె'ని చూశాక షాక్ అయ్యా. అమలా పాల్ నటన ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ సినిమా చేస్తున్నందుకు గర్వపడుతున్నా" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "నేను తీసిన సినిమా తెలుగులో విడుదలవుతున్నందుకు ఆనందంగా ఉంది" అన్నారు. అమలాపాల్ మాట్లాడుతూ "ఎంతో ధైర్యంతో ఈ చిత్రంలో నటించా. ఇందులో ఒక సన్నివేశం చూసి అనురాగ్ కశ్యప్ 'ఇందులో నగ్నత్వం కంటే నీ కళ్లలో బాధ ఎక్కువ కనిపించింద'ని చెప్పారు. ఆ మాటల్ని మరిచిపోలేను. మా నిజాయతీని అంతా మెచ్చుకుంటారని ఆశిస్తున్నా" అన్నారు.

తమ్మారెడ్డి భరద్వాజ, రత్నకుమార్, నందినిరెడ్డి, అమల పాల్, శ్రీకాంత్

యోధుడు వస్తున్నాడు


సుదీప్

సుదీప్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'పహిల్వాన్'. సునీల్‌శెట్టి, ఆకాంక్షసింగ్ కీలక పాత్రధారులు. ఎస్.కృష్ణ దర్శకుడు. ప్రముఖ నిర్మాణ సంస్థ వారాహి చలన చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. "యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న చిత్రమిది. 'ఈగ'తో తెలుగు ప్రేక్షకులకు చేరువైన సుదీప్ మల్లయోధుడి పాత్రలో సందడి చేస్తారు. ప్రముఖ కథానాయకుడు చిరంజీవి విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌కి మంచి స్పందన లభించింది. 'కె.జి.ఎఫ్' చిత్రాన్ని తెలుగులో విడుదల చేసి విజయాన్ని అందుకున్న వారాహి చలన చిత్రం 'పహిల్వాన్'ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంద'ని చిత్రవర్గాలు తెలిపాయి.

పండుగాడి హంగామా


దిలీప్‌రాజా, సుకుమార్, అలీ, వెంకటసాంబిరెడ్డి

అలీ కథానాయకుడిగా నటించిన చిత్రం 'పండుగాడి ఫొటో స్టూడియో'. దిలీప్‌రాజా దర్శకుడు. గుదిబండి వెంకట సాంబిరెడ్డి నిర్మాత. ఈ నెల 21న తెనాలిలో విడుదల ముందస్తు వేడుకని నిర్వహించబోతున్నారు. హైదరాబాద్‌లో దర్శకుడు సుకుమార్ టీజర్‌ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "నేను అలీకి పెద్ద అభిమానిని. ఈ సినిమాతో ఆయన కథానాయకుడిగా రెండో ఇన్నింగ్స్‌ని ప్రారంభించారు. పాటలు బాగున్నాయి. జంధ్యాల మార్క్ కామెడీ ఇందులో ఉంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "విలక్షణమైన పాత్రలతో, ప్రేక్షకుల్ని నవ్వించడమే లక్ష్యంగా రూపొందించిన చిత్రమిది. మా సినిమాలో పండుగాడు ఎవరికి ఫొటో తీస్తే వాళ్లకి పెళ్లైపోతుంటుంది. దానివల్ల ఎలాంటి పరిణామాలు చోటు చేసుకొన్నాయో తెరపైనే చూడాలి. యాజమాన్య సంగీత సారథ్యంలో శ్రేయగోషల్, మనీషా పాడిన పాటలు బాగుంటాయ"న్నారు.

నాగచైతన్య వల్లే అవకాశం

రిచర్డ్ ప్రసాద్

"ఏ సాంకేతిక విభాగమైనా కథలో కలిసిపోయి సాగాలి. ఛాయాగ్రహణం కూడా అంతే" అన్నారు రిచర్డ్ ప్రసాద్. సమంత నటించిన 'ఓ బేబీ' చిత్రానికి ఛాయాగ్రాహకుడిగా పనిచేశారు. 'కొత్త జంట', 'బాబు బంగారం', 'దోచేయ్' తదితర చిత్రాలకు పనిచేశారు రిచర్డ్. 'ఓ బేబీ'తో ఆయన ఖాతాలో మరో విజయం చేరింది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో రిచర్డ్ మాట్లాడారు.

★ "ఫొటోగ్రఫీ కథపై ఆధిపత్యం చేయకూడదు. అందులో మిళితం కావాలి. నందినీ రెడ్డి సూచనలతో 'ఓ బేబీ'ని ఆవిధంగానే తెరకెక్కించాను. సినిమాకి చక్కటి ఆదరణ లభించింది. నా పనితనానికీ మార్కులు పడ్డాయి. 'ఓ బేబీ' విడుదలకి ముందు ప్రచార చిత్రం బాగుందని హాలీవుడ్ ఛాయాగ్రాహకుడు నీరవ్‌షా అభినందిస్తూ ఓ సందేశాన్ని పంపారు. లొకేషన్ని, సెట్‌ని దృష్టిలో ఉంచుకుని లైటింగ్ సమకూర్చుకున్నాను".

★ స్పీల్‌బర్గ్ ప్రేరణతో ఛాయాగ్రాహకుణ్ని కావాలనుకున్నాను. విజువల్ కమ్యూనికేషన్స్‌లో డిగ్రీ పొందా. అడయార్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో మూడేళ్లు సినిమాటోగ్రఫీ చేశా. 'మనం' చిత్రానికి పి.ఎస్. వినోద్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేశా. రచయిత, దర్శకుడు కృష్ణచైతన్య నా మిత్రుడు. తన ద్వారా 'స్వామి రారా'కి ఛాయాగ్రాహకుడుగా అవకాశం దక్కింది. 'కొత్తజంట'లోని నా పనితనాన్ని కథానాయకుడు అల్లు అర్జున్ మెచ్చుకున్నారు. నాగచైతన్య వల్లే 'ఓ బేబీ' అవకాశం దక్కింది. నందిని ఆలోచనల్ని అర్థం చేసుకుని 'ఓ బేబీ'కి పనిచేశాను. తన తదుపరి కొత్త చిత్రానికీ నన్నే ఛాయాగ్రాహకుడిగా ఎంచుకున్నారామె".

★ "నాన్నకు ప్రేమతో' చిత్రానికి పనిచేసే అవకాశం వచ్చినా, వీసా సమస్య చేయలేకపోయా. మరో రెండు పెద్ద చిత్రాలూ వివిధ కారణాల వల్ల వదులుకోవాల్సి వచ్చింది. నన్ను సినిమాటోగ్రాఫర్‌గా చూడాలని అమ్మ కోరిక. అది తీరకుండానే అమ్మ కన్ను మూసింది".

తరుణ్‌తేజ్, లావణ్య

సందేశంతో 'ఉండిపోరాదే'

తరుణ్‌తేజ్, లావణ్య జంటగా నవీన్ నాయని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఉండిపోరాదే'. డాక్టర్ లింగేశ్వర్ నిర్మాత. సత్య ప్రమీల కర్లపూడి సమర్పిస్తున్నారు. ఈ చిత్రంలోని గీతాన్ని ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "సినిమా పేరు బాగుంది. సాబు వర్గీస్ సంగీత సారథ్యంలో రూపొందిన పాటలన్నీ చాలా బాగున్నాయి" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కథాబలమున్న సందేశాత్మక చిత్రమిది. సాబు వర్గీస్ పాటలు, మహావీర్ నేపథ్య సంగీతం చిత్రానికి ప్రధానబలం" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుందీ చిత్రం. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అన్నారు.

భార్య కోసం భర్త

మహేష్‌సూర్య సిద్దగోని నటిస్తూ స్వీయదర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'బడిదొంగ'. ఇషిక వర్మ, రవికిరణ్ ప్రధాన పాత్రధారులు. శుక్రవారం హైదరాబాద్‌లో చిత్రబృందం లోగోను ఆవిష్కరించింది. దర్శకనిర్మాత మాట్లాడుతూ "యాక్షన్‌తో కూడిన రొమాంటిక్ ప్రేమ కథ ఇది. రామాయణం ప్రకారం సీతను రావణుడు అపహరించినప్పుడు సీత జాడని తెలుసుకొనేందుకు లంకకి వెళ్లొచ్చాడు ఆంజనేయుడు. ఈ కాలంలో అపహరణకి గురైన భార్య కోసం భర్తే వెళ్లడం వల్ల ఏర్పడే పరిణామాల నేపథ్యంలో సాగే కథ ఇది" అన్నారు.

ఇషికా, రవికిరణ్

వసుంధర

'అంతర్జాతీయ అంతరిక్ష విశ్వవిద్యాలయం'లో పరిశోధన చేయాలని, శిక్షణ తీసుకోవాలనేది ఎందరో శాస్త్రవేత్తల కల. తెలుగమ్మాయి నిఖితకు ఆ అవకాశం అనుకోకుండానే వచ్చింది. శాస్త్ర సాంకేతిక రంగంలోకి రావాలనుకునే విద్యార్థులకు ఆమె కల్పిస్తోన్న అవగాహనతోనే ఆ ఛాన్స్ కొట్టేసింది. కల్పనా చావ్లా జ్ఞాపకార్థం అందించే ఉపకార వేతనమూ అందుకుంది. ఇంతకీ ఆమె ఏం చేస్తుందో వివరించిందిలా...

నాసా శిక్షణకు ఈ నలుగురు...

అనంత విశ్వం అంటే... అంతరిక్ష పరిశోధనలు ఎక్కడ చేస్తారు...రాకెట్ రయ్‌మని ఎలా దూసుకుపోతుంది... చిన్నప్పుడు నాకూ ఇలాంటి సందేహాలెన్నో వచ్చేవి. వాటిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, ఈ రంగంలోకి రావాలనుకునే విద్యార్థులకు తెలియజేయాలనుకున్నా. ఆ ఆలోచనతోనే 'సొసైటీ ఫర్ స్పేస్ ఎడ్యుకేషన్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్' అనే సంస్థను ప్రారంభించా. నేను పుట్టి, పెరిగింది బెంగళూరులో అయినా మా స్వస్థలం కర్నూలు. మా నాన్న దర్జీ. అమ్మ టీచర్. అంతా ఇంజినీరింగ్, మెడిసిన్ గురించి ఆలోచిస్తుంటే... నేను వ్యోమగామిని కావాలనుకునేదాన్ని. అదే లక్ష్యంతో బెంగళూరులోని అలయన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ డిజైన్‌లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్ పూర్తి చేశా.

> నిఖిత నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీలో ప్రాజెక్టులు రూపొందించింది. ఐఐటీ, కాన్పూర్ నుంచి ఫ్లైట్ ల్యాబ్ ట్రైనింగ్‌లో శిక్షణ పొందింది. సొసైటీ ఫర్ ఇస్రో నిర్వహించిన పోటీల్లో బెస్ట్ టీచర్ అవార్డు అందుకుంది. కర్ణాటక సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ బెస్ట్ సైన్స్ కమ్యూనికేటర్ అవార్డు అందుకుంది. ఆమె గణితం, సైన్స్ టీచర్ కూడా.

శాస్త్రవేత్తలను తయారుచేయాలని...

మా కాలేజీలో స్పేస్ క్లబ్ ఉండేది. అందులో అంతరిక్షానికి సంబంధించిన విద్యపై అవగాహన కల్పించేవారు. అదీ కేవలం మా కళాశాల విద్యార్థులకు మాత్రమే. నా లక్ష్యం వ్యోమగామి కావడం. అయితే నా శరీర ఎత్తు అందుకు సరిపోదని తెలిసింది. నేను కాలేకపోయినా ఇతర విద్యార్థులకు ఆ విజ్ఞానాన్ని అందించాలనుకున్నా. ఓ కార్యక్రమంలో ఇలాంటి ఆలోచనలే ఉన్న సుజయ్ కృష్ణతో పరిచయం అయ్యింది. అతనిది కేరళ. ఇద్దరం కలిసి శాస్త్ర, సాంకేతిక రంగంపై వీలైనంతమంది విద్యార్థులకు అవగాహన కల్పించాలనుకున్నాం. స్పష్టమైన ప్రణాళికతో నా ఇంజినీరింగ్ కాకముందే... ఇద్దరం కలిసి 2016లో 'సొసైటీ ఫర్ స్పేస్ ఎడ్యుకేషన్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించాం. మా సంస్థ ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో అంతరిక్ష విద్యపై అవగాహన కల్పిస్తాం. తెలంగాణలోని బాసర ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్‌తో కలిపి ఇప్పటి వరకు నాలుగు వేల మందికి పైగా విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాం. ఇటీవల సంగారెడ్డితోపాటు, బెంగళూరులోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలను ఎంపికచేసి మరి కొన్ని కార్యక్రమాలు చేయబోతున్నాం. ఏ పాఠశాల అయినా సరే... ఆసక్తి ఉన్న ముప్పై మంది విద్యార్థులను ఎంపిక చేస్తాం. వీరికి వారంలో ఒక రోజు ఇస్రో శాస్త్రవేత్తలు, ఇతర నిపుణులతో శిక్షణా కార్యక్రమం ఉంటుంది శాస్త్రవిజ్ఞానానికి సంబంధించిన మ్యూజియంలు, రాకెట్, చిన్న చిన్న విమానాల పనితీరు తెలియజేస్తాం. ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేయడానికి మాకు అక్షయ పాత్ర ఫౌండేషన్ నిధులు సమకూరుస్తోంది. అదే ప్రైవేటు పాఠశాల విద్యార్థులైతే అందుకు అయ్యే ఖర్చును భరించాల్సి ఉంటుంది. మేం ఇస్రో, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరో ఫిజిక్స్‌తోనూ మేం అనుసంధానం అయ్యాం. త్వరలో కేరళలోనూ మా సేవల్ని విస్తరించబోతున్నాం. భారత్‌లోనే కాకుండా... ఫిలిప్పైన్స్, మారిషస్, శ్రీలంకలోనూ శిక్షణ అందిస్తున్నాం. మొదట్లో మా పెద్దవాళ్లకు మేం ఓ సంస్థ పెట్టబోతున్నామని చెబితే... 'బాగా చదువుకున్నారు. ఇవన్నీ మీకెందుకు. ఏదైనా మంచి ఉద్యోగం చేసుకోవచ్చు కదా' అని అన్నారు. సంస్థ పెట్టిన ఏడాదిన్నర తరువాత మా విజయాలు చూసి అంగీకరించారు. మొదట్లో నిధులు సమకూర్చుకోవడం ప్రారంభంలో కొద్దిగా కష్టమైంది. నేను ట్యూషన్లు చెప్పి, ఆ డబ్బును దీనికి ఉపయోగించేదాన్ని. ఇప్పుడు ఏ ఇబ్బందీ లేదు. ఇవన్నీ కలిపి నాకు కల్పనాచావ్లా ఉపకారవేతనంతోపాటు అంతర్జాతీయ అంతరిక్ష విశ్వవిద్యాలయంలో శిక్షణ తీసుకునే అవకాశం తెచ్చిపెట్టాయి. నాతోపాటు మరో ముగ్గురు విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొనబోతున్నారు. కల్పనా చావ్లా పురస్కారం సైతం అందుకోనున్నారు.

కల్పనా చావ్లా అవార్డు ఎవరిస్తారంటే...

మైఖేల్ పాటర్ అనే వ్యక్తి కల్పనా చావ్లా జ్ఞాపకార్థం ఈ స్కాలర్‌షిప్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఆయన చావ్లా స్నేహితుడు. ఈ కార్యక్రమం కింద దేశంలో శాస్త్రవిజ్ఞాన శాస్త్రంలో ప్రతిభ కనబరిచే మహిళలకు మూడేళ్లుగా ఆర్థిక చేయూత అందిస్తున్నారు.

ఉపకారవేతనానికి ఇలా...

ఫ్రాన్స్‌లోని అంతర్జాతీయ అంతరిక్ష విశ్వవిద్యాలయానికి ప్రపంచం నలుమూలల నుంచి దరఖాస్తులు రాగా అందులో 120 మంది అర్హత సాధించారు. భారత దేశం నుంచి 12 మంది ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. వీరిలో ఏడుగురు ఇస్రో శాస్త్రవేత్తలు. మిగిలిన వారిలో నిఖిత కాకుండా మరో ముగ్గురు అమ్మాయిలు, ఓ అబ్బాయి ఉన్నారు. వీళ్లూ కల్పనా చావ్లా పురస్కారానికి ఎంపికయ్యారు. ఇంతకీ వాళ్లెవరంటే...

- నిత్యా పాండేది ఛత్తీస్‌గఢ్‌లోని చిన్న గ్రామం. బాల్యం నుంచే ఆమెకు అనంత విశ్వం అంటే ఆసక్తి. డిగ్రీలో ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ ఎంపిక చేసుకుంది. ఆ తరువాత ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్‌లో పీజీ పూర్తి చేసింది.
- అదితి నీలవర్ణది మహారాష్ట్రలోని థానే. ముంబయిలోని ఎన్ఎంఐఎంఎస్ విశ్వవిద్యాలయం నుంచి 2017లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసింది. ఆమెకూ బాల్యం నుంచే అంతరిక్షం గురించి తెలుసుకోవాలని కోరిక. అప్పటి నుంచే అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంచుకుంది. ఆమె బాస్కెట్ బాల్, వాలీబాల్ క్రీడాకారిణి కూడా.
- రుషాంక అమృత్కర్ ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తోంది. ముంబయి ఐఐటీలో టీచింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. రాయల్ ఆస్ట్రానమీ సొసైటీలో సభ్యురాలు. మూడు పుస్తకాలు రాసింది. శాటిలైట్ రిమోట్ సెన్సింగ్‌లో నిపుణురాలు. స్టెమ్‌లో సభ్యులైన వారికి అవసరమైన చేయూత అందిస్తోంది.

మిగిలిన శాస్త్రవేత్తలతోపాటు ఈ నలుగురు అంతరిక్ష విశ్వవిద్యాలయంలో రెండు నెలలపాటు శిక్షణ తీసుకుంటున్నారు. స్పేస్ పాలసీ, కొత్త సంస్థల ఏర్పాటు, స్పేస్ ఇంజినీరింగ్, ఆస్ట్రానమీ గురించి ఇందులో తర్ఫీదునిస్తారు. ఇక్కడికి ప్రపంచ ప్రఖ్యాతి పొందిన శాస్త్రవేత్తలు, స్పేస్ లాయర్లు, స్పేస్ డాక్టర్లు... వచ్చి పాఠాలు చెబుతారు.

నిఖిత నిత్యా పాండే అదితి నీలవర్ణ రుషాంక అమృత్కర్

జిడ్డు చర్మానికి ఉప్పు నీళ్లు

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొందరి ముఖం ఎప్పుడూ జిడ్డుగా కనిపిస్తుంది. ఆ సమస్యను అదుపులో ఉంచాలంటే...

- ముఖం కడుక్కుంటున్నప్పుడు మొదట చల్లని నీరే వాడాలి. చర్మంలోని జిడ్డు, మురికిని తొలగించడంలో ఇదెంతో మేలు చేస్తుంది. ఆ తరువాత గోరువెచ్చని నీటితో మరోసారి కడిగి, పొడి వస్త్రంతో అద్దినట్లు తుడుచుకోవాలి. ఆ వెంటనే చల్లని నీటిని ముఖంపై చల్లుకుంటే చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. ఇలా రోజులో రెండుసార్లు చేయగలిగితే ముఖంపై మొటిమలు వచ్చే అవకాశం తగ్గుతుంది.
- చర్మంలోని అధిక నూనెను నియంత్రించాలంటే ఎప్పటికప్పుడు బ్లాటింగ్ లేదా టిష్యూ కాగితంతో ముఖాన్ని అద్దుకోవాలి. వెనిగర్ లేదా గ్రీన్ టీకి గులాబీ నీరు కలిపి ముఖానికి రాసుకోవాలి. ఇది టోనర్‌లా పనిచేసి జిడ్డు సమస్యను అదుపులో ఉంచుతుంది.
- వారానికి రెండు లేదా మూడు సార్లు పాలల్లో కొద్దిగా తేనె కలిపి ముఖానికి రాయాలి. ఆరిన తరువాత చల్లని నీటితో శుభ్రపరుచుకుంటే జిడ్డు సమస్య చాలావరకూ తగ్గుతుంది.
- సెనగపిండి, పెరుగు కలిపి ముఖానికి పూతలా వేయాలి. పదిహేను నిమిషాలయ్యాక శుభ్రం చేస్తే ముఖంపై పేరుకున్న మురికి తొలగిపోవడమే కాదు... చర్మం తాజాగా మారుతుంది.

ఉప్పునీరు

మంచినీటిలో కొంచెం ఉప్పు కలిపి దాన్ని స్ప్రే సీసాలో నింపాలి. ముఖాన్ని శుభ్రం చేసుకుని ఈ ఉప్పునీటిని స్ప్రే చేసుకోవాలి. ఈ నీరు చర్మంలోని జిడ్డును నియంత్రిస్తుంది. ఇలా రోజులో రెండు లేదా మూడు సార్లు చేస్తే కొద్ది రోజుల్లోనే ముఖంపై జిడ్డు దూరమవుతుంది.

రోజుకో గ్లాస్... క్యారెట్ జ్యూస్

వంటల్లో క్యారెట్ వాడటం, అప్పుడప్పుడూ పచ్చిగా తినడం మాత్రమే కాదు, రోజూ గ్లాసు రసం తాగి చూడండి. ఎన్ని లాభాలుంటాయో!

- క్యారెట్‌లో బీటా కెరొటిన్ ఎక్కువ. ఇది శరీరంలోకి వెళ్లిన తరువాత విటమిన్-ఎగా మారుతుంది. ఈ రసం తాగడం వల్ల కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.
- ఇందులో కెరొటినాయిడ్లు అధికం. ఇవి యాంటీఆక్సిడెంట్లలా పనిచేసి శరీరంలోని మలినాలను బయటకు పంపిస్తాయి. శరీరానికి హాని చేసే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. ఒత్తిడిని తగ్గించి జీవక్రియలు సాఫీగా జరిగేలా చూస్తాయి.
- క్యారెట్‌లోని పోషకాలకు క్యాన్సర్ కణాలతో పోరాడే శక్తి ఉందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.
- ఈ రసం తాగడం వల్ల ముఖంపై ముడతలు తగ్గుముఖం పడతాయి. చర్మం కాంతిమంతంగా మారుతుంది. ఇందులోని విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.
- ఆహారం సరిగా జీర్ణం కాకపోవడం, మలబద్ధకం సమస్యలున్నవారు రోజూ గ్లాసు క్యారెట్ రసం తాగితే జీర్ణక్రియ సక్రమంగా జరుగుతుంది. ఇందులోని పీచు మలబద్ధకాన్ని నివారిస్తుంది.
- బరువు తగ్గాలన్నా, జీవక్రియలను మెరుగుపరుచుకోవాలనుకున్నా, శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపాలనుకున్నా... రోజూ గ్లాసు క్యారెట్ రసం తాగితే చాలు. త్వరగా ఆకలి వేయదు.
- క్యారెట్‌లోని పొటాషియం చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. రక్తపోటును నియంత్రిస్తుంది. థైరాయిడ్, అధిక కొలెస్ట్రాల్‌తో బాధపడేవారు ఈ రసం రోజూ తాగితే మంచిది.

మెకానిక్ మైనా!

యాభై రెండేళ్ల మైనా చేసే పని చాలామంది మహిళలతో పోలిస్తే భిన్నం. ఎందుకో తెలుసుకోవాలనుకుంటున్నారా... ఇది చదివేయండి మరి.

మైనాది మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని మందసౌర్ పట్టణం నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని నయాఖేడా అనే గ్రామం. మందసౌర్ బైపాస్ హైవేపై ఆమెకో మెకానిక్ షెడ్డు ఉంది. సైకిల్, బైక్ లాంటి చిన్న చిన్న వాటికే కాకుండా కారు, జీప్, ట్రక్ లాంటి భారీ వాహనాల టైర్లకు పంక్చర్లు వేస్తూ, మరమ్మతులు చేస్తుంది. భారీగా ఉండే ట్రక్కుల టైర్లను సొంతంగా తొలగించి మరమ్మతు చేసి మళ్లీ బిగిస్తుంది. ఏ వేళలో, ఏ వాతావరణంలోనైనా ఆమె మెకానిక్ షెడ్డు పనిచేయడం విశేషం.

మైనా తండ్రి మెకానిక్. చిన్నప్పటి నుంచి ఆయనకు పనిలో సాయం చేసేది. కొన్నాళ్లకు ఆమెకు పెళ్లి చేశారు. ఇద్దరు అమ్మాయిలు పుట్టారు. మూడో బిడ్డ కడుపులో ఉన్నప్పుడు భర్త చనిపోయాడు. అంతకు ముందే ఆమె కన్నతండ్రీ కన్ను మూశాడు. ఏ ఆధారం లేక బిడ్డలతో పుట్టింటికి చేరింది. అక్కడా తోబుట్టువులు చిన్నవాళ్లు కావడంతో కుటుంబ పోషణ కోసం ఏదైనా పని చేయాలనుకుంది. పెద్దగా చదువుకోకపోవడంతో మెకానిక్ పనినే ఉపాధిగా ఎంచుకుంది.

ఇబ్బందులు తప్పలేదు...

హైవే మీద చిన్న గుడిసె వేసుకుని దాన్నే షెడ్డుగా మార్చుకుంది. మొదట్లో కేవలం సైకిళ్లు, బైక్ టైర్లకు పంక్చర్లు వేస్తూ మరమ్మతులు చేసేది. క్రమంగా పెద్ద వాహనాలకు రిపేర్లు చేయడం మొదలుపెట్టింది. ట్రక్కుల్లాంటివి మరమ్మతులు చేసే సమయంలో చాలా కష్టపడాల్సి వచ్చేది. దానికితోడు చుట్టుపక్కలవాళ్లు, బంధువుల అవహేళనలను ఎదుర్కోవాల్సి వచ్చేది. 'మగవాళ్లు చేసే ఈ మెకానిక్ పని నీకెందుకు... మరేదైనా పని చేసుకోవచ్చుగా...' అనేవారట. 'మహిళలు బలహీనులు కారు. తలచుకుంటే వాళ్ల కాళ్లపై వాళ్లు నిలబడగలరని నిరూపించాలనుకున్నా. ఎంత కష్టమైనా పంటి బిగువున భరిస్తూ పనిచేస్తున్నా...' అని చెబుతోంది. పిల్లల్ని హాస్టల్‌లో ఉంచి చదివించుకుంది. దాదాపు ఇరవై ఏళ్లుగా ఈ పని చేస్తోంది. ఆమె పిల్లలు ఇప్పుడు పెద్దవాళ్లై ప్రయోజకులుగా మారినా ఆమె తను చేసే పనిని వదల్లేదు.

పెళ్లయ్యాకా అదే పరిస్థితి!

నాకు పాతికేళ్లు. మొదటినుంచీ నెలసరి సరిగ్గా రాదు. పెళ్లయ్యాక ఈ సమస్య తగ్గుతుందని అన్నారు. ఏడాది క్రితం పెళ్లయ్యింది. అయినా మార్పు లేదు. చివరకు అన్నిరకాల పరీక్షలు చేయించుకున్నా ఫలానా కారణం అని తెలియడంలేదు. దీనికి ఏదైనా పరిష్కారం ఉందా?

– ఓ సోదరి

నెలసరి సరిగ్గా రావడానికి ఓ ప్రక్రియ ఉంటుంది. మొదట మెదడు నుంచి హార్మోన్లు విడుదలై, అండాశయాన్ని ప్రభావితం చేస్తాయి. దాంతో అండం విడుదల అవుతుంది. అది జరిగిన పదిహేను రోజులకు నెలసరి వస్తుంది. మరికొన్ని హార్మోన్ల పనితీరు సజావుగా సాగాలి. ఒకవేళ ఎప్పుడైనా తేడా జరిగితే... ఆ ప్రభావం అండాశయంపై పడుతుంది. అది అండం విడుదలలో ఆటంకం కలిగిస్తుంది. దాంతో నెలసరి అదుపు తప్పుతుంది. ఇవి కాకుండా థైరాయిడ్, పీసీఓఎస్ (పాలిసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్) వంటి సమస్యలున్నా ఇలా కావొచ్చు. వీటన్నింటికీ పెళ్లితో సంబంధంలేదు. ఈ హార్మోన్ల అసమతూకం ముందు నుంచీ ఉండొచ్చు. ప్రసవం అయ్యాకా కొనసాగొచ్చు. ఒకవేళ మీరు గర్భనిరోధక మాత్రలు వాడి, మానేసినా ఈ సమస్య మళ్లీ ఎదురుకావొచ్చు. ముందు మీరు ఏ హార్మోన్ల లోపం ఉందో తెలుసుకోవాలి. ఆ తరువాత వెంటనే గర్భం దాల్చాలనుకుంటున్నారా... కొన్నాళ్లు ఆగాలనుకుంటున్నారా అనేదీ మీరిద్దరూ చర్చించుకోవాలి. వెంటనే పిల్లల్ని కనాలనుకుంటే చికిత్స తీసుకోవాలి. అప్పుడే పిల్లలు వద్దనుకుంటే గర్భనిరోధక మాత్రలు వాడుతూనే... హార్మోన్ల అసమతూకాన్ని నియంత్రించేందుకు చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. పిల్లలు కావాలనుకున్నప్పుడు అండం విడుదల కోసం మాత్రల్ని వాడితే చాలు. ఆహారంలో విషయంలో కొన్ని మార్పులు చేసుకోవడమూ ముఖ్యమే. వ్యాయామం చేస్తూ, ఒత్తిడిని అదుపులో ఉంచుకుంటే... నెలసరి సక్రమంగానే వస్తుంది. మీరు మరోసారి వైద్యుల్ని సంప్రదించడం మంచిది.

డియర్ వసుంధర

డా॥ అనగాని మంజుల
గైనకాలజిస్టు

– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

అహో గులాబీ!

నందనవనం

రంగు రంగుల గులాబీల్ని చూస్తే మనసు మురిసిపోతుంది. వరండా, బాల్కనీ... ఇలా ఎక్కడ ఏ కాస్త చోటు ఉన్నా ఈ మొక్కల్ని సులువుగా పెంచుకోవచ్చు. అదే వీటిని సేంద్రియంగా పెంచుకోగలిగితే గులాబీ రేకలతో గులాబీ నీరు, బెల్లం, చక్కెరతో కలిపి గుల్కండ్ వంటివి తయారు చేసుకోవచ్చు. అసలు ఈ మొక్కల్ని ఎలా పెంచుకోవాలో తెలుసుకుందామా!

గులాబీల్లో ఎన్నో రకాలు ఉన్నా ఎరుపు, పసుపు, తెలుపు, గులాబీ రంగు పూల మొక్కలకు ఆదరణ ఎక్కువ. వీటిని నాటుకునే ముందు చీడపీడల్ని తట్టుకునే రకాల్ని ఎంచుకోవాలి. సంవత్సరంలో మూడు, నాలుగు దఫాలుగా వీటికి అంటుకట్టి కొత్త మొక్కల్ని పెంచుకోవచ్చు.

ఎత్తుని బట్టి... మొక్క ఎదిగే తీరుని బట్టి కుండీలను ఎంచుకోవాలి. పొట్టి గులాబీలకు పన్నెండు అంగుళాలు... ఫ్లోరిబండా, చిన్న హైబ్రిడ్, పెద్ద హైబ్రిడ్ రకాలకు పద్దెనిమిది అంగుళాల్లో కుండీలను వాడాలి. అవి లోతుగా, వేర్ల పెరుగుదలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలి. గులాబీ మొక్కల్ని పెంచేందుకు అవసరమైన మట్టిని సిద్ధం చేసుకోవాలి. ఎర్రమట్టి, తేమని నిలిపే కొబ్బరిపీచు (కోకోపీట్), కొంత వర్మీ కంపోస్టు కలిపి కుండీలో నింపాలి. దానికి అడుగున రంధ్రం చేస్తే మిగులు నీరు బయటికి పోతుంది. ఈ మట్టి మొత్తం తడిసేలా దశల వారీగా నీటిని అందించాలి. మొక్కని నేరుగా కుండీల్లో నాటాలనుకున్నప్పుడు వేర్లు కుండీలో అన్ని వైపులకు సమానంగా వ్యాపించాలి. అవి రెండు అంగుళాల లోతులో ఉండేలా చూసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ద్రవ, ఘన రూప ఎరువులను కొత్త వేళ్లకు తగిలేలా ఉంచకూడదు. అలాచేస్తే మొక్కలు మొదట్లోనే చనిపోయే ప్రమాదం ఉంది.

ఆధారం ఇవ్వాలి... గులాబీ మొక్కల్ని గాలి సోకే ప్రాంతాల్లో, మిద్దెమీద పెంచుతుంటారు. అవి పొదవుగా ఎదిగే మొక్కలైతే త్వరగా విరిగిపోవచ్చు. ఆ సమస్య ఎదురుకాకుండా మొక్కలకు తగిన ఊతమివ్వాలి. ఎప్పటికప్పుడు ఎండిన పూలను, కొమ్మల్ని కత్తిరించుకుంటే మొక్కలు చక్కగా పెరుగుతాయి. ఎక్కువ పూలు పూస్తాయి. పెంచే రకాన్ని బట్టి పోషణ అందించాలి. రెండు వారాలకోసారి ఎన్‌పీకే ఉండే ద్రవరూప ఎరువుల్ని అందించాలి. వర్మీకంపోస్టు, పశువుల పేడ వంటి సేంద్రియ ఎరువులను మొక్కలకు వినియోగించవచ్చు. వీటన్నింటివల్లా అన్ని పోషకాలు సమపాళ్లల్లో అందుతాయి. మూడు నుంచి ఐదు సంవత్సరాల వరకూ ఆ కుండీలు మార్చవలసిన అవసరం లేదు. గులాబీపూల సంఖ్య, నాణ్యత తగ్గితే కొత్త మొక్కల్ని పెట్టాల్సిందే. అలాంటి మొక్కలను పడేయకుండా పెరట్లో నాటితే మళ్లీ పూస్తాయి.

పోషణ ఇలా... గులాబీల మట్టి పొడిబారకుండా చూసుకోవాలి. కుండీల్లోని మట్టి మిశ్రమంపై మెత్తటి సేంద్రియ ఎరువును చల్లితే తేమ కోల్పోకుండా చేయవచ్చు. కుండీల్లో పెంచే గులాబీలకు సాధారణంగా పొలుసు పురుగులు, నల్లి, తామర, పిండి పురుగులు పడతాయి. దాంతో పూలు ఆకర్షణ కోల్పోతాయి. ఈ సమస్యకు రసాయన పురుగుమందులు కాకుండా వేపనూనె వాడొచ్చు. ఇది ఫంగస్‌ని అదుపులో ఉంచుతుంది.

– సూరం సింధూజ, అసిస్టెంట్ ప్రొఫెసర్, శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం, హైదరాబాద్

నజరానా

పరుపుల కింద, అరల్లో వేప, తులసి ఆకులు వేస్తే నల్లులు, దోమలు రాకుండా ఉంటాయి.

బంగారం-వెండి

12న ముగింపు-క్రితం

	ముగింపు	క్రితం
హైదరాబాద్		
బంగారం (24క్యా)	35,600	35,860
ఆర్నమెంట్	33,280	33,480
వెండి (కిలో)	39,040	39,270
విజయవాడ		
బంగారం (24క్యా)	35,670	35,840
ఆర్నమెంట్	33,050	33,200
వెండి (కిలో)	39,300	39,500
ప్రొద్దుటూరు		
బంగారం (24క్యా)	34,400	34,500
ఆర్నమెంట్	31,650	31,850
వెండి (కిలో)	39,000	39,200
రాజమహేంద్రవరం		
బంగారం (24క్యా)	35,630	35,780
ఆర్నమెంట్	32,960	33,300
వెండి (కిలో)	39,100	39,300
విశాఖపట్నం		
బంగారం (24క్యా)	35,460	35,650
ఆర్నమెంట్	32,980	33,150
వెండి (కిలో)	38,500	38,500
తమిళనాడు		
బంగారం ఆర్నమెంట్ (గ్రా)	3,296	3,330
వెండి (గ్రా)	41.00	41.30

(రూ. లలో)

ఈతరం

అంకురార్పణ

చెత్తకు స్మార్ట్ చెక్!

చెత్త ఎందుకిలా పేరుకుపోతోందని ఆలోచించాడో కుర్రాడు.. దాన్ని ఆపే దిశగా అడుగులు వేశాడు.. చదివిన టెక్నాలజీని వాడుకున్నాడు. అంతే.. ప్రధానమంత్రి ప్రకటించడానికి ఒకడుగు ముందే 'స్వచ్ఛ భారత్' పేరుతో యాప్‌ని రూపొందించాడు. తర్వాత దాన్నే స్టార్టప్‌గా మలచి 'అంతరిక్ష్' పేరుతో నడుపుతున్నాడు.. ఆ చిన్నోడు ఎవరంటే? మహేక్ ఎం షా. హైదరాబాదీనే. ఇంతకీ ఏంటీ అంతరిక్ష్? అని అడిగితే 'ఈ-తరం'తో తన జర్నీని పంచుకున్నాడిలా..

మొదట్నుంచీ ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్‌లంటే ఇష్టం. ప్రతిదాన్నీ నిశితంగా పరిశీలించేవాడిని. ఆ ఆసక్తితోనే ఐఐటీ మద్రాసులో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశా.. తర్వాత హైదరాబాద్‌లోని ఓ ట్రేడింగ్ కంపెనీలో మూడేళ్లు పని చేశా. ఆ అనుభవంతో ఈ- కామర్స్ రంగంలో అంకుర సంస్థ స్థాపించా. వాస్తవ పరిస్థితులు తెలియక కొద్ది నెలల్లోనే కంపెనీని మూసేయాల్సి వచ్చింది. తర్వాత ఇటలీ వెళ్లి అక్కడ డిజైన్, ఎనర్జీ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ పూర్తి చేసి తిరిగి ఇండియా వచ్చా. ఐఐటీ మద్రాసులో నాతో పాటు చదివిన కొందరు మిత్రులు, సీనియర్లు కలిసి స్టార్ట్ చేసిన కంపెనీలో ప్రొడక్ట్ మేనేజర్‌గా కొత్త బాధ్యత తీసుకుని 30కి పైగా ప్రొడక్ట్స్‌ని తయారు చేశా. అక్కడా ఆశించిన స్థాయిలో ఫలితం రాలేదు. అప్పుడే నాదైన ముద్ర వేసేలా ఏదైనా కొత్తగా స్టార్ట్ చేయాలనుకున్నా. అదీ సమాజ హితం కోరేదై ఉండాలని అన్వేషించా. మనకున్న ప్రధాన సమస్యల్లో చెత్త కుప్పలుగా పేరుకుపోవడం నాలో ఆలోచనకి పునాది అయ్యింది. పారిశుద్ధ్య కార్మికులు వారానికి ఒకటి రెండు సార్లు వచ్చి చెత్త సేకరిస్తున్నారు. ఒక్కోసారి చెత్త పూర్తిగా నిండిపోయి దుర్వాసన వస్తున్నా పట్టించుకునేవారుండరు. ప్రతిసారీ మున్సిపాలిటీ సిబ్బందికి ఫిర్యాదు చేయాలన్నా కష్టమే. మరేంటి దీనికి పరిష్కారం? అని ఆలోచించా. అలా పుట్టిందే 'స్వచ్ఛ భారత్' యాప్.



నేనే ముందు..

ప్రధానమంత్రి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడానికి ముందే 2014లో దీన్ని రూపొందించాను. దీంతో మీ ఇంటి పక్కన, మీ వీధిలోని గార్బేజీ బిన్‌లో చెత్త పేరుకుపోతే, ఒక ఫొటో తీసి ఈ యాప్‌లో పోస్ట్ చేయాలి.. సంబంధిత ఫొటో నేరుగా ప్రధాని కార్యాలయ ట్విటర్ అకౌంట్‌కి చేరుతుంది.. ఇలా పేరుకుపోయిన చెత్తను ఫొటోల రూపంలో పీఎం కార్యాలయానికి చేరవేయడమే ఈ యాప్ పని. రోజులో చాలా ఫిర్యాదులు వచ్చేవి. ఇప్పటికి సుమారు లక్షన్నర ఫిర్యాదులు ఈ యాప్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి చేరాయి. చాలా సమస్యలు పరిష్కారమయ్యాయి కూడా.. ఇదే అంతరిక్ష్ అనే నూతన అంకుర సంస్థ స్థాపనకి ప్రేరణగా నిలిచింది.

మొదటి పదిలో మేము..

ఏటా నూతన అంకురాలను ప్రోత్సహించేందుకు క్వాల్కం కంపెనీ పోటీలు నిర్వహిస్తుంది ఈ ఏడాది పోటీలో వందకు పైగా అంకుర సంస్థలు పాల్గొన్నాయి. ఇందులో మొదటి పది స్థానాల్లో నిలిచిన సంస్థల్లో మా అంతరిక్ష్ ఒకటి.

ఏంటీ అంతరిక్ష్?

ప్రజలు, ఉద్యోగులు, పంచాయతీ కార్యాలయ సభ్యులు, పారిశుద్ధ్య కార్మికులకి తక్కువ ఖర్చులో ఐఓటీ టెక్నాలజీలతో స్మార్ట్ విధానంతో చెత్త నిర్వహించడం ఎలాగో అవగాహన కల్పిస్తున్నాం. గార్బేజ్ బిన్స్ దగ్గర ఏర్పాటు చేసిన స్తంభాలకు సెన్సర్‌లు అమర్చుతాం. అవి గార్బేజ్ బిన్స్ నిండగానే మున్సిపాలిటీ ఉద్యోగులు, చెత్తని సేకరించి తీసుకెళ్లే వర్కర్లకు మెసేజ్ రూపంలో సమాచారం చేరవేస్తాయి. అంతేకాదు.. గార్బేజ్ బిన్స్ చుట్టుపక్కల ఉన్న ప్రజల్ని దీంట్లో భాగస్వాముల్ని చేస్తున్నాం. నిండిన చెత్తని

ఎంత సమయంలో సేకరించి తీసుకెళ్తారో తెలుపుతూ అలర్ట్ మెసేజ్ వెళ్తుంది. ప్రస్తుతం స్మార్ట్ సిటీల రూపకల్పనలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా సౌత్ చెన్నైలో ప్రయోగిస్తున్నాం. దేశంలోని ఇతర రాష్ట్రాలకూ ఈ ప్రాజెక్టు చేరేలా చేయాలనేది నా ఆలోచన.. ఇప్పటికైతే 11 మంది బృందంగా ఏర్పడి పని చేస్తున్నాం. 'ఐఓటీ' టెక్నాలజీ సాయంతో అందర్నీ భాగస్వాముల్ని చేస్తూ క్లీన్ ఇండియాని చూడాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం.

- నిఖిల్ గెంటిల

సీ టు ది 'పవర్' ఆఫ్ ఫోర్

ఫ్యామిలీ.. ఫ్రెండ్స్..
పుట్టిన రోజు.. పెళ్లి రోజు..
సంతోషం.. బాధ..
దేనికైనా మీరెలా స్పందిస్తున్నారు?
గ్రూపులో ఓ మెసేజ్.. లేకుంటే ఎఫ్‌బీలో గ్రీటింగ్స్..
ట్విటర్‌లో ఓ సంక్షిప్త సందేశం.. ఇంతేనా? స్మార్ట్‌ఫోన్‌లు సోషల్ లైఫ్‌లో చిక్కుకుని రియల్ లైఫ్‌కి దూరం అవుతున్నారా? అయితే, కచ్చితంగా 'సీ టూ ది పవర్ ఆఫ్ ఫోర్' స్కిల్ ఫార్ములా గురించి తెలుసుకోండి.

లైఫ్ స్కిల్ ఫార్ములా

C4

కేర్- మీపైనేనా?

రోజులో మీకు ఎంత మంది 'టేక్ కేర్' అని చెబుతున్నారో మీరెప్పుడైనా గమనించారా? కచ్చితంగా వారిలో అమ్మ, నాన్న, తోబుట్టువు, ఫ్రెండ్స్ ఎవరో ఒకరు ఉంటారు. మరి, మీరెంత మందికి 'టేక్ కేర్' అని చెబుతున్నారు? కనీసం పేరెంట్స్‌కైనా చెప్పారా? లేదే.. అని ఆలోచిస్తున్నట్లయితే తక్షణం 'కేరింగ్' తీసుకోవడం నేర్చుకోండి. ఎంతో కేర్‌తో సోషల్ మీడియా ప్రొఫైల్‌ని చూసుకుంటున్నట్టుగానే నిజ జీవితంలో చుట్టూ ఉండే వారికీ 'టేక్ కేర్' అంటూ రక్షణ వలయంగా మారండి.

కమ్యూనికేషన్- ఒక వైపే కాదు!

కోపం, ఆవేశం, శాంతం, మౌనం.. ఇవన్నీ భావావేశాలు. వీటికి మూలం కమ్యూనికేషన్. ప్రేమ, ఫ్రెండ్‌షిప్, కెరీర్ దేంట్లోనైనా మీరు చేస్తున్న కమ్యూనికేషన్ ఆధారంగా మీలోని భావాల్ని ఎదుటివాళ్లు స్పష్టంగా అర్థం చేసుకుంటారు. అలాగే, ఇతరుల నుంచి వచ్చే స్పందనల ఆధారంగా మీరూ అవగాహనకి వస్తారు. మీరు చేస్తున్న సంభాషణల పట్ల మీరెంత ఆత్మవిశ్వాసంతో ఉంటారో.. ఇతరులూ అదే మాదిరిగా ప్రవర్తిస్తారు. సో.. ఇరువైపులా చక్కని కమ్యూనికేషన్ జరగాలంటే విషయం పూర్తిగా విని స్పందించడం మంచిది. అదే సరైన కమ్యూనికేషన్.

కమిట్‌మెంట్- మీకుందా?

చదువు, ప్రేమ, జీవిత లక్ష్యం దేంట్లోనైనా నెగ్గాలంటే? నిబద్ధత అవసరం. చదువులో ర్యాంకులు సాధించాలన్నా.. ప్రేమలో గెలవాలన్నా.. మీ నిర్ణయానికి తోడయ్యేది మీకున్న నిబద్ధతే. అప్పుడే ఫలితం ఏదైనా వేచి చూడగలిగే దమ్ము, ధైర్యం పుడతాయి. దాంతో ఓటమిలోనూ విజయాన్ని చూడగలుగుతారు. ఏదో ఒక రోజు గెలుస్తారు.

క్యురేట్- చేస్తున్నారా?

ఎక్కడికి వెళ్లినా.. ఏం చేస్తున్నా.. మంచీ చెడూ రెండూ ఉంటాయి. మంచిని స్వీకరిస్తూ చెడుని దూరం పెట్టాలి. చదువుకునే రోజుల్లో ఫ్రెండ్స్... ఉద్యోగం చేస్తున్నప్పుడు సహోద్యోగులు.. ఇలా అన్ని దశల్లోనూ మంచి, చెడుల్ని పరిచయం చేసేవారు ఎందరో. కొందరు ఓ మెట్టు పైకి ఎక్కించే ప్రయత్నం చేస్తే.. ఇంకొందరు కిందికి లాగేందుకు చూస్తుంటారు. అప్పుడు మీరెంత క్విక్‌గా 'క్యురేట్' చేసి దేన్ని ఎంపిక చేసుకుంటున్నారనేది మీ దారిని నిర్దేశిస్తుంది.

C4

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులంటే.. వారంలో ఐదు రోజుల పని.. వీకెండ్ మొత్తం పార్టీలు, పబ్‌లు.. అంతేనా! ఏం కాదంటున్నారు ఈ టెకీలు. 'డిజిథాన్ డిజిటల్ యాత్ర'తో సాంకేతిక పాఠాలు నేర్పుతున్నారు. ఎవరికో తెలుసా? సర్కారు బడుల్లోని విద్యార్థులందరికీ. తెలంగాణ సమాచార సాంకేతిక సంఘం, టీ-హబ్‌లు సంయుక్తంగా ఈ యాత్రని నిర్వహిస్తున్నాయి.

పట్నం వదిలి.. పల్లెకు కదిలి

డిజిటల్ శ్రీమంతులు

ఏంటీ 'డిజిథాన్'?

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతిక పాఠాలు నేర్పడం ఈ డిజిథాన్ డిజిటల్ యాత్ర లక్ష్యం. ఇందులో భాగంగా నగరానికి చెందిన దాదాపు 150 మంది యువ టెకీలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి అక్కడి విద్యార్థులకు సాంకేతిక పాఠాలు బోధిస్తారు. కంప్యూటర్, అంతర్జాల వినియోగంపై ప్రాథమిక అవగాహన కల్పిస్తారు. దీని ద్వారా సాంకేతిక నిరక్షరాస్యత శాతాన్ని తగ్గించి ప్రతి విద్యార్థికీ సాంకేతికతను పరిచయం చేయనున్నారు. ఈమెయిల్ ఖాతా సృష్టించడం, వాడకం, సామాజిక మాధ్యమాల ప్రయోజనాలు వివరిస్తారు. ప్రైవసీ చిట్కాల్ని బోధిస్తారు. అంతే కాకుండా ఐటీ రంగంలో స్థిరపడాలంటే ఏం చేయొచ్చు అనే అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పిస్తారు. యాత్రలో ఆయా పాఠశాలల విద్యార్థులతోనే భోంచేసి వారితోపాటే ప్రభుత్వ వసతి గృహాల్లో నిద్రిస్తారు.



పాఠశాల స్థాయిలో ఇంక్యుబేషన్ సెంటర్

యాత్రలో భాగంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో టెక్నాలజీ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్(టీఐఐసీ క్లబ్)ను ఏర్పాటు చేస్తారు. క్లబ్‌లో ఇద్దరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు బృందంగా ఏర్పడి స్థానికంగా ఉన్న టిటా బృందంతో కలిసి పనిచేస్తారు. ప్రాథమిక దశ నుంచే విద్యార్థుల్లో సాంకేతికతపై అవగాహన కల్పించడమే క్లబ్ ముఖ్య ఉద్దేశం. దీంతో విద్యార్థుల్లో ఉన్న నూతన ఆలోచనలు వెలుగులోకి తీసుకొచ్చి వారి భవితకు బంగారు బాటలు వేయనున్నారు. ఇప్పటికి రెండు జిల్లాల్లో ఈ యాత్ర విజయవంతమైంది. త్వరలో మిగతా జిల్లాల్లో పూర్తి చేయనున్నారు. అలాగే 'డిజిటల్ గావ్' పేరిట రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో డిజిటల్ అక్షరాస్యత పెంపొందించడంతో పాటు ప్రజలకు పథకాలు, బ్యాంకు లావాదేవీలు తదితరాలపై అవగాహన కల్పించారు. గతేడాది బాసర గ్రామాన్ని దత్తత తీసుకొని నూరుశాతం సాంకేతికత వినియోగం పట్ల అవగాహన కల్పించి 'డిజిటల్ బాసర'గా తీర్చిదిద్దారు.

- ఇట్ట అభిసాయి, ఈనాడు డిజిటల్, హైదరాబాద్

మనసులో మాట

నా చదువు తనకి కానుక



తాము నెరవేర్చుకోలేనివి తమ పిల్లల ద్వారా నిజం చేయాలనుకుంటారు పేరెంట్స్. ఇంటర్ తర్వాత నాకూ అలాంటి పరిస్థితే ఎదురైంది. ఎంసెట్‌లో మంచి ర్యాంకు రావడంతో నాన్న నన్ను ఇంజినీరింగ్‌లో చేర్పించారు. నాకు ఇష్టం లేకపోయినా నాన్న ఆనందం కోసం ఒప్పుకొన్నా. 2012 సెప్టెంబర్‌లో నా క్యాంపస్ జర్నీ మొదలైంది. చదువుతో పాటు వివిధ రకాల మనుషులు వారి మనస్తత్వాలు తెలుసుకుంటూ ఆ లైఫ్‌కి అలవాటు పడుతున్నా. ఓ రోజు తీవ్రమైన అనారోగ్యంతో ఇంటికి వెళ్లాల్సివచ్చింది. తీసుకు వెళ్లేందుకు బైక్‌పై నాన్న వచ్చారు. ఇంటికెళ్లే దార్లో యాక్సిడెంట్. స్పృహలోకి వచ్చేసరికి నేనొకచోట.. నాన్నొకచోట.. రోడ్డు మీద పడిఉన్నాం.. అదంతా అటవీ ప్రాంతం కావడంతో బంధువుల సాయంతో హాస్పిటల్‌కు చేరుకున్నాం. నెలలు గడిచాయి. నాన్న ఆరోగ్యం కుదుటపడింది. నేను మాత్రం జరిగిన ప్రమాదం నుంచి తేరుకోలేకపోయాను. మమ్మల్ని పలకరించడానికి బంధువులు, స్నేహితులు వచ్చి వెళ్లేవారు. వాళ్లలో ఒకావిడలో ఏదో ఎనర్జీ చూశా. చాలా ఉత్సాహంగా కనిపించారు. నాకెందుకో చాలా రిఫ్రెషింగ్‌గా అనిపించింది.

ఎదురుగా కూర్చున్న తన కొడుకుని చూపించి నవ్వింది. విచిత్రమేమిటంటే అతనూ నాలాగే కట్టుకట్టుకుని కూర్చున్నాడు. అతడు కూడా వాళ్ల అమ్మలానే నవ్వుతూ హాయ్ చెప్పాడు. నా ముఖంలో ఇంజినీరింగ్‌పై అనాసక్తిని గమనించాడేమో. చదువు తప్ప అన్ని విషయాల గురించి మాట్లాడాడు. ఎందుకో.. తన మాటల్లో నన్ను నేను చూసుకున్నట్టు అనిపించింది. నాలాగే ఆలోచిస్తున్నట్టుగా తోచింది. ఇలా ఆలోచిస్తుండగా.. 'ఈ ఏడాది చివర్లో అమెరికాకి వెళ్తున్నా. మాస్టర్స్ చేయడానికి..' అన్నాడు. ఆశ్చర్యంగా అతడివైపు చూశాను. 'కేవలం చదువు కోసమే. ఎలక్ట్రానిక్స్ గురించి రిసర్చ్ చేయడానికి' అంటూ.. నాకు తెలియని అంశాలను ఆసక్తికరంగా వివరించాడు. తను చెబుతుంటే.. అప్పటి వరకూ నాకు తెలియని నన్ను చూశాను.

మెల్లగా ప్రమాదం నుంచి తేరుకున్నాను. మళ్లీ ఫ్రెష్‌గా కళాశాలలో అడుగుపెట్టాను. నేర్చుకునే ప్రతీ అంశాన్నీ నిజజీవితానికి ముడేసి చూడడం అలవాటు అయ్యింది. అలా రెండేళ్లు గడిచాయి. కానీ, ఏదో అసంతృప్తి. ఇష్టపడే చదువుతున్నా.. కానీ నా లక్ష్యం ఏంటి? అనే ఆలోచన మొదలైంది. ఒక రోజు అప్పుడే కాలేజీ నుంచి ఇంటికి వచ్చా..

అదే రోజు మమ్మల్ని పలకరించడానికి వచ్చిన ఆంటీ కనిపించారు. నా క్షేమసమాచారాలు అడుగుతూనే 'మరో మూడు నెలల్లో మా అబ్బాయి అమెరికా నుంచి వస్తున్నాడు' అంది. ఆ మాటతో నాలో అలజడి. రెండేళ్లలో నేను అతనితో ఎన్నడూ మాట్లాడింది లేదు. అయినా.. అతని ఆలోచనలే. అతని కుటుంబ సభ్యుల్లాగే నేను కూడా అతడి రాకకోసం ఎదురుచూస్తున్నాను.

ఎప్పటిలానే ఆ రోజూ స్నేహితులతో కబుర్లు చెబుతూ.. ఇంటికి చేరుకున్నాను. ఇంట్లో అందరూ డల్‌గా ఉండటం చూసి ఏం జరిగిందని అడిగా. ఎవరి నుంచీ సమాధానం లేదు. కొన్ని గంటల తర్వాత విషయం తెలిసింది. నిన్న రాత్రి అమెరికాలో ఆంటీ వాళ్ల అబ్బాయి కారు ప్రమాదంలో చనిపోయాడని. ఒక్కసారిగా ఏం చెప్పారో.. నా చుట్టూ ఏం జరుగుతుందో అర్థం కాలేదు. కొన్ని రోజుల్లో వస్తాడన్న వ్యక్తి కనిపించడు.. రాడు అన్న విషయం జీర్ణించుకోలేకపోయాను. అతడి మాటలే నిత్యం గుర్తొచ్చేవి..! నాతో అతడు మాట్లాడింది.. రోజులో కొన్ని గంటలే కానీ అవి చెరగని ముద్ర వేశాయి. అతని ఆలోచనలతో చదువు ముందుకు సాగేది కాదు. ఎందుకంటే నాకు ఇంజినీరింగ్ చదువుపైన ఆసక్తి కలిగించేలా చేసింది అతడే. తనే లేకపోవడం బాధించింది. వచ్చిన సబ్జెక్ట్ అయినా పరీక్ష గదిలోకి వెళ్లాక ఖాళీ పేపరు ఇచ్చి వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. ఒకరోజు అద్దంలో నన్ను నేను బాగా ప్రశ్నించుకున్నా. అప్పుడు నిశ్చయించుకున్నా. నా డిగ్రీని అతనికి కానుకగా ఇవ్వాలని కష్టపడ్డాను. అవగాహన లేని విషయాలపై పట్టుసాధించి మళ్లీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాను. నా కాన్వకేషన్ డిగ్రీ ప్రదానోత్సవంలో అందరం విడిపోతున్నందుకు బాధ పడుతుంటే.. నాకు మాత్రం అతడి ఆశయం నెరవేర్చినందుకు ఆనందభాష్పాలు వచ్చాయి.

● అతడిని తలుచుకుంటూ బాధపడేకంటే నేను చేసే ప్రతి పనిలో తనే ఉన్నాడనుకుని ముందుకు సాగుతున్నా. బహుశా జీవితమంటే ఇదేనేమో.

- హారిక ఆద్య